

# అనంత యాత్ర

# 4వ భాగం

## పూజ్య శ్రీ బాబూజీ మహారాజ్, కస్తూరీ బహెన్‌ల ఉత్తర ప్రత్యుత్తరాలు

**25 జూలై 1955 నుంచి 3 మార్చి 1959 వరకు**

**ఉత్తరం సంఖ్య 501 నుంచి 700 వరకు**

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

కె. రామదాస్ - **9440652774**

కె. సుదర్శన్ - **9247805058**

సంప్రదించగలరు.

# రెండు మాటలు

ప్రియమైన అభ్యాసీ బంధువులకు,

ఈ రోజు 'అనంత యాత్ర' 4వ భాగాన్ని మీ చేతులకు అర్పిస్తున్నందుకు అత్యంత ఆనందాన్ని పొందుతున్నాను. 'అనంత' యాత్రలో అనంతమైన దశల యొక్క అనుభవాన్ని మీ ఎదుట ప్రత్యక్షం చేస్తూన్న నాకు అనంత సుఖం యొక్క అనుభూతి కలుగుతోంది. ఈ దైవిక దశలను చదివి వీటిని పొందటానికైన ప్రేరణ, వీటి ద్వారా మీ అందరికీ కలిగితీరుతుందని నేను విశ్వసిస్తున్నాను.

"అనంత యాత్ర" నా యొక్క శ్రీ బాబూజీ కృప మరియు అభ్యాసీపట్ల **'వారి'** సహజ ప్రేమకు దివ్య నమూనాగా ఉంది. దైవిక సౌందర్యం ద్వారా నన్ను అలంకరింపజేస్తూ "అంతిమ సత్యం" యొక్క సామ్రాజ్యంలో నాకు ప్రవేశం కల్పించి, ఇది **"అందరికీ"** అన్నట్లు వారు "అనంత దేశం" (అనగా భూమా) యొక్క ద్వారాన్ని తెరచివేశారు. ఇప్పుడు దీనిలో ప్రవేశించి మీ అందరూ జీవిత పరమ లక్ష్యాన్ని పొందాలని నా శుభాకాంక్షగా ఉంది.



**కస్తూరీ చతుర్వేది**

# అనంత యాత్ర - 4వ భాగం

## ఉత్తరం సంఖ్య - 501

షాజహాన్‌పూర్,
25.07.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం 19.07.1955వ తేదీది చేరింది. బ్రహ్మాండ మండలం (Cosmos) నుంచి శక్తిని రాబట్టటం మూలంగా చాలా ప్రయోజనం కలుగుతుంది. దానిని సాధ్యమైనంతవరకు ఉదయం పూటనే చేయి. ఇంకా కావాలనుకుంటే, రోజుకి రెండు, మూడు సార్లు చేయవచ్చు. ఐతే బ్రహ్మాండ మండలం నుంచి శక్తిని రాబట్టేముందు ముఖ్యమైన విషయం ఒకటి దృష్టిలో ఉంచుకోవాలి. అది ఏమిటంటే, (Energy) శక్తిని రాబట్టేముందు (System) వ్యవస్థకు ఎంత శక్తి అవసరమో అంతే వస్తోందని భావన కలిగి ఉండాలి. ఇంకొక విషయం, నేను ఇంతకుముందు కూడా చెప్పాను. **నీ శరీరంలో ఏ వ్యాధి అయితే ఉందో, అది పొగరూపంలో నీ వెనుకభాగం నుంచిగాని, కుడి ఎడమవైపు నుంచిగాని బయటకు పోతున్నాయని దృష్టి నిలిపి ధ్యానం చేసిన తర్వాత వ్యాధి తొలగిపోయి ఆరోగ్యవంతమయ్యాను అని భావించాలి. కళ్ళు తెరచి ఈ విధంగా ధ్యానం చేసినా అభ్యంతరం లేదు.** నీ ఆరోగ్యస్థితిని పూర్తిగా వ్రాయి. బలహీనత తొలగిపోయిందో లేదో, ఇంకా ఏదైనా సమస్య ఉన్నదా, ఉంటే అది ఏమిటో, ఎక్కడో, అలాగే బాధ, వాపు ఉన్నట్లయితే అది ఎక్కడో వివరంగా తెలియజేయి.

నీవు, కంపనం (Vibration) తగ్గినట్లుగా వ్రాశావు. అది ఎప్పటికీ సమాప్తం కాదు కాని, కొంత బలహీనపడిపోయి ఉంటుంది. ఈ విధంగా బలహీనపడిపోవటం, ఆధ్యాత్మిక ఉన్నతస్థితి కలగటానికి చిహ్నంగా ఉంటుంది. మనం 16 వలయాలు దాటి మన అహంను పూర్తిగా నశింపజేసుకున్నప్పుడు ఈ కంపనం పూర్తిగా మసకబారిపోతుంది. ఆ కంపనం ఎంతగా బలహీనపడి పోతుందో అంతగా శక్తి సూక్ష్మరూపంలో వస్తూ ఉంటుంది. ఎప్పుడైతే మనం బలహీనపడిన ఆ కంపనాలకి బలం చేకూర్చి మళ్ళీ కంపనం కల్పిస్తామో, అప్పుడు మనం గొప్ప పనులు చేయగలుగుతాం. (Subtle form) సూక్ష్మ రూపంలో  శక్తి దిగిరావటమంటే మనం (Original-Power) అసలు-శక్తిలో ప్రవేశించామని దాని అర్థం. తల మీద చేతి స్పర్శ తెలియకపోవటానికి కారణం నీవు స్వయంగా వ్రాశావు. అది ఏమిటంటే, ఆ హస్తం, కంపనం లేదా శక్తిని అవసరానికిమించి రాకుండా నియంత్రిస్తోంది అని. అవసరానికి తగినంతగా రక్షణ కల్పిస్తూ ఆ చేయి ('మాలిక్' అభయహస్తం) ఇంకా అక్కడ ఉంది.

కేసర్‌కు రూ. 150ల వేతనంతో ఉద్యోగం దొరకటం చాలా మంచిది. కేసర్ వ్రాసిన విషయం గురించి ఆమె చింతించాల్సిన అవసరం లేదు. త్వరలోనే అంతా సర్దుకుంటుంది. "స్వంత నిర్మలీకరణం" (Self-Cleaning) ఆమె తరచుగా సాధనచేస్తూ ఉండాలి. అందుకు తగిన విధానాన్ని నీవు ఆమెకు తెలియజేయి. ఆమె స్థితి అయితే చాలా బాగుంది.

నీ సోదర సోదరీ లందరికీ ఆశీర్వాదాలు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 502

లఖీంపుర్,

30.07.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ దయతో కూడిన ఉత్తరం చేరింది. చదివి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

బాబూజీ! ప్రకృతి సమస్తమూ జడత్వం దాల్చినట్లు అనిపిస్తోంది. నడవటం, తిరగటం, నిద్రించటం, మేల్కొనటం వంటివి ఎప్పుడూ జరగవన్నట్లుగాను, ఎప్పుడూ జరిగి ఉండలేదన్నట్లుగాను అనిపిస్తోంది. ఈ స్థితిని శుద్ధమైనదిగా గాని లేదా అమాయకమైనది (లేదా అజ్ఞానం వంటిది) అనిగాని చెప్పాల్సి ఉంటుంది.

బాబూజీ! నా స్థితి ఏమిటో ఆ దైవానికే తెలియాలి. ఇప్పుడు నేను జడత్వస్థితి నుంచి కూడా విముక్తమయ్యాను. ఎందుకంటే, ఈ దశను జడత్వదశ అని చెప్పినప్పటికీ దశలో భేదం లేకుండా ఉంది. ఈ దశ ఎలా ఉందంటే, ఎవరినైతే నేను 'బాబూజీ' అని చెప్పుకుంటానో 'వారు' ఎలా ఉంటారో, ఎక్కడ ఉన్నారో కూడా తెలియనట్లుగానే ఉంది. అసలు ఎప్పుడూ 'వారి'ని కలవటం జరగలేదన్నట్లుగా ఉంది. ఎప్పుడైనా గాని నేను 'బాబూజీ' బస్సు నుంచి దిగుతారు అని ఊహించుకున్నా, అసలు నేను గుర్తుపట్టగలనో లేదో అన్నట్లు ఉంది. ఎప్పుడూ 'వారు' కణకణంలోనూ కనిపిస్తూ ఉండేవారు. ఇప్పుడు ఏమైందో ఏమో ఎక్కడా, ఎన్నడూ కనిపించటం లేదు. ఇంకొక రకంగా చెప్పాలంటే, 'వారి'ని చూడగలగటానికి కన్నులలో కాంతియేలేదేమో అని అనిపిస్తోంది. దశను జడత్వమైనది అని చెప్పుదామంటే, దానిమీద దీని ప్రభావం ఉండటం లేదు. ఇప్పుడు ఎంతో సౌమ్యమైన ప్రదేశంలో ప్రయాణిస్తున్నట్లు అనిపిస్తోంది. అక్కడ ఎటువంటి గాలి లేదు. ఒకవేళ ఎటువంటి గాలియైనా ఉందనుకుంటే, అది చాలా స్వల్పమైనదిగాను, స్వచ్ఛమైనదిగాను లేదా అమాయకత్వపు (అజ్ఞానపు) సారంలాంటిదిగాను చెప్పాల్సి ఉంటుంది. నేనయితే అనుభూతి చెందుతున్నాను, దానిలో ఇమిడి ఉంటున్నాను కాని ఈ శబ్దాలు భారమనిపిస్తున్నాయి. గాలి అయితే అక్కడ లేదోమోకాని, ఆ దశ యొక్క అనుభూతి చెందుతూ కూడా తరచుగా నాకు నేను ఏదైనా దశానుభూతి చెందుతున్నానో లేదో తెలియకుండా ఉంది. లేదంటే ఎంత సమంగా (Balance) ఉంటున్నదంటే, అనుభూతి అయితే కలుగుతూనే ఉంటుంది, కాని అదే నా రూపంగా అయి ఉంటోంది. ఈ దశ ఎటువంటిదో దయచేసి తమరే తెలియ జెప్పండి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నారులైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 503

షాజహాన్‌పూర్,

03.08.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం 30 జూలై 1955వ తేదీది అందింది. ఈ ఉత్తరంలో కొన్ని వింతైన ఆలోచనలు, వింతైన స్థితి మరియు వింతైన విధానంలో వ్రాశావు. దీనినిబట్టి వ్రాసినవారు కూడా విశేషమైన వారుగాను, ఏకైక వ్యక్తిగాను ఉంటారని అనిపిస్తోంది. దానిని నీవు వ్రాశావా? అని అంటే, దానికి నీవు జవాబుగా, "నేను వ్రాసే ఉంటాను. అయితే అది ఎలా వ్రాశానో నాకు తెలియదు" అని అంటావు. నీకు అది తెలియకపోవటానికిగల కారణం

దాని జాడ నీకు తెలిసి ఉండకపోవచ్చు. దాని అర్థం జాడ తెలియజేసి అనగా జ్ఞానం కలిగించి ఎక్కడికో వెళ్ళిపోయింది అని. మంచితీరుతో సత్యత్వంలో (రియాలిటిలో) పూర్తిగా ప్రవేశించటం అంటే ఇలాగే ఉంటుంది. ఇది కూడా అంతమైపోతుంది. ఎందుకంటే, జ్ఞానం యొక్క జ్ఞానం కూడా ఉండదు. కాని ఇంకా జ్ఞానం లేకుండా ఉన్నదని తెలుస్తుంది. నీవు వ్రాసిన కొన్ని వాక్యాలు చదివి నేను చాలా ఆనందించాను. అది నీ ప్రస్తుత ఆధ్యాత్మిక స్థితిని స్పష్టంగా తెలియజేస్తుంది. యదార్థమైన విషయం ఏమిటంటే, మనలో చివరకు భక్తిగాని, భక్తి యొక్క భావనగాని ఉన్నట్లయితే మనం పూర్తిగా విముక్తులం కాలేదన్న మాట.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 504

లఖీంపుర్,
30.07.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక స్థితిని వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఆ తేలికపాటి (Vibration) ప్రకంపనం కూడా జీర్ణమైపోయినట్లుగా అనిపిస్తోంది. నాకయితే ఏమీ కనిపించటం లేదు. అయినాగాని, దృష్టి నిలిపినట్లయితే ఆ అల్పమైన ప్రకంపన (Dim vibration) కూడా స్పష్టంగా అనుభవానికి వస్తున్నట్లుగా నేను చూస్తున్నాను. ఇప్పుడు ఈ దశ ఎలా ఉందంటే, నేను తిరుగాడుతూ ఉన్నా కూడా కాళ్ళు భూమి మీద ఆననట్లుగా ఉంటోంది. ఇప్పుడు హృదయం బయట ఉన్నదో లేక లోపల ఉన్నదో అర్థం కానట్లుగా ఉంది. హృదయం మీద దృష్టి పెట్టినప్పటికీ ఎటువంటి ప్రభావమూ ఉండటం లేదు. పైగా హృదయం బయటగాని, లోపలగాని అసలు ఎక్కడైనా ఉన్నదా, లేదా అని సంశయం కలుగుతోంది. ఇప్పుడు మనస్సు కంపించిపోయినట్లుగాను, ఆ విధంగా కంపించిపోతున్నా కూడా నా దృష్టికి రానట్లుగాను ఉంటోంది. ఇప్పుడు ఆ ప్రకంపనమే మనస్సు లేదా బుద్ధి లేదా జ్ఞానం లేదా ఇంకేమైనాగాని, అవి అన్నీ కూడా జీర్ణమైపోతున్నట్లు అనిపిస్తోంది. నా మనస్సుతో దానిని తీవ్రతరంగా చేసినపుడు మాత్రం అనుభవానికి వస్తున్నట్లుగా ఈ స్థితి ఉంది. సరళత్వం (Simplicity) మరియు అమాయకత్వం (Innocence) వంటివి ఈ దశ యొక్క లక్షణాలుగా మాత్రమే గుర్తింపబడుతున్నాయి. ఈ ప్రకంపనం అనేది మాత్రం నా దశ యొక్క సహజ స్వభావంగా ఉండిపోయింది. జ్ఞాపకం యొక్క జ్ఞాపకం కూడా మరచిపోయినట్లు ఉంది.

ఏ హస్తమైతే నా శిరస్సుపైన, వీపుపైన ఉందో ఆ హస్తం యొక్క అనుభూతి ఇప్పుడు నా స్వంత రూపంగా అయిపోయింది. దశలో కల్పితంగాని, సహజత్వంగాని లేవు. సహజత్వమైతే కేవలం నా దశ యొక్క గుణంగానే ఉండిపోయినా గాని నాలో గుణమంటూ ఏదీలేదు. అదేమిటో దైవానికే తెలియాలి. ఇప్పుడు కొన్ని రోజులనుంచి రాత్రి అంతా నా శరీరం ఎవరితోనో మాట్లాడుతున్నట్లు ఉంటోంది. కాని నేనయితే ఎంత అజ్ఞానంగా ఉంటున్నానంటే, తెల్లవారుతూనే దాని యొక్క స్పృహ లేకుండా ఉంటున్నాను. రాత్రంతా నిద్రలోనయితే ఎంతో కొంత స్పృహ వంటిది ఉంటోందిగాని, తెల్లవారుతూనే నేను స్పృహ లేకుండా ఉంటున్నాను. స్పృహ ఉన్నప్పుడు అలసట ఉంటోంది కాని, రాత్రి సమయంలో స్పృహలేనపుడు ఆ అలసత్వం ఉండటం లేదు.

బాబూజీ, నేనయితే పిచ్చిదానను కావటానికి ప్రయత్నించాను కాని 'మాలిక్' మాత్రం ఈమె పిచ్చిదైపోయి తిరిగితే అప్రతిష్టపాలైపోతుంది, అని భావించారు. అందుచేత నేను నిజంగా పిచ్చిదానను కాలేకపోయాను. ఈ స్థితిలో ఇప్పుడు నాకు అసలు ఈ కోరిక ఉన్నదో లేదో కూడా తెలియటం లేదు. పిచ్చివారుగా కావటం ఎలా?

వారు (పిచ్చివారు) ఏమి చేస్తారు? అసలు ఎందుకు పిచ్చివారుగా అవుతారు, అనేది కూడా నాకు తెలియకుండా ఉంది. కనుక బాబూజీ, అదేమిటో తమరే చెప్పాలి. నాకు ఏమీ తెలియదు. బహుశా తమరు చెప్పినదానినిబట్టి ఏమైనా అర్థమైనట్లయితే నేను ఎంతోకొంత ప్రయత్నిస్తాను. దానితోపాటు, నేను ఎవరిని గురించి పిచ్చిదానను కావాలి, ఎలా కావాలి, పిచ్చిదాననైతే ఎటువంటి ఆనందం వస్తుంది అనేది కూడా దయచేసి చెప్పండి. అదేదో తమకే తెలుసు. ఎందుకంటే, నేను చూస్తున్నదానినిబట్టి లేదా అర్థం చేసుకుంటున్న దానినిబట్టి, దాని సారాంశం, రహస్యం తమరేనని తెలుసుకొన్నాను. అందుచేత నా సంగతి అంతా తమకే తెలుసు. తమరు ఏది చెప్పదలచుకుంటారో అదే నాకు కొంతగానైనా అవగాహనకు వస్తుంది కాని మరేదీ రాదు. అయితే తమరు మాత్రం ఒక శిలకు ఏమని చెబుతారు. పశు పక్ష్యాదులకయితే ఎంతోకొంత నేర్పవచ్చును కాని, శిలలకు మాత్రం ఎంతకూ తగదు. బాబూజీ, నాకు ఉన్న ఇంకొక స్థితి కూడా ఏమిటంటే, ముందుగా నాకు నేను శిలనా, జంతువునా, మనిషినా లేక ఇంకేమైననా అని, లేదా ఏమీకాదు అని తమరు చెప్పాల్సి ఉంటుంది. అదంతా నాకు ఎందుకు, 'తమరు' ఏది అంటే అదిగా ఉంటాను.

ఇప్పుడు తరచుగా ఈ దశ ఉంటున్నది, తరచుగా కూర్చునే ఉంటూ కళ్ళు విప్పుకుని ఉండి నన్ను నేను కోల్పోయి ఉంటున్నాను. వాస్తవంగా నేను ఏమికాకుండా అయిపోయాను. ఎందుకంటే బాబూజీ, ఇప్పుడు ఏమీకాకుండా ఉండటమనేది నా అసలు స్వరూపంగా అయింది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 505

షాజహాన్‌పూర్,
14.08.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీవు ఆగష్టు 8వ తేదీన వ్రాసిన ఉత్తరం చేరింది. నీవు ఏదో ఉత్తరంలో '$F_1$' పాయింట్ మీద నీ యాత్ర పూర్తయిపోయినట్లుగా వ్రాశావు, కాని అది జరగలేదు. కాని ఆ స్థానంమీద వ్యాపించి ఉన్న శక్తి ఎలా ఉందో అలానే ఉంది కాని అది ఇంకను ఆధ్యాత్మిక యాత్రరూపం దాల్చలేదు. అది చాలా స్వల్పంగానైతే జరిగింది. దాని ఫలితంగా నీవు ముందుకు వెళ్ళలేకపోతున్నావు. దానికోసం నీవు చింతించనవసరం లేదు. అది నా పని, నేను దానిని సరిదిద్దుతాను. నీవు వ్రాసినటువంటి దానిలో మిగిలిన స్థితి, నీవు సత్యత్వంలో (రియాలిటి) లయమవుతున్నట్లుగా తెలుపుతోంది. నీవు వెర్రితనం (ఆధ్యాత్మిక అతిశయం) గురించి వ్రాసిన దానికి సమాధానం వెర్రివాడే ఇవ్వగలుగుతాడు. అయితే ఆ వెర్రితనం ఎక్కడ ఉంటుందో అక్కడ ద్వైతం ఉంటుంది. నీవు నిద్రలో ఎవరితోనో మాట్లాడుతున్నట్లుగా ఉందని వ్రాశావు. దానికి కారణం నిద్రలో నీ ఆలోచనల ప్రవాహం యొక్క దిశ నావైపుగా మరలుతూ ఉండి ఉండవచ్చు. నా అభ్యాసకాలంలో ధ్యానంలో ఉండగా జనం మాట్లాడుకునే మాటల శబ్దం తరచుగా నన్ను చేరుతూ ఉండేది. ఇప్పుడు కూడా తరచుగా అలాగే జరుగుతూ ఉంది. ఉదాహరణకు, కాశ్మీర్‌లో కాల్పులు జరిగిన సమయంలో ఆ తుపాకుల ధ్వని నా చెవులను తాకింది. అప్పుడు నేను పటాన్ని (Map) పరిశీలించగా ఆ దిశగానే కాల్పులు జరిగినట్లు తెలిసింది. ఎక్కడో రైలు ప్రమాదం జరిగినపుడు ఆ రైళ్ళు ఢీకొట్టిన శబ్దం, క్షతగాత్రుల హాహాకారాలు కూడా నాకు వినిపించాయి. ఇటువంటి సంఘటనలు ఎప్పుడూ దృష్టికి రావు. అవి ఎప్పుడు, ఎందుకు, ఎలా వస్తాయో భగవంతునికే తెలుసు.

కాశీరామ్‌గారు అస్సాంలో బాగా కృషి చేస్తున్నందువలన మిషన్ యొక్క సమాచారం ఆ ప్రాంతంలో బాగానే వ్యాప్తి చెందింది. సత్సంగంలో 6,7 మంది సభ్యులు చేరటమే కాకుండా అది తగిన రీతిలోనే జరుగుతోంది.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 506

లఖీంపూర్,

13.08.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి చాలా సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా ఈ స్థితిలో స్పృహ కలిగి ఉండటం, స్పృహ లేకపోవటమనేవి రెండూ నాకు ఎటువంటి విషయాలుగా ఉన్నాయి అంటే, కావాలనుకుంటే వాటిని నాలో ఉత్పన్నం చేసుకోగలను లేదా 'మాలిక్'ను అర్థించగలను. లేకపోతే అది ఏమిటో, అది ఏది కాదో నాకు తెలియకుండా ఉంది. జీవితం ఇలా గడుస్తూ ఉండగా దాని స్థితిని చూస్తూ ఉంటే, 'మాలిక్' మనస్సును చైతన్యంగా ఉంచుతారో లేదా చైతన్యం లేకుండా ఉంచుతారో నాకు తెలియకుండా ఉంది. నాకు ఈ రెండింటికి మధ్య భేదం లేదు.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 507

లఖీంపూర్,

15.08.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడంతా కుశలమే. తమరు కూడా ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా దశ ఎలాంటిది అంటే, దీనిలో నాకు 'ప్రేమ' అను శబ్దం ఎగిరిపోయినట్లుగా ఉంది. నాకు నాపట్లగాని, ప్రపంచంపట్లగాని, ఈశ్వరునిపట్లగాని ప్రేమ కలగటం లేదు. ఒకప్పుడు ఒక్క సెకను కాలమైనా 'అతడి'ని మరచిపోయినట్లయితే 'అతని' కోసం తపన ఉండేది, కాని ఇప్పుడు ఆ విధంగా నాలో తపన కలగటం లేదు. ఇది మనస్ఫూర్తిగా లేకపోయినపుడు కల్పించుకుంటె మాత్రం ఏమి వస్తుంది. మనస్సులో తపన కోసమని ఆర్తియే ఉండటం లేదు. నాలోని రసమంతా పిండివేసి నన్ను ఎండలో ఎండవేసినట్లుగా అర్థం చేసుకోవచ్చు. అయితే 'మాలిక్' కృపతో ఇంతవరకైనా మిగిలి ఉన్నది ఏమిటంటే, శ్రీ బాబూజీ యొక్క ఆజ్ఞ కలగగానే శరీరం స్వయంగా చెప్పినట్లుగా చేస్తోంది. 'వారి' ఇష్టానికి వ్యతిరేకంగా కలలో కూడా ఏమీ చేయలేను. దానంతట అదే జరిగిపోతున్నట్లుగా చూస్తున్నాను.

'$F_1$' పాయింట్ యొక్క యాత్ర సమాప్తమైపోయినట్లుగా అనిపిస్తోంది. నేను మాత్రం ఎండు కట్టెలులాగా ఉంటున్నాను. బయట, లోపల ఒకే విధంగా ఉన్నాను. తరచుగా ఏమి జరుగుతున్నది అంటే, ఎదుట శ్రీ బాబూజీ ఉన్నట్లుగా ధ్యాస పెట్టినప్పటికీ, హృదయం 'వారి'తో (బాబూజీతో) "మా 'బాబూజీ'ని ఎప్పుడైనా చూశారా!" అని

అడుగుతున్నట్లుగా ఉంటోంది. ఇలా ఎందుకో నాకు తెలియదు. 'వారు' చాలా మంచివారే, ఇంకేమైనా కావచ్చును కాని నాకేమీ తెలియదు. ఇదే నా స్థితిగా ఉంది. తరచుగా నాకు, నేను నిజంగా 'తమరి'ని ఎప్పుడైనా చూసి ఉన్నానా లేదా అనేది జ్ఞాపకం రావటం లేదు. ఈ సంగతి కూడా 'మాలిక్'కే తెలియాలి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 508

షాజహాన్‌పూర్,

17.08.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. మాస్టర్ సాహెబ్‌గారి చిరునామాతో ఆగష్టు 4వ తేదీన నేను ఒక ఉత్తరం వ్రాసి పంపాను. దానిలో నీ ప్రశ్నకు కూడా సమాధానం ఉంది. బహుశా అది నీకు చేరే ఉంటుంది. ఈ సంవత్సరం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా జరిగే 'ఉపవాసం' ఆగష్టు 10వ తేదీ బుధవారం నాడు జరుగుతుంది. ఒకవేళ నీవు ఉపవాసం ఉండాలనుకుంటే, మధ్యాహ్నం పాలుగాని, పండ్లుగాని లేదా ఏదైనా అల్పాహారంగాని తీసుకోవాలి. సూర్యాస్తమయం తర్వాత పొట్టనిండా ఏదైనా అల్పాహారం తీసుకోవాలని నేను కోరుతున్నాను. ఎందుకంటే, ఇటీవల నీవు కొంత బలహీనంగా ఉన్నావు కనుక కఠినమైన, స్థూలమైన ఆచారాలను పాటించాల్సిన అవసరం లేదు. దైవకృపతో తన స్థితి కూడా బాగానే ఉందని కేసర్‌తో చెప్పు. ఆమె నిన్ను అనుసరించటానికి ప్రయత్నిస్తుంది. అయితే కొన్ని పరిమితుల (Limitations) మూలంగా తను అనుకున్నంత పూర్తిస్థాయిలో ముందుకు పోలేకపోతోంది. సాధారణంగా ఇది అందరి విషయంలోను జరుగుతుంది. అందుకు చింతిచాల్సిన పనిలేదు. సాధన మరియు సత్సంగాల ద్వారా అది క్రమక్రమంగా తొలగిపోతుంది. ఆమెకు తన స్థితిని గురించి ఒక ఉత్తరంలో తెలియజేశాను కూడ. లయ–అవస్థ ఇంకా ఎవరిలోనైనా ఉంది అంటే, నీ లయ–అవస్థ తర్వాత ఆమెకే ఆ స్థానం దక్కుతుంది. అభ్యాసులలో కొంతమంది మంచివారు ఉన్నారు. మరికొందరైతే మ్రొక్కుబడిగా అభ్యాసం చేస్తున్నారు.

చౌబేజికి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీర్వాదాలు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 509

షాజహాన్‌పూర్,

23.08.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం చేరింది. జవాబు వ్రాయాలనుకున్నాను, కాని ఇంతలో అలహాబాద్ నుంచి ఒక ఉత్తరం వచ్చింది. దానినిబట్టి నీ ఆరోగ్యం బాగుండలేదని తెలిసింది. అందువలన శనివారం సాయంత్రం బస్సులో గోలా మీదుగా లఖీంపూర్ చేరదామనుకుంటున్నాను. బసంత్‌పంచమి ఉత్సవం 16.02.1956వ తేదీన జరుగుతుంది.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 510

లఖీంపూర్,
16.08.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

బాబూజీ! నా ఈ స్థితిలో నేను ద్వైతరాలునా లేదా అద్వైతరాలునా అనేది తెలియటం లేదు. తమరు వ్రాసిన దానిమీద బాగా ధ్యాస నిలిపి ఆలోచించినట్లయితే కూడా ఏమీ అర్థం కాలేదు. అదేమిటో తమకే తెలియాలి. ఇంతేగాకుండా నాకు ఇంక ఎటువంటి స్థితి అవగాహనకు రావటం లేదు. ఏమీ తెలియని స్థితి లేదా అజ్ఞాన స్థితి అని దీనిని చెప్పటం నాకు సబబుగా అనిపించటం లేదు. నేత్రాలకు సంబంధించిన గ్రంథి ఏదో స్వచ్ఛంగా అయిపోయినట్లుగాను, ఇంకను 'మాలిక్' కృపతో చూసినట్లయితే, ఆ ద్వైతం-అద్వైతాల తంటా తీరిపోయినట్లుగాను నాకు అనిపిస్తోంది. మేల్కొంటున్న సందర్భంలో అప్పుడప్పుడు ఉలిక్కిపడుతున్నాను. అలా గాబరా చెందినా కూడా ఎటువంటి భావం కలగటం లేదు. స్థితిలో ఏదైనా ఇమిడి ఉండటం కాని, సాదాతనం యొక్క ఛాయగాని లేదు. వాటి ప్రభావం మాత్రమే కొద్దిగా ఉంది, ఆ మీదట తమకే తెలియాలి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 511

లఖీంపూర్,
18.08.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. నా ఆరోగ్యం ఇప్పుడు బాగానే ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

దశలో చెమ్మగిల్లడం అనేది ఎప్పుడూ కలగటంగాని, నిశ్చలత్వం కూడా జాడలేకుండా పోయినట్లుగాను నేను చూస్తున్నాను. (Balanced state) సామ్యావస్థ కూడా అంతమైపోయినట్లుగా ఉంది. ఇప్పుడు దశ వలయం మధ్యలో బిందువు (.) లేదా వలయంలో కేంద్ర బిందువుగా ఉంది. ఈ వలయానికి నలువైపులా కూడా సామ్యావస్థ లేదా సామాన్యత యొక్క క్షేత్రం ఉంది, కాని దానిని అంచనా వేయలేకపోతున్నాను. ఆధ్యాత్మిక సాగరం (దరియాయె-మార్‌ఫత్)లో నేను ఎప్పుడూ మొఖమన్నా కడుక్కోలేదనిపిస్తోంది. (Simplicity) సాదాతనంలో ఆనందం ఉంది, కాని మనస్సు దాని అంచనా వేయలేకపోతోంది. అయితే ఇప్పుడు ఉన్నటువంటి అనుభూతి ఎటువంటిదైనాగాని, దానితో మనస్సు విభేదించటం లేదు. ఆ అనుభూతికి వచ్చిన రూపమే మనస్సు యొక్క రూపంగా అయిపోతున్నట్లు నేను గమనిస్తున్నాను.

ఇప్పుడు నేను ఎలా ఉన్నానంటే, (దరియాయె-మార్‌ఫత్) ఆధ్యాత్మిక సాగరంలో నా దశ నీరు అంటని కమలదళంలాగా ఉంది. నాకు మానవత్వం, సభ్యత గురించి తెలియనపుడు నేను బ్రహ్మవిద్యను ఎలా నేర్చుకోగలను. బాబూజీ, ఇప్పుడు ఇంకా ఏమిటంటే, ఎటువంటివి కొనడంగాని, అమ్మడంగాని జరగలేదు.

కేసర్ తమకు ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాశీస్సులు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 512

షాజహాన్‌పూర్,

25.08.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీవు 1955 ఆగష్టు 16 మరియు 18వ తేదీలతో వ్రాసిన ఉత్తరాలు చేరాయి. డాక్టర్ వరదాచారిగారి ఉత్తరం యొక్క నకలు నీవు పరిశీలించే ఉంటావని అనుకుంటాను. నీవు వారిని గురించి వ్రాసిన అభిప్రాయం సరిగ్గానే ఉంది. ఇప్పుడు నాకు నీ సహాయం అడుగడుగునా అవసరమవుతోంది. ఎందుకంటే, నీ పరిశీలన అనుభవపూర్వకంగా ఉంటుంది. ఇటువంటి అనుభవశీలురైన వ్యక్తి ఎవ్వరైనా నాకు సమీపంలో ఉంటే, ఈ ఆధ్యాత్మిక విషయాలలో నాకు తోడుగా ఉంటారని ఆశిస్తున్నాను. నా అనుభవం నాకు సక్రమంగానే తెలుపుతుంది, అయితే దానిని ఇతరులు ఎవరైనా ధృవపరచినట్లయితే అప్పుడు నా ఆలోచన సరైనదేనని నిర్ణయించుకుంటాను. నా అనుభవం నిస్సందేహంగా నిశితంగా (Sharp) ఉండేది. బహుశా ఇప్పుడు కూడా అలాగే ఉన్నదనుకుంటాను. కాని అలాగే అని చెప్పలేను.

నీవు, నేను అక్కడికి రావాలని కోరుకుంటున్నావని గ్రహించాను. అయితే నేను రాలేదని నీవు అనుకుంటావు. నేను వచ్చాను, అయితే ఇది చెప్పు, నేను వెళ్ళింది ఎప్పుడు? నీ ఉత్తరంలో వ్రాసిన దానినిబట్టి అది ప్రేమకు చెందిన అత్యున్నత స్థితి. 'తన'ను తాను మరచిపోయినట్లుగా చెప్పటానికి (మరపుస్థితి) అది సరైన వాదనగా ఉంటుంది. (Conscious) స్పృహ ఉన్నట్లుగా గాని, (Unconscious) స్పృహ లేకపోయినట్లుగా గాని నీ అనుభవానికి రాకపోవటమను విషయం, నీవు దైవంతో గాఢమైన బాంధవ్యాన్ని, అన్నింటికి అతీతమైన దానిని నెలకొల్పుకున్నట్లుగా తెలియజేస్తుంది. కాని నీవు ఈ బాంధవ్యం కలిగి ఉన్న విషయాన్ని కూడా ఎప్పుడు మరచిపోతావో అప్పుడు అక్కడ అంతా సత్యత్వమే సత్యత్వం (Reality alone) తప్ప ఇంకేమి ఉండదు. అయినప్పటికి అది అంతం కాదు. '$F_1$' విషయంలో నీవు వ్రాసినది సరైనదే. ముందుకు నడక సాగనప్పుడు చికాకు కలుగుతుంది. నేను శిక్షణ ఇచ్చేటప్పుడు తప్పులు కూడా చేస్తూ ఉంటాను. అదేమిటంటే, కొన్ని సందర్భాలలో ప్రాణాహుతిని అవుసరానికిమించి ఇస్తూ ఉంటాను, అది జీర్ణించుకోబడదు. నేను ఇప్పుడు దానిని దృష్టిలో పెట్టుకుంటాను. నేను ఇప్పుడు ఆ '$F_1$' స్థానాన్ని కొంచెం సున్నితంగా చేశాను. దాని మూలంగా నీవు సుతిమెత్తనగా అనుభూతి చెంది ఉంటావు. దైవం తలిస్తే నేను ఈ స్థితిలోనే నీ ఆధ్యాత్మిక యాత్రను సరైన వేగంతో జరిగేటట్లు చేస్తాను. ఇప్పుడు నీ స్థితి చాలా సున్నితంగాను, సూక్ష్మంగానూ ఉంది. దానితో నీవు చాలా తేలికగా అనుభూతి చెందుతావు. నేను తప్పు చేస్తూనే ఉంటాను. అది ఎందుకో దైవానికే తెలియాలి. అప్పుడప్పుడు అభ్యాసీ యొక్క సామర్థ్యానికి తగినట్లుగా నా ఇచ్ఛాశక్తిని మరల్చటానికి విఫలమవుతూ ఉంటాను. ఆ స్థానంలో ఎంత అవసరమో, దానిని అంచనా వేయటంలో తప్పు జరగటంవల్లనే దీనికి కారణమవుతున్నది. అందుకు నేను విచారపడుతున్నాను. భగవంతుణ్ని, భక్తుడ్ని గుర్తించటానికి ఇదే ప్రధానాంశం. దైవం తరపునుంచి ఎప్పుడూ తప్పు జరగదు. అది భక్తుని విషయానికి వచ్చేసరికి, ఏదశలోనైనా, ఏ సందర్భంలోనైనా జరగవచ్చు.

కనీసం ఒక్క మంచి అభ్యాసీ అయినా అందుబాటులో ఉంటే, అతడు మిషన్‌ను అభివృద్ధి చేస్తాడు. అలా కాకుండా పనికిరానివాళ్ళు 50 మంది ఉన్నప్పటికి ఉపయోగం ఉండదు. దైవ ప్రేమ, భక్తి అధికంగా ఉండటం వలన కాశీరామ్‌గారి యొక్క వాణి అస్సాం అంతటా ఇప్పుడు విస్తరిస్తున్నది. ఆ కారణంతోనే నేను

ఆయనకు శిక్షణ నివ్వటానికి ఒక్కపెట్టున శక్తి కల్పించి ప్రిసెప్టర్‌ను చేశాను. అయితే మాస్టర్ సాహెబ్‌గారు ఇంత త్వరితంగా ఎందుకు చేశావు అని కోపగిస్తారేమోనని నా హృదయంలో భయం కలుగుతోంది.

చౌబేజికి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీర్వాదాలు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 513

లఖీంపుర్,
23.08.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరూ కుశలమే. 'తమరు' కూడా కుశలమే అని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఆదివారం రాత్రికి చెందిన కల గురించి లేదా ఆలోచన గురించి చెబుతాను. నేను నిండైన సముద్రం మధ్యలో నిలబడి, తీరాన నిలబడి ఉన్న తమరిని చూస్తున్నాను. అకస్మాత్తుగా చూస్తూ చూస్తూ ఉండగానే సముద్రం ఎండిపోయి, నేను నీరుగాని, ఇసుకగాని లేని ఆ సముద్రంలో పొడిగానే నిలబడి ఉన్నాను. నేను 'తమరి'ని రెప్పవాల్చకుండా చూస్తూ ఉన్నాను. అప్పుడు 'మాలిక్' తన హస్తాలతో నన్ను లేవదీస్తూ లేవదీస్తూ ఉండగానే నేను 'వారి' హస్తకమలాలలో ఇమిడిపోయాను. అప్పుడింక నన్ను నేను కనుగొనలేకపోయాను. ఇంకా చూస్తే నేను 'తమరి'ని కూడా కనుగొనలేకపోయాను.

ఆలోచనలు బాగా ఎక్కువగా మెదడులో ముసురుకుంటున్నాయి, ఈ విషయం ఏమిటో దైవానికే తెలియాలి. ఒక్కటి మాత్రం ఖాయం, ఏమిటంటే, నేను కోరుకుంటే, అవి దూరమైపోతున్నాయి. అయితే మరి ఎందుకోగాని మనస్సు అలా కోరుకోవటం లేదు. ఎవ్వరికైతే ఎప్పుడైనాగాని ఈశ్వరుని గురించి చెప్పబడి ఉండలేదో అటువంటి మానవునిలాగా నా దశ ఉన్నది. అటువైపుగా కూడా ఆలోచనను కొంచెం మరలించాల్సి ఉంది. అదేమిటో కూడా తెలియదుగాని, వర్షంలో తడుస్తూ తిరుగుతున్నాను, అయినాగాని తడవకుండా పొడిపొడిగానే తిరుగుతున్నాను. అసలు వర్షం నామీద పడటంలేదోమో అన్నట్లు ఉంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 514

లఖీంపుర్,
26.08.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. సమాచారం తెలిసింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు శరీరం యొక్క కణకణం మహాసమాధి లేదా చిరసమాధిలో (శాశ్వత సమాధి) లయమైపోయినట్లుగాను, శాశ్వతంగా మహాశాంతి ప్రాప్తించినట్లుగాను అనిపిస్తోంది. దశ అయితే స్పృహ లేనిదిగా గాని లేదా నిద్రించి ఉన్నటువంటిదిగా గాని చెప్పలేను. కాని, నా స్వరూపమైతే మహాసమాధిగా గాని మహాశాంతిగా గాని లేదా చిరశాంతిగా

గాని అయిపోయినట్లుగా అనిపిస్తోంది. అది ఏమిటో దైవానికే తెలియాలి, ఇప్పుడు ఎటువంటి స్థితి యొక్క అనుభూతీ పొందలేకపోతున్నాను. ఒక నాళం (Vein) వంటిది ఏదో హృదయం నుంచి మెదడుతో అనుసంధానమై ఉన్నట్లుగాను, ఇంకా ఏమిటంటే, ఆ నాళం మెదడుకుపైన ఎక్కడో సంబంధం కలిగి ఉండి కూడా గాలిలో కలిసి మాయమైపోతున్నట్లు గమనిస్తున్నాను. అది దాటాక కూడా నాలో ఏదో జీవనం నింపబడుతున్నట్లు అనిపిస్తోంది. అయితే జీవితం అంటే ఏమిటో కూడా నాకు తెలియనట్లుగా ఉంది. ఎగిరిపోయిన పక్షి యొక్క పంజరం ఖాళీది శుభ్రమైనదిగా ఉన్నట్లుగానే నా శరీరం ఉందనిపిస్తోంది. పంజరం అని మాటమాత్రంగా చెప్పాను, అలా కాకుంటే నా స్థితి ఎటువంటిది అంటే, అది నాకు తన బాధను నాతో చెప్పటానికి ఏమాత్రం సంబంధం లేనిదానిగా ఉన్నాను. ఆ సంగతి ఏమిటోగాని, స్పృహలోనే ఉండి నేను నా చేయిపట్టుకున్నా కూడా ఆ స్పర్శ యొక్క జ్ఞానం ఉండటం లేదు. నిరంతరం స్పృహ ఉండీ లేనట్లుగా ఉన్న ఒక ఆశ్చర్యకరమైన దశ నాది అని అనిపిస్తోంది. కాని నేను ఎప్పుడూ స్పృహలేనిదానిగా లేనట్లుగానే చూస్తున్నాను. ఇప్పుడు నా దశను ఆధ్యాత్మికమైన మగతగాని, మత్తుగాని తాకనట్లుగా ఉంది. దశ అంతా స్వచ్ఛంగా ఉంది. స్థితిలో ఆనందం తన్మయత్వం ఉన్నదని చెప్పలేను, లేదనీ చెప్పలేను. మనస్సు లగ్నమై ఉంటోందని మాత్రం చెప్పవచ్చు. ఇప్పుడు నా ఈ స్థితిలో నాకు ఏమనిపిస్తోంది అంటే, నా సంపూర్ణ ఆలోచనా ధోరణిని కేవలం 'మాలిక్' ఆనందం కొరకే మరల్చాలని, మరియు నిరంతరం 'మాలిక్' నా ఎదుటనే కూర్చుని ఉన్నట్లుగా అనుభూతి చెందాలని అనిపిస్తోంది. 'మాలిక్' ఎదుట నావలన ఈ తప్పు జరిగింది కనుక ఆ దోష పరిహారార్థం ఇదే చిట్కా అవుతుంది. ఆ తర్వాత అటువంటి దోషం పునరావృతం కాకూడదని ప్రార్థిస్తున్నాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 515

లఖీంపుర్,

27.08.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అంతా కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

బ్రహ్మవిద్య అనేది పూర్తిగా ఈశ్వరీయ ధార లేదా ఈశ్వర రూపం యొక్క స్వరూపంగా ఉంటుంది. ఈ దశలో నాకు నా స్వంత రూపం యొక్క ప్రతిబింబమే (రియాలిటీ) సత్యత్వంగా అనిపిస్తోంది. అంతేగాకుండా, ఆ ప్రతిబింబంతోనే ఈ ప్రపంచం కాంతివంతంగాను, చైతన్యం ఉన్నట్లుగాను అనిపిస్తోంది. అయితే ఆ ప్రతిబింబానికి పైన, నాలోగాని, నా దశలోగాని మరే ఇతర వస్తువు యొక్క జాడలేనట్లుగా నా స్థితి ఉంది. ఈ స్థితి ఎలా ఉందంటే, ఇది ఖాళీగా ఉంది అని చెప్పినప్పటికీ కూడా దానిలో ఏదో ఒకటి అనుభవం ఉంటుంది, కాని నాకేమీ అనిపించటం లేదు. నేను ప్రతిబింబం కాదు కనుక నా నుంచి (రియాలిటీ) సత్యత్వం పిండి వేయబడి ఉంటుంది (వడకట్టబడి ఉంటుంది). ఇప్పుడు 'లేదు' అను దానిని 'ఉన్నది' అను అనుభూతితో ముందుకు నడుస్తున్నాను అని చెప్పితే బాగుంటుందని అనిపిస్తోంది. ఇప్పుడు నేను ఇక్కడకు పోవాలి, అక్కడికి పోవాలి, ఆగిపోవాలని అనిపించనటువంటి స్థితిలో ఉన్నాను. ఇప్పుడు సముద్రం లేదు, నావ లేదు, ఇటూ లేదు, అటూలేదు. అయినప్పటికీ నా హృదయంలో ఎప్పుడూ బాధ ఉండేది, కాని ఇప్పుడు ఏమైందో ఆ భగవంతునికే తెలియాలి, ఆ బాధ యొక్క అనుభవం కలగటం లేదు. కాని ఎప్పుడైనా ఆ బాధ అనుభవమైతే అది నాకు స్పృహను కల్పిస్తుంది లేదా నాలో కొంత చైతన్యం కల్పిస్తుంది.

కేసర్ తమకు ప్రణామం చెబుతోంది. అమ్మ ఆశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 516

షాజహాన్‌పూర్,
29.08.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ మూడు ఉత్తరాలు 23, 26 మరియు 27 ఆగష్టు 1955వ తేదీలవి అందాయి. ఆగష్టు 23వ తేదీ ఉత్తరంలో నీవు మహాసముద్రంలోకి వెళ్ళటం, తర్వాత నా చేతుల్లో లీనమైపోవటం వ్రాసినది చాలా మంచి వ్యాఖ్యానం. ఇదివరకే దీనిని గురించి నేను మాస్టర్ సాహెబ్‌గారికి వ్రాసిన ఉత్తరంలో వ్రాశాను. ఒక దర్శనం (Vision) లేదా ఒక సంఘటన రూపంలో ఆ స్థితి దిగి వచ్చింది. అనగా **నీవు నాలో లయమైపోయావు. ఇప్పుడు నీవు నీ తల్లిదండ్రులకు జన్మించిన కస్తూరీవి కావు.** ఈ పరిస్థితినిబట్టి నాకు అర్థమవుతున్నది ఏమిటంటే, నా స్థితికి నీ స్థితికి భేదం ఏమిటంటే, ఈ స్థితులు నా గురుమహరాజ్ తన మహాసమాధి అనంతరం నాకు ఇవ్వటం జరిగింది, ఇది మాత్రమే భేదం. దీనిలో ఒక ప్రత్యేకత ఉంది. నీకు వ్రాసిన ఒక ఉత్తరంలో ఆధ్యాత్మిక గురువు మహాసమాధి పొందిన తర్వాత శిష్యునికి కలిగే లాభం ఏమిటో ఇదివరకే వ్రాశాను. ఇప్పుడు నేను చెప్పదలచిన దానిని చెబుతాను. నిరాడంబరత్వం (Simplicity) యొక్క అనుభూతి ఎప్పుడు కలగదంటావు? ఎప్పుడైతే 'వారి'లో లయ-అవస్థ పొందుతారో అప్పుడు. దీనినిబట్టి నీలో (Condition of Ignorance) అజ్ఞాన స్థితి ఆరంభమైనట్లుగా తెలియజేస్తోంది. అంతేకాదు, దానిలో చాలా ఉన్నతిని సాధించావు. ఈ అజ్ఞానస్థితి 'మాలిక్'లో లయమైపోయాక, అప్పుడు (Spiritual knowledge) ఆధ్యాత్మిక పరిజ్ఞానం అంతమవుతుంది. కాని నా దృష్టి ఏ ఒక్క పాయింట్ లేదా స్థానానికి మాత్రమే పరిమితం కావటం లేదు. దీని తర్వాత ఇంకా ఏదో ఉంది కాని నేను ఇప్పుడే వ్రాసినట్లయితే ప్రయోజనం ఉండదు. ఎందుకంటే, ఈ అజ్ఞానస్థితి తర్వాత స్థితిని గురించి నేను నోరు విప్పితే నేటి కాలపు వేదాంతులు నన్ను విమర్శించవచ్చు. అయినా వారు విజయం సాధించలేరు. అప్పుడు ఏమి జరగుతుంది? వారు నన్ను "వెర్రివాడు"గా వ్యాఖ్యానిస్తారు. ఎందుకంటే, అది మాత్రమే వారికి చేతనైన పని. కాబట్టి నీవు స్వయంగా ఆ అజ్ఞానస్థితిని దాటి తరువాత స్థితికి చేరుకున్న తర్వాత దాని సంగతి తెలియజేసినట్లయితే నేను ఈ అపఖ్యాతి నుంచి తప్పించుకున్నవాడనవుతాను. మన చౌబేజీ వారిని వేదాంతిగా చక్కగా వర్ణించారు. ఆయన వారిని హాస్యపూర్వకంగాను, వ్యంగ్యంగాను, 'వేదాంతి'ని 'బేదాంతీ'గా పేరుపెట్టారు. 'బేదాంతీ' అనగా పళ్ళు లేనివాడు అని అర్థం వచ్చేటట్లుగా చెప్పారు. పళ్ళులేనివాడు ఆహారాన్ని నమలలేడు, నమలకపోతే జీర్ణకోశం జీర్ణించుకోలేదు. ఈ విధంగా నమలబడని ఆహారం జీర్ణకోశంలోకి చేరినట్లయితే, జీర్ణవ్యవస్థ చెడిపోతుంది. వేదాంతుల పరిస్థితి కూడా ఇటువంటిదే. వారు ఆధ్యాత్మికత అనబడు ఆహారాన్ని, శక్తిని జీర్ణించుకోవటానికి అశక్తులవుతారు. కనుక ఉపన్యాసాలు ఇవ్వటం కంటే ఆచరణ ఉండాలి.

**స్వామి వివేకానంద:** "ఈ అభివ్యక్తంచేసే తీరు చాలా అద్భుతం. వాస్తవిక స్థితిని ఆమోదించటమే నిజమైన ఆధ్యాత్మికత."

నీ ఉత్తరం ఆగష్టు 23వ తేదీ దానిలో కేవలం ఒక దానికి నేను సమాధానం ఇవ్వవలసి ఉంది. నీకు చాలా ఆలోచనలు వస్తున్నాయని వ్రాశావు. దీని మీద నీవు ధ్యాసపెట్టినట్లయితే నీవు స్వయంగా ఆలోచనల నుండి వేరుపడుతున్నట్లుగా గ్రహిస్తావు. ఈ స్థితిలో కూడా ఆలోచనా ప్రవంతిని కల్పిస్తూ ఉండటం దైవం యొక్క అపారమైన దయకు నిదర్శనం. దీనికి కారణం ఏమిటంటే, ఈ అజ్ఞానస్థితిలో ఆలోచనలు కలగనట్లయితే శరీరం ఛిన్నాభిన్నమైపోతుంది. ఎందుకంటే, సృష్టి ఏర్పడకపూర్వం ఉన్నటువంటి (Perfect Balanced State) స్వచ్ఛమైన

సామ్యావస్థ కలగటమే దానికి కారణం.

ఆగష్టు 26వ తేదీ ఉత్తరానికి జవాబు ఇస్తున్నాను. దేహం యొక్క కణకణం శాశ్వత సమాధిని పొందాయని, దానితో మహాశాంతి చేకూరిందని వ్రాశావు. అయితే అది నీకు అనుభవం అయ్యిందా లేక నీ మనస్సుకు తోచిందా అనేది వ్రాయలేదు. ఎప్పుడైతే శాంతి యొక్క ఆలోచన కూడా లేనిఅనుభూతి కలుగుతుందో, అప్పుడు అది వాస్తవిక స్థితి. అప్పుడు అజ్ఞానం యొక్క స్థితి పరిపక్వమవుతుంది. నేను శాంతికి చాలా భయపడతాను. శాంతి కలగకముందే తమంతటతాము శాంతంగా ఉన్నామని చెప్పుకునే స్వాములకు నా అభినందనలు. స్పృహ కలిగి ఉండి కూడ నీవు ఒక చేతిని మరొక చేతితో స్పర్శించినప్పటికీ ఆ స్పర్శయొక్క అనుభూతి కలగటం లేదు అని వ్రాసావు. ఇది ఉత్తమశ్రేణికి చెందిన "లయ–అవస్థ". ఆధ్యాత్మిక మత్తుగాని, దాని ప్రభావంతో వచ్చే మాదకతగాని నీ స్థితిని కనుమరుగు చేయలేకపోతున్నాయని కూడా నీవు వ్రాశావు. మత్తు (నిషా) భౌతిక శరీరంతో సంబంధం కలిగి ఉంటే, దాని ప్రభావంతో కలిగిన మాదకత సూక్ష్మ శరీరానికి సంబంధించి ఉంటుంది. నీవు వీటినిమించి ఉన్నతంగా సాగిపోయావు, కనుక వీటి ప్రభావం నీలో ఉండే ప్రశ్నేలేదు. నీవు కాయస్థవై (శరీరంతో ఉండి ఉంటే) ఉంటే ఆ మత్తుయొక్క ఆనందాన్ని అనుభవించటం జరిగి ఉండేది. ఏదైనా ఆనందాన్ని పొంది ఉంటే అది హృదయంలో ఉప్పొంగిన మహదానందం మాత్రమే. మహమ్మదీయ సూఫీలు దీనిని 'నశె మార్ ఫత్' (ఆధ్యాత్మిక మత్తు) అని అంటారు కాని, అది సరికాదు. ఇప్పుడు నీవు ఏ స్థితిలో ఉన్నావో అర్థం చేసుకో.

ఆగష్టు 27వ తేదీ ఉత్తరంలో నీవు "నా స్వంత ప్రతిబింబమే సత్యత్వం (రియాలిటీ)గా అనిపిస్తోంది, కాని నేనే స్వయంగా దాని ప్రతిబింబం ఎందుకు కాలేకపోయానో దైవానికే తెలియాలి. ఎందుకంటే, ఆ 'సత్యత్వం' (రియాలిటి) నా నుంచి బయటకు తీసివేయబడింది" అని వ్రాసావు. ఈ వాక్యం నాకు అర్థం కాలేదు. నీవు ఇటుగాని, అటుగాని వెళ్ళాల్సిన అవుసరంలేదని, అక్కడ సముద్రం కాని, పడవగాని లేవు అని ఇంకేదో వ్రాశావు. అభ్యాసీ సత్యత్వం (రియాలిటీ)లో లయమైపోతున్నప్పుడు అటువంటి అనుభూతులు, ఆలోచనలు కలుగుతూ ఉంటాయి. అది నిజమే! ఎందుకంటే, అక్కడ వచ్చేదీ, పోయేదీ ఏదీ ఉండదు. మనం, ఎక్కడి వాళ్ళమో అక్కడ ఉంటాము. అంటే, ఎక్కడైతే మనం ఎప్పుడూ ఉన్నామో, ఎక్కడైతే మనం ఎప్పుడూ ఉండాలో, అక్కడ. ఆత్మ ఎంత నిర్మలం, పరిశుద్ధమైనదిగా ఉంటుందంటే, దాని మీద ప్రపంచ సంబంధమైన ఏ రంగూ (భౌతికత) అతకదు అను విషయం కూడా సరైనదే. అయితే దాని ఉనికి అనగా అది (ఆత్మ) ఉన్నదను భావం బుద్ధికి తెలిసినట్లయితే అది ఒక పెద్ద ప్రతిబంధకంగా తయారవుతుంది. అలా ఎందుకంటే, మనస్సు, ఆత్మకు సమీపంలో ఉండి, ఆత్మకు సంబంధించినది ఏదైతే ఉందో దానిని తనదిగా భావించి అహం యొక్క వలలో పడిపోతుంది. అర్థం చేసుకోవటానికి దానిని జ్ఞానం (Intelligence) లేదా మరేదైనా మాటలతోగాని చెప్పవచ్చు. దానిని (Mind) మనస్సు అని కూడా చెప్పవచ్చు. ఆత్మ నివేదన యొక్క జ్ఞానాన్ని కూడా ఇదే కల్పిస్తుంది.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 517

లఖీంపూర్,
29.08.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. చదివి చాలా సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

అదేమిటోగాని, బ్రహ్మాండం నుండి ఏదో వస్తువు దానంతట అదే వెలువడుతూ వాతావరణంలోకి వ్యాపించిపోతున్నట్లు అనిపిస్తోంది. ఆ వస్తువు ఏమిటో నాకయితే అర్థంకావటం లేదు. యోగి మరణించినపుడు అతని బ్రహ్మాండం ముందుగా బ్రద్దలవుతుంది అని జనులందరూ అంటూ ఉంటారు, మరి నేనయితే నా బ్రహ్మాండం దానంతటదే బ్రద్దలైపోయినట్లు నేను చూస్తున్నాను. నా స్థితిని గురించి చెప్పాల్సివస్తే ఆనందంలేని ఆనందాన్ని మరియు 'లేదు'ను 'ఉన్నది'గా భావించి ముందుకు సాగిపోతున్నాను. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 518

లఖీంపుర్,

7.09.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి వ్రాసిన ఉత్తరం ద్వారా తమకు చెందిన సమాచారం తెలిసింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇంతకుపూర్వం నేను, ఒకసారి నడుస్తున్నా, పనిచేస్తూ ఉన్నా కూడా నా కణకణం సదా నిశ్చలంగా ఉంటున్నాయి అని వ్రాశాను. కాని ఇప్పుడు ఎందుకోగాని, చేయి కదుపుతూ ఉన్నా కూడా చేతి యొక్క స్పర్శ తెలియటం లేదు. ఇప్పుడైతే శరీరం ఒక వింతదానిలాగ ఉంటున్నది. దీనిని నటిస్తున్నట్లు చెప్పుకున్నా చెప్పుకోవచ్చు. నా స్థితి ఎలా ఉందంటే, దానిని నిశ్చలంగానో లేదా చంచలంగానో ఉందని చెప్పినా కూడా శరీరంపై దాని ప్రభావం ఏమీ లేదన్నట్లుగా నా స్థితి ఉంది. స్థితి గురించి చెప్పాలంటే ఏమీలేదు, ఎందుకంటే మార్పు అనేది లేకుండానే ఉంది. ఇంకొకరకంగా చెప్పాలంటే, ఇంతకుముందు ఎలా ఉందో అలానే ఉంది.

అసలిప్పుడు శరీరంగాని లేదా దశగాని ఏదైనా అంశయేనా (విషయమైనా) కాదా అనేది నాకు తెలియటం లేదు. ఈ దశను చెప్పటానికి (Ignorance) అజ్ఞానపు దశగా చెప్పవచ్చునుగాని, నేనయితే ఇప్పుడు ఇది కూడా చెప్పలేను. ఎందుకంటే, ఇప్పుడు ఈ అజ్ఞానపు దశ యొక్క రంగు కూడా వెలిసిపోయినట్లు ఉంది. ఒక వస్త్రానికి రంగు పట్టించి ఎండలో ఆరవేసినట్లయితే ఆ రంగు వెలిసిపోయి, తెల్లగా అయిపోయినట్లు దీనిని పోల్చవచ్చు. ఉన్న భేదం ఏమిటంటే, నాలో తెల్లబడటం అనేది ఎప్పుడూ లేదు, మరి ఇప్పుడూ లేదు. ఇప్పుడు నేనేమి చెప్పాలి? ఈ స్థితిలో, దశను ఉన్నది ఉన్నట్లుగా ఉంది అని చెబుదామనుకుంటున్నా అది కూడా చెప్పతగినదిగా లేదు. నేను రంగు వెలిసిపోయింది అని ఎందుకు వ్రాశానంటే, నావద్దనయితే ఎలాంటి రంగూ లేదు. శరీరమూ లేదు. కనుక నేనేమీ చేయలేదు. ఏమిచేయను కూడా. నేను ఏమైపోయానో తమకే తెలియాలి. నేను ఈ దశను చూస్తున్నాను, దానిలో, నాకు ఏమైనా కావాలని అనిపించినా, అనిపించకపోయినప్పటికీ హృదయంలో ఒక తపన మాత్రం ఉంటోంది. అయితే దానికి ఏమి కావాలో తెలియదు. 'మాలిక్'తోపాటుగా ఉంటూ ఉండి కూడా అది అతడినైనా చూడాలనుకోవటం లేదు. అదేమిటో 'మాలిక్'కే తెలియాలి. నాతో 'అతడు' ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదు. ఒకవేళ చేస్తున్నా కూడా నేను వినలేకపోతూ ఉండి ఉంటాను. ఎందుకోగాని నామీద నాకు విశ్వాసం లేకుండా పోయింది. నా సమక్షంలోనయితే 'తమరు' ఒక్కరే ఉంటున్నారు. కాని నేను ఎక్కడైనా 'తమరి'ని మరచి ఉన్నానా? ఇది కూడా 'తమ'కే తెలియాలి. నేనయితే ఏమీ చెప్పజాలను. 'మాలిక్' నన్ను ఎలా ఉంచితే నేను అలాగే ఉంటాను. ఇంక చెప్పవలసింది ఏమీలేదు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 519

లఖీంపుర్,
14.09.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరు కుశలమే. నారాయణ దద్దా ద్వారా తమరు కుశలమేనని తెలిసింది. విని సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ స్థితి ఎలా ఉందంటే, అజ్ఞానం యొక్క స్థితిని దాటి వెళ్ళుతూ ఉన్నట్లు ఉంది. ఈ స్థితిలో అజ్ఞానం యొక్క జ్ఞానం కూడా స్మృతిలో లేకుండా పోయినట్లు ఉంది. **నేను చేయాల్సిన ప్రతి పనిని, ఆఖరికి మాట్లాడటం కూడా ప్రకృతియే స్వయంగా నిర్వహిస్తున్నట్లు అనిపిస్తోంది. ప్రకృతి నన్ను శ్రీ బాబూజీ కుమార్తెగా భావించి, తన సేవకురాలిగా చూడకూడదని భావించి ఉంటుందేమో,** అది 'మాలిక్'కే తెలియాలి. ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, ఎలాంటి దశను కూడా ఆలోచనతో కేంద్రీకరించలేకపోతున్నాను. అలా ఎందుకంటే, నేనే స్వయంగా ఆలోచనలో ఇమడలేకపోతున్నాను. ఏదో ఒకటి చెప్పాల్సి ఉంది కనుక చెబుతున్నానుగాని, వాస్తవానికి నావద్ద చెప్పవలసింది ఏమిలేనట్లు ఈ స్థితి ఉంది.

2,3 రోజుల నుంచి దశ స్పష్టంగా ఉండటం లేదు, ఇప్పుడు తరచుగా ఇలాగే ఉంటోంది. అదేమిటో తెలియదు, కాని స్థితిలో ఆనందం, స్వచ్ఛత ఎప్పుడూ కలగటం లేదు. నేను ఇప్పుడు స్థితిలో లోతుగా ప్రవేశిస్తున్నానో లేదో తెలియకుండా ఉంది. అయినా కూడా స్థితి బాగున్నట్లుగానే ఉంది. అది కూడా ఎందుకు చెబుతున్నాను అంటె మనస్సుకు అది చెడుగా అనిపించటం లేదు కనుక. ఇంకా ఏమిటంటే, మనస్సుకు దశమీద బాగా ధ్యాస నిలపటానికిగాని, ఆలోచించటానికిగాని తగిన శక్తి కూడా లేకుండా పోయింది. ఎందుకోగాని, మనస్సులో విసుగుదలతోపాటు లోపల కొంత దిగులుగా ఉంటోంది. దీనివలన ఏ పని చేయటానికి మనస్సు లగ్నం కానందున ఏమి చేయలేకపోతున్నాను. మనస్సు ఎప్పుడూ విసుగు చెందుతూనే ఉంది. నిర్మలీకరణ యొక్క అవసరం ఏమైనా ఉందా అనే ఆలోచన కలుగుతోంది. మానసిక శక్తి ఎంత దుర్బలమైపోయింది అంటే, ప్రయత్నించినా కూడా ఈ విసుగుదలను మాన్పలేకపోతున్నాను. బహుశా ఇందుకే అప్పుడప్పుడు అకారణంగా విలపించాలనే కోరిక కలుగుతుంది. ఇప్పుడు మానసిక స్థితి ఇలా ఉండగా విలపించటం, పాడటం మరియు నిద్రించటం అనేవి కూడా ఇప్పుడు నా స్వాధీనంలో లేవు. ఈ మనస్సును ఇప్పుడు 'మాలిక్'కు అర్పించటానికిగల సామర్థ్యం కూడా లేకుండాపోయింది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 520

షాజహాన్‌పూర్,
19.09.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలన్నీ కూడా అందాయి. నీ స్థితి చాలా బాగానే ఉంది. ఈరోజు సాయంత్రం గం. 7.30 ని॥లకు నేను నిన్ను '$G_1$' స్థానం మీదకు చేర్చాను. అందుకు దైవానికి ధన్యవాదాలు. దైవం తలిస్తే నీవు (Central Region) కేంద్ర మండలంలో తప్పకుండా యాత్ర చేయగలవు. మిషన్ పనిని అలుపులేకుండా చేయగలగటానికి

దైవం నీకు ఆరోగ్యం అనుగ్రహించుగాక!

కేసర్ మా ఇంటికి వచ్చింది. నేను ఆమెకు పిండదేశ ఆధ్యాత్మిక యాత్రను పూర్తి గావించాను. బ్రహ్మాండ మండలంలో ఆమె ధ్యానరూప ప్రతిబింబం ఏర్పడిపోయింది. ఆమె, తనఈరాక నిరర్థకమని భావించకూడదని ఒక రోజున (ట్రాన్స్‌మిషన్) ప్రాణాహుతి ఇచ్చాను. రెండవ రోజున అయిష్టంగానే మరొక సిట్టింగ్ ఇచ్చాను. అయితే ఆ సిట్టింగ్‌ను ఆమె కోరకుండానే ఇచ్చాను. ఆమెకు పిండదేశపు ఆధిపత్యం ఇవ్వాలన్నది నా తలంపు. అందుకు తగినట్లుగా తయారుచేస్తూ ఉన్నాను. కాని దానిని స్వీకరించగల సత్తా (Capacity) ఆమెలో లేకపోవటం వలన నేను ఏమి చేయలేకపోయాను. మిషన్ పనినైతే ఆమెకు అప్పగించాను. ఆమె దానిని సక్రమంగా నిర్వర్తిస్తూ ఉంది. నీవు 'సహజ–సమాధి' పుస్తకం ద్వారా దానిలోని విషయాన్ని విస్తరించావు. నేను వచ్చినపుడు దానిని విని, తర్వాత దానిని అచ్చువేయించటానికి ఏర్పాటు చేస్తాను.

చౌబేజీకి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 521

లఖీంపుర్,
23.09.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం అందింది, చదివి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటోగాని ఇంతకుపూర్వమైతే నాలో ఏదో ఒకటి ఉండి, అది నా పురోగతిని గురించిన సమాచారం అందిస్తూ ఉండేది. కాని ఇప్పుడు అది ఎక్కడ ఉందో తెలియదు. బహుశా ఇందుకే నా పురోగతి గురించి తెలియటం లేదు. అయితే ఇప్పుడు నా దశలో ఈ ప్రపంచమే నా ప్రపంచం అన్నట్లుగాను, ఇదే నా ప్రస్తుత నివాసం అన్నట్లుగాను ఉంది. అలాకాదు కాని, ఇప్పుడు అసలు ఏ ప్రపంచం లేనట్లుగా ఉంది. ఇప్పుడు నన్ను అసలు ఏ లెక్కలోకి లెక్కించుకోవాలో తెలియటం లేదు. ఎందుకంటే, నా ఆలోచనలో ఎటువంటి లెక్కకూ విలువలేదు. (అనగా నన్ను ఏ స్థాయికి చెందిన దానను అని చెప్పుకోవాలో తెలియటం లేదు, ఎందుకంటే, ఇప్పుడు నాకు స్థాయి ఉన్న అంశం ప్రాముఖ్యం లేనిదిగా ఉన్నది –అని). ఇంకా చెప్పాలంటే, నన్ను ఈ ప్రపంచంలో ఒక లెక్కకురాని (ప్రాధాన్యతలేని) మనిషిగా భావించినా కూడా బహుశా తప్పుగాకపోవచ్చు, అది కూడా నన్ను ప్రభావితం చేయలేదు. ఇప్పుడు ఉన్న స్థితిని చూస్తుంటే, ఈ ప్రపంచం నుంచి పైకిపోయే శక్తి సామర్థ్యం కూడా నాలో లేకపోయినట్లుగాను, అసలు దానిపట్ల నాకు అభిరుచియే లేనట్లుగాను అనిపిస్తోంది. ఈ దశలో నన్ను ఇప్పుడు ఒక ఇంటికి చెందినదానిని అనిగాని, ఇల్లేలేనిదానిని అనిగాని, ఏదో ప్రపంచానికి చెందినదానను అనిగాని లేదా అస్తిత్వమే లేనిప్రపంచానికి చెందిన అని చెప్పినాగాని, మనస్సులో ఇదేమీ పట్టనట్లుగాను, భేదమేమీ లేనట్లుగాను ఉంది.

బాబూజీ, ఇప్పుడు నేను నా దశను ఎటువంటిది అని ఏ మాటల్లో వ్రాయాలి? చూస్తూ ఉంటే, ఇప్పుడు నా ఆలోచనల్లో శక్తిగాని, పట్టుదలగాని ఏమీ లేనట్లుగా అనిపిస్తోంది. ఇలా ఎందుకంటారా? దశలో అజ్ఞానం లేదా వినమ్ర మహాసమాధి లేదా సరళత్వం ఉన్నాయని చెబుదామంటే కూడా ఇవన్నీ, నిరర్థకంగా అయిపోయాయి, లేదా వీటిని పట్టుకోగల శక్తి నా ఆలోచనలకు లేదనిపిస్తోంది.

నా స్వంత ప్రళయమే జరుగుతోందని అందరూ అంటూ ఉంటారు కాని, దీర్ఘంగా ఆలోచిస్తే ప్రళయం ఎక్కడ జరిగింది? ఎందుకంటే, నేను ఎలా ఉన్నానో అలానే ఉన్నాను. నేను సత్సంగ్‌కి వెళ్ళినపుడు, అదేదో ఉత్సవం జరుగుతూ ఉన్నట్లుగాను, దాని గురించి ఏమి తెలియనట్లుగాను ఉంటోంది. ఇదివరకటిలాగా నా కళ్ళలో అన్వేషణ లేకుండా పోయింది. నిద్ర – జాగరణ దశలో ఒక రకమైన బాధ ఉంటోంది, కాని దానిని నేను బాధ అనలేను, మరేదైనా అనీ చెప్పలేను. ఇప్పుడు కళ్ళలో పొగబారిన మసక వంటిది లేదు. ఆ మసకను శుభ్రం చేసుకున్నాక బాగా కనిపించింది అని చెబుతానని అనుకుంటున్నారేమో కాని అలాంటిది ఏమీలేదు. నా మనస్సులోగాని లేదా లోపలగాని ఎటువంటి స్మృతి (జ్ఞాపకం) కూడా లేనట్లుగా ఉంది ఈ దశ. అది ఎంత గాఢంగానంటే, ఏదైనా (Spiritual moment) ఆత్మిక క్షణంగాని, (Spiritual joy) ఆత్మిక ఆనందం కూడా జ్ఞాపకం రావటం లేదు. అక్కడ ఏ చిత్రం తయారుకాలేదు, చెరపబడనూ లేదు. నేను ఒక విగ్రహంలాగా అయిపోయాను. ఎవరైనా నా వద్దకు ధ్యానానికి వచ్చినపుడు, వారు ఆ విషయం చెప్పనంతవరకు, ఎవరైనా నావద్దకు ధ్యానం చేయటానికి వస్తారా, నేను ధ్యానం చేయించగలనా అనేది కూడా అర్థం కాకుండా ఉంది. ధ్యానం చేయించినాగాని అది తెలియని స్థితిలోనే ఉంటోంది. కనుక కేవలం 'తమ' ఆసరాతోనే అన్నీ జరుగుతున్నాయి.

కేసర్ తమకు ప్రణామం చెబుతున్నారు. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాశీస్సులు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 522

షాజహాన్‌పూర్,
29.09.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం సెప్టెంబర్ 23వ తేదీది అందింది. శ్రీ వి.విశ్వనాధన్ గురించి నీవు వ్రాసిన అభిప్రాయం సబబుగానే ఉంది. అతడు 'మహాయోగం' అనగా అహంను అంతమొందించే ప్రక్రియలో మునిగి ఉన్నాడు. వింత ఏమిటంటే, అతనిలో అది (అహం) వృద్ధి చెందుతోంది. డాక్టర్ వరదాచారిగారి నుంచి మళ్ళీ ఒక ఉత్తరం వచ్చింది. దాని నకలు నీకు పంపుతున్నాను. మనిషిగా వారు మంచివారే, కాని తరచుగా కొంచెం తేడాగా వ్రాస్తుంటారు. వారి హృదయంలో స్థూలత్వం ఘనంగా లేదు కాని ఎంతో కొంత మిగిలి ఉంది. దీనిని నీవు వారి పూర్తి శారీరక వ్యవస్థలో గమనించగలవు.

ఇప్పుడు నీ స్థితిని గురించి వ్రాయటానికి నీకు మాటలు దొరకనట్లుగానే, నీ స్థితిని నీకు వివరించటానికి నాకూ మాటలు దొరకటం లేదు. ఏదైతే నీ స్థితిని నీకు తెలియజేస్తూ ఉందో అది ద్వైతం (Duality) అవుతుంది. అది ఇప్పుడు తన అస్థిత్వాన్ని కోల్పోతూ లేదా శుష్కించిపోతూ ఉండటంతో దాని జాడ నీకు తెలియటం లేదు. అయినప్పటికి ఆ ద్వైత స్థితిని తెలియజేయటానికి ఏదో ఒకటి ఉంటూనే ఉంటుంది. అయినా దాని జాడ ఏమని తెలుపుతుంది? కబీర్ ఎక్కడో ఒకచోట ఈ విధంగా వ్రాసాడు: **"జహాం మిలౌనీ తహాం విచార్, ఏక్ ఏక్ మె కహాం విచార్"** (అనగా ద్వైతం ఎక్కడైతే ఉంటుందో అక్కడ ఆలోచన ఉంటుంది, అంతా ఒక్కటైపోయినప్పుడు ఆలోచన ఇంక ఎక్కడ ఉంటుంది అని భావం.)

'మాలిక్' నీ ఆలోచనలోకి రాకుండా ఉన్నట్లయితే దానిని మంచి స్థితిగా చెప్పాలి. అది ఎందుకంటే, ఎవ్వరికొరకైతే అన్వేషిస్తున్నావో అతడు నీలోనే ప్రత్యక్షంగా ఉన్నాడు. అయితే ఈ స్థితి ఇంకా పరిపక్వత చెందలేదు. నీ ఈ దశలో

విశేషం ఏమీ కనిపించటంలేదని, అది అందరి మానవులతో సమానంగానే ఉన్నట్లు అనిపిస్తోంది అని వ్రాశావు. ఇది స్వయంగా ఒక మంచి స్థితి. ఆరంభమైతే అయ్యింది కాని ఇది కూడా ఇంకా పరిపక్వస్థితికి రాలేదు. **అంతిమం చేరిన తర్వాత కలిగేటటువంటి అసలు-స్థితి, చాలా గొప్ప రహస్యమైనదిగా ఉంటుంది.** దానిని గురించి ఇప్పటివరకు నేను నోరు విప్పలేదు. ఎందుకంటే, జనం నా గురించి ఏమనుకుంటారో ఏమో! ఇతడు ఆధ్యాత్మికత రంగంలో ఇంకను కాలైనా మోపలేదు కాని జనాలను మోసగిస్తున్నాడు అని చెప్పి "ఫత్వా" (మతానికి సంబంధించిన ఆంక్ష) విధిస్తారు. ఇంకా రెండో విషయం ఏమంటే, ఈ అంతిమం (ఆఖరి స్థానం) చేరటంవలన కలిగే ప్రయోజనం ఏమిటో ఎవ్వరికైనా చెప్పబడినప్పుడు, దాని ప్రాముఖ్యత తెలిసి, అది మానవులను ఆధ్యాత్మిక జ్ఞానం లేదా బ్రహ్మవిద్యవైపు ఆకర్షిస్తుంది. నేను దానిని ఎక్కడో, ఏదైనా సందర్భంలో వివరించాలని బలీయమైన కాంక్ష అయితే ఉంది కాని చెప్పకుండా ఉండటమే మంచిదనుకుంటాను. ఎందుకంటే, అక్కడకు చేరిన వారు దానిని స్వయంగా తెలుసుకుంటారు. వేదాలలోగాని, ఋషుల రచనల్లోగాని ఈ విషయం ఏమాత్రం ప్రస్తావించబడలేదు. భగవంతుడు నాలాంటి వారికొరకు నిలిపి ఉండవచ్చు. ఎందుకంటే, గొప్ప విషయాలు, గొప్పవారి కొరకు; అల్పమైన విషయాలు నావంటి సామాన్య మానవులకొరకు నిర్దేశించబడి ఉండవచ్చు. ఒక బిచ్చగాడు యాచన చేసినపుడు అతనికి ఒక రొట్టె గాని, పైసాగాని ఇవ్వబడుతుంది. అదే ఎవరైనా గొప్పవాడు కోరినట్లయితే వేల రూపాయలకు చెక్కును ప్రజలు అందజేస్తారు. చేతిలో నుంచి అన్నీ జారిపోయినట్లుగా అనిపిస్తోంది అని నీవు వ్రాశావు. సమస్తం చేతిలోకి వచ్చాయి అనిగాని, నీవు పట్టుకుని ఉన్నది చేజారిపోయి, ఆ భారంతో చేయి ఖాళీ అయిపోయినట్లుగా గాని, దాని అర్థం. నీలో ఏదో తపన, దానిని గురించి నీవు చెప్పగలిగినటువంటిదిగాని, చెప్పలేనటువంటిదిగాని ఉన్నట్లుగా నీవు వ్రాసావు. ఈ తపనయే నిన్ను ముందుకు నడిపిస్తోంది, దాని పని పూర్తి చేసిన తరువాతనే అది తొలగిపోతుంది. చివరకు (అంతిమం చేరిన తర్వాత) అది కూడా ఉండదు.

కేసర్ ఉత్తరం కూడా వచ్చింది. ఆమె మనస్సులో, నేను ఏ స్థాయికి చేర్చాలనుకున్నానో ఆ స్థాయికి తగ్గ సామర్థ్యం ఆమెలో లేకపోయింది అని చెప్పిన మూలంగా ఎటువంటి నిరుత్సాహం ఉండకూడదు. దైవం తలిస్తే అది వృద్ధి చెందుతుంది. జపానుకు పంపటానికి నా ఫోటోలు సిద్ధం చేశాను. నేను వాటినన్నింటినీ పంపుతున్నాను. మాస్టర్ సాహెబ్‌గారు వాస్తవంగా ప్రపంచం యొక్క అన్ని భాగాలలో కాకపోయినా సరే, ఒకరిద్దరిలోనైనా మిషన్ పేరును ప్రచారం చేసిన ఖ్యాతి పొందారు. ఇంతవరకు అయితే నా చేతిలో ఉందికాని, మిగిలినది దైవం చేతిలో ఉంది.

చౌబేజీకి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 523

లఖీంపుర్,
22.10.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం చేరింది. నా ఉత్తరం కూడా తమకు చేరి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇంతకుపూర్వం నాకు కొంత స్పృహ లేదా ధ్యాస వస్తూ ఉండేది. అప్పుడు మనస్సు మరియు యావత్తు శరీరం యొక్క నరాల క్రియాశీలత యొక్క ఆకర్షణ లేదా చైతన్యం ఊర్ధ్వముఖంగా ఉన్నట్లు అనుభవమవుతూ

ఉండేది. అయితే ఈ దశలో నేను ఇక్కడికి ఇక్కడే ఉంటున్నాను కాని పైకి ఎప్పుడూ పోవటం లేదు. ఇప్పుడు ఈ స్థితిలో ఆలోచన అనేది కలగటం లేదు, అలాగని ఆలోచనా రహితంగా ఉండటం లేదు. బాబూజీ, నా స్థితిని నిద్రించి ఉన్న మనస్సుకు నిద్రయొక్క అనుభూతి లేదని, లేదా ఒక కోల్పోయిన మనస్సుకు తాను కోల్పోయినట్లుగా, తెలియకుండా ఉంది. జీవితం ఒక సాధారణ అమ్మాయిలాగా గడుస్తోంది. ఇప్పుడు మనస్సుకు అశాంతి యొక్క అనుభూతిలేకుండా ఉండి కూడా శాంతిని పొందలేకపోతున్నాను. అదేమిటో అర్థం కావటం లేదు. ఇప్పుడు మనస్సు బంధనాలు తెంచుకుని ఎక్కడికైనా పారిపోవాలని అనుకుంటున్నట్లు ఉంది. ఎలా వెళ్ళాలి, ఎక్కడికి వెళ్ళాలి అనేది కూడా తెలియకుండా ఉంది. ఇప్పటికీ లోపల ఏదో బంధనం ఉన్నట్లుగాను, అది తెంచుకుంటున్నాగాని తెగిపోనట్లుగాను ఉండి మనస్సుకు ఇంకా స్పష్టత రానట్లుగా ఉంది. అందువలన ఇంటిలోగాని, బయటగాని, సత్సంగ్‌కుగాని, మరే ఇతర విషయానికైనాగాని ఒక్క క్షణంపాటైనా మనస్సు కుదురుకోవటంలేదు. ఈ దశ, అశాంతి, శాంతి యొక్క అనుభూతి లేనిదిగా ఉంది.

ఇప్పుడు ఈ స్థితిలో బందీకృతంగా గాని, స్వతంత్రంగా గాని లేదు. ఇప్పుడు నన్ను చూస్తూ ఉంటే, నేను నా 'మాలిక్'ను –నేను అస్థిరంగా ఉన్నానా లేక స్థిరంగా ఉన్నానా, అని ప్రశ్నిస్తున్నట్లుగా ఉంది. ఇది నాకు అంతుబట్టటం లేదు. ఏదో ఒక సందర్భంలో నేను తమకు –"మనస్సు, చిత్తం, జ్ఞానం మరియు సకల శరీరం స్థిరంగా ఉండిపోయాయి" అని వ్రాసినట్లు బాగా జ్ఞాపకం ఉంది. కాని ఇప్పుడైతే నేను అలా చెప్పలేకున్నాను. కనుక నేను ఇప్పుడు మౌనంగా ఎందుకు కూర్చోకూడదూ? దశ ఎలాంటిది అంటే, మాట్లాడటంగాని, మౌనంగా ఉండటంగాని, వినటంగాని, వినిపించటంగాని – ఇవేమీ నాకు చేతకావటం లేదు. ఇప్పుడు నన్ను నేను చూస్తూనే ఉన్నాను, కాని అందులో ఎటువంటి విశేషంగాని, మార్పుగాని, ప్రాముఖ్యతగాని ఏమీ కనిపించటం లేదు. మొట్టమొదటిసారిగా ప్రపంచంలో మానవుడు జన్మించినపుడు, అతనికి స్వయంగా ఏమి చేస్తున్నాడో, ఏమి చేయటం లేదో, అతనిచేత ఆచరించబడుతున్నది సరైనదో కాదో తెలియటువంటి స్థితియే ఇప్పుడు ఈ దశలో ఉన్నట్లు చెప్పవచ్చు. పాపం అతనికి ఈశ్వరుని జాడగాని, ప్రార్థన మరియు ఇంకేమైనాగాని, వాటి అవసరం కాని తెలియనే తెలియవు. చూసి నేర్చుకోవటానికైనా అతనికి ప్రత్యక్షంగా ఏమీలేదు. కనుక అతడు ఏదిచేస్తే అదే సరైనది అన్నట్లు నా దశ ఉంది. తప్పకుండా చెప్పాల్సింది ఇంకొకటి ఏమిటంటే, అసలు నేను ఎప్పుడైనా పుట్టి ఉన్నానా, లేదా అనేది కూడా నాకు తెలియకుండా ఉంది. బహుశా ఇందుకే నేను ఇప్పుడు ప్రపంచంలోని ఇతర సాధారణ మానవులతో సమానం అనే అనుభూతి కూడా నాకు కలగటం లేదు. ఎందుకంటే, అసలు ఈ ప్రపంచం ఇప్పటికి నిర్మితమై ఉందా, లేదా అనేది కూడా తెలియనట్లుగా నా ఈ దశ ఉంది. ఈ దశను ఎవరో తమ గుప్పెట్లో పెట్టుకున్నట్లుగా ఉందని మాత్రం నేను బాగా గమనించగలుగుతున్నాను. ఈ దశను చాలా నిదానంగా విప్పి చూపుతున్నారు. ఇది తప్పనిసరిగా నా 'మాలిక్' యొక్క కృపయే. నేను ఈ దశలో మునిగి ఉండటం లేదా దానిలోనే అంతరించిపోవటం ఆరంభమైపోయింది, కాని అందులో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. అది ఏమిటంటే, దానితో జీవనం, మృత్యువు అను రెండు దశలూ నశించిపోయాయి. కనుక ఇంక దానిలో నిర్మాణం, వినాశనం అను రెండు దశలూ నశించిపోయాయి. కనుక ఇంక దానిలో నిర్మాణం, వినాశనం అను రెండు విషయాలు ప్రస్తావనకు రావు. విద్య, అవిద్య యొక్క జాడ కూడా లేదు. దీనిని నా దశ అని చెప్పవచ్చు లేదా ఆ స్వరూపమే నాది అనిగాని చెప్పవచ్చు. ఇప్పుడింక హద్దు అను పరిమాణంగాని, హద్దులేని మైదానంగాని లేవు. మరి దీనిని ఏమనాలో తెలియదు. 'మాలిక్' యొక్క దయార్ద్ర హస్తం పట్టును కొద్దికొద్దిగా సడలిస్తోంది, దాని మూలంగా ఈ దశ చాలా నిదానంగా విప్పారుతోంది.

ఇప్పుడు నా లోపల ఏదో బంధనం బలీయంగా ఉన్నట్లు ఉండి, ఆ బంధనం బంధనంగా అనిపించకుండా ముందుకే నడిపిస్తోంది. 'మాలిక్' కూడా ఇప్పుడు చేతి నుంచి పట్టుసడలిపోయాడా అన్నట్లు అనిపిస్తోంది. నాలో

ఇప్పుడు ఎలాంటి సామర్థ్యం లేకుండా పోయింది. ఏమి చేయాలో తెలియటం లేదు. బహుశా ఇందుకే హృదయంలో కూడా (Broadness) విశాలత్వం ఎప్పుడూ కలగటం లేదు సరికదా దానిని సమకూర్చుకునే నేర్పుకాని, సామర్థ్యంగాని నాలో లేవు.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాశీస్సులు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 524

లఖీంపుర్,
29.10.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం 'తమకు' చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ క్షేమం. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నేను చూస్తున్నది ఏమిటంటే, దశ దానంతట అదే విచ్చుకుపోతోంది. అది ఇదివరకులాగా ముందు పైకి విస్తరించి లోపలికి చొచ్చుకుపోవటం లేదు. ఇప్పుడు ఆ విధంగా కాకుండా ఉన్నది ఉన్నట్లుగా అది నా స్వరూపంగానే అయిపోతూ ఉంది. అలాకాదు, దశయే నా స్వరూపంగా అయిపోతూ ఉన్నట్లు నేను చూస్తున్నాను. ఈ దశ ఏమిటోగాని, నేను ఆహారం తీసుకునే విషయంలో మరియు పనిపాటలలో నిమగ్నమై ఉన్నట్లుగా లేకపోయినా కూడా నాకేమీ తెలియనట్లుగా నిమగ్నమై ఉంటున్నాను. ఇప్పుడు నేను ఏం చేయాలో తమరే చెప్పాలి.

ఇప్పుడు నా స్థితిలో శరీరం నిద్రించి ఉన్నదానిలో ఉంటోంది. కాని నిద్రించి ఉన్న అనుభూతి మాత్రం కలగటం లేదు. ఇదివరలో రాత్రిపూట నిద్రించి ఉన్నపుడు, కొంచెం విస్తృతమైనదో లేక అల్పమైనదో అయిన మంచి దశ అనుభవమవుతూ ఉండేది. నిద్రలేవగానే నిద్ర బాగా పట్టినట్లుగా అనుభవమయ్యేది. కాని ఇప్పుడు ఈ దశలో రేయింబవళ్ళు కూడా నిద్రించి ఉన్నటువంటి శరీరంలో నిద్రించిన జ్ఞానం ఉండటం లేదు. నాకు వీటిలో భేదం ఏమీ కనిపించటం లేదు. శరీరం సరళంగా ఉందని చెబుదామంటే అది పరాభవించినట్లుగా ఉంటోంది. ఇంతకూ వాస్తవం ఏమిటంటే, అసలు దశ అనేదే లేదు. దశ ఇంకా ప్రారంభం కాలేదు. శరీరం వినమ్రతను కూడా త్యాగం చేసినట్లుగా అనిపిస్తోంది. బందీగా ఉన్న చిహ్నాలు లేదా లక్షణాలు కూడా పొడచూపటం లేదు. శరీరంలో ఒక విధమైన విరక్తి వంటిదే చోటుచేసుకుంది. నాలో ఎటువంటి శక్తి లేదు, దానిని కల్పించుకోవాలను ఉద్దేశ్యం కూడా లేదు. ఇంక 'మాలిక్'యే సరి చూడాల్సి ఉంటుంది. ఆత్మ కూడా మరణించిందా అన్నట్లు ఉంది. ఎందుకంటే, మనస్సుకు మంచి చెడులను ప్రశ్నించటం కూడా లేకపోయింది.

బాబూజీ, నా స్థితిని –**"నా పిడికెడు, తమ పాదధూళితో స్వర్గాన్ని కూడా లెక్కచేయను"** అన్నట్లుగా చెప్పవచ్చును. ఇలా ఎందుకంటే, నేను 'మాలిక్' యొక్క (Sub-Conscious mind) సుప్తచేతనా మనస్సులో లయమైపోయాను అనిగాని, సుప్తచేతనా మనస్సులో వ్యాపించిపోయాను అని గాని, అనుభూతి కలుగుతోంది. నా స్థితి 'మాలిక్' యొక్క గుప్పిట్లో ఉన్నట్లు అనిపిస్తోంది. అది కూడా స్వల్పంగా బంధించబడినట్లుగా మాత్రమే ఉంది. అలా కాకుంటే, నా మనస్సు ఎక్కడెక్కడికో పారిపోవాలని అశాంతికి గురవుతుంది. ఇప్పుడు స్థితి అనేది ఒక ఊహాభరితంగానే ఉంది. ఇప్పుడు ఈ భ్రమకు కూడా భ్రమ యొక్క జ్ఞానం లేదు. ఎందుకంటే, ఈ ఊహకి మైదానం ఎక్కడ ఉంది? కేవలం అక్కడ ఒక సమతల మైదానం ఉండి దానికి హద్దు లేకుండా ఉంది. కాని నా దృష్టి అయితే ఆ ఉపరితలం మీద

కూడా లేదు. అదేమిటో, తమకే తెలియాలి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 525

షాజహాన్‌పూర్,
02.11.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీవు 1955 అక్టోబర్ 22 మరియు 29వ తేదీలతో వ్రాసిన ఉత్తరాలు చేరాయి. డాక్టర్ కె.సి. వరదాచారిగారిలో ఇప్పుడు అంధకారం మరియు స్థూలత్వం చాలావరకు తగ్గాయి. నీవు వారిపట్ల చాలా బాగా పరిశ్రమించావు. నేను కూడా, వారు స్వచ్ఛత పొందటానికి ఏ పద్ధతి అనుసరించాలి అని ఆలోచిస్తూ ఉన్నాను. నేను కూడా చాలా మాసాలుగా వారిలోని ఆ దోషాలను తొలగించటానికి శ్రమిస్తూనే ఉన్నాను. వారి హృదయ పరిస్థితి ఒక అంధకార కూపంలాగా ఉంది. లాలాజీ సాహెబ్ కృపవలన ఇప్పుడు ఆ లోపాలన్ని చాలా తగ్గిపోయాయి. నాకు ఈమధ్యనే ఒక విధానం ఆలోచనకు వచ్చింది. దానితో అంధకారానికి కారణమైనవాటిమీద దృష్టి కేంద్రీకరించి నివారణ చేయవచ్చు, అని. నేను ఆ విధంగానే ప్రయత్నించి మంచి ఫలితం సాధించాను. నాకు ఇదివరకు ఇటువంటి నివారణోపాయాలు వెంటనే దృష్టికి వస్తూ ఉండేవి కాని ఇప్పుడు కొన్ని నెలల తర్వాత దీనికి పరిష్కారం నా దృష్టికి రావటం చాలా వింతగా ఉంది. బలహీనత కారణంగా మెదడు పూర్వంలాగా బాగా పని చేయటం లేదు.

నీ ఉత్తరాలకు సమాధానం ఇవ్వడం చాలా కష్టమైపోతోంది. ఎందుకంటే, మున్ముందు లయ–అవస్థ, దాని తురీయ అదే ఫారసీభాషలో 'బకా' అని పిలువబడేది, పరిశుద్ధరూపంలో తయారై వస్తూ ఉన్నాయి. అవి ఎప్పటివరకు వస్తాయో దాని అంతు తెలియదు. చిట్టచివరిగా బకా అనబడేది ఒక (Changeless condition) మార్పులేని దశ కలగటమే అవుతుంది. ఇకమీదట తపనగాని, మరేదశగాని ఉండకపోవటమే కాదు, దీని తర్వాత ఇంకేమీ మిగిలి ఉండనటువంటి అత్యున్నత స్థితి ఇది. భగవంతుడు ఈ స్థితిని అందరికీ అనుగ్రహించుగాక! ఇందులో ఉన్న ఇబ్బంది ఏమిటంటే, **నేను అభ్యాసులకు దీనిని గురించి గుర్తుచేస్తూ ఉంటానేగాని దానిని ఎవరూ లక్ష్యపెట్టరు. నేను వారికి ఒక్క క్షణకాలంలో ఈ దశను సాక్షాత్కరింప జేయటానికి కూడా సంసిద్ధంగా ఉన్నాను. ఇది చాలా కష్టమైంది. ఎందుకంటే, ఈ సందర్భంలో అభ్యాసీ యొక్క బంధనాలన్నింటినీ అదుపులో ఉంచాల్సి ఉంటుంది. అలా చేయకపోతే ఆత్మ దాని మూలంలో కలిసిపోవచ్చు. ఒక బాటసారి ఎంతో దూరంగా ప్రయాణిస్తున్నప్పటికీ తన ఇల్లు కనపడితే దానిలో ప్రవేశించటానికి ఇష్టపడతాడు. అదే విధంగా ఆత్మ విషయంలో కూడా సంభవిస్తుంది. నేను ఇవన్నీ చేయటానికి సిద్ధపడి ఉన్నప్పటికి కూడా ఇందుకు ఎవ్వరూ సిద్ధంగా లేరనిపిస్తోంది. నేను తరచుగా చిన్న చిన్న స్థితులను జనానికి సాదృశ్యం చేస్తాను. ఎందుకంటే, వారికి బ్రహ్మవిద్య మీద ఆసక్తి కలుగుతుంది అని; అయినప్పటికీ ప్రయోజనం లేదు.** నీవు వ్రాసిన ఉత్తరంలో, "నేను స్థితితో అంటిపెట్టుకుని ఉండలేకపోతున్నాను" అని వ్రాశావు. ఈ విషయం గతంలో కూడా ఒకసారి ఇలాగే జరిగింది. అయితే ఇప్పుడు తప్పు నీది కాదు. నిన్ను ఏ తీరున నడిపించాలో నేను ఇంకా నిర్ణయించుకోలేదు. ఇప్పటివరకు నిన్ను ఏ తరహాలో నడిపించి ఉన్నానో అదే విధంగా నడిపించినట్లయితే, అటువంటి సందర్భంలో నాకు ఏ స్థితులు కలిగాయో అవే కలుగుతాయి. ఇది నాకు తప్పుగా అనిపించటం లేదు. **అయితే ఒకే సమయంలో ఒకే రకమైన వ్యక్తిత్వాలు ఉండజాలవు అను సందిగ్ధం ఉత్పన్నమౌతుంది. రెండవ వ్యక్తిత్వం**

**కనుక అదే స్థాయికి తయారుకావటం జరిగినట్లయితే, మొదటి వ్యక్తిత్వం యొక్క అవసరం తీరిపోతుంది కనుక ఆ విశిష్ట వ్యక్తిత్వం ప్రపంచం వదలిపోవాల్సి ఉంటుంది. గురుమహరాజ్ కూడా ప్రస్తుతం పనిచేస్తున్నటువంటి విశిష్ట వ్యక్తిత్వం భవిష్యత్తులో కొన్ని వేల సంవత్సరాల వరకు రావటం జరగదు అని చెప్పారు.** సరే, ఆ విషయం అలా ఉంచు. ప్రత్యేకమైన ప్రార్థన చేసినట్లయితే ఇటువంటి వ్యక్తిత్వాలు ఒకదాని తర్వాత రెండవది, రెండవదాని తర్వాత మూడవది, కొంతకాలం వరకు వస్తూ ఉంటాయి. నేను ఇప్పటివరకు ఏ విధంగా నడిపించానో, అదే విధంగా నడిపించమని నా హృదయం నన్ను బలవంతపెట్టుతూ ఉంది. నేను ఇప్పటివరకు నిన్ను నడిపించిన దాని పరిణామం ఎటువంటిదంటే, దానితో అవతార స్థితి (Prophetic-Condition) ప్రారంభమైంది. **నీవు నిశితంగా పరిశీలించినట్లయితే, దైవశక్తి నీ ఆదేశాలను స్వీకరించి ప్రకృతి కార్యం చేయటానికి వేచి ఉంటున్నట్లుగా గుర్తించగలవు.** ఈ విషయం నేను ఇంతవరకు వ్రాయలేదు కాని ఇప్పుడు వ్రాస్తున్నాను. వాస్తవానికి నేను ఇంకా ఆ సహజగుణాన్ని నీలో అభివృద్ధి పరచలేదు, అలాగే నీ దృష్టిని కూడా ఆ దిశగా మరల్చలేదు. అది జరిగి ఉంటే ఆ సహజగుణంతో నీవు దైవీయ శక్తులను వినియోగించుకోవటం జరిగి ఉండేది.

"కంపనం కలుగుతున్నట్లయితే నేను 'మాలిక్' యొక్క (Sub-conscious mind) అవచేతనా మనస్సులో లయమైపోయినట్లుగా అనిపిస్తోంది" అని నీవు వ్రాశావు. నీ అభిప్రాయం సరైనదే. నీ శక్తి నీకు జ్ఞాపకం లేకుండా పోతోందని, నీ ఫోటోను (చిత్రాన్ని) చూసి నీవు గుర్తించలేక పోతున్నావని నీవు వ్రాసిన దానినిబట్టి, కస్తూరీగా ఈ లోకంలోకి వచ్చిన ఆమె ఇంకా లేకుండా, ఇంతకుపూర్వం ఏలా ఉందో అలాగే అయిపోయిందనీ (అనగా ఈ సృష్టిలో మొదటిసారిగా జన్మించకపూర్వం అన్నదిగా) స్పష్టమవుతోంది. దీనినే తనను తాను గుర్తించటం అంటారు. నీలో ఆలోచనా ప్రవాహం వస్తున్నట్లుగా వ్రాశావు. ఈ ఆలోచనలు నీవికావు, అవి సూక్ష్మ రూపానికి చెందిన ఆలోచనలు– మానవులచేత ఉత్పత్తి చేయబడినటువంటివి. అవి నిన్ను తాకుతూ ఉన్నాయి. నాకు కూడా ఇటువంటి స్థితియే చాలాకాలం కొనసాగింది. ఇంకా ఉన్నతంగా ఎదిగిన తర్వాత ఇవి తాకుతూ ఉండటం ఆగిపోతుంది. పర్యావరణం మార్పులనుబట్టి ఆలోచనలు ఉద్భవిస్తూ ఉంటాయి, కాని చాలావరకు ఆ వ్యక్తికి సంబంధించి ఉండవు.

అమ్మకు ప్రణామం. సోదర సోదరీలకు ఆశీస్సులు. శ్రీ కాశీరామ్‌గారు "అస్సాం–సందేశం" (పత్రిక)ను నీకు కూడా పంపించి ఉంటారని అనుకుంటాను. దానిలో నీ పాట ప్రచురించబడింది.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 526

లఖీంపుర్,
4.11.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది, సమాచారం తెలిసింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ! నా ఈ దశలో నిరంతరం నాకు ఆంతరికంగా బాగున్నట్లుగానే అనిపిస్తోంది. అంతేగాకుండా అదే నా స్వరూపమైపోయినట్లు ఉంది. కాని నాకు చెందిన ఆ బాగున్నదనిపించటం యొక్క స్వరూపంతో కూడా నాకు సంబంధం ఉన్నదా లేదా అనేది తెలియటం లేదు. ఎందుకంటే, ఆ బాగున్నదాని అంచనా కూడా గుర్తించలేకపోతున్నాను. ఆ ఆనందంలో ఎంత అధికంగా విలీనమైపోతున్నాను అంటే, ఉంటూ ఉండీ ఎందుకోగాని దానిలో మమేకమైపోతున్నాను. ఇప్పుడు ఆలోచనల ధారవంటిది రేయింబవళ్ళు నిద్రలో కూడా నిలిచి ఉంటూనే దాని పనితనంపై దానితో సంబంధం

కలిగి ఉంటోంది. అందువలన ఆ ఆలోచనలతో నాకు ఎటువంటి ప్రయోజనంకాని సంబంధంకాని ఉండటం లేదు. ఇప్పుడు అజ్ఞానపు దశగాని, జ్ఞానం ఉన్నదశగాని ఈ దశలో ఉండటం లేదు. స్వయంగా నా స్థితితో నాకు ఎలాంటి సంబంధం లేదనిపిస్తోంది. ఏదైనా విషయం గురించి ప్రయత్నిస్తే, బలవంతంగా నేను ఆ ఆనందం నుంచి వేరుపడటానికి ప్రయత్నించినట్లుగా ఉంటోంది కాని, విడిపోవటం జరగటం లేదు. బాబూజీ! నిజం చెప్పాలంటే, నేను చూస్తూన్న దానినిబట్టి, ఎటువంటి స్థితి అయినా దానితో నేను సంబంధం కలిగి ఉండటానికి లేదా దానిలో లయమైపోవటానికి ఏ భావం ఇప్పుడు కలగటం లేదు. దశ మాత్రం స్వయంగా సహజత్వం యొక్క నమూనాగా ఉందిగాని ఆ సహజత్వం కూడా అసలు ఉందో లేదో నాకు తెలియదు. ఇంతేగాకుండా నేను వింటున్నటువంటి శబ్దం ఇదివరకు ఎన్నడూ వినలేదు అన్నట్లు ఉంది. శరీరంలోపల కణకణం ఎటువంటి ఆనందం యొక్క స్వరూపంగా అయిపోయింది అంటే, దానిని నేను ఆనందమయమనిగాని, ఆనందరహితమనిగాని చెప్పజాలను. నా స్థితి ఈ విధంగా ఉంది.

ఈ స్థితి ఎటువంటిదిగా ఉంది అంటే, ఇది తెలుసు, ఇది తెలియదు అని చెప్పటం కూడా తెలియనటువంటిదిగా ఉంది. ఒకవేళ ఏదైనా తెలుసు అని అనుకున్నా, తెలియదని అనుకున్నాగాని ఆ తెలిసిందీ, తెలియనిదీ ఏమిటో కూడా తెలియదు. ఇదివరకైతే కొంచెం అల్పమైనదే అయినా ఏదో కంపనం వంటిది ఎప్పుడూ అనుభవమవుతూ ఉండేది, కాని ఇప్పుడు ఏమయ్యిందో ఏమిటో, శరీరంలో ఎక్కడా కంపనం అనేది కలగటం లేదు. ఆ కంపనం లోపల, బయట ఎక్కడ కూడా అనుభవానికి రావటంలేదు. బాబూజీ, నాకు అంచనా వేయగల సామర్థ్యం కూడా లేకుండా పోయిందేమోనని అనిపిస్తోంది. అంచనా వేయగలగటం, అంచనా వేయలేకపోవటం కూడా గుర్తించలేనటువంటి దశగా ఇది ఉంది. అసలు ఆధ్యాత్మికతతో సంబంధమే తెగిపోయినపుడు మరియు సత్యత్వంతో సంబంధం లేకపోయినపుడు ఇంక అంచనా వేయటం లేదా ఊహించటమనేది మాత్రం ఏమి ఉంటుంది. ఇప్పుడు నేను ఇంతగా దిగజారిపోయి ఉన్నప్పుడు, ఆధ్యాత్మిక విషయాలంటూ ఎప్పుడు జ్ఞాపకం వస్తాయి, 'మాలిక్' మాటలను కూడా నేను ఎలా గుర్తించగలను. అసలు ఏమైనా నాకు తెలుసో, లేదో తెలియనపుడు ఇంక నాకు తెలిసింది ఏమిటి? నేను ఏమైనా తెలుసుకోవలసింది ఉందేమో, 'మాలిక్'యే నాకు చెప్పాలి.

స్థితిలో నాకు సూక్ష్మత్వం లేదా సాదాతనం నాకు ఇష్టం. అయితే నేను ఇప్పుడు దానిని ఆలోచనలో కూడా పొందలేకపోతున్నాను. ఆ సరళత్వం కూడా ఎందుకు ఇష్టం అంటే, అది నా 'మాలిక్'కు ఇష్టమని వింటున్నాను కనుక. ఇప్పుడు నేను ముందుకు సాగిపోతున్నాననిగాని, ఆగిపోతున్నాననిగాని అనుభూతి కలగటం లేదు. అయినా కూడా స్థితిలో మధ్య మధ్య నిలిచిపోవటం, మళ్ళీ కొనసాగిపోవటం జరుగుతున్నట్లు నేను చూస్తున్నాను. 'మాలిక్' కనుక నా చేయిపట్టుకుని నడిపించకపోయినట్లయితే నాకు ఆగిపోవటమే తప్పదనిపిస్తోంది. 'వారు' నన్ను బలవంతంగా ఈడ్చుకు పోతున్నట్లు అనిపిస్తోంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీలందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 527

లఖీంపుర్,
19.11.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు అని భావిస్తున్నాను. ఇక్కడ అంతా కుశలమే. అక్కడ కూడా అందరూ కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నాకైతే ఏమీ తెలియటం లేదు కాని, నేను గమనిస్తున్నదాన్నిబట్టి, తరచుగా నోటి నుంచి ఏదైనా మాట తప్పనిసరిగా వెలువడింది అంటే, నేను తలచిన విధంగా ఈశ్వరీయ శక్తితో పని చేయించగలుగుతున్నాను. కాని అది ముఖ్యమైన విషయమేమి కాదు. నేను తరుచుగా ఖాళీగానే ఉంటున్నాను. ఆలోచనలు కూడా రావటం లేదు. అయితే ఒకటి రెండు రోజులు ఏవైనా ఆలోచనలు వచ్చినా కూడా నేను మాత్రం ఖాళీగానే ఉంటున్నట్లు చూస్తున్నాను. ప్రతి మానవుడు కూడా ఖాళీగానే కనిపిస్తున్నాడు. ఇంతేకాదు, ప్రతి మానవుడు తిరుగుతున్నా, పనిచేస్తున్నా కూడా నాకు వారిలో చలనమే తెలియటం లేదు. జడత్వం కనిపించటం లేదు. మనస్సుకు ఏదైనా తెలుసుకోవాలని కుతూహలం కూడా ఉండటం లేదు. పురోగతి గురించిన కోరిక కూడా ఎప్పుడూ కలగటం లేదు. అది 'మాలిక్'కే తెలియాలి.

ఇప్పుడు ఈ దశలో ఏమి తెలియకపోవటమనేది అసంభవంగా అనిపిస్తోంది. ఇంకా ఏదైనా తెలుసుకోవటం అంటే దాని కంటె కూడా అసంభవంగా ఉంటోంది. 'మాలిక్' యొక్క సుప్తచేతనా మనస్సు (Sub-conscious mind) అంతా ఒక్కపెట్టున నాలో కలిసిపోయి జీర్ణించుకపోయి, నా ఆధ్యాత్మిక యాత్ర దానిని అతిక్రమించింది. మనస్సు (మైండ్) నుండి వస్తూ ఉన్నటువంటి ఆలోచనా ధార నాకు తెలిసినా, తెలియకపోయినా నిద్రలోనూ నిరంతరం లయమైపోతూ ఉంది. ఇప్పుడు అదంతా నాలో జీర్ణించుకుపోయింది. ఇప్పుడింక దశలో నాకు విరామం ఉంటున్నా, అది కూడా నాలో జీర్ణించుకుపోతూ ఉంది. దశ ఇప్పుడు పూర్తిగా ఖాళీగా ఉన్నాగాని దానిలో ఖాళీతనం లేదు. ఇదివరకైతే నేను దశను చూస్తూ ముందుకు సాగిపోతూ ఉండేదానను, అనుభూతి చెందుతూ ఉండేదానను. కాని ఇప్పుడు అయితే దశయే స్వయంగా నా స్వరూపంగా అయిపోయింది. ఒక తీవ్రమైన తపన తరచుగా మనస్సులో కలచివేస్తూ ఉండేది, దాని మూలంగా హృదయపూర్వకంగా 'మాలిక్'ను కోరుకోలేకపోయాను. అయితే ఇప్పుడు ఈ ముల్లు ఎటువంటిదంటే, అది ఇప్పుడు గుచ్చుకోవటం లేదు. నేను దశను అంటిపెట్టుకొని ఉండటం లేదు అను అభియోగం నాకు లేదు. పూర్తిగా సరళం, శుద్ధమైన స్థితిగా ఉన్నప్పటికీ నాకు సంతృప్తికరంగా లేదు. 'మాలిక్' కృపతో అనుభూతికి వచ్చిన దశను ఉన్నదున్నట్లుగా చెప్పలేకపోతున్నాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 528

లఖీంపుర్,

26.11.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి వచ్చిన ఉత్తరం ద్వారా తమ సమాచారం తెలిసింది. ఇక్కడ కూడా అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

స్థితి ఎటువంటిదంటే, అది స్వయంగా దాని నమూనాగా ఉంది. ఎందుకంటే, అది ఇప్పుడు ఒంటరిగా ఉంది. దానిని పోల్చటానికి మరేదైనా ఉపమానం ఉంటే, దానితో పోల్చవచ్చు. దానికి అదే అయినపుడు ఇంకా ఏమి ఉంటుంది? బాబూజీ! నాకు ఈ స్థితిలో ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) అనేది నాలోనికి ఎప్పుడూ చేరటం లేదని అనిపిస్తోంది. ఆ ట్రాన్స్‌మిషన్ యొక్క స్పర్శ కూడా నన్ను తాకటం లేదు. బాబూజీ! నాకు 'శ్రీ బాబూజీ' ఎప్పుడూ కనిపించలేదు అన్నట్లు ఉంది. నా ప్రభువును చూడటానికి కళ్ళు ఎక్కడ నుండి తీసుకురావాలి. నా జీవితమంతటిలోను ఎన్నడూ నా 'శ్రీ బాబూజీ' యొక్క జ్ఞాపకం రాదంటారా? కేవలం 'శ్రీ బాబూజీ' యొక్క సిట్టింగ్‌లోనే బాగుంటుంది లేదా విశ్రాంతి లభిస్తుంది. నా స్థితి ఇంకొకటి ఏమిటంటే, నేను 'శ్రీ బాబూజీ' వద్దకు వచ్చాను అని నాకు ఒక్క

క్షణమైనా అనిపించటం లేదు. ఇదేకాదు, మాటిమాటికీ బాబూజీతోనే 'శ్రీ బాబూజీ' ఎక్కడ ఉన్నారు, ఇంటికి ఎప్పుడు వస్తారు అని అడగాలని నాలుక మీదకు వస్తుంది కాని దానిని ఎవరో నొక్కి పెట్టుతున్నట్లుగా అ దశలో అనిపిస్తోంది. నా ఈ స్థితిలో, ఆ ఆత్మిక స్థితి యొక్క సంపూర్ణ జీవితం లయమైపోతున్నట్లు అనిపిస్తోంది. కారణం యొక్క కారణం కూడా పూర్తిగా సమాప్తమైపోయింది. 'శ్రీ బాబూజీ' నా ఎదుటనే కూర్చుని ఉన్నప్పటికీ కూడా, నాకు ఎందుకోగాని వారి అనుభూతి కలగటం లేదు. ఇదంతా ఏమిటో తమకే తెలియాలి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 529

లఖీంపూర్,

29.11.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇటీవల నేను షాజహాన్‌పూర్ నుంచి తిరిగి వచ్చేటప్పుడు, బస్సులో కూర్చుంటూ ఉండగానే నేను షాజహాన్‌పూర్ వెళ్ళి ఉంటానా అనిపించి, స్పృహలేకుండా పోయింది. ఒక తెలియని ఆనందం చెప్పలేనంతగా ఉంటోంది. కాని నాకు మౌనంగా కూర్చుని, ఏమీ పని చేయకుండా ఉండాలనిపిస్తోంది. ఎక్కడకి వెళ్ళటానికి కూడా మనస్కరించటంలేదు.

నా స్థితి ఎలాంటిది అంటే, అప్పుడప్పుడు 'మాలిక్' ఎదుటనే కూర్చుని ఉండగా ఒక్కసారిగా 'మాలిక్'కు వేరేగా కూర్చున్న నా శరీరం కూడా భారమనిపించి చిటపటలాడుతోంది వారిలో కలిసిపోవటానికి అని. కాని అది సాధ్యపడటం లేదు. శరీరం దానిలాగ ఉండటం లేదు. నేను షాజహాన్‌పూర్ నుంచి తిరిగి వచ్చినప్పటి నుండి వీపు అంతా విశేషించి వెన్నెముకలోను, దాని సమీపంలోను, రెండువైపులా నిరంతరం ఒక గిలిగింత వంటిది మరియు కొంచెం వణుకుతున్నట్లు అనుభవమవుతోంది. వెన్నెముక పైభాగం నుండి క్రింది కొసవరకు ఇటువంటి చలనం (కంపనం) వంటిది ఉన్నట్లుగా అనిపిస్తోంది.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 530

షాజహాన్‌పూర్,

04.12.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలు నవంబరు 26 మరియు 29వ తేదీలవి చేరాయి. నేను మధుర నుంచి నవంబర్ 30వ తేదీ సాయంత్రం చేరుకున్నాను. నారాయణగారు కోరినమీదట అతనివద్ద 6 గంటలు గడిపాను. నారాయణగారి నుంచి సిట్టింగ్ తీసుకోవటం ప్రారంభించిన లాయరుగారు కూడా నాతోపాటు కూర్చున్నారు, చాలా ఆనందించారు. దీనినిబట్టి ఆయన నిలకడగా సిట్టింగ్స్ తీసుకుంటున్నారని అనిపించింది. ఆ లాయరుగారు డాక్టర్ చతుర్భుజ్ సాహెబ్ (లాలాజీగారి శిష్యుడు) వద్ద కూడా సిట్టింగ్ తీసుకున్నారుగాని, ఆయనకు అక్కడ ఆడంబరమే ప్రాధాన్యంగా ఉన్నట్లు

నిర్ధారించుకున్నారు. ఆ లాయరుగారు చతుర్భుజ్ సాహెబ్ వ్రాసిన పుస్తకాలన్నీ చదివారు. మన మిషన్ నుంచి వెలువడుతున్న గ్రంథాలలోని విషయాలకు, చతర్భుజ్ సాహెబ్ వ్రాసిన గ్రంథాలలోని విషయాలకు పొంతనలేదని, వాటిలోని ఆలోచనలు కూడా పూర్తిగా వివరించబడలేదని చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి మంచి విషయాలు, అసలైనవి మరెక్కడా లేవని జనం గుర్తించగలరని, అది సంభవమవుతుందని నేను భావిస్తున్నాను. ఇదంతా మన గురు మహరాజ్ యొక్క ఆశీస్సులు మరియు కృపా ఫలితమే. వారి పేరున ఈ మిషన్ ఔన్నత్యం పొందుతూనే ఉంటుందని నా విశ్వాసం. ఇప్పటివరకు జనం నాకు సేవచేసే అవకాశం కల్పించటం లేదను మాట వాస్తవం. అంతేగాకుండా (రియాలిటీ) వాస్తవికతను సాక్షాత్కారింప జేసుకోవాలను దృఢమైన సంకల్పం ఉన్నటువంటివారు ఎక్కువగా మిషన్‌లో ప్రవేశించటంలేదనే చెప్పాలి. ఇది నా భాగ్యమో లేక ఆ సమయం ఇంకా ఆసన్నం కాలేదో తెలియకుండా ఉంది.

ఇప్పుడు నీ స్థితిని గురించి నేను వ్రాస్తున్నాను. ఇటువంటి సూక్ష్మగతులకు సమాధానం ఇవ్వటం చాలా కష్టమవుతుంది. ఎందుకంటే, లయ–అవస్థ యొక్క గతియే నీ ఉత్తరంలో ప్రత్యక్షమవుతున్నటువంటిది, వృద్ధిచెందుతూ సాగిపోతోంది. దాని స్థితులనే నీవు రకారకాలుగా దర్శింపజేసుకున్నావు. ఒక రకమైన సోమరిస్థితి ఉంటున్నదని, దాని వలన ఉత్తరం వ్రాయటానికి కూడా మనస్కరించటంలేదని నీవు వ్రాసావు. నీ స్థితి శుక్లాజీకి కలిగినటువంటి స్థితి కాదు. ఆ విధంగా సోమరితనంగా ఉండటం అనేది ఆత్మ యొక్క సహజగుణంగా ఉంటుంది. శరీరంతో సంబంధం చాలావరకు తగ్గిపోతుంది. ఇక్కడ రెండు విషయాలు ఉన్నాయి. **మనం శరీరంతో పని చేయించాలి అని అనుకున్నప్పుడు, మన పరిస్థితి చెప్పబోయే ఉదాహరణలాగ ఉంటుంది. భగవంతుడు ప్రపంచాన్ని సృష్టించినపుడు, ఆత్మ మన జన్మకు కారణమయ్యింది. అంతేగాక అది ఒక మూలాధారంగా ఉండి, ఆలోచన కలగ్గానే వెంటనే పని ప్రారంభిస్తుంది. ఆలోచనలు ఆత్మకు అతిసమీపంలో ఉన్న కారణంగా అవి స్వయంగా ఆత్మ నుంచి శక్తిని కూడగట్టుకుని శరీరంతో పని చేయించటానికి ఉద్యమిస్తాయి. ఆలోచనలకు అందుకు తగినట్లుగా తన నుంచి శక్తిని కల్పించటం ఆత్మ యొక్క విధానం. ఇది ఎటువంటిది అంటే, విద్యుచ్ఛక్తి నుంచి దీపాలకు, ఫ్యానులకు, కొలిమిలకు (Furnaces) శక్తి సమకూరినట్లుగా ఉంటుంది. అందుచేత ఆలోచనలు కూడా ఆత్మరూపం దాల్చునట్లుగా మనం చేసే ప్రయత్నమే సాధన. మన ఆలోచనల్లోని రంగులు అనగా పరిపరి విధాల భ్రాంతులు తొలగిపోయి పవిత్రవంతమైనపుడు మానవుడు నిర్వహించే పనులన్నీ ధర్మశాస్త్ర సమ్మతంగానే ఉంటాయి. అతడు చేసే పనిలో శాస్త్రవిరుద్ధమైనది ఏదీ ఉండదు.** శుద్ధమైన ఆలోచనలు కలగటానికి ధర్మశాస్త్రాలలో అనేక నియమాలు, నిబంధనలూ విధించబడ్డాయి. కొంతమంది కవులు తమ బుద్ధిని ఈ విషయం మీద ఎక్కువగా శ్రద్ధపెట్టి దానిని జటిలం చేశారు. దానితో మన ఆధారం కూడా స్థూలత్వమైంది. ఈ స్థూలత్వం అనేది చాలా సులభం కనుక, మన రంగుదాల్చిన (నకిలి) మహాత్ములు దానిని అమలు చేశారు. నిశితమైన వివేకశక్తి లేకపోయిన కారణంగా తప్పు ఒప్పుల తేడాలను గుర్తించలేకుండానే పని ప్రారంభించారు. ఏ కవులపట్లనయితే జనానికి వారి రచనలు స్వచ్ఛమైనవిగాను, అలాంటి కవులు ఆధ్యాత్మికంగా కూడా జ్ఞానులుగాను భావన కలిగిందో, అటువంటి వారిని ప్రామాణికంగా ప్రతిపాదించారు. ఆ కవుల ఆధ్యాత్మిక శక్తిని అంచనా వేయగల స్థితిని ఈ మహాత్ములు పొందలేకపోయారు. నేను ఉర్దు, ఫారసీ సాహిత్యాన్ని కూడా చదివాను. వాటిలో కూడా చాలా మంచి ఆలోచనలు ఉన్నాయి కాని వాటిలోని ఆధ్యాత్మిక విశిష్టతను ఎవరూ ఆలకింపజేయటం లేదు. ఆలోచనలు చాలా మహత్తరమైనవిగా ఉండి అప్పుడప్పుడు ఉదహరించబడుతూ ఉన్నాయి.

ఈ మహాత్ములు అనబడేవారు కేవలం హిందీ కవుల పుస్తకాలలోనివే ప్రామాణికంగా భావిస్తున్నారు. నా దృష్టిలో సంస్కృత పండితులకు విశాల దృక్పథం లేదు. ఎందుకంటే, సంస్కృత సాహిత్యంలో ఇప్పటివరకు ఒక నియమిత సాహిత్యం మాత్రమే ఉంది. అంతకుమించి ప్రకృతిని పరిశీలించి, ఇతర భాషలలోని విషయాలను కూడా

స్వీకరించి వాటి తారతమ్యాలను విశ్లేషించి వ్రాయకపోవటమే దీనికి కారణమని నేను అనుకుంటున్నాను. మహర్షి మను, వేదాలలో వల్లించబడిన ఆలోచనలు ఏవైనా జ్ఞానవంతంగా కాని, సహేతుకంగా గాని లేకపోయినట్లయితే వాటిని అంగీకరించ నవసరంలేదని వ్రాశారు. బిటియా! నీవు కూడా బ్రాహ్మణ జాతికి చెందిన దానివే అయినప్పటికీ, లక్నోకు చెందిన బ్రాహ్మణులవంటిదానవు కాదు, కనుక నన్ను క్షమించాలి. నేను కవి తులసీదాసు యొక్క కవితాచరణం ఒకటి వ్రాస్తున్నాను.

**పూజియేం విప్ర సకల గుణ హీన, శూద్ర న గుణ్ గన్ జ్ఞాన్ ప్రవీణా।**

దీని అర్థం: విప్రుడు ఎంతటి గుణహీనుడైనా పూజించండి, శూద్రుడు ఎంతటి జ్ఞానప్రవీణుడైనా పూజించకండి.

ఈ పద్య చరణాన్ని బ్రాహ్మణులచేత ప్రమాణం చేయిస్తుండగా నేను విన్నాను. ఈ చరణాన్ని ప్రస్తావించటంలోని అర్థం జనం వారిని ఎక్కువగా గౌరవించాలి అని. దీనినిబట్టి జనం వారిని గౌరవిచటంలేదను విషయాన్ని వారు గ్రహించి ఉంటారని భావించుకోవాలి. అందుకోసం వారు తులసీదాస్ వాక్యాన్ని ఉదహరిస్తున్నారు. ఇటువంటి విషయాలు ఇంకా చాలా సందర్భాలలో కనిపిస్తాయి. పైన చెప్పిన మాటలతో మను మహర్షి వ్యాఖ్యలను విమర్శచేసి బలహీనపర్చాలి. లోతుగా ఆలోచించి చూస్తే కులాభిమానాన్ని ఖండించాలి. నేను బ్రాహ్మణుడను, వైశ్యుడను లేదా శూద్రుడను లేదా మరొక కులానికి చెందినవాడను అను మాట రాకుండా ఉండాలి.

నీవు నన్ను కణకణంలోను చూస్తూ ఉన్నట్లుగాను, కాని ఇప్పుడు నేను నీకు ఎక్కడా కనిపించటంలేదని వ్రాసావు. ఇది ఒక కన్ను మరొక కన్నును చూడలేనటువంటిదిగా ఉంటుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఎవరినైతే నీవు చూస్తూ ఉన్నావో వారుగా నీవు అయిపోయినపుడు ఇంక చూసేది ఎవరిని? నీలోనికి (ట్రాన్స్‌మిషన్) ప్రాణాహుతి కూడా చేరటంలేదని నీకు అనిపిస్తున్నట్లుగా కూడా నీవు వ్రాసావు. ఏదైతే నిన్ను చేరుతూ ఉందో దానిలోనే నీవు మునిగిపోయావని దాని అర్థం. నదిలో ఒకటి లేదా రెండు కుండల నీరు పోసినంతమాత్రాన దాని పరిమాణం పెరగదు. **నీ జీవితకాలంలో నా జ్ఞాపకం ఎప్పుడూ కలగలేదని అనిపిస్తోంది అని వ్రాశావు. దానికి ఒక ఉదాహరణ నేను వ్రాస్తున్నాను. ఆడపిల్లలు వివాహం తర్వాత తమ అత్తవారింటికి మొదటిసారి లేదా రెండవసారి కాపురానికి వెళ్ళినపుడు వారికి తమ పుట్టింటి గురించిన జ్ఞాపకం ఎక్కువగా వస్తుంది. ఆ విధంగా కాలం గడిచేకొద్దీ వారికి అత్తవారిల్లే కన్నవారిల్లులాగా అయిపోతుంది. అప్పుడు పుట్టినింట జ్ఞాపకాలకు బదులు అత్తవారింటి జ్ఞాపకాలే పుట్టినింటి జ్ఞాపకాలుగా నిలిచిపోయి అదే తన ఇల్లుగా అయిపోతుంది.** నీ స్థితి కూడా అటువంటిదిగానే భావించినట్లయితే, జ్ఞాపకం చేసుకుంటూ నీవు జ్ఞాపకంగానే అయిపోయావు. నవంబరు 26వ తేదీ ఉత్తరంలో ఉన్న మిగతా విషయాలను చూస్తే, నీవు నా శరీరం యొక్క ఛాయా మాత్రంగా అనిపించటంవంటిది, నాలో నీవు పూర్తిగా లయమైపోయినట్లుగా తెలియజేస్తుంది. అయితే ఇప్పటికీ అసంపూర్ణంగా ఉన్నది ఏమిటంటే, నేను నీకు ఛాయా మాత్రంగా కనిపించటమే. **అభ్యాసీకి గురువుయొక్క అభిరుచులు తెలుస్తూ ఉండాలని నేను తరచుగా చెప్తూ ఉంటాను. దీని అర్థం ఏమిటంటే, అభ్యాసులకు ఈ సందర్భంలో తమంతటతాము ప్రతిక్షణం చైతన్యవంతంగాను, గ్రహించగలుగునట్లుగాను ఉండాల్సి ఉంటుంది. అభ్యాసులు తమ ఆలోచనలను గురువుతో అనుసంధానించి ఉన్నప్పుడే ఇది సాధ్యపడుతుంది.**

దీనికి చాలా విధానాలు ఉన్నాయి. ఉదాహరణకు, ఒక విశ్వాసపాత్రుడైన సేవకుడు తన యజమానికి ఎప్పుడూ తన ద్వారా సుఖం, సౌకర్యం కలగాలనే కోరుకుంటాడు. అతడు ఎక్కడ ఉన్నప్పటికీ, తన యజమానికి ఆ సమయంలో ఏది అవసరమౌతుందో అనేది అతని దృష్టిలో నిలిచి ఉంటుంది. ఇది ఒక ఉదాహరణకు ఉదాహరణ. **ఆధ్యాత్మికతకు సంబంధించినంతవరకు అభ్యాసీకి మాస్టర్‌తో నిజమైన సంబంధం కల్పించుకున్నట్లయితే, అభ్యాసీకి ఏ సమయంలో మాస్టర్‌వైపు దృష్టి సారించాలి, ఏ సమయంలో ఏది చేయాలి అనేది ఏర్పడుతుంది.** అయితే ఈ విషయాలు నీకు సంబంధంచినవి కావు.

నవంబరు 27వ తేదీ ఉత్తరంలో, పూజ చేస్తున్న సమయంలో నాలుక యొక్క పైపొర తొలగిపోయినట్లుగా భావన కలిగిందని నీవు వ్రాశావు. ఇదొక వింత అనుభవం, ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. ఆకాశంలో శబ్దం ఉంది. మనలో నాలుక ఉంది. మనం చెప్పవలసినదానిని చెప్పాలంటే, ముందుగా ఆలోచనలు శబ్దరూపం దాల్చుతాయి. తర్వాత వాటిని నాలుక త్రిప్పుతూ ఒక రకంగా మలచటం ద్వారా మనం చెప్పవల్సింది ఎదుటవారికి అర్థమౌతుంది. అనగా మన ఆలోచనలకు శబ్దరూపంలో వ్యక్తం చేయటానికి నాలుక ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. ఇంక నాలుకపై పొరలేచిపోవటమంటే, ఆ శబ్దం యొక్క ధ్వని చెల్లాచెదురుగాకుండా క్రమబద్ధమై సహజమైన రీతిలో బయటకు వెలువడుతూ ఉంది. ఆధ్యాత్మికతకు సంబంధించినంతవరకు ఏమవుతుందంటే, **నీ నోటి నుంచి వెలువడే మాటల్లో పూర్తిగా సత్యత్వం (Reality) మరియు పవిత్రత (Purity) మాత్రమే ఉంటాయి కాని కృత్రిమత్వం (కల్పితం) ఉండదు. అంతే కాకుండా, నీవు చెప్పేదానిలో ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) మరియు దాని ప్రభావం నెలకొని ఉండి, ఇతరుల హృదయానికి హత్తుకుపోతుంది. నీ మాటల ధ్వని ప్రకంపనలతో ఆధ్యాత్మిక లబ్ధి చేకూరుతుంది.** వెన్నెముకలో ఏదో పాకుతున్నట్లుగా అనుభూతి కలగటాన్ని ఈ స్థానం మరియ పాయింట్లు జాగ్రదావస్థకు చేరుతున్నవని దాని అర్థం. నీవు ప్రసంగించటానికి కార్యక్రమం నిర్ణయించుకోవటానికి శ్యామ్‌ప్రకాష్‌తో చర్చించుకోవాలి. చౌబేజీ చెప్పినట్లయితే ఆయన తప్పక సహకరిస్తాడు. అంతేకాదు, ఆయనకు స్వయంగా నీ గురించి పరిచయం ఉంది. నీ ఆధ్యాత్మికయాత్ర '$H_1$' పాయింట్ మీద ఇంకనూ ప్రారంభం కాలేదు. అయితే ఈ ఉత్తరం నీకు చేరేసరికి అది ప్రారంభమైనట్లుగా నీవు గ్రహించగలవు.

నీ సోదర సోదరీలకు ఆశీస్సులు. అమ్మకు, చౌబేజీకి ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 531

లఖీంపుర్,
08.12.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం అందింది. సమాచారం తెలిసింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇపుడు ఎలా ఉందంటే, వీపు అంతటా మరియు భుజాలవరకు ఏదో ప్రాకుతున్నట్లు ఉంది. ఇంకొక విషయం ఏమిటంటే, ఎవరైనా చనిపోయినా కూడా నాకు ఏమీ అనిపించటం లేదు. దాని జ్ఞాపకం కూడా ఉండటం లేదు. ఇంకొక గమ్మత్తు ఏమిటంటే, చనిపోయిన విషయమై రోదిస్తూ ఉన్నాను కాని మరణించినట్లు తెలిసిన జ్ఞానం ఉండటం లేదు. జీవించి ఉన్న మనిషిని గురించి కూడా తెలియటం లేదు. ఇదంతా జీవన్మరణాల భ్రమలాగా ఉంది. ఇదంతా నాకు అర్థం కావటం లేదు సరికదా మనస్సు వీటిని గురించి ఆలోచించటానికి ముందుకు రావటం లేదు. ఎందుకంటే, మనస్సులో ఎటువంటి చలనంగాని, జిజ్ఞాసగాని కల్పించుకుందామని అనుకున్నా సాధ్యపడటం లేదు. సమస్యలు పరిష్కారమైపోయాక ఇంక దేనిని గురించి పట్టించుకోవాలి.

ఇపుడు నా స్థితి ఎలా ఉందంటే, షాజహాన్‌పూర్‌లో 'మాలిక్' దర్శనం ఛాయామాత్రంగా ఉన్నట్లు వ్రాశాను కదా, వాస్తవానికి ఆ విషయమై నేను సరిగ్గా వ్రాయలేకపోయాను అని, ఇప్పుడు అనిపిస్తోంది. ఇది అగౌరవంగా అనిపించవచ్చును కూడా. ఇంతకుముందు తమరు ఎప్పుడైనా తమ లఉత్తరంలో 'నన్ను క్షమించు' అని వ్రాసేవారు, అప్పుడు నాకు దెబ్బకొట్టినట్లు, దుఃఖం కలిగిస్తూ ఉండేది. కాని ఇప్పుడైతే 'క్షమించు' అన్న మాటను చదివి కూడా

ఎటువంటి భావం కలగటం లేదు. ఏదో విషయం నా స్థితికి చేరుకుని దానిని కళంకితం కానివ్వటం లేదు. స్వచ్ఛత, నిశ్చలత్వం నా స్వరూపంగా అయిపోయాయి. ఆ స్వరూపం ఎటువంటిదో తెలియకపోవటం వలన, ఇప్పుడు నన్ను నేను స్వయంగా అంటిపెట్టుకుని నడవటం ఎలాగో తెలియటం లేదు. ఇప్పుడు అది ఏమిటోగాని, 'మాలిక్' రాక కొరకు నిరీక్షించలేకపోతున్నాను. ఇంకేముంది, కాళ్ళు బస్‌స్టాండ్‌కు చేరుకుని బస్సులో 'మాలిక్' కోసం వెదకి తిరిగి వస్తున్నాయి. అయినా దాన్ని గురించి నామీద ఎటువంటి ప్రభావం ఉండటం లేదు. అన్ని ఎముకలలో నుంచి పొరలు ఊడిపోతున్నట్లుగా ఉండి చాలా సన్నని కాంతి ఉంటోంది. అయితే నా స్థితితో వీటన్నింటి సంబంధం ఏమీ లేనట్లుగా అనిపిస్తోంది. ఈ శరీరం పరిస్థితి ఈ విధంగా ఉంది. వ్రేళ్ళ తాలుకు ఎముకలలో కూడా పలుచని కాంతి ఉంటోంది. శరీరమంతటిలో ఎక్కడ నుండో ఎప్పుడూ ఒక కంపనం (Vibration) కలుగుతున్నట్లు నేను గమనిస్తున్నాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 532

లఖీంపుర్,

19.12.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉండవచ్చు. ఇక్కడందరూ కుశలమే. అక్కడ కూడా తామెల్లరూ కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నేను దాదాపు ఒక సమతలం వంటి దానిలో మునుగుతూ, దాటుతూ వెళ్ళుతున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు నా స్వరూపం పూర్తిగా ఒక సహజ అవస్థ స్వరూపంగా అయిపోయింది, కాని నేను దానిలో మునగలేక పోతున్నాను. రెండు రోజుల క్రితం వీపు ఎడమవైపున, మెడకు దిగువన వీపు యొక్క వెడల్పాంటి ఎముక ఉంటుందో, దాని మధ్యన ఒక బిందువు ఉంది. అది పక్వానికి వచ్చిన గడ్డలాగా లోపలి నుంచి పైకి ఉబ్బటానికి అన్నట్లుగా దానిలో (Sensation) చలనం కలుగుతోంది. అప్పటి నుండి వీపంతా చాలా తేలికగా అయిపోయింది. అది శరీరమంతటిలో కలిసిపోయి ఒక్కటిగా అయిపోయినట్లు ఉంది. ఇప్పుడు ఈ దశ ఏమిటోగాని, శ్రీబాబూజీ వచ్చారనిగాని, వెళ్ళారనిగాని, అశాంతితో ఉన్నా కూడా స్థితి మాత్రం మార్పులేకుండా ఉంది. వారిని చూడగల కళ్ళుగాని, వారి మాటలు వినగలిగిన చెవులుగాని, వారిని జ్ఞాపకం ఉంచుకొనటానికి తగిన జ్ఞాపక శక్తిగాని, 'వారు' ఉన్నట్లుగా అనుభూతి చెందగలిగిన అనుభవంకాని లేకుండా ఉన్నాయి. అప్పుడప్పుడు ఏదో ఒక మానసిక స్థితిలో ఉన్నప్పుడు ఎవరితోనైనా దశల గురించి మాట్లాడిన తర్వాత కొంతసేపటికి నేను వారిని మోసగించలేదు కదా! అనే సందేహం కలుగుతుంది. బహుశా దీని బాధ్యతను 'మాలిక్'యే వహిస్తూ ఉంటారు. అందువలన వారిని మోసగిస్తున్నాను అనే ఆలోచన నిలకడగా ఉండటం లేదు. దీని వలన నాకు అప్పుడప్పుడు అశాంతి కలుగుతోంది. ఇప్పుడు నా మనస్సే కరిగిపోయినట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు మనస్సే లేకపోయాక నాలో ఆలోచనా శక్తి మాత్రం ఎక్కడి నుండి వస్తుంది. మనస్సు యొక్క ఆవరణ తొలగిపోవటం వలన ఇప్పుడు మనస్సును దాటిపోయి శరీరం ఒక హద్దులేని క్షేత్రంలో ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. ఇంకా ఏమిటంటే, శరీరం యొక్క కణకణంతో సంబంధం తెగిపోయినట్లుగా ఉంది. ఇప్పుడు ఏమి జరుగుతున్నదో ఏమోకాని దశ యొక్క అంచనాను కూడా నేను నిర్వహించలేకపోతున్నాను. అంచనా యొక్క లోతులోకి మునిగేందుకు మానసిక శక్తికి భారంగా అనిపిస్తోంది. ఇప్పుడు నేను ఏమైతే మాట్లాడుతూ ఉన్నానో, ఆ మాటలకు నాలుకతో సంబంధంలేనట్లు అనిపిస్తోంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 533

షాజహాన్‌పూర్,

22.12.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ రెండు ఉత్తరాలు 1955 డిశంబర్ 8 మరియు 19వ తేదీలవి చేరాయి. నీ స్థానం '$H_1$' మీద చీకటి ఎందుకు వ్యాపిస్తుందో భగవంతునికే తెలియాలి. నేను దానిని తొలగిస్తున్నప్పటికీ మళ్ళీ వ్యాపిస్తోంది. దానిని గురించి ఆలోచించాల్సి ఉంది. గురుమహరాజ్ (లాలాజీ సాహెబ్) కృపతో దానికి కారణం ఏమిటో తెలుసుకోగలిగి దానిని తొలగించటానికి ప్రయత్నిస్తాను. దానికి చింతించాల్సిన పని లేదు. దానికి కారణం ఏమిటో నీ దృష్టికి వస్తే వ్రాసి పంపించు. డిశంబరు 8వ తేదీ ఉత్తరంలో, "నాకు ఏదైనా ఉన్నదనిగాని, లేదనిగాని తెలియటం లేదు" అని వ్రాశావు. ఇది బ్రహ్మగతి స్థితి, అయితే దీనిని ఇంకా వికసింపచేయాల్సి ఉంది. అభ్యాసీ ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఎదిగినకొద్దీ అతనికి క్రిందిస్థాయిలోని విషయాలు అల్పంగా అనిపిస్తాయి. ఉదాహరణకు మనం ఎత్తైన పర్వతం మీదకు వెళ్ళి క్రిందికి చూసినట్లయితే వృక్షాలు, మనుష్యులు కేవలం ఒక ఛాయలాగా కనిపిస్తుంది. కనుక ఈ సందర్భానికి ఇదే సమాధానం. నా దృష్టిలో నీవు చూసింది ఒక ఛాయ లాంటిది. నీవు దీనిని లోతుగా పరిశీలించినట్లయితే అందరి విషయంలోను ఇలాగే జరుగుతుంది. నీవు శరీరమంతటా ప్రకంపనం అనుభవమవుతున్నట్లుగా వ్రాశావు. దీనికి అర్థం ఇలా చెప్పాల్సి ఉంటుంది. నీవు నీ స్థితితో బాగా అంటిపెట్టుకుపోయి ఉన్న కారణంగా ఆ ప్రభావమే నీ ఎముకలలో కూడా ప్రవేశిస్తూ ఉంది. ప్రతి ఎముక నుంచి కాంతి వెలువడుతున్నట్లుగా అనుభవమవుతున్నదని నీవు వ్రాశావు. లోపల ఏదైతే ఉందో అది బయటకు వ్యాపిస్తోంది అని దీని అర్థం. ఇది చాలా మంచి స్థితి. అందుకు దైవానికి ధన్యవాదాలు. ఇప్పుడు ఇంక డిశంబర్ 19వ తేదీ లేఖ విషయానికి వస్తున్నాను. నీవు, ఒక మానసిక స్థితిలో ఉండి, ఎవరితోనైనా మాట్లాడాలని అనుకుంటాను లేదా ఏదైనా ఇతరులను చెప్పమని అంటాను కాని తర్వాత తప్పు మాట్లాడి వారిని వంచించానేమో అను సందేహం కలుగుతుంది, అని వ్రాశావు. దీనినిబట్టి నీలో ఇంకా అస్థిత్వ (ఉనికి) భావన ఉందని తెలుస్తోంది. ఇది ఒక లోపంగా ఉంది. దీనిని ఉర్దూ భాషలో "అహమియత్" (అహం, 'నేను' అను భావం) అని అంటారు. ఇప్పుడు నా పరిస్థితి కూడా కొంచెం వ్రాస్తాను. నేను మాట్లాడుతున్నప్పుడు ఎవ్వరు మాట్లాడుతున్నారో తెలియదు, ఏమి చెప్పానో తెలియదు, వ్రాస్తూ ఉన్నప్పుడు కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. అందువలన ప్రతి సందర్భంలోను శాసించే స్వరమే నీకు అనుభవమవుతుంది. దీనిని ప్రజలు అహంకారంగా భావించితే నేను చేయగలిగేది ఏమీ లేదు. ఇలా ఎందుకు వ్రాశాను అంటే, ఇదే కనుక సక్రమమైతే, ప్రతి ఒక్క అభ్యాసీ ఈ స్థితికి చేరాలి. ఉపరితలమంతా సమతలంగా ఉన్నట్లు ఉన్నదని, దానిలో హృదయం మునిగి, అది కూడా ఉపరితలంతో సరిసమానమైపోయినట్లుగా ఉందని నీవు వ్రాసావు. సామ్యావస్థ యొక్క కాంతి వెలువడటానికి ప్రారంభమవుతున్నట్లుగా దీని అర్థం. సాధువులు, ఋషులు ఈ (Balanced condition) సామ్య–అవస్థను చాలా ఘనంగా భావించారు. నిజానికి ఇది చాలా ఉన్నత స్థితి. ఈ స్థితిని ఎవరికైనా భగవంతుడు అనుగ్రహించినట్లయితే వారి జీవిత సమస్య పరిష్కారమై పోయినట్లు అర్థం చేసుకోవాలి. ఈ దృష్టితో నీవు 1955 డిశంబర్ 8వ తేదీ ఉత్తరంలో, సమస్య పరిష్కారమైపోయింది అని వ్రాసినది సరిగ్గానే ఉంది. గొప్ప ఋషులు, సెయింట్లు ఈ స్థితిని పొందటమే చాలనుకుని ఇంకా ముందుకుపోవటానికి ప్రయత్నించరు. సరిగ్గా చెప్పాలంటే, ఇది చాలా గొప్ప మంచి స్థితియే. అయితే నీవు

ఆ స్థితికి ఇంకా పరిపూర్ణస్థాయిలో రాలేదు. త్వరలోనే దానిని నీవు చేరుకుంటావు. కాని ఈ స్థితికి చేరిన అభ్యాసీ, ఇతరులకు సెకను కాలంలో విముక్తిని కల్పించలేడు. కొన్ని సంవత్సరాలు సాధన చేయించిన తర్వాత ఆ స్థితిని కల్పించగలడు. కాని ఎక్కడైనా నా పని అంతం కాదు. జనం దృష్టిలో ఇది పరిపూర్ణత్వం, అలా చెప్పటం తప్పు కూడా కాదు. నేనయితే ఆ బాట యొక్క బాటసారినే. దానిలో ప్రయాణిస్తూ ఇంతకుపూర్వం ఎప్పుడైనా ఈ బాటలో ప్రయాణించానేమో కూడా తెలియడం లేదు. ఇంతేగాకుండా, మరి ఇతరములైనవాటి అనుభూతి కూడా కలగకుండా పోతుంది ఈ స్థితిలో. సామ్య-అవస్థ కొరకు నేను కూడా ప్రయత్నిస్తూ ఉంటాను, అభ్యాసీలలో ఈ స్థితి ఏర్పడాలని. ఎందుకంటే, ఈ స్థితియే కనుక ఏర్పడినట్లయితే వారి జీవిత సమస్య పరిష్కారమైపోయినట్లే. వారిని ఈ స్థాయి వరకు చేర్చగలిగినందుకు నేను తృప్తిచెందకపోయినా ఫర్వాలేదు. ఒకవేళ నేను పూర్తిగా నోరు తెరిచి మాట్లాడినట్లయితే లేదా దాపరికం లేకుండా మాట్లాడితే, ఆ దైవీయ రహస్యాలు బయటకు వచ్చే అవకాశం ఉంటుంది. అందుచేత అర్థం చేసుకోగలిగినవారి కొరకు నేను ఇంతవరకే వ్రాస్తున్నాను. మనం దేనితోనూ ముడిపడకుండా ఉన్నట్లయితే, మనం (వాస్తవికత) రియాలిటితో సంబంధం లేదా అనుసంధానం కలిగి ఉన్నామని దృష్టి నిలపాలి. ఆ తర్వాత ఇంకేమి జరుగుతాయో చెప్పటానికి మాటలు లేవు.

నీవు ఈ ఉత్తరంలో, నీ పరిశీలన నిలవడంలేదని, దాని మూలంగా మనస్సు యొక్క ఆలోచనా శక్తి కూడా దానిని పట్టించుకోవటంలేదని వ్రాశావు. నీ యొక్క ఈ భావాన్ని సరిగ్గా వివరించలేకపోయావు. కాని దీనిని సరియైన రీతిలో వివరించగలిగినట్లయితే, దానికి జవాబుగా, నీవు బ్రహ్మలో బాగా లీనమయ్యావు అని చెప్పవచ్చు. ఎడమ భుజం క్రింది ఎముకలో ఏదో స్పర్శ కలుగుతున్నట్లుగా అనుభవమయ్యింది అని వ్రాశావు. దానిని గురించి ఆలోచించాల్సి ఉంది. అయినప్పటికి దానికిగల కారణం వివరిస్తున్నాను. నీవు షాజహాన్‌పూర్ వచ్చినప్పుడు నేను నీ వెనుకవైపు నరాలను, ఎముకలను నిర్మలీకరించాను. సామ్య అవస్థలో ఏమాత్రం భారం ఉండకూడదని అప్పుడు అలా చేశాను. దానిని ఇప్పుడు ఇంకా నిర్మలీకరించాల్సి ఉంది. ఈ ఎముకలను, నరాలను నిర్మలీకరించటం వలన 'సామ్య అవస్థ' యొక్క అసలైన రూపం దర్శనీయమవుతుంది. నా దగ్గరకు వచ్చే ప్రతి ఒక్క అభ్యాసీ కొరకు ఎముకలు, నాడులను ఎందుకు నిర్మలీకరించకూడదను ఆలోచన నాలో కలుగుతుంది. కాని వారు తగిన సమయం ఇవ్వనందున వీటి నన్నింటినీ నిర్మలీకరించే అవకాశం లేకుండా ఉంది. ఎందుకంటే, సూక్ష్మశరీరం, మరియు పిండ, బ్రహ్మాండ స్థానాలు నిర్మలీకరించటానికి నాకు ఎక్కువ సమయం పట్టుంది. వారిలో కనుక భక్తి మరియు ఈశ్వరప్రాప్తిని గురించిన తపన ఉండి ఉంటే నాకు అంత సమయం పట్టదు. ఈ పని భారమంతా నా భుజస్కంధాలపైనే మోపాలనుకుంటానుకాని, **భక్తి మరియు నియమపాలన ఆచరించటం ద్వారానే దివ్యశక్తిని అభ్యాసీ పొందవలసి ఉంటుంది అనేది దైవ శాసనంగా ఉంది.**

కేసర్ ఉత్తరం కూడా అందింది, దానిని చదివి చాలా ఆనందించాను. కేసర్ కూడా బాగా ఉన్నతి చెందుతోంది. నేను ఆమెకు వివరంగా జవాబు ఇవ్వడంలేదు, ఎందుకంటే, నీవు ఆమెకు ఏ విషయమైనా బాగా వివరించి చెప్పగలవు కనుక నాకు సమయం మిగుల్తుంది. అయినా కూడా ఆమెకు గ్రహింపజేయటానికి ఇది వ్రాస్తున్నాను. ఆమె నుండి కాంతి వెలువడి నలుదిశలా వ్యాపిస్తున్నట్లు అనిపించటమనేది, ఆమె పిండదేశ అధికారం మీద అడుగుపెట్టినట్లుగా తెలియజేస్తుంది. నేను దానిని ఒక్కపెట్టున ఇవ్వాలనుకున్నాను. కాని ఆమె ఆంతరిక స్థితి (Transparent) పారదర్శకంగా లేకపోవటమేగాక (Opaque) అపారదర్శకంగా (అనగా ఒకవైపు నుంచి చూస్తే కన్పించటం మరొకవైపు నుంచి చూస్తే కన్పించకపోవటం వంటిది) ఉంది. అందువలన ఆ పని నిలిపివేశాను. అలా చేయకుంటే ఏదైనా నరం (Nerve) దెబ్బతినవచ్చు. అయితే నేను తలపెట్టిన పనిని దైవం నిదానంగా పూర్తి చేస్తున్నాడు. నేను ఆమెకు చెప్పిన పని చేస్తూనే ఉందనుకుంటాను. ఇప్పుడు ఆమె సిట్టింగ్ తీసుకోవటానికి ఇష్టపడకపోవటానికి కారణం, ఆమెలో ప్రేమ, భక్తి మూలంగా ఒక తాజాదనం (Freshness) నెలకొని ఉంది. అయినప్పటికి ఆమె సిట్టింగ్‌ను నిర్లక్ష్యం

చేయటం తగదు. అలా కాకుండా సిట్టింగ్ తీసుకుంటూ ఉంటే ఆ తాజాదనం పెరుగుతూ ఉంటుంది.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 534

లఖీంపుర్,

24.12.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. చదివి చాలా సంతోషించాను. ఇక్కడ కూడా అందరు కుశలమే. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇపుడు శరీరం బయట, లోపల కణకణంలోను మహాప్రళయం వంటి నిశ్శబ్దం నెలకొని ఉంది. ఇంకొక తెలియని విషయం ఏమిటంటే, నాకు నాలుగువైపులా చాలా మసకవంటిదైన కాంతితో కూడి ఉన్న ప్రకంపనం ఎల్లవేళలా ఉంటోంది. అయితే దానికి శరీరంతో సంబంధం మాత్రం లేదు. కాని ఈ మసక కాంతివంటిది అయితే నా ప్రతియొక్క ఎముక లోపల నుంచి స్వయంగా వెలువడుతోంది. ఇప్పుడు ఎటువంటి సంతోషకరమైనది, నవ్వు పుట్టించే విషయమైనాకాని నా స్వభావంలో ఎటువంటి మార్పు లేకుండా గంభీరంగా ఉంటోంది, కాని అది నన్ను దరిచేరటం లేదు. నేను కావాలనుకుని ప్రయత్నించినా కూడా వాటిలో ప్రవేశం కల్పించుకోలేకపోతున్నాను. నా శరీరంలో కూడా ఇప్పుడు కొన్ని మార్పులు జరుగుతున్నట్లుగా చూస్తున్నాను. లోపల లోపలే ఏదో జరుగుతోంది, నా శరీరం యొక్క కణకణం పూర్తిగా తేలికగానూ, నిశ్శబ్దంగానూ అయిపోయాయి. అయితే వాటి ద్వారా రోమరోమం నుంచి ఏదో ఒక రకమైన శక్తి విడుదలవుతోంది. ఇప్పుడు అనుభూతి యొక్క మృతదేహం వెళ్ళిపోయింది. ఇంకా చెప్పాలంటే, అనుభూతి కోసమని ఏ విషయం కూడా ఎదుటకు రావటం లేదు, ఏదైనా వస్తున్నదంటే అది (Nil) 'ఏమీలేనిది'గా ఉంటున్నది. ఆ (Nil) 'ఏమిలేని' దానిని నిలువరించటానికి కూడా నాలో ఎటువంటి అడ్డూలేదు.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 535

షాజహాన్‌పూర్,

26.12.1955

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం 24వ తేదీది అందింది. నీవు గీతాజయంతిలో బాగా ప్రసంగించావని విన్నాను. అది నాకు చాలా సంతోషం కలిగించింది. నీలో ఇప్పుడు బిడియం తగ్గిపోయింది. నీవు మంచి ఉపన్యాసకురాలివిగా అయ్యావు. మాట్లాడుతూ ఉంటే నాలుకతో ఏమీ సంబంధంలేనట్లుగా అనిపిస్తోంది అని నీవు నీ లేఖలో వ్రాశావు. ఇది లయ-అవస్థకు చెందిన మంచి అభివ్యక్తీకరణ. మహాప్రళయం మాదిరిగా నిశ్శబ్దం ఆవరించినట్లుగా అనిపించటం అంటే చిత్తవృత్తులు నిరోధించబడినట్లుగా దాని అర్థం. ఈ స్థితిలో ఇంకను స్థూలత్వం ఉంది. నాలుగు దిశలా మందగతి కంపనం (Dim vibration) కలుగుతున్నట్లుగా అనుభవమవుతోందని నీవు వ్రాశావు. అది నీవు ఉన్న '$H_1$' స్థానం యొక్క ప్రతిస్పందన. నీ శరీరంలో కణకణం వికసించినట్లుగా అనిపిస్తున్నదని వ్రాశావు. చెట్టు నీడ విస్తరించి ఉన్నట్లుగా అంతటా ఒకే స్థితి వ్యాపించి ఉన్నది అని నేను గ్రహిస్తున్నాను. దీనిలో కంపనం (Vibration)

స్పష్టంగా తెలుస్తుంది. దీని తర్వాత ఇంకా ఏమైనా నీవు వ్రాసినపుడు, నేను దీనిని ఇంకా స్పష్టంగా వివరిస్తాను. నీ స్థితి గురించి నీకు అనుభవమయ్యింది అంతా వ్రాస్తూ ఉండు. ఆధ్యాత్మికంగా ఉన్నతి చెందుతున్నకొద్దీ వివరించటానికి ఎవరికీ మాటలు దొరకవు.

కేసర్ తన మరణం జరిగిపోయినట్లుగాను, ఈ ప్రపంచంతో తనకు సంబంధం లేనట్లుగాను అనిపిస్తున్నదని వ్రాసింది. ఆమెకు కలిగిన ఈ అనుభూతి సరైనదే. అయితే ప్రపంచంతో ఇంకా ఆమె సంబంధం కలిగే ఉంది.

చౌబేజీ మరియు అమ్మకు ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 536

లఖీంపుర్,
24.12.1955

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. సమాచారం తెలిసి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా ఎముకలు కూడా కరిగిపోయి, జీర్ణించుకుపోయి మాయమైపోతున్నాయి. నాకయితే ఎందుకో తెలియదు కాని, నా కంఠస్వరంలో ఇప్పుడు ఆధిపత్యం కలిగి ఉన్న ధ్వని వస్తోందని అందరూ అంటున్నారు. నేను ఏది మాట్లాడినా అంతా సత్యవంతంగా ఉంటుందన్న విశ్వాసం నాకు ఉన్నట్లుగా అనిపిస్తోంది. వెన్నులో ఎముకలలోను, వెన్నుపూసలలోను కూడా కరగటం వ్యాపించిపోయి పూర్తి స్వరూపమే సూటిగా ఒక సమతలంగా అయిపోతున్నది. నా శిరస్సు వెనుకభాగంలో దాదాపు ఎప్పుడూ ఊగిసలాట ఉంటోంది. కొద్దిగా కరగటం మరియు ప్రాకుతున్నట్లు ఉంటోంది. సామాన్యంగా నాకు ఏమీ అనుభవం కావటం లేదు, కాని **ఎప్పుడైతే నేను స్వయంగా నన్ను పరిశీలించటానికి ప్రయత్నిస్తానో అప్పుడు ప్రతి మనిషి యొక్క పాదాలవైపు నా శిరస్సు వంగుతుంది.** అయితే శరీరం మాత్రం సూటిగా ఉండిపోతుంది. దానిని పట్టించుకోవాల్సిన పనిలేదు. ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, నాకు ఏదైనాగాని ఛాయామాత్రంగానైనా కనిపించటం లేదు. నేను ఇంటిలో అందరితో మాట్లాడుతున్నాను, సంభాషిస్తున్నాను, అయినా గాని నేను ఇప్పటివరకు అమ్మతో మాట్లాడానా, తావూజీతోగాని, కేసర్‌తోగాని మాట్లాడానా లేక ఇంకెవ్వరితోనైనా మాట్లాడానా అనేది తరచుగా నాకు తెలియకపోతున్నట్లు నేను గుర్తిస్తున్నాను. నాకు ఎవరి మాటైనా గాని, స్వయంగా నా మాటగాని గుర్తించలేకపోతున్నాను. ఏదైనా చెబుతున్నా, మాట్లాడుతున్నా చైతన్యమంటూ కలగటం లేదు. మనం సర్వస్వం మరచి ఈశ్వరునిలో లీనం కావాలని అందరూ చెబుతున్న దానిని గురించి అప్పుడప్పుడు నేను ఆలోచించి, ఆ విధంగా ప్రయత్నించి విఫలమయ్యాను. నాలో ఎప్పుడూ చైతన్యం ఉంటోంది. ఒక క్షణకాలం కూడా చైతన్యం లేకపోవటమనేది ఉండటం లేదు. మరి ఇప్పుడు నేనేం చేయాలి? 'మాలిక్'తో ఏదైనా కొంచెం చెప్పాలని నాకు అనిపిస్తోంది, అయితే ఆ 'కొంచెం'లో 'కొంచెం' కూడా లేదు. కనుక నేనేం విన్నవించుకోవాలి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 537

షాజహాన్‌పూర్,
01.01.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం 1955 డిశంబర్ 29వ తేదీది చేరింది. '$H_1$' పాయింట్ మీద చీకటి చేరినట్లుగా ఉండటం అనే దాని అర్థం ఇంకను సరిగ్గా తోచలేదు. ఏదో కొద్దిగా అవగాహనకు వస్తోంది. అది ఏదో పూర్తిగా స్ఫురించిన తర్వాత నీకు తెలుపుతాను. దక్షిణ భారతదేశంలో ఇంకా కొంతమంది మిషన్‌లో చేరారు. కలకత్తాలోని ఒక క్రొత్త అభ్యాసీ నుంచి ఉత్తరం వచ్చింది. సాధన గురించిన కొన్ని విషయాలను అతనికి వ్రాశాను.

మనస్సులో దృఢసంకల్పం అంటూ ఉండి తీరాలి, దానిని ఎవ్వరైనా వ్యతిరేకించినట్లయితే అది తప్పుగానే భావించబడుతుంది. ఎవ్వరైనా బంగారాన్ని ఇత్తడి అని చెప్పినట్లయితే, నిపుణులు దానిని బంగారంగానే నిర్ణయిస్తారు. నీ ఎముకలు కరిగిపోయి కనిపించకుండాపోయాయి అని అనిపిస్తోందని వ్రాశావు. దేవుని దయవలన నీ ఎముకలు కరిగిపోవటంకాని, కనిపించకుండా పోవటంకాని జరగలేదు. అది నెగేషన్ స్థితి కలగటానికి సంసిద్ధం కావటం. నీ లోపల, బయట కూడా అంతా సమతలంగా ఉన్నట్లు అనిపిస్తున్నదని వ్రాశావు. దీనికి క్రితం ఉత్తరంలోనే జవాబు ఇచ్చాను. తల యొక్క వెనుక భాగం ఏదైతే ఉందో దానిని "ఆక్సిపిటల్ ప్రామినెన్స్" (Occipital Prominence) అంటారు. అది బ్రహ్మ యొక్క భాండాగారం. దానిలో సంచలనం కలుగుతున్న అనుభూతి, అక్కడ ఆధ్యాత్మిక ప్రభావం ప్రారంభమైనట్లుగా తెలియజేస్తుంది. అది కనిపించటమే కాదు, దానిలో మన లాలాజీ సాహెబ్ యొక్క సామర్థ్యం నిరూపితమవుతోంది. అది ఏమిటంటే, అభ్యాసీ ఉన్న స్థానం నుండి దానికి ముందున్న స్థానంలో అతడు పాగా వేయటం జరుగుతుంది. (అనగా తరువాత కలగనున్న ఉన్నత స్థితికి తయారైపోయి ఉండటం జరుగుతుంది.) అనుభవపూర్వకంగాను, ప్రయోగాత్మకంగాను తెలిసిన విషయం ఏమిటంటే, కొన్ని రోజులు మాత్రమే ధ్యానం మరియు అభ్యాసం చేసిన తర్వాత అభ్యాసీ యొక్క 'ఆక్సిపిటల్ బోన్' (శిరస్సు వెనుకభాగంలో ఉన్న ఎముక) మీద కొన్ని తరంగాలు ఏర్పడసాగుతాయి. నిజానికి, అభ్యాసులలో అసలు తత్త్వం అనగా వారు ఏ విధంగా తయారుకావలసి ఉందో అలా తయారు కావటానికి ఆరంభంలోనే ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) ద్వారా బీజం వేయబడుతుంది. దానితో ఆధ్యాత్మిక పురోగతి వేగవంతమవుతుంది.

మాట్లాడుతున్నప్పుడు, అది నీ తండ్రిగారితోనా లేక తల్లిగారితోనా అను విచక్షణ చేయలేకపోవటమనే విషయం, చాలా మంచి స్థితియే. దీనినిబట్టి నీ భౌతిక బాంధవ్యం తెగిపోయినట్లుగా అవుతుంది. అంతేగాక సమత్వం కూడా పెంపొందుతుంది. అది బాగా వృద్ధి చెందటానికి కారణం, శరీరంతో పోలిస్తే మెదడు కొంచెం బలహీనంగా ఉండటం ఒకటి. మరొకటి ఆ మెదడు మీద ఒత్తిడి అధికం కావటం మూలంగా దాని పనితనంలో కొంత లోపమే ఉండటం. ఇలా చెప్పటంలో నా ఉద్దేశ్యం, నీ మెదడు చాలా బలహీనమైనదని చెప్పటం కాదు. కాని దాని శక్తికి మించిన పని చేయించటంలో ఈ సమస్య ఏర్పడుతున్నదని నా భావం. దేవుని దయవలన నీ తెలివి మరియు మెదడు బాగానే ఉన్నాయి. ఇతరుల సంభాషణ త్వరగా గ్రహించలేకపోవటానికి కారణం నీ ఏకాగ్రత (Concentration) కారణంగా నీ దృష్టి వాటిపై లేకపోవటం మరొక కారణం. నీవు దేవుని జ్ఞాపకం చేసుకోవటంలో మరుపు కలిగి ఉండటమనే విషయం ఎప్పుడో జరిగిపోయింది. అయితే నీవు జ్ఞాపకం చేసుకోవాలనుకున్నవారు నీ ఎదుటనే ఉన్నప్పుడు ఈ స్థితి కలుగుతుంది. ఇప్పుడు ఇద్దరూ ఏకమైపోయినపుడు ఎరుకలేనిది ఎవరి గురించి అవుతుంది?

కేసర్ ఉత్తరం చదివాను. భగవంతుని కృపతో స్థితి బాగానే కొనసాగుతోంది. అమ్మకు, చౌబేజీకి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 538

లఖీంపుర్,
04.01.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది, సమాచారం తెలుసుకున్నాను. ఇక్కడ కూడా అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు శరీరంలో భారం ఏమీ లేనట్లుగా ఉంది. అది చాలా తేలికగా ఉండి, అప్రయత్నంగా ఇటు అటు దొర్లుతున్నట్లు ఉంది. దానిని కదపటానికి ఆసక్తి ఏమీలేదు. బహుశా అందువల్లనే దాని నడవడిక గురించి నాకేమీ తెలియటం లేదు. అది నా విషయంలోనే కాకుండా అందరి విషయంలో కూడా ఇలాగే ఉంటుందని అనిపిస్తోంది. అదేమిటోగాని, నా శరీరం భూమి మీద నడుస్తున్నదో లేక ఆకాశంలో ఎగురుతున్నదో తెలియటం లేదు. నా శరీరం అంతా చైతన్యంగా అయిపోయింది. చెప్పటానికైతే దానిని చైతన్యం అని చెప్పాను, లేకపోతే ఈ దశలో ప్రతికణం నుండి ప్రకాశం వెలువడుతోంది కాని, అది వెలుతురు చేకూర్చే ప్రకాశం కాదు. ఇంకొక రకంగా చెప్పాలంటే, ప్రతికణం ఒక నేత్రంలాగా అయిపోయి దాని నుంచి ప్రకాశం వెలువడుతున్నట్లు అనిపిస్తోంది. 'మాలిక్' ఇప్పుడు నా దృష్టిలో 'అసలు' తత్వం (రియాలిటి) యొక్క ప్రకాశాన్ని నింపారు. అనగా నాకు ఇప్పుడు 'అసలు' తత్వం యొక్క అనుభూతియే ఉంది కాని ఇంతకుమించి మరేదీ లేదు. నా శరీరంలోని కణకణంలోను ఈశ్వరీయ శక్తి యొక్క రూపమే నాకు అనుభవమవుతోంది. ఇది స్వయంగా నా శరీరమా లేక ఈశ్వరీయ శక్తి యొక్క రూపంగా అయిపోయిందా అన్నట్లు ఉంది. నేను ఈశ్వరీయ శక్తి రూపం అని ఎందుకు చెబుతున్నాను అంటె ఇదే నా దశకు చెప్పదగ్గదిగా ఉంది, అలాకాకపోతే శక్తి, భక్తి, ముక్తి, బంధనం లేనట్లే. స్వభావం కూడా ఎంత సామ్యంగా అయిపోయిందంటే, ఎప్పటివరకు దశలో అంధకారం ఉంటుందో అప్పటివరకు చిర్రుబుర్రులాడటం (కస్సుమంటం) ఉంటుంది. శరీరం వశంతప్పి ఉంటోంది అయితే అది శుద్ధమైనపుడు, ఎవరైనా కొట్టినా, తిట్టినా కూడా ఎటువంటి ప్రభావం ఉండటం లేదు. ఎందుకంటే, ప్రతిపని శరీరం ద్వారా జరుగుతోంది. శరీరం ఈశ్వరీయ శక్తి రూపంగా అయిపోయింది. అటువంటప్పుడు దానిమీద ఎటువంటి ప్రభావమైనా పడే అవకాశం ఎక్కడ ఉంది!

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 539

లఖీంపుర్,
08.01.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తమరి కుశల సమాచారం తెలిసి ఆనందించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా దశ ఎలా అయ్యిందంటే, రాత్రింబవళ్ళు ఎప్పుడైనా గాని అసలు నా శరీరం ఉందో, లేదో తెలియటం లేదు. ఎముకలు, మాంసం అన్నీ కరిగిపోయి ఒక సమతల ఉపరితలంలో కలిసిపోయాయి. నేను తరచుగా, నా స్వరూపం ఇలా అయిపోయింది, అలా అయిపోయింది అని వ్రాస్తూ ఉండేదానను, కాని ఇప్పుడైతే నా స్వరూపమే లేనట్లుగా చూస్తున్నాను. ఇప్పుడు నేనేం వ్రాయాలి. కలం వ్రాయనంటున్నట్లుగా ఉంది. అయితే, కలం నడిపించేవారు ఈ విషయం గ్రహించి దానితో ఏదో వ్రాయిస్తూనే ఉంటారు. అంతేకాదు, ఆ కలం జీవితాంతం వ్రాయించబడుతూనే ఉంటుంది అని నా దృఢవిశ్వాసం కూడా. ఎందుకంటే, 'మాలిక్' కృపతో దశ ఏదైతే వస్తుందో, అది ఒక అద్దంలాగా నా ఎదుట స్వయంగా ప్రత్యక్షమవుతోంది. ఆ అద్దంలో నా ముఖం చూస్తున్నట్లుగా నేను దానిని చూస్తూ వివరిస్తూ ఉండిపోతాను. అయితే ఇప్పుడు నేనేం చేయాలి? నాకు ఏమీ తెలియడం లేదు, ఎందుకంటే, అద్దం ఎదుట ఏ చిత్రం రావటం లేదు. చైతన్యం లేకపోవటం అనేది కూడా ఇప్పుడు నాతో సంబంధం త్రెంచుకుంది. 'చైతన్యం' లేదంటే 'అచైతన్యం' అని కూడా చెప్పటం ఇప్పుడు సరికాదు అనుకుంటాను. అదేదో దైవానికే తెలియాలి.

'$H_1$' పాయింట్ పూర్తిగా శుభ్రంగా ఉంది. ఎప్పుడూ ఎటువంటి ఆటంకం కలగలేదు. ఏదైనా అడ్డంకి అనేది వస్తుంది అంటే అది పైనుంచే అని నాకు ఇప్పుడు అనిపిస్తోంది. లయ-అవస్థ అనేది ఇప్పుడు నాలో ఎంతకూ ప్రవేశించలేకపోతోంది. దశ యొక్క దశ కూడా నాలో జీర్ణించుకుపోతున్నట్లు అనిపిస్తోంది. అనగా నావద్దకు ఇప్పుడు ఏదైనా (దశ) రావటంగాని, నా నుంచి పోవటంగాని ఏమీలేదు. ఏమైందో ఏమిటో అంతుబట్టటం లేదు. అది తమకే తెలియాలి.

కేసర్ తమకు ప్రణామం చెబుతోంది. అమ్మ ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 540

షాజహాన్‌పూర్,
11.01.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ రెండు ఉత్తరాలు చేరాయి. **అభ్యాసులు షాజహాన్‌పూర్‌కు వచ్చి తిరిగి వెళ్ళిన తర్వాత వారి మనస్సు నా వద్దనే ఉండిపోతోంది అని వ్రాశావు. నీవు తెలిపిన అనుభూతి నిజమైనదే. ఎందుకంటే, వారి ధ్యాస నావైపు నిలిచి ఉంటుంది. దానిని ఇంకొక విధంగా చూసినట్లయితే, నా మనసు కూడా కొన్ని రోజులపాటు వారి వెంటే ఉంటుందంటే, అది ఇంకా బాగుంటుంది. వాస్తవంగా, ఎప్పుడైతే వారి మనస్సు నావైపుగా మరలుతుందో, సహజంగా నా హృదయం వారివైపు ఆకర్షిస్తుంది. కాని ఇది అందరి విషయంలోను కాదు. వారి మనస్సు శాశ్వతంగా నావద్దనే విడిచిపెట్టబడితే వారికి ఇంకా దేనినీ వెదుక్కోవాల్సిన అవసరం ఉండదు. ప్రకృతివైపు నుంచి '$H_1$' పాయింట్ మీద ఉన్న అంధకారం గురించిన నీ అనుభూతి నిజమైనదే. అది ప్రకృతి యొక్క నిరోధకం. ఎందుకంటే, నీవు ఒక ప్రత్యేక వ్యక్తిత్వం ఉన్న వారిలాగా తయారుకాకూడదు అని. ఒకవేళ ఆ విధంగా జరిగితే నేను ఈ ప్రపంచం విడిచివెళ్ళవలసి వస్తుంది. నా హృదయం ఆ విధంగా చేయటానికి నిరాకరించినపుడు స్వామి వివేకానంద దానిని అడ్డగించారు. దీనివలన నీకు ఏమీ హాని కలగలేదు.** నాకు తెలిసినంతవరకు ఇది (Prophetic-place) ప్రవక్తగా తయారయ్యే స్థానం. ఇంకా చెప్పాలంటే, నీ యొక్క ఈ స్థితి ఎప్పుడో ప్రారంభమైపోయింది. అది తలెత్తకుండా ఉండటంకోసం ఒక విధానం అమలుచేయబడింది. దానివలన కూడా ఏమీ హానిలేదు. నిన్న రాత్రి గం. 9.30

ని॥లకు నిన్ను '$I_1$' స్థానంవైపుకు మళ్ళించాను. అటువైపు '$I_1$' పూర్తిగా ఎందుకు లాగలేదంటే, '$H_1$' మీద ఉన్న చీకటి తొలగిపోగలదు అని. ఉపరితలం ఏదైతే నీవు లోపల, బయట చూశావో ఆ స్థానం వేరే విషయానికి సంబంధించినది. ఇప్పుడు నీవు '$H_1$' పాయింట్‌లో లయమైపోతున్నావు. అనుభవిస్తున్న బాధ దాని హద్దు దాటిపోయాక, అదే ఒక ఔషధంగా తయారైపోతుంది. ఇప్పుడు నీ ఉత్తరంలోని విశేషాలకు సమాధానం నేను కొన్ని వాక్యాలలో వ్రాస్తున్నాను.

**"ముందు నీవు ఎవ్వరివో నీవు తెలుసుకో" అని అందరూ అంటారు. వాళ్ళు చెప్పేది సరైనదే కావచ్చు. కాని నన్ను ఎవరైనా అడిగితే "నిన్ను నీవు మర్చిపో, నీ శారీరక స్పృహను, నీ ఆత్మ స్పృహను (Body-consciousness and Soul-consciousness) కోల్పోవటమే అన్నిటికంటె ముఖ్యం" అని అంటాను.** మనకు గుర్తించటానికి మరియు తెలుసుకోవటానికి శక్తి ఉన్నట్లయితే, అప్పుడు రెండు విషయాలు మన ముందు ఉన్నాయి. ఒకటి 'మనం' అయి ఉండగా, మరొకటి 'దేని గురించైతే మనం తెలుసుకోవటానికి ప్రయత్నిస్తామో' దానిని ఎప్పటికీ గుర్తించలేకపోతాము. దీనికి సులభమైన పరిష్కారం ఏమిటంటే, **నిన్ను నీవు మరచిపోవటానికి ప్రయత్నంచేస్తూ ఉండిపో. నేను కూడా దానికి సహకరిస్తాను అని చెప్పటమే కాకుండా, జనానికి ఈ విధంగానే సాధన చేయమని చెబుతున్నాను. "నిన్ను నీవు తెలుసుకో" అను దానిని సాధన చేయమని సోక్రటీసు వ్రాసినట్లు, దానినే జనం అనుసరిస్తున్నారని నాకు తెలుసు. భారతదేశంలోని మేధావులు, మహాత్ములు దీనిపైనే ఎక్కువ ధ్యాస నిలిపి ఉండవచ్చు. మనమైతే మనల్ని మనం మథించుకుంటూ ఉండాలి. అది ధ్యానం యొక్క మథనంతోనే సాధ్యపడుతుంది. అది ఎంతగానంటే, ఆ మథనంలో వెన్నయే మిగిలేట్లుగా చేయాలి.** నీవు నీ ఉత్తరంలో, నేను ఈసారి లఖీంపూర్‌లోనే ఉండిపోయినట్లుగాను, షాజహాన్‌పూర్‌కు తిరిగిరావటం కష్టమైపోయినట్లుగాను వ్రాశావు. అది సజావుగానే ఉంది.

కేసర్ ఉత్తరం కూడా వచ్చింది. ఆమెలో సంస్కారాలు ఏర్పడటం ఆగిపోయింది. ఆసక్తి లేకపోవటానికి కారణం, ఆమె ఆంతరికంగా భక్తితో నిమగ్నమై ఉంటోంది. ఒక విధమైన చీకటి దర్శనమవుతుందన్న అనుభూతి కలుగుతున్నదంటే, అది త్రికుటిలో ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభమైనట్లు దాని అర్థం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 541

లఖీంపుర్,
11.01.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరు కుశలమే. అక్కడ తామెల్లరూ కుశలమనేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఈ దశ ఏమిటో గాని, నేను కళ్ళు మూసుకున్నా కూడా నాకు చీకటి అనిపించటం లేదు. అలాగే కళ్ళు తెరచి ఉంచినా ప్రకాశం ఉండటం లేదు. నా ఈ దశలో ఒక విద్దూరమైన నిశ్శబ్దం ఆవరించి ఉంది. అయితే ఈ నిశ్శబ్దంలో "భయ్ – భయ్" అను శబ్దం లేనట్లుగా ఉంది. ఇంకా ఏమిటంటే, ఈ నిశ్శబ్దమే నా ఈ దశగా ఉంది. బహుశా ఇందుకే నాకు ఇది బాగుందనిపిస్తోంది. నిర్మానుష్యంగాను, ఎడారిలాగాను ఉంది ఈ దశ.

నా ఈ స్థితిలో నేను లోపలికి చూస్తూ ఉంటే, నా ఆంతరికం మరియు శరీరం కూడా నిశ్శబ్ద రూపంగా అయిపోయాయి. శరీరం యొక్క కణకణంలోను నిశ్శబ్దమే ఆవరించి ఉంది. బయట, లోపల కూడా ఇదే విధమైన నిశ్శబ్దం అనుభూతి చెందుతున్నాను, కాని అది నాకు చెడుగా అనిపించటం లేదు. ఎందుకోగాని మనస్సులో ఏకాగ్రత అనేది ఎప్పుడూ కలగటం లేదు. దక్షిణాదిలో పూజ చేయిస్తున్నపుడు చిక్కని రక్తమంతా నేలమీద

పోగుచేయబడినట్లుగా చూశాను. నాకు స్థూలం, సూక్ష్మం ఏదీ కూడా అనుభవానికి రానట్లుగా ఈ దశ ఉంది. ప్రతిదీ ఉన్నది ఉన్నట్లుగానే అనుభవమవుతోంది. ఈ అనుభూతిలో ఏమీ ఉన్నట్లుగా కనిపించటం లేదు. ఇప్పుడు శరీరం యొక్క అణువణువూ ఈశ్వరీయ ప్రకాశం మరియు ఈశ్వరీయ శక్తిమయంగా ఉన్నట్లు చూస్తున్నాను. దానిలో ప్రకాశం మరియు శక్తి యొక్క అనుభూతి లేనప్పటికీ, నా కణకణం నుంచి ఏ కిరణాలైతే పెల్లుబుకుతున్నాయో వాటిలో ఈ విషయం (ప్రకాశం, కాంతి) అనుభూతి చెందుతున్నాను. మొత్తం మెదడులోని ఎముకలలోను, యావత్తు శరీరం యొక్క కిరణాలలోను, అలాగే వాటికి నాలుగువైపులా ఉన్న వాతావరణంలోను ఈశ్వరీయ చైతన్యం యొక్క ప్రకాశం అనుభూతి చెందుతున్నాను. కాని ఏదీ లేకుండా ఖాళీగా ఉన్నాను. చాలారోజుల నుండి మెదడు అంతా నొప్పిగా ఉన్నప్పటికీ, ఈశ్వరీయ ప్రకాశం మరియు దివ్యచైతన్యం దాని నుంచి వ్యాపించిపోతున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు కస్తూరీ ఇదివరకటి కస్తూరీగా కాకుండా, బాబూజీకి చెందిన కస్తూరీగా అయిపోయింది. నాకు అర్థంకానిది ఒకటి ఏమిటంటే, నా మదిలో ఇప్పుడు ఆత్మయే లేనట్లుగాను, ఇంకను ఆత్మ నా నరనరాల్లోను, రోమరోమంలోను వ్యాపించిపోయినట్లుగాను అనిపిస్తోంది. బయట, లోపల అంతటా వ్యాపించిపోయింది. ఇప్పుడు జనమంతా నాకు నావారే, నాలాగే అనిపిస్తున్నాగాని, నాకు మాత్రం ఏ జనంగాని, ఏ వస్తువుగాని అనుభూతికి రావటంలేదు. అసలు ఉన్నది ఆత్మయా, ఈశ్వరుడా అనేది కూడా అర్థం కావటం లేదు కాని ఏదైతే మాత్రం ఏమిటి అని అనిపిస్తోంది. ఆత్మ ఇప్పుడు తన ఇంటిలో దూరిపోయింది కనుక నాలోకి ఎక్కడ నుండి వస్తుంది అన్నట్లుగా తలపిస్తోంది. ఇంతకుముందు తరచుగా నాలోపల శరీరం యొక్క ఏకత్వం గురించిన అనుభూతి వ్రాస్తూ ఉండేదానను, అది ఇప్పుడు పూర్తి స్వరూపంగానే అయిపోయింది. ఈ దృశ్యం అంతా మారిపోతున్నా కూడా దశ మాత్రం మారటంలేదని అనిపిస్తోంది. స్థితి మాత్రం సమానంగా నడుస్తోంది. అది తొలగిపోకుండా ఉంటోంది, ఎందుకంటే దానికి ఆది అంతాలు అంటూ లేవు కనుక.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. కేసర్ మరియు బిట్టో ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 542

లఖీంపుర్,
14.01.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉండవచ్చు. ఇక్కడ అంతా కుశలం. అక్కడ తమరందరూ కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ రోజున దశ బాగా వేగంగా నడుస్తోంది. నా కణకణం నుండి ఈశ్వరీయ కిరణాలు వెల్లివిరుస్తున్నాయి. దేనిమీదనైతే నా హస్తం ఉంచుతానో అది దివ్యమైపోతుంది. నా నాలుగువైపులా (Vibration) ప్రకంపనం చాలా తీవ్రంగా ఉంది. అయితే నరనరాల్లోను (Moderation) సమతుల్యత వ్యాపించి ఉంది. ఇదంతా తమ యొక్క కృపా ఫలితమే.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 543

షాజహాన్‌పూర్,
31.01.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ రెండు ఉత్తరాలు 1956 జనవరి 11 మరియు 14వ తేదీలవి అందాయి. ఉత్తరాలకు జవాబు వ్రాసే ముందు ఒక శుభవార్త అందించాలని అనుకుంటున్నాను. అది ఏమిటంటే, నిన్న కాశీరామ్‌గారు, గజానంద్‌గారు ఇద్దరూ అస్సాం నుండి వచ్చారు. ఇప్పుడు నీ ఆధ్యాత్మిక దశను గురించి వ్రాయబోతున్నాను.

నీ దశలను గురించి అర్థంచేసుకోవటానికి ఎవ్వరికీ శక్యం కావటంలేదు. అలాగే నాకు కూడా అర్థం చేసుకోవటానికి కష్టమవుతోంది. దానిని వివరించటానికి మాటలు దొరకటం లేదు. కళ్ళు మూసినప్పటికీ చీకటి అనిపించటంలేదని, కళ్ళు తెరచి ఉంచినప్పటికి కాంతి తెలియటంలేదని వ్రాశావు. ఇది ఎంత అద్భుతంగా వ్రాశావో కదా! దీనిని సత్యత్వం (రియాలిటి) యొక్క అట్టడుగు భాగంగా గ్రహించాలి. ఇక్కడ చీకటి, వెలుగు రెండూ ఉండవు. జనం దానిని 'అసలైన ప్రకాశం' అంటారు. నేను కూడా దానిని వివరించటానికి ఇదే మాటను ప్రయోగిస్తాను. భూమావైపు ఎవ్వరైనా నిశితంగా చూసినట్లయితే, నీకు కలిగినటువంటి స్వచ్ఛస్థితి యొక్క అనుభూతి, వారికి కనిపిస్తుంది. కాని హృదయం లేనటువంటివారు (దివ్య హృదయం కలిగినవారు) మాత్రమే నిశితంగా భూమా (సెంటర్)లోకి చూడగలరు. దీనిని గురించి నేను 'అనంతంవైపు' (అనంత్ కీ ఓర్, Towards Infinity) పుస్తకంలో కూడా వ్రాశాను. నీవు, నీ లోపల, బయట ఒక విధమైన నిశ్శబ్దం ఆవరించి ఉన్నట్లుగా వ్రాశావు. దీనిని వివరించటానికి ఆంగ్లంలో 'Wilderness or Solitude' అనగా నిరామయం లేదా శూన్యత్వం అని చెప్పవచ్చు. అయితే ఇది దాని (Wilderness) తర్వాత కలుగునట్టి స్థితి. కాని అసలైన స్థితి ఇంకా చాలా దూరంలో ఉంది. ఇప్పుడు నీ స్థితిలో పదార్థం యొక్క పరమాణువులు చాలా తేలికైనవి కలిగి ఉన్నాయి. ఇది '$I_1$' యొక్క స్థితి. బాగా పరిశీలించినమీదట చాలా స్వల్పంగా ఇంద్రియ జ్ఞానం (Sensation) కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఇంద్రియ జ్ఞానం (Sensation) అనేది అంతర్గత చలనం యొక్క సూక్ష్మస్థితికి చెందినదేతప్ప మరేమీ కాదు. నెగేషన్‌లో ఇవేమీ ఉండవు. ఒక పొడిబారిపోయిన, మార్పులేని స్థితి మాత్రం ఉంటుంది కాని ఇది కూడా అనుభూతికి రాదు. దీని తర్వాత స్థితిలో అంతర్గత చలనం ఒక మాధ్యమంగా ఉండి, దానిలో అపరిమితమైన శక్తి ఉంటుంది. ఈ నెగేషన్‌ను ఒక మృత్యుస్థితిగా చెప్పాల్సి ఉంటుంది. అయితే మొత్తం జీవితానికి అదే మూలం అవుతుంది. అసలు విషయం చెప్పాలంటే, మనం మరణించిన తర్వాత (అనగా అహం కోల్పోయిన తర్వాత) అసలైన జీవితాన్ని ఆనందిస్తూ గడుపుతాం. ఎప్పుడైతే ఏకాగ్రత ఒక మంచి రూపం దాల్చుతుందో, అప్పుడు దీని అనుభూతి కలగదు. నీకు ఇప్పుడు భగవంతుడు మరియు ఆత్మ చిందులేసుకుంటున్నట్లుగా అనిపిస్తుంది. ఇది ఎలా ఉంటుందంటే, కెంపులు (Ruby) ఉన్న చోట రంగుల దుకాణం తెరచినట్లుగా ఉంటుంది. వాస్తవంగా చెప్పాలంటే, బ్రహ్మవిద్యను (ఆధ్యాత్మిక జ్ఞానం) పొందటానికి మహాత్ములు అని చెప్పబడే వారు రంగుల దుకాణాలే తెరుస్తారు. జీవితాంతం వాటినే విక్రయిస్తూ ఉంటారు. ఈ రంగులపై (విధానాలపై) దృష్టి నిలిపినవారికి, ఆ రంగులే హృదయంలో నాటుకుంటాయి. అందుచేత మనలో ఏ రంగులైతే చోటుచేసుకున్నాయో వాటిని తొలగించాల్సి ఉంటుంది.

**అంతరార్థం:** అసలైన బ్రహ్మవిద్య ఉండగా రంగులకు ప్రాధాన్యం ఇచ్చి ఆ వేషధారణలో ఆశ్రమాలు స్థాపించి ధార్మిక ప్రసంగాలను అమ్ముకోవటం వంటిది. ఈ రంగు వేషధారులవైపు ఆకర్షితులైనవారు వాటికే అలవాటు పడిపోతారు, కాని ఆ రంగు విదిల్చుకుని అసలైన దివ్యజ్ఞానంపైన దృష్టి నిలపరు. అందుచేత వాటిని విస్మరించి దివ్యత్వంవైపు దృష్టి నిలిపాలి అని సూచించటంగా అర్థం చేసుకోవచ్చు.

శరీరంలోని కణకణంలో నుంచి ఈశ్వరీయ ప్రకాశం వెలువడుతూ ఉన్నట్లుగా అనిపించడాన్నిబట్టి నీవు బ్రహ్మలో మొదటిదశలో లయ-అవస్థ పొందినట్లుగా తెలియజేస్తోంది. గతంలో నీకు ఏదో ఒక ఉత్తరంలో వ్రాశాను మరియు ఋగ్వేదంలో కూడా చెప్పబడింది -అది బ్రహ్మలు పలురకాలుగా ఉంటాయి అని. ఇప్పుడు నీకు కలిగిన స్థితి, గొప్ప ఋషులకు కూడా పొందటానికి కష్టతరమవుతుంది. **మన మిషన్ యొక్క శిక్షణ ఎంతో సులభమైనదే అయినప్పటికీ దానిని ఎవ్వరూ అర్థం చేసుకొనకపోవటం వలన దాని విలువ తగ్గిపోతూ ఉండటం చాలా బాధకరంగా ఉంది. విలువ అని చెప్పటంలో నా ఉద్దేశ్యం, దీనికి గౌరవం లేకుండా పోయింది అని చెప్పటమే.** దక్షిణభారతదేశంలో నీకు దర్శనమైన రక్తపాతం జరగవలసే ఉంది.

నేను ఏదో ఒక సందర్భంలో ఎవరితోనో సంభాషిస్తున్నపుడు ఇటువంటి సంఘటనలు దక్షిణభారతదేశంలో నుంచే ప్రారంభమవుతాయి అని చెప్పాను. బహుశా ఇది నిజమవ్వవచ్చు. **అభ్యాసులను రక్షించి నీవు మంచి పనే చేశావు. దైవం తలిస్తే వారికి ఆ రక్షణ అలాగే ఉండిపోతుంది.** కణకణంలోను ఆత్మ వ్యాపించియే ఉంటుంది, కాని ఈ విషయంలో నీకు కలిగిన అనుభూతికి అర్థం ఏమిటంటే, జనులు ఏ రూపంకొరకై వెదుకుతున్నారో అదే రూపంగా నీవు అయిపోయావు. కాని విచారించాల్సిన విషయం ఏమిటంటే, **ఏనుగును మట్టి కుండలో వెదుకుతున్నారు. (అనగా దైవాన్ని విగ్రహాలలో పొందతలపెట్టున్నారు అని భావం.)**

నీవు '$I_1$' స్థితిని సరిగ్గానే వివరించావు. నాలో గురుమహరాజ్ యొక్క ఆధ్యాత్మిక జ్ఞానం, తెలివితేటలు పనిచేయకపోతే, ఉన్నత స్థాయికి చెందిన శిక్షణ ఇవ్వటం కష్టమై ఉండేది. '$H_1$'వద్ద ఉన్న నలుపును తొలగించటానికి '$H_1$' మీద నా శక్తి నంతటనీ కేంద్రికరించాను. దాని ఫలితంగా '$H_1$' మీద స్థితి సరిచేయబడటమేగాక '$I_1$' మీద నీ అంతట నీవు రెండవ పాదం మోపటానికి సిద్ధపడుతున్నావు. '$H_1$' మీద నీకు అనుభవమైన నలుపు ఎటువంటి స్థూలత్వం లేదా దోషం కాదు. అలా ఎందుకంటే, నా తప్పిదంవలన దాని మీద నేను ప్రయోగించిన శక్తి అంచనాకు మించినది చేరటంవలన శక్తి యొక్క ఒక పొర ఏర్పడిపోయింది. దానిని నేను తొలగించటానికి ప్రయత్నించినప్పటికీ తొలగిపోలేదు. లాలాజీ సాహెబ్ కృపవలన ఈ విధానం నాకు స్ఫురించింది కనుక చేయవలసి వచ్చింది. దీని మూలంగా నేను చేసిన తప్పు యొక్క ప్రభావం తొలగిపోవటమేకాదు, ఈ తప్పు మూలంగా నీకు ముందు ఉన్న పాయింట్‌కు ఎక్కువ సహాయం చేకూరింది.

నీ తల్లిదండ్రులకు ప్రణామం. అలాగే నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 544

లఖీంపుర్,
30.01.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం మరియు కేసర్ ఉత్తరం చేరాయని అనుకుంటున్నాను. ఇక్కడంతా కుశలమే. అక్కడ అందరూ కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇప్పుడు దశ ఎంత ఖాళీదిగా ఉందంటే, దానిని చెప్పటానికి తగిన శబ్దాలే లేనట్లుగా ఉంది. నిర్మానుష్యం అనిగాని, ఎడారిలాగా ఉందని చెప్పటంగాని ఎంతమాత్రం భావ్యంగా అనిపించటం లేదు. కణకణం నుంచి ఈశ్వరనామం అను సుగంధం కూడా ఎవరో పీల్చివేసినట్లుగానో లేక ఒక స్థలం లేక ఒక పాత్రలోని వాయువును ఏదైనా యంత్ర సహాయంతో (వ్యాక్యూమ్ పంప్, వాయురేచక యంత్రం) పూర్తిగా లాగివేసినట్లయితే ఎలా ఉంటుందో ఆ విధంగా

ఉందనిపిస్తోంది. నిశ్శబ్దం అని చెప్పానుగాని, ఇప్పుడు దశలో నిశ్శబ్దం అని చెప్పటానికి కూడా ఏమీలేదు. ఇప్పుడు ఈ దశలో ప్రేమ యొక్క జాడ కూడా లేకుండాపోయింది. కనుక బాబూజీని ప్రేమించటానికి ఆ ప్రేమను ఎక్కడి నుండి, ఎలా తీసుకురావాలి! **ఒకరోజు సాయంత్రం పూజగదిలో ఏదో వ్రాస్తూ ఉండగా ఒక శక్తి, నా ఊహ ప్రకారం విష్ణువు అయి ఉండవచ్చు, నా ఎదుటకు శ్యామవర్ణంతో (నలుపు రంగుతో) వచ్చి ఏమి కావాలో కోరుకో అని అడిగింది. నేనయితే నాకు ఏమీ అవసరం లేదని చెప్పాను. నాకు అన్నీ లభించాయి అని కూడా చెప్పాను. అలా కాదు, ఏమైనా కోరుకో అని అంది. అప్పుడు నేను, నీవు ఎప్పుడైనా నా బాబూజీని చూశావా అని అడిగాను గాని అది మౌనంగా ఉండిపోయింది. అప్పుడు వెంటనే నేను, శ్రీ బాబూజీ ధ్యానంలో లయమై ఉండమని నేను కోరుతున్నాను అని చెప్పాను. అప్పుడు వెంటనే ఆ శక్తి మాయమైపోయింది.**

నా స్థితి ఎటువంటిది అంటే, స్వల్పమైన శబ్దం కూడా దానిని తాకటం లేదు. అందుకే నేను దానిని ఖాళీగా ఉందని చెబుతున్నాను. అది కూడా ఎటువంటిది అంటే, ఉన్నదేదో అది దాని స్వంతం అన్నట్లుగాను, ఇంకను చెప్పటానికి ఏమీ లేనట్లుగాను ఉంది.

ఇప్పుడు నా దశలో బయట, లోపల అంతటా చీకటి అంటె చీకటిగానే ఉంది. కణకణం చీకటి స్వరూపంగా అయిపోయినట్లుగాను, లోపల బయట విచిత్రమైన శూన్యతయే వ్యాపించి ఉన్నట్లుగాను ఉంది. నన్ను చూస్తూ ఉంటే, రోమ రోమంలోను, నాళాల్లోను (సిర, రక్తనాళం) శూన్యతయే వ్యాపించినట్లు ఉంది. ఈ విధంగా అంతటా శూన్యతయే వ్యాపించి ఉన్నట్లుగా అనిపించినప్పటికీ, నాలోపల పరిశీలించినట్లయితే, కణకణంలోను చీకటి వంటి శూన్యత ఉంటోంది. అయితే శరీరం నుండి కంపనం (Vibration) వెలువడుతున్నట్లుగా అనుభవమవుతోంది. ఇది ఆశ్చర్యకరంగా ఉంది. అలా ఉన్నదానిని నేను శూన్యతా దశ అని చెబుతున్నాను గాని దశ ఎటువంటిది అంటే, నేనే స్వయంగా శూన్యతా రూపంగా అయిపోయానా అన్నట్లు ఉంది. నేను చూస్తున్నది ఇంకొకటి ఏమిటంటే, ఇదివరకు పైనున్న అనంత శక్తి నన్ను తనవైపుకు గుంజుకుపోతున్నట్లుగా ఎప్పుడూ అనిపిస్తూ ఉండేది, ఎప్పుడైనా నేను అనారోగ్యంగా ఉన్నపుడు కూడా నాకుపైన ఉన్న శక్తి యొక్క ఆకర్షణ నన్ను తనవైపుకు ఈడ్చుకుపోతున్నట్లు ఉండేది, కాని ఇప్పుడైతే అలా కాకుండా, ఎవరో ముందున్న ద్వారం దభాలున మూసివేసినట్లుగా వెంటనే ఆగిపోతోంది. ఇప్పుడు నేను మరపుతో, స్పృహతో ముందుకు సాగిపోతున్నాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. కేసర్ మరియు బిట్టొ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 545

లఖీంపుర్,
05.02.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి సంతోషించాను. 'మాలిక్'కు అనేకానేక ధన్యవాదాలు. ఎందుకంటే, అపారకృపావంతుడైన 'మాలిక్'కు ధన్యవాదలకుమించి ఇంకేమి చెప్పగలను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఏమిటోగాని, లోన బయట అంతటా, అన్నివైపులా నాకు పూర్తిగా ఖాళీగానే ఉన్నట్లు అర్థమవుతోంది. దశ యొక్క మిరుమిట్లుగొల్పటం కూడా సద్దుమణిగిపోయినట్లుగా ఉంది. ఇంకొక విధంగా చెప్పాలంటే, దాని

ప్రాణం వంటిది కూడా తొలగిపోయినట్లుగా గ్రహిస్తున్నాను. ఇప్పుడు ఎలాంటి దశను చూస్తున్నానంటే, ఏదైనా చెప్పినా లేక చేసినాగాని దానిని గురించిన పునరాలోచన అంటే ఇలా జరిగి ఉంటుందేమో అను మారు ఆలోచన అనేది మనస్సులో కలగటం లేదు, కాని మనస్సు మాత్రం నిశ్చింతగా ఉంటోంది. అయినప్పటికీ దీనిలో ఇంకా పూర్తి దృఢ నిశ్చయం రాలేదు. ఈ దశలో ఇంకా ఎలా ఉందంటే, ఎవరైనా తెల్లవారింది అనిగాని, రాత్రి అయ్యింది అనిగాని చెప్పినా కూడా నాకు ఏమీ అనుభూతి కలగటం లేదు. అందరూ గాలి వేస్తోంది అని చెప్పినా, వర్షం కురుస్తోంది అని చెప్పినా కూడా నాకు ఏమీ అనుభూతి కలగటం లేదు. నేను మాత్రం ఎలా ఉన్నానో అలాగే పొడిగా ఉంటున్నాను. స్థితి అనేది తనలో తానే ఉంటూ అంతా ఒకేలాగ అయిపోయింది. అందరూ రాత్రి అయ్యింది అని చెప్పుకుంటున్నా కూడా నాకు నిద్ర రావటం లేదు. అలాగే ఎప్పుడైనా అలసత్వం (సోమరితనం) గాని, చురుకుదనంగాని అనుభూతికి రానట్లుగా గమనిస్తున్నాను. వాస్తవంగా నా దశ ఎటువంటిది అంటే, పైన వ్రాసిన మాటలన్నీ పైకి ఎగిరిపోతున్న గాలి మాటలులాగానే ఉంటున్నాయి. '$I_1$' పాయింట్ బాగా శుభ్రపడినట్లుగా నాకు అనిపిస్తోంది. కాని నేను నా స్థితిని పట్టుకోలేకపోతున్నాను. ఎప్పుడైనా, ఏదైనా కలిగితేనే అప్పుడు పట్టుకోవటం జరుగుతుంది. ఎందుకంటే, నా స్థితి స్వయంగా నేనే అయిపోయాను. అన్నివైపులా ఎడారిలాగా లేదా నిర్మానుష్యంగా అయిపోయింది. కాని 'మాలిక్' కృపతో నాకు ఇటువంటి దశయే మేలనిపిస్తోంది.

ఈరోజు రాత్రి ఒక స్వప్నం వంటిది కలిగింది. దానిలో, ఒక ఏకాంత నిర్మానుష్య ప్రదేశంలో ఒక నది ప్రవహిస్తోంది. దాని నీరు బురుదమయం గాను, చాలా తేలికగాను ఉంది. నేను దానిలో స్నానమాడుతున్నాను గాని, కాని తడవకపోగా పొడిపొడిగానే బయటకు వస్తున్నాను. అయినా కూడా, నది యొక్క మొత్తం నీటిలో నా 'శ్రీ బాబూజీ' ఇమిడి ఉన్నట్లుగాను, అయినా గాని తడవకుండా, నా ఊహలకు అందనంతగా బాబూజీ అవతలి తీరంలో ఉన్నట్లుగా అనుభవమవుతోంది. వారి నీడగా చెబుతామంటే, దానిలో చాలా గుణాలు భారమవుతాయి. నీవు విధవరాలుగా అయిపోయావు అని జనం అంటున్నాగాని నేను పూర్తిగా నిరాలోచనతో కూడిన ఖాళీదశలో ఉండటం వలన నాకేమీ అనిపించటం లేదు. ఇంతలో కళ్ళు తెరిచాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. కేసర్ మరియు బిట్టొ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 546

లఖీంపుర్,
23.02.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. నా ఆరోగ్యం ఈమధ్య చెడిపోయింది కాని, ఇప్పుడు పూర్తిగా బాగయ్యింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో నేను బాబూజీని చూస్తున్నపుడు మాట్లాడుతున్నాను, కాని వారి గొప్పతనాన్ని గురించి స్మరించుకుంటూ ఉన్నట్లయితే, మనస్సు గాబరాపడుతోంది. హృదయానికి ఊపిరి సలపటం లేదు. అసలు విషయం ఏమిటంటే, ఈ దశలో దానిని (దశను) గురించి అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తుంటే, హృదయం గాబరా చెందుతోంది. ఇప్పుడు ఉత్సవంగాని, జనసమూహంగాని, శ్రీ బాబూజీగాని ఏమీ కనిపించటం లేదు.

ఇప్పుడు దశ ఎటువంటిది అంటే, అది పూర్తిగా మరణించిపోయింది, పూర్తిగా ఆలోచనా రహిత స్థితిని చూస్తున్నాను. ఇంతేకాదు, అసలు నా స్వరూపమే దానిలాగా అయిపోయింది. బహుశా అందుకనే నాకు ఉత్సవంగాని, జనసమూహంగాని కనిపించ లేదు. ఉత్సవానికి నేను వెళ్ళాను కాని ఉత్సవం ఉందా లేదా అనేది కూడా నాకు తెలియలేదు. ఇంకా దశ ఎలా ఉందంటే, అక్కడ కనీసం ఈశ్వరీయ ధార కూడా ప్రవేశించనట్లుగా ఉంది. పూర్తిగా అంతటా అన్నివైపులా ఒక ఆలోచనా రహిత దశయే ఉంది. దశలోకి వస్తున్నదిగాని, పోతున్నదిగాని ఏమీలేదు. పూర్వం నాకు చాలా స్వల్పమైన ప్రకంపనం అనుభవమవుతూ ఉండేది. కాని ఇప్పుడు అంతా సమాప్తమైపోయింది. దశలో ఇప్పుడు పూర్తిగా సమత్వమే (Homogenous) ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇది పూర్తిగా ఆలోచనా రహిత దశ, ఇదే దాని స్వరూపం.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 547

షాజహాన్‌పూర్,

29.02.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీవు వ్రాసిన ఉత్తరం 23.2.1956వ తేదీగలది చేరింది. శ్రీ ఎమ్.కె. గౌర్షన్ ధ్యానంలో చాలా బాగా నిమగ్నమై ఉన్నారు. 25.2.1956 రాత్రి గం. 7.25 ని॥లకు ఆయన స్వయంగా తన ఆత్మస్థానానికి చేరుకున్నారు. దానితో ఆయన పిండదేశానికి సంబంధించినంతవరకు హృదయచక్రం యొక్క ఆధ్యాత్మిక యాత్రను పూర్తిచేసారు. ఇప్పుడు హృదయంలో నెలకొని ఉన్న కొద్దిపాటి చీకటిని నిర్మూలీకరించవలసిన బాధ్యత మన ఇద్దరిమీద ఉంది.

ఇప్పుడు నీ యాత్రకు సంబంధించిన స్థానం మరచిపోయాను. అది '$I_1$' అవునో కాదో తెలియజేయి. భగవంతుని కృపవలన నీలో "సామ్యావస్థ" (Balanced State) ఏర్పడింది. అయితే దానిలో ఇంకా స్వచ్ఛత మరియు పవిత్రత నెలకొనవలసి ఉంది. ఈ స్థితిని పోల్చిచూసినప్పుడు, నీడవంటి స్థూలత్వం నలుపు రంగు వంటిది ఏర్పడినట్లుగా ఉంది. దేవుని దయవలన ఇది కూడా త్వరలోనే తొలగిపోతుంది. ఉత్సవ (బసంత్ పంచమి) సందర్భంలో ఏమీ అనుభూతి కలగలేదని నీవు వ్రాశావు. దానికి అర్థం, నీవు నన్ను అంటిపెట్టుకుని మంచి లయ-అవస్థను పొందావు. ఇది చాలా మంచి విషయం. నీవు ఆలోచనా రహితస్థితిని గురించి వ్రాశావు. ఒక విధంగా చెప్పాలంటే, అది సామ్య-అవస్థకు మారు పేరు వంటిది. దీని మూలంగా ఒంటరితనం కూడా అనుభవానికి వస్తుంది. ఆధ్యాత్మికంగా నీవు ఎక్కడ ఉన్నప్పటికీ అక్కడ ఇంద్రియ జ్ఞానం కూడా ఉండటంలేదని నీవు వ్రాసిన విషయం సరైనదే. ఒక ఉర్దూ కవి ఇలా వ్రాశాడు: **"న వహాఁ ఖ్యాల్ పహుంచె, న జేహన్ కీ హై రసాఈ"** అనగా అక్కడ ఆలోచనకుగాని, జ్ఞానానికిగాని ప్రవేశం ఉండదు అని అర్థం. నీవు ప్రేమించదలచినంతగా ప్రేమించలేకపోతున్నావు, అని వ్రాశావు. నేను కూడా ఇదే మాట చెప్పుతూ వచ్చాను. ఆ విధంగా చెప్పుతూ దానిలోనే కుమిలిపోయాను.

కేసర్ ఉత్తరం కూడా వచ్చింది. ఆమె కలకు అర్థం నేను ఇలా వ్యాఖ్యానించాను. ఆమె ఆత్మ తన నగ్నరూపంలోకి వచ్చేసింది. అనగా ఆత్మను ఆవరించి ఉన్న సంస్కారాలన్నీ తొలగిపోయి దాని అసలు రూపంలోకి వచ్చింది. దీనిని నిర్వచించటం చాలా కష్టం కూడ. పూజ చేయటానికి, చేయకపోవటానికి ఏమీ భేదం ఉండటంలేదని అమె వ్రాసింది. దీనిని ఆమె స్పష్టంగా వివరించలేకపోయింది. అది ఈ విధంగా అర్థమౌతుంది: ఆమె పూజ చేసినప్పుడు ఎటువంటి

స్థితి ఉంటున్నదో, పూజ చేయనప్పుడు కూడా అలాగే ఉంటోంది, అని. ఈ స్థితి నిలకడగా ఉన్నట్లయితే చాలా మంచిదే కాని ఈ స్థితి కొరకు ప్రయత్నం చేయకుండా ఉండాలి, అనగా దానంతట అదే కలగాలి. ప్రార్థన సమయంలో యుద్ధ దృశ్యం కనిపించిందంటే, అది సంభవించే అవకాశం ఉంటుంది. గోండా నుంచి కొన్ని రోజులు ధ్యానం ఆచరించి నిలిపివేసినటువంటి ఒక అభ్యాసీ – "నేను ధ్యాన సమయంలో పూర్తిగా భారతదేశం మీద ఒక పరదా కప్పినట్లుగాను, దాని మీద 'ప్రమాదం' అని వ్రాయబడి ఉన్నట్లుగాను చూసాను" అని వ్రాశాడు. దానిని నేను తొలగించి అందులో ప్రవేశించినట్లు కల కూడా చూశాడట. ఏమి జరగనున్నదో భగవంతునికే తెలియాలి. ఉత్సవానికి (బసంత్ పంచమి) ఈ సంవత్సరం నేను డబ్బు ఏమీ వెచ్చించలేదు. బహుశా 20 లేదా 30 రూపాయల మిగులు ఉండవచ్చు. దానిని బ్యాంకులో జమ చేయటం జరుగుతుంది.

చౌబేజికి, అమ్మకు నా ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 548

లఖీంపుర్,
28.02.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని ఆశిస్తున్నాను. కాని ఇప్పుడు మళ్ళీ ఏదో వ్రాయాలని బుద్ధి పుట్టింది, అయితే విశేషమైనది ఏమీలేదు. అయినా కూడా ప్రస్తుతం దశ అంటూ ఉంది కనుక వ్రాస్తున్నాను.

ఇప్పుడు దశలో, కేవలం బీజం అంటే బీజం మాత్రమే ఉన్నట్లుగాను, దానిలో నేను ఇమిడిపోయి ఉన్నట్లుగాను, అదే నా స్వరూపంగా అయిపోతున్నట్లుగాను అనిపిస్తోంది.

బాబూజీ, నాకు ఈ దశలో లోన, బయట ఇప్పుడు ఏమీ ఉన్నట్లు అనిపించటం లేదు. ఇపుడు ఈ ఏమీలేదు అనుదానిలోనే నేను పరవశమైపోయి దానిలోనే నేను మగ్నమైపోయి ఉన్నట్లు లేదా దానిలోకే దూసుకుపోతున్నట్లు నేను గమనిస్తున్నాను. ఇప్పుడు ఎలా ఉందంటే, పగలంతా కూడా ఎప్పుడూ నాకు వెలుతురు సోకనట్లుగా అనిపిస్తోంది. ఎండలో కూర్చుని ఉన్నా కూడా వెలుతురు అనిపించటం లేదు. ఇంకను కారుచీకట్లో కూడా, లాంతరు ఆర్పివేసినాగాని, దుప్పటితో ముఖం కప్పి ఉంచుకున్నాగాని చీకటిగా ఉండటం లేదు. ఇంతకుముందు కూడా తరచుగా నేను ఈ విషయం వ్రాస్తూ వచ్చాను, అటువంటిదే ఈ దశ కూడా. అయితే నాలోపల ఒక మార్పులేని దశ అనుభవమవుతోంది. అక్కడ నా దశ నా స్వరూపంగా అయిపోయినట్లు లేదా ఆ దశయే లోపల, బయట మరియు కణకణంలో వ్యాప్తమై ఉన్నట్లు చూస్తున్నాను.

దీనిని ఆలోచనారహిత దశ అనిగాని, మరేమైనా అనిగాని చెప్పాలంటే నాకేమీ అర్థం కావటం లేదు. ఎందుకంటే, నా శరీరం యొక్క కణకణమూ ఆ రూపమే చెందిపోయాయి. నేను ఇంతకుక్రితం, నా లోపల ఒక విచిత్రమైన అనంతం మరియు ఒకే రసభరితమైన ఆనందం ఏర్పడి ఉంటోందని వ్రాస్తూ వచ్చాను. కాని ఇప్పుడైతే నా ఆంతరికమే కరిగిపోయి సమాప్తమై పోయిందేమో నాకు తెలియటం లేదు. ఎందుకంటే, ఇప్పుడు నేను చూస్తూ ఉంటే, నా ఆంతరికం ఉన్నదో లేదో అనిపిస్తోంది. నా శరీరం యొక్క కణకణం, లోపల బయట అన్నీ కూడా పూర్తిగా ఒకే ఒక ఆలోచనా రహిత దశగానే అయిపోయాయి. ఆ ఒకే రసభరితమైన ఆలోచనారహిత ఆనందం ఇప్పుడు నా స్వరూపంగా అయిపోయింది. అందువలన ఇప్పుడు ఆనందం అని చెప్పటం తగదు అన్నట్లు ఉంది. ఇంకేముంది,

స్వయంగా ఒక్క పరమానందమే ఉంది. స్వయంగా అది నేనే అన్నట్లుగా నాకు అంతుచిక్కింది. అది స్వయంగా నా స్వరూపమే కాని మరేమీ కాదు. ఇంక ఎల్లప్పుడూ ఆలోచనా రహిత దశయే ఉంటున్నది.

ఇప్పుడు ఈ దశలో, ఏమున్నదో అదే ఉంది అన్నట్లుగా ఉంది. ఇప్పుడు సూక్ష్మంగా లేదు కాని, సూక్ష్మత్వం అనేది నాకు ఒక పరదాలాగా అనిపిస్తోంది, అది నాలో లేదు. దశ పూర్తిగా ఒకే విధంగా ఉంది, లేదా ఒక అంతులేని మైదానం వంటిదిగా చెప్పవచ్చు. దానిని దశ అని అనండి లేదా మరేదైనా అనండి. స్థితిలో ఏమీలేకుండా పోయింది. యదార్థం ఏమిటంటే, నేను పైన ఆలోచనా రహితమని దేనినైతే వ్రాశానో, అది కూడా ఒక దశ కాదు. కాకపోతే పూర్తిగా ఖాళీ అనిగాని, శూన్యమనిగాని చెప్పటానికి బదులుగా ఇలా చెప్పాల్సి వచ్చింది. బలవంతంగా ఏదో శక్తి పైనుంచి ప్రపంచంవైపు నన్ను అణచి ఉంచుతున్నట్లు అనిపిస్తోంది మరియు నాలో శారీరిక చైతన్యాన్ని కల్పిస్తూ ఉంది. ఇప్పుడు దశలో ఎటువంటి మహిమగాని, చాంచల్యంగాని, సుఖానుభూతిగాని లేవు. ఎందుకంటే, అది ఎలా ఉన్నదో అలానే ఉన్నపుడు మరొకటి ఎక్కడ నుండి వస్తుంది.

దశ ఎలా ఉంది అంటే, దానిలో ఇప్పుడు దేనికీ ప్రవేశం లేదు, అన్నింటికీ ప్రవేశమూ ఉంది. ఇప్పుడు అంతులేని మైదానం నా ఎదుట ఉండగా దానిలో నేను పూర్తిగా ఇమిడిపోయాను. ఈ దశలో రావటమూ, పోవటమూ రెండూ తెలియనట్లు ఉంది. అసలు నాకేమైనా తెలుసో, తెలియదో, ఏదైనా తెలుసుకోగలనో తెలియదు. ఇప్పుడైతే నేను భిక్షకురాలిని కూడా కానందున, ఇంక నా గమ్యం మాత్రం ఏమి తెలుస్తుంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన<br>
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 549

షాజహాన్‌పూర్,<br>
15.03.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. **అసలైన జీవితం ఏమిటి? అని ప్రశ్నించుకుంటే జీవితం యొక్క జీవితం తొలగిపోతూ ఉండటమే. ఆ జీవితం నుంచి తొలగిపోవాల్సిన జీవితం ఏమిటి? అది ఏమిటంటే, దానికి 'త్వం' సమకూర్చాలి అనగా 'జీవత్వం' అవుతుంది. ఇప్పుడింక జీవితం ముగిశాక అనగా బ్రతుకులో ఉరుకు–పరుగులు ముగిసిపోయాక కలిగేటటువంటి జీవనం ఏదైతే ఉందో దానిని ప్రాపంచికంగా మరణించటంగానే చెప్పబడుతున్నప్పటికీ దానిని దేవుని దృష్టిలో జీవించి ఉండటంగానే చెప్పటం సమంజసంగా ఉంటుంది.** నేను రావటం, వెళ్ళటం జరిగింది కాని దాని అనుభూతి కలగలేదని నీవు వ్రాశావు. దానినిబట్టి ఆ అసలు జీవితం (Real life) ప్రారంభమైనట్లుగా చెప్పాలి. హృదయం "బాబూజీ, బాబూజీ" అంటూ తపనతో ఆక్రందనం చేస్తూ ఉందని కూడా వ్రాశావు. దీని అర్థం ఏమిటంటే, ఆ తపన (బాధ) ఇంకా మిగిలి ఉన్నది అని, దానివలన ఇంకా అసలు జీవితంలో జీవించవలసి ఉంటుంది అని తెలియజేస్తుంది. అసలు జీవనాన్ని దృష్టిలో పెట్టుకుని "బాబూజీ, బాబూజీ" అంటూ హృదయం ఆక్రందనం చేస్తూ ఉన్నదంటే దానిని బలహీనతగానే భావించాలి. అయితే, నీవు దేనిలోనయితే జీవించాల్సి ఉందో ఆ జీవనానికి ఈ తపన ఒక సాధనం వంటిది.

నీ ఉత్తరంలో మిగతా విషయాలన్నింటికి సమాధానం– సావన్ (జులై) మరియు భాదో (ఆగష్ట్) మాసాలలో వరుసగా ఆకుపచ్చగా గాని, ఎండిపోయి ఉండటంగాని లేనటువంటి నల్ల తుమ్మచెట్టులాగా నీవు అవుతున్నావు.

ఉత్తరంలోని మిగతా విషయాలన్నీ ఇపుడు చాలా ఉన్నత లయ–అవస్థను తెలుపుతున్నాయి. ఇది ఈ విధంగా జరుగుతూనే ఉంటుంది. అది ఒకప్పుడు లయగాను, మరొకప్పుడు తురీయగాను ఉంటుంది.

ఇప్పుడు నేను నీ వృత్తాంతం గురించి లేదా నా స్వంత వృత్తాంతం గురించి వివరిస్తున్నాను. నేను ఇటీవల లఖీంపూర్ వచ్చినప్పుడు నిన్ను '$J_1$' స్థానం మీదకు చేర్చాను. దానిలో యాత్ర ఇంకా బాగా ఆరంభం కాలేదు. కాని దాని చిహ్నాలు పొడసూపుతున్నాయి. దానిలో సూక్ష్మత్వం వృద్ధి చెందుతోంది. వాస్తవంగా, నీ స్థితులను గమనిస్తూ ఉంటూ, నేను ఏమి చేయాలో అది చేస్తాను. ఒక స్థితి నాకు ఎంతగానో నచ్చింది. దానిని చూస్తూ ఉంటే నాకు ఎంతో ఆనందం కలుగుతోంది. అందువలన నీకు కొంత ఆలస్యం అనుభవమవుతోంది. నాకు సంతోషం కలిగించినటువంటి స్థితి ఆ స్థానం మీద వ్యాపించి ఉంది. దానిని ఇంకా చూస్తూ ఉండాలని అనిపిస్తున్నప్పటికీ, ఇప్పుడు దానిలో యాత్ర ప్రారంభింపజేస్తాను.

నాకు చౌబేజీ ఇచ్చిన ఋగ్వేద పుస్తకాన్ని నేను చదివించుకుని వింటున్నాను. దానిలో "సోమ రసం" గురించిన వర్ణన ఉంది. దానిని గురించి విమర్శకులు చేసిన వ్యాఖ్యలతో నేను ఏకీభవించటం లేదు. ఈసారి నేను లఖీంపూర్ వచ్చినపుడు, ఎక్కువమంది అభ్యాసులు సమావేశమైనపుడు, అందరికీ "సోమరసం" త్రాగించాలని నేను నిర్ణయించుకున్నాను. దీనితో నాకు కూడా కొంత అనుభవం వస్తుంది. దేవుడు దయ తలిస్తే ఆ వేదంలో చెప్పబడినటువంటి సోమరసం పానం చేయటం వలన ఎటువంటి ప్రభావం కలుగుతుందో అదే ప్రభావం అందరిపైన కలుగుతుంది. దాని ప్రభావం ఒక వైద్యుని చీటీలాగా (Prescription) అయినట్లయితే, దాని ఉపయోగం ఏమిటో నిరూపితమవుతుంది. కేసర్ మరియు ఠాకుర్ దత్త సింగ్‌తో ఏదైనా (Old dictionary) పురాతన శబ్దకోశంలో ఈ 'సోమ' అనేది బబూల్ అనగా తుమ్మచెట్టుకు సంబంధించినదేమో వెదకమని చెప్పు.

ఋగ్వేదంలో సరస్వతీ మంత్రాలు, అగ్ని, వాయువు మరియు జలం గురించిన మంత్రాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన స్థానాలమీద వాటి శక్తి ఉంటుంది. సరస్వతి స్థానంమీద నేను ఇదివరకే పరిశోధన చేశాను. కనుక దానిలో వివరించి ఉన్న మంత్రాలన్నీ వాటి యొక్క స్థానాలలో శక్తిని సమకూరి ఉంటాయి. ఆ మంత్రాల స్వరంతో ఆ స్థానం జాగృతమవుతుంది. వాటిని పదే పదే ఉచ్చరించినట్లయితే ఆ స్థానంలో ఆధ్యాత్మికయాత్ర పూర్తవుతుంది. నా ప్రసంగంలో ఒకసారి ఇదే విధంగా దీపక్ రాగం (దీని ద్వారా జ్యోతులు వెలిగించబడతాయి) కంఠ చక్రంకు సమీపం నుంచి ఆలాపించబడుతుందని, కనుక అగ్నికి సంబంధించిన మంత్రాలు ఏవైతే ఉన్నాయో వాటి (స్వరం) ధ్వని కంఠచక్రం నుంచే వెలువడుతుందని చెప్పాను. దానిలో ఆధ్యాత్మిక యాత్ర విధానాలు కూడా ఒక్కలాగా ఉండేటట్లుగా నా ఇచ్ఛాశక్తిని వినియోగించాను. నేను కొన్ని మంత్రాలు విన్నాను. వాటి ఫలితం గురించి కూడా నీకు ఎప్పుడో వ్రాశాను. కనుక స్వయంగా వేద అధ్యయనం చేయటం ప్రయోజనకరంగా ఉంటుంది. ఆర్యులు వాక్కును (అనగా స్వరాన్ని) ప్రయోగించారు. అది లక్ష్యానికి చేరుతుంది. నేను గనక వేదాలు అన్నింటిని విని ఉన్నట్లయితే, వేదకాలం నాటి ఋషులు ఎంతవరకు సాధించగలిగారో తెలిపి ఉండేవాడిని.

ఈ ఋగ్వేద గ్రంథాన్ని నాకు పంపించి, నన్ను ఆలోచింపజేసినందుకు చౌబేజీగార్కి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 550

లఖీంపుర్,
24.03.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న హరిదక్షగారు ఇక్కడకు వచ్చారు. వారి ద్వారా 'తమ' గురించిన సమాచారం తెలిసింది. చాలా సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా దశ ఏమిటంటే, దానిలోకి ఆధ్యాత్మిక తరంగాలు (Spiritual waves) అనేవి పొరపాటున కూడా ఎప్పుడూ రాలేకపోతున్నాయి. ఇంతకుముందు నేను ఎంతో మంచి దశలు అనగా నమ్రత, సరళత్వం వగైరా వంటివి వ్రాస్తూ ఉండేదానను. కాని ఇప్పుడైతే ఏ విషయంగాని, ఏ దశగాని రావటమే లేదు. ఇప్పుడు –"మనస్సు స్థిరం, చిత్తం స్థిరం, జ్ఞానం స్థిరం, సకల శరీరం స్థిరం" అనేది లేదు కాని ఇప్పుడు మనస్సు, చిత్తం, శరీరం ఏవీలేవు. ఇప్పుడు అంతా (Uniform) సమత్వం, (Static) చలనంలేని గతియే నా స్వరూపంగా ఉంది. నేను గతంలో లోపల కరగటం అని వ్రాస్తూ ఉండేదానను. ఇప్పుడు ఆ కరగటం కూడా అంతమైపోయింది. ఇప్పుడు అంతా (Homogenous) సమత్వ గతియే. ఇప్పుడు నా 'శ్రీ బాబూజీ' గురించిన ధ్యానం చేసినాగాని దాని ప్రభావం ఏమీలేకుండా ఉంది. ఒక్క క్షణకాలమైనా నేను ఆధ్యాత్మికతకు చెందిన మనిషినని అనిపించటం లేదు. ఇప్పుడు (Stability) స్థిరత్వం కూడా అనుభవం కావటం లేదు. ఖాళీగా ఉంటూనే రేయింబవలు గడచిపోతున్నాయి.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 551

షాజహాన్‌పూర్,
04.04.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీవు వ్రాసిన ఉత్తరం చేరింది. దానికి సమాధానం తర్వాత వ్రాస్తాను. ఈ సమయంలో నాకు తోచిన ఒక విషయం గురించి నీకు వ్రాయాలనుకుంటున్నాను. నేను ఏదైనా విషయం చెబుతున్నానంటే, దానికిగల కారణం ఏమిటో నీవు ఆలోచించాల్సి ఉంది. ఆ విధంగా చెప్పటంలో నా ఉద్దేశ్యం ప్రేమభరితంగా ఉందో లేక అందుకు విరుద్ధంగా ఉందో ఆలోచించుకోవాలి. అలా చెప్పిన దానిలో ఏదైనా ప్రయోజనం ఉన్నప్పుడు అది ప్రేమపూరితంగా ఉన్నట్లుగానే భావించాలి. నేను చౌబేజీగార్కి ఎప్పుడో చెప్పి ఉంచాను. నా జన్మదిన సందర్భంగా 5 రూపాయలకు మించి ఖర్చు చేయవద్దు అని. దానికి ఆయన అంగీకరించారు కూడ. కాబట్టి ఆ విధంగానే ఆచరించటానికి నిర్ణయం తీసుకున్నట్లుగా కూడా చెప్పారు. ఇతరులను కూడా పిలిచి విందు చేయటం ద్వారా కనీసం 50 లేక 60 రూపాయలు ఖర్చుపెట్టి ఉంటారని అమ్మగారి మాటలు, నీ మాటల ద్వారాను గ్రహించాను. ఇది మీకు ఆర్థికంగా ఎంత ఇబ్బందికరమో నీవు బాగా ఆలోచించుకుంటే మంచిది. 5 లేదా 6 రూపాయలతో సరిపెట్టుకోగలిగిన దానికి ఇంతగా ఖర్చుచేయటం ఎంతవరకు సముచితమో ఆలోచించు. నేను ఖర్చు విషయంలో చాలా నిక్కచ్చిగా ఉంటాను. అందుకని ప్రసాదం పంచటం కూడా అవసరంలేదని చెబుతూ ఉంటాను. నా అభిప్రాయం సహేతుకమో కాదో నీవు ఇప్పుడు బాగా ఆలోచించు. దానిని గురించే ఇంత సుదీర్ఘంగా వ్రాయవలసి వచ్చింది. నా గురించి నేను ఒక విషయం వ్రాస్తున్నాను, అది నా ప్రశంసకొరకు కాదు. ఎప్పుడైతే లాలాజీకి **'వారి'** పాదాలను

ఇతరులు స్పర్శించటం ఇష్టంలేదని తెలిసిందో, అప్పటినుంచి నేను **'వారి'** పాదస్పర్శ మానివేశాను. ఎందుకంటే, మనం వారికి అంగీకారమైన విధంగానే ప్రవర్తించాలి. మనలో, నేను కాకుండా మరెవ్వరైనా అభ్యాసీ విషయంలో ఇలా జరిగితే, మీరు చేయవలసిన పని ఏమిటంటే, లాలాజీ కోరికను అనుసరించి వారికి హృదయంలో ఎటువంటి బాధ కలగకుండా చూడాలి. ఏమైనాగాని మీ కుటుంబీకులు ధనం వ్యయం చేయటానికే ఇష్టపడుతున్నట్లయితే, నాకేమీ నష్టం వాటిల్లదు. మీరు అనుకున్నంతగా ఖర్చు చేయండి. దానివలన మీరే ఇబ్బందిపడతారు.

**ఈ విషయం గురించి మళ్ళీ నీవు బాగా ఆలోచించు– ఆధ్యాత్మిక గంగలో మునిగితే ఎక్కువ లాభం ఉంటుందో లేక 'మాయ' నదిలో ఈదుతుంటే లాభమో.** గురు పశువుల్లాగా మీరు నిరూపించబడినట్లయితే అది నాకు చాలా విచారకరమవుతుంది. నా మాటలు మీకు బాధాకరమైనవిగా అనిపిస్తే నేను నా మాటలు ఉపసంహరించుకుంటాను. ఇది గురుమహరాజ్ ఆజ్ఞ కనుక చెప్పక తప్పలేదు. నా యొక్క ఈ మాటల వలన గాని, వ్రాతలవలన గాని మీ మీద ఎటువంటి ప్రభావం కలిగినా, దానిని తప్పించటం నా వశంలో లేదు. అనవసర విషయాలపైన ఎక్కువగా దృష్టిమరల్చటం మంచిది కాదు, కనుక నేను ఈ విషయాన్ని ఇక్కడితో ముగించాలని అనుకుంటున్నాను. నేను ఆ ఉత్తరంలో వ్రాసిన విషయం గురించి నీకు దుఃఖం కలగలేదా? చౌబేజీ, అమ్మగారికి కూడా బాధ కలిగి ఉండవచ్చు. కనుక జన్మదిన సందర్భంగా ఎంత ఖర్చు పెట్టినా సరే నేను బాధపడనని చౌబేజిగారితో చెప్పదలచుకున్నాను. ఎందుకంటే, ఆయన నా ప్రేమను అర్థం చేసుకోలేకపోయారు. నేను దానిని నిషేధించటానికిగల కారణాన్ని కూడా గ్రహించలేకపోయారు. వివేకం ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత ఏమంటే, నేను దానిని నిషేధించటానికిగల కారణం ఏమిటో తెలుసుకోవటం. అలాగే నేను చెప్పినదానిని హృదయపూర్వకంగా ఆమోదించి అమలుపర్చటం జరపాలి. మీ గృహంలో నా జన్మదినోత్సవం జరపటం కారణంగా ఒక క్రొత్త సమస్య ఏర్పడినట్లుగా నాకు అర్థమయ్యింది. అది మీకు దుఃఖం కలిగించింది. నా గురుమహరాజ్ స్వభావం ఎలా ఉండేదంటే, ఎవ్వరైనా అభ్యాసీ **వారి** (లాలాజీ) జన్మదిన సందర్భంగా ఎక్కువ ఖర్చు చేసినట్లయితే, దానిని సహించేవారు కాదు సరికదా అతడిని హెచ్చరించేవారు కూడ. అదే అలవాటు నేను కూడా అలవరుచుకున్నాను. నా నుంచి సలహాను లోతుగా అర్థం చేసుకొని పాటించని కారణంగా కలిగిన అనర్థానికి నాకు బాధ కలుగుతుంది. దాని మూలంగా నేను నా అలవాటు ప్రకారం గట్టి నిర్ణయం తీసుకోవటం తప్పనిసరి అవుతుంది. నేను గట్టిగా నా నిర్ణయం తెలిపినప్పటికీ మీ ఇంటిలో జన్మదినం జరిపినందుకు సిగ్గుపడ్డాను. ఎందుకంటే, దీనిని గమనించినవారు రామచంద్ర తనను పూజించదలచినట్లుగా కోరుకుంటున్నారు అని తలంచకూడదని, ఆ విధంగా ప్రవర్తించాను. ఇకమీదట ఈ విషయం పూర్తిగా నీకే వదిలిపెట్టాలనుకుంటున్నాను. నీవు విచారపడకుండా ఉండే విధంగా నీకు ఎలా తోస్తే అలాగే చేయి. నా ముఖ్య ఉద్దేశ్యం తెలపటానికి, దానికిగల కారణాలన్నింటిని విపులంగా పైన వ్రాశాను. ఈ విషయాలను చౌబేజీకి, అమ్మగార్కి కూడా తెలియజేయి. చౌబేజీ ఇప్పటికీ సంతృప్తి చెందలేకపోయి నట్లయితే వారికి వేరే ఉత్తరం వ్రాసి నన్ను క్షమించమని కోరతాను. నేను చెప్పిన దానివలన కలిగిన ప్రభావం కొంతవరకు తొలగిపోయింది కాని, నీవు, చౌబేజీ, అమ్మగారికి కూడా దీని ప్రభావం పూర్తిగా తొలగిపోవాలని లాలాజీని ప్రార్థించినపుడే పూర్తిగా తొలగిపోవటం జరుగుతుంది. దానితో నా హృదయం కూడా సహకరిస్తుంది. ఇంకా ఏదైనా దోషం మిగిలినట్లుగా అనిపిస్తే, చౌబేజీ నాకు వ్రాసినట్లయితే దానిని కూడా నిర్మలీకరణ చేస్తాను.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 552

లఖీంపూర్,

13.02.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. తమకు కొద్దిగా శ్వాసకు చెందియున్న ఇబ్బంది ఇప్పుడు తొలగిపోయిందని ఆశిస్తున్నాను. తమరు సదా ఆరోగ్యంగా ఉండాలని ఈశ్వరుని ప్రార్థిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నా దశ ఎటువంటిది అంటే, (Vibration) ప్రకంపనం అనేది ఎంతమాత్రం లేదు, (Knowledge) జ్ఞానంగాని, (Intelligence) తెలివిగాని లేవు. శ్రీ బాబూజీ ఆత్మలో నేను ఏకమైపోయి ఉంటూ వస్తున్నానని, అదే నా స్వరూపంగా అవుతూ ఉందని నాకు అనిపిస్తోంది. నా ఈ దశలో నిద్ర, ఆకలి, దాహం, శ్వాస, ప్రాణం ఏవీ కూడా నన్ను చేరటం లేదన్నట్లు ఉంది. గతంలో నేను, నాకు ఒక ఆత్మ తప్పించి ఏమీ కనిపించటం లేదని వ్రాస్తూ ఉండేదానను. అయితే ఇప్పుడు ఈ దశలో ఆత్మగాని, మరేదీకాని తెలియకుండా ఉంది. ఇంతకుపూర్వమైతే నాకు ప్రతి మనిషిపట్లగాని, వస్తువుపట్లగాని దేనితోనైనా శరీరానికి కౌగిలించుకోవాలను ప్రేమ ఉండేది, కాని ఇప్పుడు నాకేమీ కనిపించటం లేదు సరికదా నాకు దేనిపట్ల ప్రేమ అనేదే లేకుండా ఉంది. ఇప్పుడు ఈ దశలో, నాకు ఏమైనా కనిపిస్తున్నట్లుగాని, ఏదైనా అనుభూతి ఉన్నదా, లేదా అనిగాని తెలియకుండా ఉంది. స్థితి మాత్రం చాలా శుభ్రంగా ఉంది. శరీరం నడుస్తున్నదో లేక నిలకడగా ఉన్నదో కూడా తెలియటం లేదు. బాబూజీ, దశను గురించి నేనైతే ఏదో చెప్పానుగాని దశ ఎలాంటిది అంటే, దానిలో ఎటువంటి పరదా (చాటు)గాని, బంధనంగాని, మరేమీగాని లేవు. దీనిని నగ్నమైనదిగా చెప్పవచ్చు. బాబూజీ ఆత్మలో మునిగిపోయి, 'వారి'లో వ్యాపించిపోయినట్లుగా అనిపిస్తోంది.

ఇది నా స్వరూపంగా అయిపోయిందని, ఏదో ఒకటి అయిపోయిందని వ్రాయటానికైతే వ్రాస్తున్నానుగాని ఇప్పుడు చూస్తూ ఉంటే, స్వరూపం ఉన్నది ఉన్నట్లుగానే ఉందనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడు బకా అంటె బకాయే (లయావస్థ) ఉంటోంది కాని ఫనా (లయావస్థ యొక్క ఉన్నతస్థాయి) మాత్రం ఎంతకూ రావటం లేదు.

తమరు నా యందు దయ ఉంచి నన్ను '$J_1$' పాయింట్‌కు చేర్చారు. నామీద అంతటి దయ చూపించిన తమరికి నేను ఎలా ధన్యవాదాలు చెప్పాలో తెలియటం లేదు. నేను అందుకు యోగ్యురాలిని కూడా కాదు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 553

లఖీంపూర్,

16.03.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు దశ పూర్తిగా ఖాళీగా ఉంది. ఇదనీ లేదు, అదనీ లేదు, ఖాళీదశకు శబ్దాలు కూడా ఖాళీగానే ఉన్నాయి. అనగా మాటలు లేవు. పూర్వం నేను సర్వవ్యాపక దశను గురించి వ్రాస్తూ ఉండేదానను కాని ఇప్పుడైతే సర్వవ్యాపకం అనిగాని, ఇంకేమైనా అనిగాని చెప్పినా కూడా ఎలాంటి ప్రభావమూ ఉండటం లేదు. నేను ఏమి చూస్తున్నానంటే, ఏ రూపంగాని, రంగు గాని అలాగే ఎలాంటి నడతగాని, మిట్టపల్లాలుగాని, ఎటువంటి సారం గాని

లేవు. అందులో ఏ రహస్యమూ దాగి ఉండలేదు. ఇప్పుడు ఈ దశలో బహుశా ఈశ్వరుడు సర్వవ్యాపి కూడా కాదనుకుంటాను. 'అతని'లో కరుణ, దయ అని ఏవైతే ఉన్నట్లుగా చెప్పబడుతాయో, అవేమీ 'అతని'లో లేనట్లుగా నేను చూస్తున్నాను. 'అతడు' కూడా పూర్తిగా ఖాళీగానే ఉన్నాడు. నా బాబూజీకి ఎలాంటి స్వరూపం లేదని, ఎటువంటి పేరు లేదని నాకు ఇప్పుడు అనిపిస్తోంది. ఆత్మ వంటిది కూడా ఏమీలేనట్లుగాను, ఏమీ ఉండవన్నట్లుగాను ఉంది. శరీరం యొక్క కణకణం కూడా ఖాళీగానే ఉన్నట్లు అనిపిస్తోంది. వెన్నెముకలో శిరస్సు వరకు ఉన్న రెండు నరాలుతప్ప (రక్తనాళాలు) ఇంకేమీ లేవన్నట్లుగా అనిపిస్తోంది. అన్ని చిక్కులు సమాప్తమైపోయినట్లుగా అనిపిస్తోంది.

నాకు ఇప్పుడు శరీర నిర్మాణం యొక్క శీల ఊడిపోయినట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు నాకు దీని నిర్మాణం కూడా అనుభవానికి రావటంలేదు కాని ఇది కూడా ఒక సమత్వ దశలో కలిసిపోయి సమానంగా అయిపోయినట్లుగా అనిపిస్తోంది. ఇదివరకు ఒక హృదయం ఉండి దానిలో బాబూజీ విరాజిల్లుతూ ఉండేవారు మరియు అదే వారిని పిలుస్తూ ఉండేది. కాని ఇప్పుడైతే ప్రతికణమూ ఒక హృదయంగా అయిపోయి వారిని పిలవసాగాయి. అయితే పిలుపులో ధ్వని లేదు, ప్రేమ కూడా లేదు. ఇలా ఉంది ఈ దశ. అదేమిటో దైవానికే తెలియాలిగాని, నా చెవుల్లో "బాబూజీ! బాబూజీ!" అను క్షీణస్వరం వినిపిస్తోంది. ఇపుడు నాకు హృదయం యొక్క అనుభూతి కూడా తెలియకుండా ఉంది. నేనైతే పిలవటం లేదు కాని ఎక్కడి నుండో "శ్రీబాబూజీ! శ్రీ బాబూజీ!" అను పిలుపు నా చెవులకు సోకుతున్నట్లు గమనిస్తున్నాను. అన్నివైపులా నాకు ఖాళీగానే ఉన్నట్లు అనిపిస్తోంది. ఎందుకంటే, ఎక్కడా పిలుపుగాని, ధ్వనిగాని లేవు. ఇప్పుడు ఎలా ఉందంటే, నా దశను ఉందనిగాని, లేదనిగాని చెప్పటానికి తగిన ఆధారం ఏమీ నావద్ద లేదు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 554

షాజహాన్‌పూర్,
12.04.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీవు వ్రాసిన ఉత్తరం అందింది. నా జన్మదిన సందర్భంగా ఇంతగా ఖర్చు చేయవలదని ఎందుకు నిషేధించానో మీరు గ్రహించి ఉంటారని విశ్వసిస్తున్నాను. ఒకవేళ ఎవ్వరైనా ఎక్కువ ధనం వెచ్చించినప్పటికీ నాకు పోయేది ఏమి ఉండదు. కాని నా మూలంగా మీ ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుందను వ్యథ నాకు కలుగుతుంది. కనుక ఆ పనిని తీవ్రంగా నిషేధించాను. ఇప్పుడు నేను ఇస్తున్న ఉదాహరణ ఈ సందర్భంలో అప్రస్తుతమే కావచ్చును కాని వివరిస్తున్నాను. ఒక కుర్రవాడు ఎవ్వరైనా దాతృత్వంతో ఈ విధంగా ధనం ఖర్చుపెట్టినట్లయితే అతని తల్లిదండ్రులకు, తదితరులకు ఆ కారణంగా ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు కలుగుతాయో ఊహించవచ్చు. అంతేకాదు అటువంటి ధార్మికత పాపభూయిష్టమవుతుంది కూడ. అతని బాధ్యత వహిస్తున్న వారందరికీ ఈ కుర్రవాని మూలంగా ఆర్థిక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఆ ధనంమీద ఇతరులకు హక్కు ఉన్నప్పుడు దానిని దానధర్మాలమీద వ్యయపరచటం పూర్తిగా పాపకార్యమే అవుతుంది. దానివలన అందరికీ ఆర్థిక ఇబ్బందులు కలుగుతాయి.

**నా గురుమహరాజ్ నాకు ఒక మంచి మాట చెప్పారు. అదేమిటంటే, విగ్రహారాధన లేదా మూర్తిపూజ అంటే అది కేవలం ఒక రాతిని పూజించటమే కాదు, ఏదైనా ఒక అలవాటుకు బానిసగా అయిపోవటం కూడా మూర్తిపూజయే అవుతుంది.** ఇంకొక విషయం ఏమిటంటే, మన ఆలోచనలు లేదా కోర్కెలు సాధించుకోవటంలోనే మనం నిమగ్నమై ఉన్నప్పుడు, దానికి విరుద్ధంగా ఏదైనా సందర్భం వచ్చినపుడు అది వ్యథ కలిగిస్తుంది. ఇటువంటి వారే స్వార్థపరులుగా గుర్తించబడతారు. దీనినిబట్టి వారు 'మాలిక్'పట్ల భక్తితో ఆనందిస్తున్నారని చెప్పలేము. వారిని గురు అభీష్టంగా

అనుసరించేవారనీ చెప్పలేము. ఈ పనిలో ఎవ్వరైనా ఎంతగా ముందుకు వెళ్తే అంతగా దైవంతో స్థిరపడలేదని చెప్పాల్సి ఉంటుంది. 'మాలిక్'ను సంతోషపరిచే విధంగా మనం ప్రవర్తించాలి. దానివలన మనకు ప్రయోజనం చేకూరి, దైవంతో మన సంబంధం ధృడతరమవుతుంది.

నాలో కూడా చాలా చెడు అలవాట్లు ఉన్నాయి. ఉదయం ఆలస్యంగా లేవటం ఒకటైతే, రెండవది హుక్కాను పీల్చడం. ఇది అందరికీ తెలిసినదే. ఇంకా నాకు తెలియని చెడు అలవాట్లు చాలా ఉండి ఉండవచ్చు. ఇతరులు ఎవ్వరైనా వాటిని నా దృష్టికి తెచ్చినపుడు తెలుస్తుంది. నాలో ఉన్న ఒక లోపం– నేను తీవ్రవాదిగా (ఆధ్యాత్మికంగా) తప్పక చెప్పితీరతాను. ఇంక ఆధ్యాత్మిక దృక్పథం యొక్క ఆలోచన కలిగి దానిలో ఏకాగ్రతతో నిమగ్నమైనట్లయితే, దానిని ఇవ్వనంతవరకూ నాకు మనశ్శాంతి ఉండదు. అదే కాకుండా నేను ఏదైనా విషయాన్ని తీవ్రంగా పరిగణించినప్పుడు, దానిలోనే గాఢంగా నిమగ్నమైనప్పుడు ఆ పని పూర్తికానంతవరకు మరిదేనిమీదకు నా దృష్టిని మరల్చను. కనుక నీ విషయంలోను, ఇదే జరిగింది. నీవు సంజాయిషీ చెప్తూ వ్రాసిన ఉత్తరం నన్ను చేరేసరికే, నేను నా బాణం (లేఖ) సంధించటం జరిగిపోయింది. ఇప్పుడు నీవు నిరాశ చెందవద్దు. నేను ఇప్పుడు ఈ విషయం అంతా నీకే వదిలివేశాను. నీవు 5 రూపాయలు లేదా అంతకంటె ఎక్కువగా గాని ఖర్చు పెట్టినా నాకు అభ్యంతరం ఉండదు. ఇది నన్ను వివశుణ్ని చేసింది. నా ఆలోచన ఈ విషయంలో తీవ్రరూపం దాల్చింది. దానివలన మీరందరూ పొందవలసిన దైవకృపకు పరిమితి / ఆంక్ష ఏర్పడింది. ఈ కారణంగా నేను నీకు ఉత్తరంలో ఈ పరిమితిని తొలగించుకోవటానికి 'లాలాజీ'ని మీరందరూ ప్రార్థించమని వ్రాశాను. నేను కూడా ప్రార్థన చేసాను, ఇంకా చేస్తాను కూడా. కాని ఇప్పటికి అది పూర్తిగా తొలగిపోలేదు. జన్మదినం జరపవలసిందిగా లాలాజీ నిర్దేశించినందున, అది జరపాల్సి వచ్చింది కాని, లేకపోతే మీ అందరికీ జరపవద్దని ఆదేశించి ఉండేవాడను.

ఇప్పుడు నా మనస్సులోను, హృదయంలోనూ ఇంకొక ఆలోచన కలిగింది. ఇప్పుడు ఉన్న కాలం, ఆనాడు శిష్యులు గురువుకు నివేదించుకున్నటువంటి కాలం కాదు. కనుక ఈ కాలాన్ని గమనించి దానికి అనుగుణంగా, గురువు అయినవారే శిష్యులకు నివేదించుకునే విధంగా మార్పు చేయాల్సి ఉంటుందేమో అను ఆలోచన నన్ను వివశుణ్ని చేస్తోంది. లాలాజీ సాహెబ్ నుంచి దీని ఆచరణకు మార్గం తెలుసుకొని ఈ విధానాన్ని మార్పు చేయాలని అనుకుంటున్నాను. దీని మూలంగానే నేను చౌబేజీని, అమ్మను క్షమాపణ కోరాను. లాలాజీ దానికి ఇష్టపడితే, నా దృష్టిలో ఈ మార్పులే మంచిదనిపిస్తోంది. చౌబేజీని, మాస్టర్ సాహెబ్‌ను కూడ వారి అభిప్రాయం ఏమిటో తెలుసుకుంటాను. నేను ఎవ్వరిని గురించి కూడా అసంతృప్తికరంగా లేనని నీకు విశ్వాసం కలిగిస్తున్నాను. ఒక్కసారిగా ఈ విషయం నా మనస్సును హత్తుకొని తీవ్రమై, అమలుపర్చాను. అది నాకు తెలిసి ఉండియే జరిగింది.

చౌబేజీ మరియు అమ్మకు ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 555

లఖీంపూర్,
21.03.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ బాగానే ఉన్నారు. తమరు కూడా అక్కడ క్షేమంగానే ఉన్నారని ఆశిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఎటువంటిది అంటే, నేను ప్రతికణం అని వ్రాస్తున్నాను. కాని కణకణం యొక్క అనుభూతి కలగటం లేదు. ఇప్పుడు ఈ దశలో నేను ఎప్పుడూ పుట్టి ఉండలేదని, పుట్టబోననీ అనిపిస్తోంది. స్నానం చేయటం, భోజనం చేయటం, రూపం, రసం, వాసన మరియు స్పర్శ –ఇవన్నీ ఎప్పుడూ కలగటం లేదనిపిస్తోంది. స్నానం చేస్తూ ఉంటే, నీటి యొక్క స్పర్శ కూడా నాకు కలగటం లేదు. అలాగే వాయువు యొక్క స్పర్శ కూడా ఉండటం లేదు. శ్వాసక్రియ అయితే జరుగుతోంది కాని, శ్వాస అనేది నన్ను చేరటం లేదు. నేను ఉన్నానో లేదో ఆ దైవానికే తెలియాలి. అంతేగాక ఈ స్థితి నాకు మాత్రమే కాకుండా అందరి విషయంలోను ఇలాగే అనిపిస్తోంది. ఇప్పుడు మరపుదశ ఉంటోంది కాని అది ఇక్కడిదో లేక అక్కడిదో తెలియదు. ఎటువంటి సమాచారం తెలియటం లేదు. నేను నా గత ఉత్తరంలో ఖాళీదశ గురించి వ్రాశాను. కాని నేను ఇప్పుడు దానిని కూడా మరచిపోయినట్లుగా గమనిస్తున్నాను. ఖాళీతనం గురించిన అంచనా కూడా నాకు ఇప్పుడు కలగటం లేదు. ఆ బహిరంగ మైదానం మాయమైపోతూ ఉండగా నేను ఎక్కడికి వెళ్ళానో తెలియటం లేదు. పూర్తిగా నమ్రతతో కూడిన దశగా ఉంది. శిరస్సు వెనుక ఏదో వ్యాపించి ఉన్నట్లుగాను, దానిలో ఆ దశయే విస్తరించి ఉన్నట్లుగాను, అది చాలా తేలికగా ఉన్నట్లుగాను నాకు అనిపిస్తోంది. అది (దశ) లోలోపలే విస్తరించి ఉన్నట్లుగాను, అయితే దాని ద్వారం ఇంకా తెరుచుకోలేదు అన్నట్లుగాను నేను చూస్తున్నాను. దశ అయితే దాని బయట కూడా వ్యాపిస్తూ ఉంది.

బాబూజీ, ఇప్పుడు నా దశను గురించి ఏమని వ్రాయమంటారు. శుష్కించిపోయిన అస్తికల నుంచి రసం పిండుతున్నాను. మరింక ఆ శుష్కించిపోయిన అస్తికల దశను గురించి ఏమి వ్రాయమంటారు. ఇప్పుడు ద్వైతంగాని, ఏకత్వంగాని అనుభూతికి రావటం లేదు. నాకు అంతా సామ్యావస్థగానే అయిపోయింది. అయితే ఇప్పుడు ఈ శుష్కించిన ఎముకల్లో రసం లేదు, కేవలం 'మాలిక్' యొక్క జ్ఞాపకంలోనే ఆనందం యొక్క రుచి కలుగుతోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్పుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 556

లఖీంపుర్,
29.03.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. తమ ఆరోగ్యం ఇప్పుడు బాగుందని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఎక్కడైతే 'తనం' అను దానికి ప్రదేశం లేదో అటువంటి స్థానం నా ఆధ్యాత్మిక యాత్రకు చెందినదిగా గ్రహిస్తున్నాను. అది ఎందుకు అంటే, ఖాళీ లేక శూన్యం లేదా సున్నా (జీరో) దశ అని దేనినైతే నేను వ్రాస్తున్నానో, దానికి 'తనం' అనేది జోడించగానే దశ (Dull) నిస్తేజమైనదిగానో లేక (Heavy) భారమైనదిగానో అవుతోంది. ఇప్పుడు లోపల, బయట, కణకణంలోను, యావత్తు శరీరం యొక్క అణువణువులోను ఒక విచిత్రమైన నమ్రత వంటి దశ ఏర్పడుతోంది. శరీరం అని నేను వ్రాయటానికైతే వ్రాశాను కాని, కాకపోతే అంతటా ఈ ఒక్క వాతావరణమే ఏర్పడిపోయింది. శరీరమైతే వాతావరణంలోనో లేదా గాలిలోనో కలిసిపోయింది. అది ఎలా అంటే, పరిపూర్ణ దశ యొక్క వాతావరణమే ఇప్పుడు నాకు అనుభూతికి వస్తోంది కాని ఇంకేమీ కాదు. ఈ దశను వాతావరణం అని చెప్పటం కూడా తగదు అనుకుంటాను. ఎందుకంటే, ఒకవేళ నేను దశనే వాతావరణం అని చెప్పితే ఊపిరి కూడా

సలపనటువంటి వత్తిడి వంటిది కలుగుతోంది. అయితే నా దశ ఇటువంటిదిగా ఉంది కనుక దానిని కేవలం దశ అని మాత్రమే చెబుతున్నాను కాని, ఇంకేమీ చెప్పను.

నా దశ ఎలా ఉందంటే, ఎటువంటి వాతావరణం నాకు ఎప్పుడూ అనుభవానికి కూడా రావటం లేదు. అదేదో దైవానికే తెలియాలిగాని, శరీరంలో చైతన్యమే లేకుండా పోయింది. ఇంతేగాదు, అసలు నా స్వరూపమే పూర్తిగా చైతన్యం లేకుండా అయిపోయింది. బహుశా అందుకే నాకు చైతన్యం, అచైతన్యం అంటే ఏమిటో కూడా తెలియటం లేదు. అయినా కూడా నా స్థితిలో ఉదాసీనత లేదు, ఏకాంతమూ లేదు. కాని ఇప్పుడు మాత్రం పూర్తిగా అచైతన్యంగా అయిపోయింది. పైనుంచి నాతో చైతన్యవంతం కావించబడటం లేదు. అందువలన నా స్వభావం యొక్క గాంభీర్యాన్ని మార్చలేకపోతున్నాను. ఎందుకంటే, నాకు ఎటువంటి కోరిక కలగటం లేదు. స్వభావం కూడా పూర్తిగా అచైతన్యంగా అయిపోయింది. ఇప్పుడు దశలో సమానత్వం (సమత్వస్థితి) గాని మరేమీగాని లేదు. దశను గురించి ఏమైనా చెప్పటం గాని, చెప్పకపోవటం గాని పూర్తిగా వ్యర్థం లేదా సమానం అవుతుంది. నేను అచైతన్యం అని వ్రాశానుగాని ఈ దశ ఏమిటో దైవానికే తెలియాలి. అసలు నేను మాట్లాడుతున్నానో లేక మౌనంగా ఉంటున్నానోగాని, ఏదైనా ధ్వనిగాని, మాటలుగాని లేకపోతున్నాయని తెలియటం లేదు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 557

లఖీంపుర్,
11.04.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తామందరి సమాచారం తెలిసింది. 'తమకు' ఉదయం, సాయంత్రం ఒక గంట చొప్పున ఉబ్బసం తిరగబెట్తోందని తెలిసింది. ఈశ్వరుడు దీనిని త్వరగా నయంచేయుగాక! 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా ఈ దశలో నాకు ఎవ్వరూగాని, ఏమీగాని లేనట్లుగా అనిపిస్తోంది. నేను లేను, ఇంకెవ్వరూ లేరు. ఇప్పుడు రాకపోకల (జనన మరణాల) అందోళనా లేదు, శాంతి కొరకైన చల్లదనం లేదు. ఏది ఉందో అది లేకపోయినా 'ఉన్నది' అని అంగీకరించియే ఏమైనా చెప్పాల్సి ఉంటుంది. ఇంకా చెప్పాలంటే, నేను దశను గురించి ఏదైనా చెబుతున్నప్పుడు కూడా దశను ఉన్నది ఉన్నట్లుగా అనుభూతి చెందుతున్నాను. నా దశ ఎలా ఉందంటే, ఏదైనా తయారు చేయటమన్నా, చెడగొట్టటమన్నా ఏదీ నాకు అనుభూతికి రావటంలేదు. నన్ను ఎవరైనా తయారుచేసి ఉండనపుడు, చెడగొట్టటం లేదా పతనం చేయటం ఏమి ఉంటుంది. ఇప్పుడు నా దశా క్షేత్రానికి 'మాటలేదు' అని చెప్పటమే భావ్యంగా ఉంటుంది, అప్పుడింక చెప్పటానికి ఏమీ ఉండదు.

బాబూజీ, ఇప్పుడు నా దశలో, బీజం కూడా నశించిపోయింది. నా లోపల ఉన్నది ఏమిటంటే, ఎన్నడూ ఎటువంటి బీజమూ చల్లనటువంటి పృధ్విగా ఉంది. హృదయం నిస్సారంగా ఉంది. దశ కూడా నిస్సారంగా ఉంది. అన్నీ కూడా యధాతథంగా ఉన్నట్లు అనిపిస్తోంది. నాకు ఏమైందో అర్థం కావటం లేదుగాని, అనుక్షణం, ప్రతివస్తువూ ఏదైతే స్థిరంగా ఉన్నట్లు అనిపించేదో, అటువంటిది ఇప్పుడు స్థిరత్వం అనేది ఏమిటో తెలియనిదిగా ఉంది, ఇంకేమీ లేదు. దేనినైతే నేను యధాతథంగా ఉన్నట్లుగా వ్రాస్తూ ఉండేదాననో, అది కూడా ఇప్పుడు ఏమీ తెలియటం లేదు. ఇప్పుడు నా స్థితి ఏమిటంటే, నాకు ఏమీ తెలియటం లేదు, ఏ విషయం కూడా తెలియటం లేదు. అయితే నాకు ఏదైనా తెలుసుననిగాని, తెలియదు అనిగాని తెలియనటు వంటిది కూడా జ్ఞాపకం ఉండటంలేదు. ఎటువంటి

శూన్యత్వానికి కూడా చోటులేనటువంటిదిగా నా దశ ఉంది. శూన్యత అని చెబుతున్నాను అంటే అది పైకి చొచ్చుకు వచ్చి మరొక విషయంగా అయిపోతోంది. కాని స్థితి స్థితిగానే ఉంది. అంతేగాని నాకు మరొక మాట తెలియదు. ఈ దశలో నాకు అసలు నాలో (Creative Power) సృజనాత్మక శక్తియే లేనట్లుగా అనిపిస్తోంది. నేను అందుకు ప్రయత్నం కూడా చేయటంలేదు, ఎందుకంటే, 'మాలిక్' ఇష్టమే నా ఇష్టంగా ఉంటుంది. ఈ విషయంలో బాబూజీ కృప ఎంతగా ఉందంటే, నాలో ప్రయత్నించగల ప్రేరణ లేకపోయినా గాని నా మనస్సుపై నాకు ఎటువంటి పట్టు ఉంచారంటే, దానిని అనగా ఆ ప్రేరణ తమ మనస్సును అతిక్రమించిపోకుండా ఉండేటట్లుగా చేశారు. ఇప్పుడు నాలో నిర్మించే శక్తిగాని, నశింపుజేసే శక్తిగాని లేవు. ఎప్పుడైతే శక్తి లేకుండా పోయిందో, అప్పుడు (Powerlessness) అశక్తి (శక్తి లేకుండా ఉండటం) యొక్క జాడ కూడా లేకుండా పోయింది. ఇదేమిటోగాని, ఇప్పుడు ఏ మానవుడైనా నా కంటె ఆధ్యాత్మికంగాను, శారీరకంగాను బలవంతుడుగా అనిపిస్తున్నాడు. బహుశా అందుకు మనస్సులో కొంత (Inferiority complex) తక్కువ అను భావం ఏర్పడి ఉంటోంది. అయినా కూడా, ఎప్పుడైనా ఉపన్యసించినా లేదా ఆధ్యాత్మిక విషయాలు చర్చిస్తూ అందులో నిమగ్నమైనపుడు నేను 'మాస్టర్'ను అనగా ఆధిపత్యం కలిగి ఉన్నట్లుగా అనిపిస్తుంది. అనగా ఆ సందర్భంలో ఆ దశలో (Mastery) ఆధిపత్యం వస్తుంది. అది ముగిసిపోయాక మళ్ళీ యథాస్థితియే ఉంటుంది. 'మాలిక్' యొక్క ప్రేమ కోసం ఆర్తితో ఉంటాను. అది లోపల దాగి ఉంటుందో లేక ఇంకోరకంగానో నాకు తెలియదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్తూతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 558

షాజహాన్‌పూర్,
13.04.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. ఇంతకుపూర్వం నేను ఒక కవర్‌ను పోస్టు చేసాను. దాని తర్వాత నీ ఉత్తరం 11.04.1956వ తేదీది చేరింది. దీనికి జవాబుగా, చౌబేజీ మరియు అమ్మపట్ల నేను కోపంగాలేను; కోపగించుకోవాల్సిన ప్రశ్న ఎక్కడ ఉంది? అని, క్రితం ఉత్తరంలోనే వ్రాశాను. నేను ఒక నియమం ప్రకారం ఖర్చు తగ్గించుకోవాలని అంటున్నాను. మాస్టర్ సాహెబ్ కూడా స్వయంగా దానిని అర్థంచేసుకోలేక మీతో ఆ విధంగా చెప్పి ఉంటారు. దీనికిముందు ఉత్తరంలో నేను ఈ విషయం వ్రాశాను. దానికి అర్థం ఏమిటంటే, ఈ విధంగా షరతులు చెప్పటంవలన దైవకృప మీ అందరి మీద వర్షిస్తుంది. ఒకవేళ 5 రూపాయలకు మించి ఖర్చు చేయటం మూలంగా ఏదైనా లోపం జరిగినట్లయితే ఆ దోష ప్రభావం తొలగిపోవటానికి ప్రార్థన చేయాల్సి ఉంటుంది. దానికిగాను నా హృదయం నుంచి ఈ ఆలోచన తొలగిపోయేట్లు చేయమని మీరు లాలాజీ సాహెబ్‌ని ప్రార్థించండి. ఈ విషయాలన్నింటినీ నేను నా గత ఉత్తరంలోనే స్పష్టం చేశాను కనుక నీవు విచారించాల్సిన పని లేదు. నీవు గత ఉత్తరాన్ని క్షుణ్ణంగా ధ్యాస నిలిపి చదివినట్లయితే నీ మనస్సు కుదుటపడుతుంది. ఇంకా ఏమైనా సందేహం ఉన్నట్లయితే నాకు వ్రాయి. నేను కూడా మనిషినే గనుక, భావోద్వేగంతో ఆ విధంగా వ్రాసి ఉంటానని అర్థం చేసుకోవాలి.

చౌబేజీ మరియు అమ్మకు ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 559

లఖీంపుర్,

16.04.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం నిన్న చేరంది. చదివి చాలా సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, 'మాలిక్'తో నా ఆంతరిక సంబంధం లేదా అంతరిక్ష (అనగా దైవీయ ఆంతరికం) సంబంధం కల్పించుకుంటూ ఉన్నాను. కాని ఇప్పుడు ఎటుచూసినా కూడా, ఆ సంబంధం తెరుచుకున్నట్లుగాని, కలుపుకుంటున్నట్లుగాని ఉండటం లేదు. అంతా సమానమైన దశయే వ్యాపించి ఉన్నది. దశ ఎంత తేలికగా ఉందంటే, అది చెప్పటం వరకేగాని, లేదంటే దానిలో ప్రాణమే లేదు. బహుశా అందుకేనేమో, నా ఆలోచనలు, పనులు మరియు బుద్ధి (జ్ఞానం) కూడా స్థితితో కలిసిమెలిసి ఉంటున్నాయి లేదా దశలో లయమై ఉంటున్నాయి అన్నట్లు చూస్తున్నాను. అందుచేత నాకు వీటి అనుభవం కూడా ఎప్పుడూ కలగటం లేదు. ఇప్పుడు ఎటువంటి దశ ఉందంటే, ఏ స్థితి కూడా నా అనుభవంలో ఉండటం లేదు, ఊహకు కూడా అందటం లేదు. ఆఖరికి స్థితి ఎలా ఉంటుంది అనేది కూడా తెలియకుండా ఉంది. ఇప్పుడు బిందువూ లేదు. సాగరమూ లేదు. ఇక్కడ ప్రారంభం, సమాప్తం కూడా లేవు. ఇప్పుడు ఉన్న దశలో ఎన్నడూ రవ్వంత క్షోభ కూడా ప్రశ్నించడానికి లేకుండా ఉంది. అందువలన స్పందన యొక్క ప్రశ్న కూడా ప్రశ్నార్థకంగానే ఉంది (అనగా వాటి జాడ కూడా లేదు అని). ఇప్పుడు దశ ఏమిటంటే, అనుభూతి కూడా అంతులేకుండా పోతోంది. బకా లేదా తురీయ అని చెప్పటం కూడా స్థితిలో ఒక శూన్యత (.)కు సమానంగా పైన మరియు వేరైన అస్థిత్వం ఉంటోంది. అది నా స్థితితో కలయిక లేకుండా ఉంటోంది. ఇంకా ఏమిటంటే, (ఫనా) లయ లేకుండా బకా (అనగా దాని ఉన్నత స్థితి) ఎలా వస్తుంది, ఏమీలేకపోయాక (అనగా స్థితియే లేకపోయిన) ఫనా అనగా లయ మాత్రం ఎక్కడ నుండి వస్తుంది- అని ప్రశ్నించుకోవాల్సి వస్తోంది. ఇప్పుడు దశ ఎటువంటిది అంటే, గుప్పిట మూసినా కూడా అందులో అంతా ఖాళీయే ఉన్నట్లు (అనగా శూన్యం) ఉంది. స్థితి ఎటువంటిదో తెలియకుండానే నేను నా స్థితిని వ్రాస్తున్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్పుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 560

లఖీంపుర్,

22.04.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తమ సమాచారం తెలిసింది. తమ ఉదర సంబంధ బాధ తెలిసి అందరం విచారించాము. తమ బాధ అతిత్వరగా నివృత్తి కావాలని దైవాన్ని ప్రార్థిస్తున్నాము. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నిన్న రాత్రి గం. 9 లేక గం. 9-30 కు ప్రార్థన తర్వాత అభ్యాసు లందరిచేత ధ్యానం చేయిస్తుండగా నాలో చాలా విచిత్రమైన విషయం ఏర్పడింది. అయినా కూడా దానిని గురించి నేను చెప్పలేను. బహుశా తమరు, నన్ను '$J_1$' నుంచి పై పాయింట్‌కు చేర్చి ఉంటారు. అది కూడా నేను చెప్పలేను. ఈరోజు, నా స్థితి కూడా నా చేజారిపోయినట్లు

అనిపిస్తోంది. ఇప్పుడు ఎలా ఉందంటే, ఒక పనిలేని మనిషికి తను పనిలేక ఖాళీగా కూర్చున్నట్లు తెలియనటువంటి స్థితిగా ఉంది. నాకు ఇప్పుడు అసలు పనే లేకుండా పోయింది అన్నట్లు ఉంది. ఇంటి పని అంతా సక్రమంగా చేస్తున్నాను, కాని దశ మాత్రం పని ఏమీలేనట్లుగా అనిపిస్తోంది. అదేమిటో గాని, పూజ (ధ్యానం) చేస్తూనే ఉన్నాను, అలాగే చేయిస్తూనే ఉన్నాను, మాట్లాడుతూనే ఉన్నాను కాని, రాత్రి పగలు ఎప్పుడు కూడా తేలికదనం అనేది కలగటం లేదు. **ఈ రోజు నాకు ఏమి అనిపిస్తోంది అంటే, ఒక పాయింట్ అనే కాకుండా ఏదో రీజియన్‌కు అనగా ప్రాంతానికి ప్రాంతమే ఒక్క గుటకలో మింగేసినట్లుగాను, జీర్ణించుకున్నట్లుగాను, తర్వాత ఇప్పుడు అది కూడా తెలియనట్లుగాను అనుభవమవుతోంది.** ఖాళీస్థితి లేదా శూన్యస్థితి అని ఏదైతే వ్రాస్తూ ఉండేదాననో, ఇప్పుడు దాని మైదానమే కోల్పోయినట్లుగా ఉంది. సమస్త వ్యాప్తి లేదా యోచనా శక్తి లేదా స్థితి, లోపల బయట, అన్నీ కూడా నాకు మింగుడైపోయినట్లుగా అనిపిస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్తుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 561

లఖీంపుర్,

30.04.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఒక ఉత్తరం తమకు వ్రాశాను. అక్కడ తమరందరూ కుశలమేనని భావిస్తున్నాను. ఇప్పటివరకు తమ నుంచి ఏ ఉత్తరమూ రాలేదు, బహుశా తమరు ఏదో ముఖ్యమైన పనిలో నిమగ్నమై ఉన్నందువలన అయి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పటివరకు నేను నా దృష్టిలో, నా శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క ఆకారపు ఒక నీడ ఉంటున్నట్లుగా చూస్తూ ఉండేదానను. తర్వాత క్రమక్రమంగా అది నా దృష్టిలో తరిగిపోతున్నట్లుగా అనుభవానికి వచ్చినా కూడా నేను దానిని నిలుపుకున్నాను. నా ఆలోచనలో ఏదో ఒక రకమైన అవాంతరం వచ్చినపుడు కూడా, నా మొదటి దృష్టి ఆ ఆకారాన్నే వెదుకుతూ ఉండేది. అది కూడా చాలా మసకగాను, మరుపుగాను వస్తూ ఉండేది. అయితే ఇప్పుడు ఎవరో దానిని పూర్తిగా తుడిచివేసినట్లుగా అనిపిస్తోంది. అది ఆలోచనలో లేనప్పుడు (Conception) భావన కూడా నిలిచి ఉండలేదు. ఇంకా ఇప్పుడు ఏమిటంటే, ఆలోచనలో ప్రాణం లేదు. తలంపు (Conception) ఖాళీ అయిపోయింది కనుక ఇప్పుడు అంతా (Beyond conception) భావాతీతంగా ఉన్నట్లు అనిపిస్తోంది. అలాకాదు కాని, ఇప్పుడు ఏదైనా ఉందన్న జాడగాని, ఏమీలేదను స్పృహగాని లేకపోయాయి. నా దశ ఎలా ఉందంటే, ఆలోచన యొక్క ఆలోచన కూడా నాకు ఉండటం లేదు. బహుశా ఇందుకే 'మాలిక్' ఆకారాన్ని కల్పించుకుంటూ ఉన్నా కూడా, దానిని పొందలేకపోతున్నాను. కల్పన (Imagination) ఎప్పుడైతే సాధ్యపడదో, దృష్టి దానిని ఎలా చూడగలుగుతుంది, మైండ్ ఏమి అర్థం చేసుకుంటుంది, దాని నీడ కూడా ఎలా నిలబడుతుంది. **నేను జీవించి ఉన్న దాననుగాదు, మృతురాలిగా ఉన్న దాననుగాదు అన్నట్లుగా నా స్థితి ఉంది. తమకు ఉత్తరం ఎవరు వ్రాస్తున్నారో, ఎవరికి వ్రాస్తున్నానో, తెలియకపోగా, వ్రాసిన కాగితం కూడా ఖాళీగానే ఉన్నట్లు అనిపిస్తోంది. మనస్సు ఎక్కడకు పోయిందో దానిని ఎవరు తీసుకుపోయారో కూడా తెలియకుండా ఉంది. అసలు అది ఎప్పుడైనా ఉందో, లేదో కూడా తెలియదు.** నేనేం చేయాలి? నాకు తృప్తిగాలేదు, దప్పిక యొక్క అనుభూతిని కూడా పొందలేకపోతున్నాను.

పూజ్య మాస్టర్ సాహెబ్‌కు నా ప్రణామం తెలియజేయండి. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 562

లఖీంపుర్,

02.05.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఆరోగ్యం మెరుగుపడిందని భావిస్తున్నాను. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పటివరకు ఏదో స్వప్నం లాంటిది చూస్తూ ఉన్నట్లుగాను, దాని (Impression) భావం నా మెదడులో జ్ఞాపకంగా ఏమీ లేనట్లుగాను అనిపిస్తోంది. ఆ స్వప్నం కూడా ఇప్పుడు ముగిసిపోయింది. స్థితి ఎటువంటిది అంటే, అది ఒక స్వప్నంలాగా ఉండి తటాలున అంతమైపోయింది. ఇప్పుడు నాకు ఇంకేమీ జ్ఞాపకం లేవు. ఇప్పటివరకు స్వప్నంలో తేలియాడుతూ ఉండగా అది ఒక్కసారిగా నాలోకి జారుకుని నాలో జీర్ణమైపోయినట్లు ఉంది. ఇప్పుడు దశ ఎలా ఉందంటే, సమస్త ప్రపంచం లేదా శక్తి ఎవరి పొట్టలోనో ఉండి, అది అతనికి తెలియనదిగా ఉన్నట్లు అనిపిస్తోంది. అదేమిటో ఏమోకాని, ఇప్పుడు ఎవ్వరితోనైనా ధ్యానం చేయిస్తున్నా లేదా ఏదైనా పని చేస్తున్న సమయంలో 'మాలిక్' నుంచి ఇచ్ఛాశక్తి వచ్చి, ఆ తర్వాత పని పూర్తికాగానే ఇంక దాని విషయం ఏమీ తెలియనట్లుగా ఉంటోంది. బహుశా ఆ ఇచ్ఛాశక్తి మళ్ళీ తిరిగి 'మాలిక్' వద్దకు చేరిపోతున్నట్లు అనిపిస్తోంది. ఎవ్వరో తన వస్తువులన్నీ అమ్మివేసి 'మాలిక్'కు బానిసగా అయిపోయి, ఆ సందర్భంలో అన్నింటినీ అప్పగించి వేస్తున్నట్లుగా ఉంది. ఇంక అంతే. ఆ బానిసకు ఏ వస్తువైనా తనది అన్న భావన కూడా ఉండటం లేదు. ఇంకా చెప్పాలంటే, అతనికి తను ఎప్పుడైనా బానిస అను ఆలోచనగాని, స్పృహగాని ఉండటం లేదు. బానిస వస్తువులు కూడా 'మాలిక్'కే చెందిపోతాయి. ఇంకొక విషయం ఏమిటంటే, 'మాలిక్' ఇష్టపడితే ఎప్పుడైనా ఆ బానిసకు ఆ వస్తువులు తనకు చెందినవి అను భావం మాత్రం కల్పిస్తాడు కాని వస్తువులు మాత్రం 'మాలిక్'కు చెందినవిగానే ఉంటున్నట్లుగా నేను గ్రహిస్తున్నాను. ఇంకేముంది, శరీరం మాత్రం బానిస యొక్క చిహ్నంగా బానిసవద్ద ఉండిపోతుంది అని అర్థం చేసుకోవాలి. దానితోనే 'అతని' (మాలిక్) కి సేవ జరుగుతుంది. అయితే, ఎందుకోగాని **సేవకత్వంలో కూడా సేవకునికి తను సేవకుడు అను భావం 'మాలిక్' కల్పించడు.** ఇది నా దశగా ఉంది.

ఇంకా, ఏమైనా ఉన్నాయను ఆలోచన వచ్చినట్లయితే, వాటిని ఎదుటనే ఉన్న 'మాలిక్' వద్దనే ఉంచినట్లుగా తోస్తుంది. ఆంతరికానికి శరీరంతో సంబంధమే లేకపోయాక ఇంక దానిని గురించి పట్టించుకునేది ఏం ఉంటుంది. ఇప్పుడు నాదైన దశలో, 'మాలిక్' అభీష్టానికి వదలిపెట్టాలను భావం కలగటం లేదు. ఎందుకంటే, 'మాలిక్'యే తగినట్లుగా పని చేయిస్తాడు. వాస్తవానికి కస్తూరీ ఈ లోకానికి ఒక ఫొటో (చిత్రం) లాంటిది, దానిలో జనం ఆ ఫొటో చూస్తూ గుర్తుపడుతూ ఉంటారు. కస్తూరీకి మాత్రం ఆ ఫొటో సంగతి కూడా జ్ఞాపకం లేదు. కస్తూరీ అయితే 'మాలిక్' యొక్క ఆంతరికంలో విలీనమైపోయింది. ఇంకా ఏమిటంటే, నా ఆంతరికాన్ని ప్రశ్నిస్తూ ఉన్నట్లయితే నా (Inner voice) అంతర్వాణి జవాబు ఇవ్వటంలేదు. ఆంతరికమే లేకపోయాక జవాబు ఎవ్వరిస్తారు. ఇంక ఉన్నది ఏమిటంటే, బాహ్యశరీరం మాత్రమే.

ఇప్పుడు ఉన్న స్థితిలో ఎలా ఉంది అంటే, 'మాలిక్' యొక్క ఆంతరికాన్నే నేను దిగమ్రింగినట్లు లేదా ఆంతరిక గమనం ఏమైందో ఏమో నాకు తెలియకుండా పోయింది. ఒక్కసారిగా నా గొంతులోకి దిగజారిపోయినట్లు అనిపించింది. ఇప్పుడు ఇంకేమవుతుంది, 'మాలిక్' గొంతు నుంచి నా ఆంతరికమే దిగజారిపోయిందో ఏమో తెలియదు. ఇప్పుడు అదే నాకు కేంద్రంగా ఉంది. ఇచ్ఛాశక్తి కూడా ఎప్పుడైనా వారు ఎంతగా ఇస్తే దానితో పని జరిగిపోతుంది. తర్వాత దాని సంగతే తెలియదు.

యదార్థం ఏమిటంటే, పని చేస్తున్నట్లుగా స్పృహ ఉండదు. 'మాలిక్' తన సెంటర్ (అనగా నా శరీరమే ఆ కేంద్రం) ద్వారా అంతా చేస్తున్నట్లుగా అనిపిస్తుంది. పూజ (ధ్యానం) చేయిస్తున్నపుడు నా శరీరం మాధ్యమంగా కాకుండా శ్రీ బాబూజీ ద్వారానే నేరుగా జరుగుతున్నట్లుగా గ్రహిస్తున్నాను. శారీరిక స్థితి ఎటువంటిది అంటే, నా చేయి నేను పట్టుకున్నా, దేనిని పట్టుకున్నానో కూడా తెలియటం లేదు. అటువంటప్పుడు ఇంక నా వలన ఏమవుతుంది.

ఇప్పుడు స్థితి అనేది స్థితిలేమిగా అయిపోయింది. బాబూజీ తరచుగా నాకు వ్రాస్తూ ఉండేవారు, ఏమని అంటే, "ఏ స్థితి అయితే అసలు స్థితి యొక్క కారణంగా అవుతుందో, దానిని నీవు బాగా చెప్పగలుగుతున్నావు" అని. కాని ఇప్పుడు నా స్థితిలో అసలు అనేది కనిపించకపోయి ఉండగా దాని కారణంగా ఏమవుతుంది అంటారు.

ఇప్పుడు ఒక విచిత్ర దశ ఏమిటంటే, ఏ లక్ష్యంగాని, ఉద్దేశ్యంగాని, అశాంతిగాని లేకపోయినా కూడా విశ్రాంతి లేదు. హృదయమే లేనప్పుడు బాధ ఎక్కడ జనిస్తుంది అంటారు. ఆంతరికం దోచుకోబడింది. రోజంతా ఖాళీగా గడుస్తోంది. దానిలో (రోజులో) నిద్రిస్తూ మేల్కొంటున్న మానవులు ఎవ్వరైన ఉన్నారా అను సంగతి తెలియకుండా ఉంది. కాదు, కాదు. కాని ఎప్పుడైనా నిద్రించటం, మేల్కొనటం అనేవి ఉన్నాయా అన్నట్లు భావించాలి. శరీరం అంతటా ప్రకంపనం (Vibration) ఉంటోంది. శరీరమంతటిలోనే కాదు, గాలి యొక్క పీడనం లేనిచోటు కూడా ఉంటున్నట్లు అనిపిస్తుంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్తున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 563

షాజహాన్‌పూర్,
07.05.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం చేరింది. ఇప్పుడు నీ ఉత్తరాలకు జవాబులు వ్రాయటం కష్టమనిపిస్తోంది. దానికి కారణం, దీర్ఘంగా ఆలోచించవలసి వస్తుంది. ఇటీవల నేను నీకు చాలా రోజుల నుంచి తరచుగా ప్రాణాహుతి నిస్తున్నాను. కొంతకాలం వేచి ఉండి, నా పనులు పూర్తిచేసుకున్నాక నీకు జాబులు వ్రాయటానికి ప్రయత్నిస్తాను.

అమ్మకు ప్రణామం. పిన్నలందరికీ ప్రేమ తెలియజేస్తున్నాను.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 564

లఖీంపుర్,
07.05.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. చాలా రోజుల నుండి తమ ఉత్తరం రాకపోయేసరికి దిగులుగా ఉంటుంది. ఎందుకోగాని తమ ఉత్తరం పొందకపోతే నాలో ధైర్యం ఉండటం లేదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, చాలా ఉత్తరాల్లో తమరు, "ఆ అసలు జీవితం నీలో ప్రారంభమయ్యింది" అని వ్రాశారు. కాని ఇప్పుడు ఉన్న నా దశలో, ఆ అసలు జీవితంలో కూడా జీవనం లేదు అని చెబుతున్నట్లుగా ఉంది. ఇప్పుడైతే జీవితమూ లేదు, మరణమూ లేదు. దానిని ఎలా చెప్పవచ్చునంటే, నిద్రించినవానికి నిద్ర యొక్క భావం కూడా లేనటువంటిదిగా చెప్పవచ్చు. ఎందుకోగాని, శిరస్సు వెనుక, శిరస్సు అంతటా తేలికగాను, ఖాళీగాను అయిపోయినట్లు అనిపిస్తోంది. శిరస్సు అంతటా మరియు పూర్తి శరీరంలో ముందు వెనుక ఒక రకమైన మృదువైన దశ వ్యాపించి ఉంటోంది. దీనిని తేలికగా ఉన్నట్లు చెబితే అంతకు వేయిరెట్లు భారంగా ఉంటుంది. నాకు ఇప్పుడు ఎడమకాలి బొటనవ్రేలు ద్వారా ఏదో దశగాని లేక ఏదో విషయంగాని నా శరీరం అంతటా వ్యాపించి ఉంటోంది. ఇంతేగాకుండా, దీని ద్వారా శరీరం అంతటిలోను కంపనం వంటిది కూడా కలుగుతున్నట్లుగా నాకు అనిపిస్తూ ఉంది. శిరస్సు యొక్క వెనుక భాగం అంతా కూడా కరిగిపోయి అంతా ఏకమైపోయినట్లు అనిపిస్తోంది. ఎడమ బొటనవ్రేలి ప్రక్కన ఉన్న వ్రేలులో కూడా ఒక రకమైన ప్రాకటం వంటిది లేదా ప్రకంపనం వంటిది ఉంటోంది.

ఇప్పుడు ఎవరో నా పగ్గాలు బాగా లాగిపట్టుకుని ఉంచుతున్నట్లుగా అనిపిస్తోంది. బహుశా అందుకే నొప్పి అనేది నాలో ఒక అంగంగా అయిపోయినట్లు ఉంది. నాకు ఇప్పుడు ఆలోచన, ఆలోచనలేని స్థితి ఏదీ కూడా అర్థం లేనివిగా అనిపిస్తోంది. ఖాళీ అనేది నాకు అర్థం లేనిదిగానే తోస్తోంది. శూన్యం (జీరో) అన్నా కూడా అంతే. ఇప్పుడు నాకయితే అన్నీ నిరర్థకమైనవిగాను, వ్యర్థమైనవిగాను అనిపిస్తోంది. ఇప్పుడు నా దశ ఎలా ఉంది అంటే, నేను కోరుకుంటె మనస్సులో భజన వెంటనే ఉత్పన్నమవుతూ ఉన్నాయి. అలాగే కథలుగాని, లేఖలుగాని వ్రాయసాగుతున్నాను. కాని ఎందుకో ఏమో, ఏమి వ్రాయటానికి పూనుకోవటం లేదు అని గ్రహిస్తున్నాను. ఎప్పుడూ మనస్సు కలగటంలేదు.

ఇప్పుడు నా ఈ స్థితిలో, శిరస్సు, కాళ్ళు, హృదయం, వీపు, హృదయం అనేవి ఏవీ అనుభూతికి రావటం లేదు. అన్నీ సమానంగానే అనిపిస్తున్నాయి. ఎడమకాలి బొటనవ్రేలి సిర (వేన్) శిరస్సు యొక్క వెనుకభాగంతో జతకూడి ఉన్నట్లు అనిపిస్తోంది. ఈ శరీరం ఎవరిదో అన్నట్లుగా అయిపోయి, అది కూడా తెలియకుండా ఉంది. ఇందులో బరువు కూడా లేదు. ఎందుకంటే, ఇందులో ఏ అవయవాలుగాని, ఎముకలుగాని, మాంసంగాని, రక్తంగాని, చర్మంగాని ఏవీ లేవనిపిస్తోంది. అంతేగాకుండా ఆకారమూ లేదు. స్వ (నాది అనేది) లేదు. రూపం లేదు. రంగూ లేదు. శరీరం అయితే గాలి అన్నట్లుగా అయిపోయింది. (రాత్రిపూట నాకు, నా శరీరం నిద్రిస్తున్నట్లుగాని లేక ఇది ఎవరు, ఏమిటి అనిగాని, ఎటువంటి అనుభవం కలగడం లేదు. ఇది ఎవరి విషయమో అన్నట్లుగా ఉంది.) ఇప్పుడు నాకు ఏమైందో ఏమోగాని, నాకు నిద్రలోని ఆనందం యొక్క జ్ఞాపకం రావటం లేదు. అలాగే మేల్కోవటంలోని ఆనందమూ కలగటం లేదు. నా శరీరమే నిద్రిస్తున్నదని భావించినా కూడా నాకు నిద్రలోని ఆనందం రానట్లుగా గ్రహిస్తున్నాను. పూజ (ధ్యానం)కు చెందిన ఆనందంగాని, 'అతని' జ్ఞాపకం యొక్క ఆనందంగాని కలగటం లేదు. అసలు ఎన్నడూ ఏమీ జరగలేదన్నట్లు అనిపిస్తున్నటువంటి స్థితి ఇది.

నాకు ఇప్పుడు భూత, భవిష్యత్తు, వర్తమానాలు ఏవీ అర్థం లేనివిగా ఉన్నాయి. నా స్థితి ఎలా ఉందంటే, నన్ను ఎవరైనా ఈ ప్రపంచంవైపు ఈడ్చుకుపోయినాగాని, ఈశ్వరుని యొక్క జ్ఞాపకం కలిగించినా గాని నాపై ఎటువంటి ప్రభావం ఉండటం లేదు. నేనయితే యథాస్థానంలోనే ఉన్నాను, కాని ఆ స్థానం గురించి లేదా నివాసం గురించి కూడా ఏమీ తెలియకుండా ఉంది. ఏమి చెప్పాలో, ఏమి చెప్పకూడదో మరి. ఏమీ తెలియని ఈ దీనురాలిని 'మాలిక్' రక్షించుగాక! మంచిచెడులు కూడా తెలియకుండా ఉన్నాను. నా దశ ఎలా ఉంది అంటే, నేను నిద్రించియే ఉంటున్నాను. అయినా కాని ఇక్కడ, అక్కడ మాటలు చెవుల్లో వినబడుతూనే ఉన్నాయి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్తుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 565

లఖీంపుర్,
15.05.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. దానిని చదివి ఆనందించాను. తమరు కేసర్‌కు వ్రాసిన ఉత్తరం ద్వారా తమ ఆరోగ్యం బాగుండలేదని తెలిసింది. కాని తమరు నాకు ఎందుకు వ్రాయలేదు. దయచేసి తమ ఆరోగ్యం గురించి త్వరగా తెలియజేయండి. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

పూజ్య మాస్టర్ సాహెబ్, నాకు బాబూజీపట్ల ఆగ్రహం కలిగిందని చెప్తున్నారు. కాని నాకైతే గతం గురించి జ్ఞాపకం ఏమీ రావటం లేదు. ఎందుకోగాని నాకు ఈ మాట వినటం కూడా సహింపరానిదిగా ఉంది. హృదయం మీద ఏదో దెబ్బ తగులుతోందనిపిస్తోంది. అయితే 'మాలిక్' కృప వలన 'వారి' సున్నిత హస్తం చూస్తూనే, ఆ దెబ్బ వెంటనే ఎంతగా మాసిపోతుంది అంటే, దానితో ఆ విషయం మళ్ళీ నా దృష్టికే రాకుండా పోతుంది.

బాబూజీ, ఇంతకుముందు నేను, నా ప్రతి యొక్క కణం స్థిరత్వం యొక్క స్వరూపంగా అయిపోయాయి అని వ్రాస్తూ ఉండేదాన్ని, కాని ఇప్పుడైతే స్థిరత్వం మరియు అస్థిరత్వాలు అనుభూతికే రావటం లేదు. స్థితి ఈ రెండింటితో కూడా ఖాళీ అయిపోయినట్లుగా తోస్తోంది. స్థితిని సమానంగా అనిగాని, సమతలంలాగా ఉందనిగాని చెప్పటంలో అర్థం లేదనిపిస్తోంది. ఇప్పుడు పూర్తిగా (Blank) ఖాళీ దశయే ఉంటోంది కాని (Blankness or Emptiness) ఖాళీతనం అనిపించటం లేదు. ఏ విషయం కూడా నేను మనస్సులో ఉంచుకోలేకుండా ఉంటున్నట్లు నేను చూస్తున్నాను. అందరి ఎదుట ఏ మాటలు మాట్లాడుతున్నానో అది ఉన్నవి ఉన్నట్లుగా వెలువడుతున్నాయి కాని దాచిపెట్టకపోవటమేకాక నిశ్చయంగా ఉంటున్నాయి. మనస్సులో ఆగ్రహంతో కూడిన మాటలు ఏవైనా ఉంటే అవి అతిశీఘ్రంగా తొలగిపోతున్నాయి. నా పగ్గాలు ఎవరి చేతుల్లోనైనా ఉన్నాయా లేక నేను నా వశంలోనే ఉన్నానా అనేది అనుభవానికి రావటం లేదు. దీనివలన నేను శాంతంగా ఉన్నానో లేక అశాంతితో ఉన్నానో కూడా తెలియటం లేదు. ఇప్పుడు నా హృదయంలో బాధా లేదు. తపనా లేదు, నాకేమీ అనుభూతి కావటంలేదు. నాకు ఇంతగా అవగాహన లేకపోయినాగాని నేను పూర్తిగా లౌకికంగా అయిపోయి ఉన్నాను. 'మాలిక్' జ్ఞాపకం ఎన్నడూ రావటం లేదు. నా ఉద్దేశ్యం కాని, లక్ష్యం కాని ఏమీ లేకపోయాయి. ఏమి చేస్తున్నాననిగాని, లేదా ఏమి చేయాలనిగాని తెలియకుండా ఉంది. ఏమి జరుగుతున్నదో, ఏమి జరగాలో ఏమి తెలియటం లేదు. నేను పైనా లేను, క్రింద లేను, నేను ఇక్కడ లేను, అక్కడ లేను, అసలుగాను లేను, కల్పితంగాను లేను, ఏదైనా పాయింట్ లోపల లేను, బయటా లేను. ఇదంతా ఏమిటో నాకు తెలియటం లేదు.

నేను దేనిని అన్వేషిస్తున్నానో కూడా తెలియదు. నా దగ్గర ఏమీలేదు. 'మాలిక్' కూడా ఎక్కడో దాగున్నాడు. హృదయంలో తపన ఉందేమో తెలియదు. చేయి, కాలు, తల –వీటిలో ఎక్కడ బాధ ఉందో దాని జ్ఞానమూ లేదు. ఏది కావలిసి ఉందో స్పృహలో లేదు. అయినాగాని రోజంతా ఏదో పని చేస్తూనే ఉన్నాను. అయితే చేస్తున్నది 'మాలిక్' పని కాదు, లౌకికమైనదీ కాదు. ఇప్పుడు అంతా చీకటే చీకటి. లోపల, బయట అంతటా అంధకారమే వ్యాపించి ఉంది. అయితే అంధకారం కూడా ఎటువంటిది అంటే, దానిలో ప్రకాశం లేదు. నాకు అంధకారం యొక్క అనుభూతి కూడా కలగటం లేదు. ఇప్పుడు అర్థంకానిది ఏమిటంటే, నేను స్థితిలో వేరుపడి ఉండటం లేదు. అలాగని దానితో అంటిపెట్టుకొనీ ఉండటం లేదని అనిపిస్తోంది. ఇప్పుడు దశ ఏమిటంటే, ఆగ్రహం కూడా ఒక్కపెట్టున వచ్చేస్తుంది. అయినప్పటికి నాకు దాని జాడ తెలియదు. నాకు ఏదైనా విషయం చెడుగా అనిపించినా నాకు తెలియదు. ఏదైనా మంచిగా అనిపించినా అది కూడా నాకు తెలియనిదిగానే ఉంటుంది.

బాబూజీ, ఇప్పుడు నేను సూటిగా ఉన్నానో లేదా వంకరగా ఉన్నానో తెలుసుకోలేకపోతున్నాను. ఇంక నన్ను ఎలా సరిచేసుకోగలను? నా చేతిలో ఏమీలేదు. 'మాలిక్' తమరే నన్ను సరిదిద్దాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్తున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 566

లఖీంపూర్,

19.05.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉంటుందని అనుకుంటున్నాను. మాస్టర్ సాహెబ్‌గారు కూడా అక్కడకు చేరి ఉంటారు. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నా స్థితి ఎలా ఉందంటే, ఎప్పుడూ వెర్రి లేదా పిచ్చి లేదా అశాంతి అనేది కలగటమే లేదు. కాని ఎప్పుడైతే ఇది ఉంటుందో అప్పుడు మనస్సులో ఏదో బంధనం వంటిది ఉండేది. అయితే ఇప్పుడు మనస్సు లేదు, విశ్రాంతి లేదు, శక్తి లేదు, అశక్తి లేదు. నాకు ఈ రెండూ సమానమే అన్నట్లుగా ఉంది. కాని ఏదైన బంధనం ఉన్నట్లయితే అది ఇంతకుముందు ఉన్నంతగా లేదు. నాకు స్వతంత్రం, బంధనం రెండూ సమానంగానే ఉన్నాయి. నాకు ప్రేమ, ప్రేమలేకపోవటం రెండు ఒక విధంగానే ఉన్నట్లు అనిపిస్తోంది. మరి ఎప్పుడైనా 'మాలిక్'ను ప్రేమించగలనా! ఇప్పుడు నేను గ్రహిస్తున్నది ఏమిటంటే, అశాంతి యొక్క హద్దు, హద్దును త్రెంచుకుని ఒక సమతలంలాగా అయిపోయింది. ఏకత్వం, ద్వైతం అను రెండు స్థితులు నాకు సమానమే. ఇప్పుడు నా కణకణం, లోపల బయట అంతటా అశాంతిగా ఉంది. కాని నేనేం చెప్పాలి? నా స్థితి ఎలా ఉన్నదంటే, నాకు శాంతి, అశాంతి ఒక్కటే అన్నట్లుగా అనిపిస్తోంది. ఒక విధమైన తపన అని చెబుదామంటే, అది స్థితి కంటె భారంగా అనిపిస్తుంది. నేను హాఁ అని పలికినట్లయితే ప్రతికణం అలాగే హాఁ హాఁ అని అంటున్నాయి. అలాగే నేను మౌనంగా ఉన్నట్లయితే అవి కూడా మౌనం దాల్చుతున్నాయి. అయితే నా స్థితి ఎలా ఉందంటే, ఈ రెండింటిలో నేను ఏదీ చేయలేకపోతున్నాను. 'బాబూజీ', 'బాబూజీ' అను మాటలు నాకు మహామంత్రంలాగా అయిపోయి స్వయంగా నా ప్రాణంలోనే కలిసిపోయినట్లుగాను, అది నాలోనే కాకుండా ఎక్కడ విన్నా కూడా, జడచైతన్యాలలోను, తక్కువగా గాని, ఎక్కువగా గాని వచ్చే ప్రతి శబ్దం 'బాబూజీ', 'బాబూజీ' అనే స్వరం, స్వయంగా నాకు చేర్చుతున్నాయి అన్నట్లుగా నేను చూస్తున్నాను.

ఏమి చేయాలో తోచటం లేదు. ఆపినా (ధ్వనిని) ఆగటం లేదు. ఎక్కడికైనా పారిపోయి దాగి ఉన్నా కూడా ఈ ధ్వని (పిలుపు) నన్ను వెంటాడుతూనే ఉంది. ఎక్కడైనా బాధ కలిగినా కూడా, నిట్టూర్పుగాని, హాఁ అనిగాని పలకకుండా 'బాబూజీ', 'బాబూజీ' అను ధ్వనియే వస్తోంది. దానితో నా బాధకు ఉపశమనం కలుగుతోంది కాని, ఈ బాధకు చికిత్సే లేదు. ఈ బాధ తీవ్రంగా వచ్చినా కూడా నా ఆత్మ దానిని తీవ్రంగా రానివ్వటం లేదు సరికదా అది (బాధ) రాదు కూడ. ఎందుకంటే, పాత్ర పగిలిపోయింది కనుక. (దీనిని ఒక మట్టిపాత్రలో ఏదైనా వేడిచేసి పొంగించాలనుకున్నా కాని పాత్ర పగిలిపోతే అది పొంగటం ఎలా సాధ్యపడదో, ఆవిధంగానని భావించవచ్చు) అది మాత్రం ఎక్కడి నుండి వస్తుంది. ఒక పగిలిన లేదా చినిగిన తిత్తిలో (Cylinder with cracks) గాలి నింపినా ఎలా నిలుస్తుంది! నా గోడు వినిపిద్దామంటే, 'మాలిక్' కూడా ఎక్కడా దొరకటం లేదు. కాని ఇప్పుడు ఉన్న స్థితి ఎటువంటిది అంటే, నాలో గుండె చప్పుడు కూడా లేదు. దానికి 'బాబూజీ' పేరు వినిపిద్దామనిగాని, వారి స్మరణ కల్పిద్దామనిగాని తలంచినప్పటికి అది సాధ్యపడటంలేదు. అది ఏమిటోగాని, నా చెవులకు సోకి నాకు 'అతని' జ్ఞాపకం కలిగించటానికి బయట కూడా ఎటువంటి ధ్వని కలగటం లేదు. ప్రపంచంలో ధ్వనియే లేకుండా పోయిందో లేక నా కర్ణభేరియే పగిలిపోయిందో ఆ దైవానికే తెలియాలి. అలాకాకుంటే ఎప్పుడైనా గాని ఏదో ధ్వని నాకు చేరి ఉండేది.

ఇప్పుడు నాకు ఎప్పుడైనా గాని, ఎవ్వరైనా గాని నా 'మాలిక్' యొక్క స్మరణ కల్పించలేరా! అసలు ధ్వని అంటూ ఎప్పుడూ లేదు, ఇప్పుడు కూడా లేదని అనిపిస్తోంది, అయితే అది ఎక్కడ నుండి వస్తుంది. బహుశా ఎప్పుడైనా 'అతడే' నాకు జ్ఞాపకం చేస్తాడను ఆశతో 'అతని' రాక కోసం దారివంకే చూస్తున్నాను. రేయింబవలు ఎటువంటి ఆలోచన తట్టడం లేదు. ఏదైనా కొద్దిగా స్పృహ కలుగుతుందేమోనని అనుకోవటానికి అది మాత్రం ఎక్కడ నుండి వస్తుంది? అది పోతేనే కదా రావటం జరిగేది! నేను ఇప్పుడు నా స్థితిని గురించి వ్రాస్తున్నానో, ఇంకేమైనా వ్రాస్తున్నానో తెలియటం లేదు. కాగితం మాత్రం ఉన్నది ఉన్నట్లుగానే ఉంది. ఇలా ఉంటే స్థితి ఏమి ఉంటుంది. నా స్థితినిబట్టి నేను ఖాళీ కాగితాన్ని కూడా గుర్తించలేకపోతున్నాను. ఇవన్నీ ఈ విధంగా ఉన్నా కూడా నాదొక (నిరంతర గమనం) అఖండ గతిగా అయిపోయింది. ఇంకొక విధంగా చెప్పాలంటే, ఆ అఖండ గతియే నా స్వరూపంగా అయిపోయింది అని చెప్పవచ్చు. ఇప్పుడు నాకు ప్రార్థనలోగాని, పాడటంలోగాని అభిరుచియే ఏమీ లేకుండా పోయింది. ఎవరో నన్ను ఏడ్వకుండాను, పాడకుండాను అడ్డుతగులుతూ ఉన్నట్లుగా ఉంది. పిచ్చిదానిలాగనూ కానివ్వడం లేదు. అందువలన శాంతి సమకూరటం లేదు. నేను ఏదైనా వినటానికిగాని, ఏదైనా చెప్పటానికిగాని ఇష్టం ఉండటం లేదు. ఏమీలేకపోవటమే అసలైన నమ్రతగా అనిపిస్తోంది. అయితే నకలును కాదు, అసలునూ కాదు. ప్రతిస్థితి యొక్క పరిభాష సమాప్తమైపోయినట్లు గాను, ఇంకను స్థితియే లేకపోయి, దాని పరిభాషయే లేకుండాపోయినట్లుగాను ఉంది. స్థితిలో ఆనందం ఉండటం, లేకపోవటమూ లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్పుతున్నారు. కేసర్ ప్రణామం చేస్తోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

**ఉత్తరం సంఖ్య – 567**

లఖీంపుర్,

26.05.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. రెండు ఉత్తరాలు పోస్టు చేశాను. తమకు అంది ఉంటాయని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఈ స్థితి ఏమిటోగాని, స్వయంగా నన్ను నేను మోసగించుకుంటున్నానేమో అని అనిపిస్తోంది. ఎందుకంటే, నేను ప్రతిస్థితిని 'ఉన్నది' అంటూనే తర్వాత అసలు అది లేనేలేదు అని, లేక నేను మళ్ళీ చూస్తూ ఉంటే ఏమీ కనిపించటం లేదు అని వ్రాస్తున్నాను. (Creative Power) సృజనాత్మక శక్తియే సమాప్తమైపోయింది, కోల్పోయింది. ఏమైందో ఏమో దైవానికి తెలియాలిగాని, దశలో చైతన్యం లేదు, చైతన్యంలేకుండా లేదు. కాని ఈ రెండు శబ్దాలు అర్ధరహితమే అనిపిస్తోంది. నేను 'స్థితి', 'స్థితిలేమి' అను మాటలు నేను స్వప్నంలో కలవరిస్తున్నానేమో అన్నట్లుగాను, ఈ మాటలకు అర్ధంపర్ధం లేనట్లుగాను అనిపిస్తోంది. ఇంక స్థితి గురించి అంటారా, దానికి కూడా ఏమీ అర్ధం లేకుండా పోయింది. 'అర్ధం' అను మాటకు అర్ధం లేకుండాపోయింది. అలాగే వ్యర్ధానికీ అర్ధం లేదు, (నా దశ ఎలాంటిది అంటే, స్థితి, నేనూ ఒకటిగా అయిపోయాము) ఇలా నేనేగాదు, ప్రతిదీ నాకు సమానంగానే అయిపోయాయి. ఇప్పుడు ఈ సమానం అనుదానికి కూడా అర్ధం లేకుండాపోయింది. ఇప్పుడు స్థితి తనకుతానుగానే ఉంటోంది. అది ఎలా ఉన్నా అది వ్యక్తం చేయదగ్గదీ, వ్యక్తం చేయదగనిదీ కాదు. అది ఉన్నది మరిలేదు.

నిన్నరాత్రి అక్మస్మాత్తుగా షుమారు 11-12 గంటలకు, నేను నిద్రపోయి ఉండగా, తమరు అకస్మాత్తుగా- "బిటియా! నాకు నీ జ్ఞాపకం బాగా వస్తోంది. నీ ఆత్మ నా హృదయంలో విలీనమైపోయింది. నేను అశాంతితో ఉన్నాను" అని చెబుతున్నట్లుగా అనిపించింది. ఇంతలో నేను ఆశ్చర్యంగా లేచి కూర్చుండిపోయాను. అప్పుడు చూశాను కదా, బుగ్గలమీద అశ్రుధారల చారలు వంటివి ఏర్పడి ఉన్నాయి. అలా కాకుంటే, మేల్కొని ఉండగా అశ్రువులు ఎప్పుడూ స్రవించవు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్పుతున్నారు. కేసర్ ప్రణామం చేస్తోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 568

లఖీంపుర్,
04.06.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నాది ఒక నిరుపేద స్థితిగా ఉంది. ఇప్పుడు నావద్ద నా 'మాలిక్'కు చెందిన ప్రేమకు నిరూపణ ఏదీలేకపోవటం వలన నేను వారికి ఏమి చూపించాలి, ఏమి వినిపించాలి అని ఆలోచిస్తున్నాను. వారికి వినిపించటానికి ఎటువంటి కథగాని, చూపటానికి హృదయంగాని లేవు. నా లోపల, బయట ఒక విచిత్రమైన దశ పూర్తిగా స్వచ్ఛమైనది, పవిత్రమైనది వ్యాపించి ఉంది. ఈ దశలో నేను చూస్తున్నది ఏమిటంటే, నన్ను చెడుగా భావిస్తున్నవారు కూడా నాకు ఈ స్వచ్ఛమైన దశలో తడిసి ఉన్నవారుగా కనిపిస్తున్నారు. ఈశ్వరుడు ఏది చేసినా మంచిగానే చేస్తాడు అని అందరూ చెబుతుంటారు. కాని నా దశ ఎంత (Innocent) అజ్ఞానమైంది అంటే, దాని వలన నాకేమి తెలియటం లేదు. 'అతడు' ఏమైనా చేస్తాడో, లేదో తెలియటం లేదు. 'అతని'కి ఏమైనా తెలుసో, లేదో తెలియదు. నేను ఇప్పటివరకు 'మాలిక్' కోరికలోనే నా కోరిక ఉందని చెబుతూ ఉండేదానను. 'అతని' కోరిక ఏదో అదే కాని, అసలు ఇప్పడు 'అతని'కి కోరిక ఉందో, లేదో నాకు తెలియదు. ఇప్పుడు కోరిక నాది కాని, మరెవ్వరిదైనాకాని, కోరిక అంటూ ఏమీ లేనట్లుగా ఉంది. ప్రతిదీ దానంతటదే జరిగిపోతుంది. నాదైతే ఒక రకంగా ఆనందం లేనిదశగా

ఉంది కాని దాని ఆనందం చెప్పతరం కాదు. ఒక ఆనందం లేని స్థితి ఎటువంటిది అంటే, దానిలో స్థితిలేని స్థితి యొక్క దృశ్యం మరియు ఆనందం ఉన్నాయి. ఎవ్వరైనా సరే, ఆఖరికి రేడియోలోగాని, గ్రామఫోనులోగాని 'బాబూజీ' అని చెప్పకూడదని కోరుకుంటున్నాను. కస్తూరీ మాత్రం ఏ ధరకు అమ్ముడుపోకుండా (ఏ కానుక లేకుండా) సమర్పితమైపోయింది.

నిన్నటి నుంచి ఉన్న దశలో, ఇది నా శరీరం కాకుండా సాక్షాత్తు శ్రీ బాబూజీ ఆత్మగానే అయిపోయినట్లుగా అనిపిస్తోంది. ఇంక దశ ఏమిటంటే, ఊహ యొక్క ఊహ కూడా దానికంటె భారంగాను, ఒకటి ప్రాణంతోను, మరొకటి ప్రాణం లేనిదిగాను ఉన్నట్లు అనిపిస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్పుతున్నారు. కేసర్ ప్రణామం చేస్తోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 569

లఖీంపుర్,
25.06.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ ఆరోగ్యం గురించిన సమాచారం తెలియలేదు. దీని మూలంగా, కొంత దిగులుగా ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఉన్న దశలో, కళ్ళు మూసుకోవాలన్నా కూడా కళ్ళు మూసుకోవటం లేదు, అలాగే తెరుచుకోవటం లేదు. నా 'శ్రీ బాబూజీ' గురించిన ఆలోచనతో చనిపోతున్నా కూడా శాంతిని పొందలేకపోతున్నాను. అయితే స్థితి ఎలా ఉందంటే, 'వారి' ఆలోచన గురించిన జ్ఞాపకం కలగ్గానే నా మనస్సు గాభరా చెందుతోంది. ఎవరైనా అభ్యాసీ సోదరునితో పూజ (ధ్యానం) చేయిస్తుండగా, నా బాబూజీ హృదయం నుంచి ఈశ్వరీయ ధార (ప్రాణాహుతి) సదరు అభ్యాసీ హృదయంలోకి ప్రవేశింపజేయాలని దృష్టి పెట్టినట్లయితే అలాంటి ఆలోచన కూడా సహింపరానిదిగా ఉంటోంది. నా ఈ దశ ఎటువంటిది అంటే, నిలకడ యొక్క అనుభూతి కలగటం లేదు. ఇంకను ఎందుకోగాని చలనం లేదా గమనం యొక్క అనుభూతి కూడా కలగటం లేదు. నాది ఇప్పుడు ఇంకిపోయిన లేదా సాపులేని దశగా ఉంది. నా ఎముకలు అన్నీ శుష్కించిపోయాయి. నా స్వరూపం, మాటామంతీ అన్నీ కూడా శుష్కించిపోయాయి. ఎంతగానంటే, నేను నా బాబూజీతో మాట్లాడుతున్నపుడు కూడా నేను శుష్కించిపోయి ఉన్నట్లుగానే అనిపిస్తోంది. ఇది కూడా నా వశంలో లేదు. ఎలా ఉన్నానో, అలాగే 'మాలిక్' ఎదుట కూడా ఉండిపోతున్నాను. ఇంతకు పూర్వమైతే నేను ప్రతిసారి వర్షం వంటిదానిలో తడుస్తూ ఉండినట్లుగా నాకు జ్ఞాపకం ఉంది, కాని ఇప్పుడైతే వర్షం ఉండటం లేదు, నేనూ తడవటం లేదు.

ఇప్పుడు నా దశ ఎలా ఉన్నది అంటే, నేను జబ్బుగా ఉంటే పగలంతా పండుకుని ఉంటున్నా గాని, బాగుండి ఉంటే పగలంతా పనిచేస్తూ ఉన్నాగాని భేదం ఏమీ కనిపించటం లేదు. ఇంకా ఏమిటంటే, ఎవరితోనైనా మాట్లాడుతున్నా గాని, రోజంతా మౌనంగా ఉన్నా కూడా భేదం ఏమీ కనిపించటం లేదు. ఏ పరిస్థితిలో కూడా నాకు తేడా ఉండటం లేదు. పూజలో కూర్చున్నాగాని, జబ్బు కారణంగా పగలంతా కూర్చోలేకపోయినా గాని ఏ మార్పులేకుండా అలానే ఉండిపోతున్నాను. ఇప్పుడు నాకు చైతన్యం, చైతన్యం లేకపోవటం దృష్టికి ఏమీ రావటం లేదు. నా దశను చెప్పాలంటే, నా కణకణం నిరంతరం నిద్రిస్తున్నట్లుగాను, నిద్రించియే ఉంటూ ఉన్నట్లుగాను ఉంటోంది. ఇంతేకాదు, సమస్త

ప్రకృతి కూడా నిద్రించిందా అనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా, కోలాహలంగా ఉన్నా కూడా నేను నిద్రలో మునిగి ఉన్నట్లుగానే ఉంది. తిరుగాడుతూ ఉన్న మనుష్యులు అందరూ నాకు నిద్రిస్తున్న దశలోనే ఉన్నట్లుగా అనుభవమవుతోంది.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 570

షాజహాన్‌పూర్,

28.06.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం 25.06.1956వ తేదీతో ఉన్నది అందింది. ఇపుడు నీ ఆధ్యాత్మిక యాత్రా స్థానం '$K_1$' అయి ఉండగా దానిలో యాత్ర క్రమక్రమంగా ఆరంభమైంది. ఇపుడు దానిపైకి నా దృష్టి సారించబడి నపుడు అది నాకు ఎంతో తాజాదనంతో స్వచ్ఛంగా మిలమిలలాడుతూ కనిపించింది. అది నాకు ఎంతో ఉల్లాసం కలిగించటమే కాకుండా దానితో నాలోని శుష్కించిన స్థానాలు కూడా తెలియకుండా పోయాయి. ఈ స్థానాన్ని వర్ణించాలంటే అది ఒక ఉషోదయంలాగా ఉంటుంది. దీనిలోని అణువులు చాలా సూక్ష్మస్థితిలో ఉంటాయి. ఇంకా చెప్పాలంటే, మాయ యొక్క తళుకుబెళుకులు కూడా చాలా స్వల్పంగా ఉంటాయి. ఈ స్థానం అంతా నిద్రావస్థలో ఉన్నట్లుగా అనిపిస్తోంది. దీనినిపోల్చి చెప్పాలంటే, ఒక యజమాని తన స్వంత ఇంటిని కాల్చివేసి లేదా ప్రపంచాన్ని నాశనంచేసి తనకు ఏమి పట్టనట్లుగా ప్రశాంతంగా నిద్రిస్తూ ఉన్నట్లు ఉంటుంది. ఇటువంటి స్థితినే నీవు నీ ఉత్తరంలో వర్ణిస్తూ వ్రాశావు. ధ్యాన సమయంలో నీవు ప్రాణాహుతి నిస్తున్నట్లుగా తలంచవద్దు. ఇది లయ–అవస్థకు మంచి నిరూపణ. ఆ స్థానంలో నీ ఆధ్యాత్మిక యాత్ర యొక్క పరిణామం ఎటువంటిదంటే, నీ శరీరంలోని కణకణమూ మగతగా నిద్రపోతున్నట్లుగా అనుభూతి కలుగుతుంది. కేసర్ ఉత్తరం కూడా చేరింది. ఆమె కూడా ఒక మంచి స్థితిని కలిగి ఉన్నట్లుగా తెలుస్తోంది. ఆమెకు నేను అప్పగించిన మిషన్ బాధ్యతను నిర్వర్తిస్తున్నట్లుగా భావిస్తున్నాను. **నీ ఉత్తరాలు, వాటికి నా జవాబులు – వీలైనంతవరకూ కేసర్ నకళ్ళు తయారుచేస్తూ ఉన్నట్లయితే, వాటిని ముద్రించవచ్చు.**

నీ సోదర సోదరీలకు ఆశీస్సులు. అమ్మకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 571

లఖీంపుర్,

30.06.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది, చదివి సంతోషించాను. నేను ఆరోగ్యం నిమిత్తం తప్పకుండా పరిశ్రమిస్తాను. తమరు విచారించవద్దు. నేను బాగానే ఉన్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నా స్థితి ఎలా ఉందంటే, పని చేస్తున్నా లేదా పండుకొని ఉన్నా దశలో ఎలాంటి భేదం ఉండటం లేదు. నా శారీరక స్థితిలో కూడా నాకు భేదం ఏమీ కనిపించటం లేదు. ఇంతకుముందు తమ ఎడతెగని విశ్వాసం

కారణంగా ప్రతి పనిలోను, ప్రతి విషయంలోను ఒక పట్టలేని ఉత్సాహం నిండి ఉండేది. కాని ఇప్పుడు ఏమైపోయిందో ఏమో దైవానికే తెలియాలి, ఇప్పుడు కూడా అదే పని చేస్తూనే ఉన్నాను కాని ఆ ఉత్సాహం ఉండటం లేదు. దానికి బదులుగా మందకొడిగానైనా పనులు వాటంతట అవే జరిగిపోతున్నాయి. ఇది మాత్రం ఖాయం. ఏమిటంటే, ఆశ నిరాశలు కూడా ఆ సమయంలోగాని, మరెప్పుడైనాగాని ఉండటం లేదు. ఇప్పుడు నాకు శాంతి యొక్క అనుభూతిగాని, అశాంతి యొక్క అనుభవం కాని కలగటం లేదు. ఇప్పుడు ఉన్న దశ ఎటువంటిది అంటే, అది వ్యక్తం కాదు, అవ్యక్తమూ కాదు అనగా తెలియదగినది లేదా తెలియలేకున్నదీ కాదు. నాలో స్పృహ కలగటానికి రేయింబవలు ఎటువంటి ఆలోచనా తట్టటం లేదు. ఆ స్పృహ మాత్రం ఎక్కడి నుండి వస్తుంది. అది పోయి ఉంటేనే కదా తిరిగి వచ్చేది. కనుక పోయిందీ లేదు, తిరిగి రావలసిందీ లేదు. వ్యక్తం, అవ్యక్తం అని నేను చెబుతున్న మాటలు వాస్తవానికి అవి నిరుపయోగమైనవి.

ఇప్పుడు లోపల, బయట కూడా ఏ పని జరగటం లేదనిపిస్తోంది. సమస్త ప్రకృతిలో నిద్రావస్థయే నెలకొని ఉంది. ఇప్పుడు ఉన్నది ఎటువంటి దశ అంటే, అక్కడికి ఎవరి మనస్సుగాని, ఆలోచనగాని దరిచేరలేవు. అనుభూతికి కూడా అవకాశం లేదు. నా మనస్సులోనైతే, నేను "మాలిక్ శరణాగతురాలిని" అని చెప్పటానికి మరియు అనుభూతి చెందటానికి అవసరమైన శక్తి కూడా లేకుండా పోయింది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెప్తున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 572

లఖీంపుర్,
03.07.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా పంపాను. అది తమకు చేరి ఉంటుందనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో రాత్రి సమయంలో అంతటా ఉండే నిశ్చల నిశ్శబ్దం ఆవరించి ఉంది. అన్ని ఇంద్రియాలలోను రాత్రి సమయంలో ఉండే ఆ నిశ్శబ్దమే వ్యాపించి ఉంది. గుండె చప్పుడు కూడా వినపడటం లేదు. దానిలో కూడా మృత్యువు వంటి నిశ్శబ్దం వ్యాపించి ఉంది. శరీరంలో ఉన్న అన్ని రక్త నాళాల్లోను, కణకణంలోను, లోపల, బయట, అన్ని వైపులా రాత్రివంటి నిశ్శబ్ద వాతావరణమే అల్లుకొని ఉంది. ఆ నిశ్శబ్ద వాతావరణంలోనే నాకు పూర్తి విశ్రాంతి లభిస్తున్నది. నా ఈ దశలో ఎల్లప్పుడూ మృత ఆసనంలోనే పడి ఉంటున్నాను కాని నాకు ఆసనం యొక్క స్పృహ లేదు. నా అంతరంగంలోను, బయట-లోపల అన్నివైపులా ఒక (Everlasting Rest) శాశ్వత విశ్రాంతి ఏర్పడి ఉన్నట్లుగా అనిపిస్తోంది. నా కణకణంలోను నిశ్శబ్ద ప్రళయమే వ్యాపించి ఉన్నదా అన్నట్లుగా ఉంది. ఇప్పుడు మృత ఆసనమే నా స్వరూపమైపోయినట్లుగా ఉంది. రాత్రి నిశ్శబ్దపు దశ నా కణకణంలోను, నరనరాల్లోను, నా స్వరూపమే అది అన్నంతగా కలసిపోతోంది.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 573

షాజహాన్‌పూర్,
06.07.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం 30.06.1956వ తేదీది చేరింది. నీవు యాత్రచేస్తూ ఉన్న స్థానం '$K_1$' అని, దానిలోనే నీ స్థితి కొనసాగుతున్నదని నేను క్రితం ఉత్తరంలో వ్రాశాను. ఆ స్థానం ఎలా ఉంటుందంటే, దానిని ఒక అరణ్య ప్రాంతంతోనో లేదా పాడుపడిన నిర్జన ప్రదేశంతోనో పోల్చదగినదిగా ఉంటుంది. ఈ స్థానంలో ప్రకృతి తన ఆవరణలు అన్నింటినీ విడిచిపారేస్తుంది. దానితో (Load, weight) బరువు, భారం అన్నీ తొలగిపోయినట్లవుతుంది. అయినప్పటికీ ప్రకృతి సూక్ష్మరూపంలో కొంత మిగిలి ఉంటుంది. ఇది కూడా తొలగిపోతున్నప్పుడు, దానిని మహాప్రళయగతి లేదా మూలస్థితి (పూర్తి లయ-అవస్థ) అని చెప్పవచ్చు. దీని తర్వాత దాని రూపం స్వయంగా చెదరిపోతూ ఉంటూ, దాని ఆవరణలు కూడా స్వయంగా తొలగిపోతూ ఉంటాయి. నీకు ప్రకృతి అంతా నిద్రపోతున్నట్లుగా అనిపించటానికి ఇదే కారణం. ఇప్పుడు **అభ్యాసులకు ఈ స్థానాలను దాట శక్యంకాదు. అభ్యాసీ ఈ యాత్రలో ముందడుగు వేయాలంటే, మూలస్థానానికి చేరాలను తపన మరియు అవిశ్రాంతతయే సహకారాలుగా ఉంటాయి. దీనిని గమనించినమీదట ప్రాణాహుతి ప్రసార ప్రదాత (Transmitter) అనగా దివ్యమార్గదర్శి (సద్గురువు) అతడిని ముందుకు నడిపించుకుపోతూ ఉంటాడు.**

**వేలకొలది సంవత్సరాలు ధ్యానం ఆచరించినప్పటికీ, ఒక మంచి ఆధ్యాత్మిక మార్గదర్శకుని సహాయం లేకుండా అభ్యాసీ ముందుకు పోవటం అసంభవం అని నేను గట్టిగా చెప్పగలను. ఒకవేళ అభ్యాసీ తన స్వశక్తితో ముందుకు పోవాలని ప్రయత్నించినప్పటికీ, అతడ్ని శక్తి ఒత్తిడిచేసి అణచిపెట్టడంతో ఒక అవరోధం ఏర్పడి, అతడు ముందుకు పోజాలడు. ఇది మన లాలాజీ సాహెబ్ దయ, కృపా విశేషాలతోను మరియు వారి దివ్యశక్తితోను పురోగతి సాధ్యపడుతున్నదే కాని మరెవ్వరివలన కాదు.** నీ ఈ గమనంలో నీకు అలుపు తెలియదు. ఎందుకంటే, ఈ స్థానంలో యాత్ర నెమ్మదిగా, క్రమంగా ఉంటుంది. ఒకవేళ ఈ గమనంలో వేగం కల్పించినట్లయితే, ప్రకృతి తొలగించుకున్న ఆవరణలు మళ్ళీ ధరించినట్లు అవుతుంది. అందుచేత దాని గతి (నడక) సూక్ష్మంగా జరుగుతూ ఉంటుంది. అంటే సూక్ష్మంగా దానిలోని యాత్ర జరపబడుతూ ఉంటుంది. మన **లాలాజీ సాహెబ్ కాకుండా మరెవ్వరూ దీనిని సుసాధ్యం చేయలేరని నీకు మరొక్కసారి తెలియజేస్తున్నాను. ఇక్కడ దివ్య మేధస్సు (Divine Intelligence) మాత్రమే పనిచేస్తుంది.** అమ్మకు మరియు చౌబేజీలకు ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 574

లఖీంపుర్,
06.07.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను ఒక ఉత్తరం తమకు పంపించాను, బహుశా అది తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో నా ఆరోగ్యం ఇప్పుడు బాగానే ఉంది. చింతించాల్సిన అవుసరం లేదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

అదేమిటో దైవానికే తెలియాలిగాని, నేను నిద్రించి ఉన్న ప్రకృతికి ఆవలి తీరంలో యాత్ర చేస్తున్నాను. అలాకాదు గాని, ప్రకృతి కూడా నన్ను జీర్ణించుకుపోతున్నదా అన్నట్లు అనిపిస్తోంది. నాకు ఏమి అనిపిస్తోంది అంటే, నాపై యాత్ర ఏదైతే ఉందో, అది నా సుప్తచేతనా మనస్సు (Sub-conscious mind) ద్వారా స్వయంగానే జరుగుతున్నట్లు ఉంది అని. దానిలో కూడా ఇప్పుడు నా మనస్సు, చేయి కలగజేసుకోవటమంటూ లేదు. నా సుప్తచేతనా మనస్సు (Sub-conscious mind) కూడా కరిగిపోతూనో లేక కలిసిపోతూనో లేదా లయమైపోతోనో ఉంది. నేను ఇంకా చూస్తున్నది ఏమిటంటే, నా (Sub-conscious mind) సుప్తచేతనా మనస్సుయే సమస్త ప్రకృతి యొక్క స్వరూపమా అన్నట్లు ఉంది. అందువలన నా దృష్టి నుంచి ఇప్పుడు ప్రకృతి కూడా కనుమరుగైపోతున్నట్లుగా ఉంది. నాకయితే ప్రకృతి కూడా కేవలం ఒక తుడిచివేయబడిన జీవనరేఖలాగా ఉంది. ఆ తర్వాత అది కూడా తుడిచివేయబడుతున్నట్లుగా చూస్తున్నాను. ఇటువంటి దశలో అభ్యాసీకి (Sub-conscious mind) సుప్తచేతనా మనస్సే ఒక నివాసస్థలంగా అవుతుందని గ్రహిస్తున్నాను. నాది కూడా ఇటువంటి దశయే అయినప్పటికీ నేనయితే (Sub-conscious mind) సుప్తచేతనా మనస్సులో కూడా ఉండటం లేదు. నేనయితే ఇక్కడా లేను, అక్కడా లేను, మరెక్కడా లేను. అంధకారమంతా నాలోనే కలిసిపోతున్నట్లు అనిపిస్తోంది. నా హృదయంలో మిళితమైపోతున్నట్లు ఉంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. పిల్లలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన<br>
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 575

షాజహాన్‌పూర్,<br>
12.07.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం బాబు శ్యామ్ బిహరీ ద్వారా చేరింది. జులై 3వ తేదీ ఉత్తరంలో నీవు వ్రాసిన స్థితికి జవాబు నేను క్రితం ఉత్తరంలోనే వ్రాశాను. దానికి జవాబు నీవు 6 జులై 1956వ తేదీ ఉత్తరంలో వ్రాశావు. నీవు నీ స్థితిని గురించి వివరిస్తూ, అది రాత్రికి పోలినట్లుగా ఉందని వ్రాశావు. అది '$K_1$' స్థానానికి చెందినది. **జనం భగవంతుణ్ని ఎందుకు కలవలేకపోతున్నారు? ఎందుకంటే, జనం దైవాన్ని బాహ్యమైనవాటిల్లో వెదుకుతారు. కాని 'అతడు' చీకటిలో తడిమితేనే దొరుకుతాడు. పగలులో రాత్రిని వెదికినా దొరకదు; అదే విధంగా రాత్రిలో పగలు వెదికినా కనిపించదు.** దీనికి అర్థం ఏమిటంటే, ఎవ్వరైతే భగవంతుణ్ని పొందుతారో, వారికి కాంతి (తళుకు) యొక్క సహాయపు ఆలోచన అతని మనస్సులోకి కూడా రాదు. అందుచేత నేను నిన్ను ఇప్పుడు చీకటిలోకి అనగా నిన్ను నీవు గుర్తించలేనంతటి చీకటిలోకి తీసుకొని వెళ్ళుతున్నాను. దీనికి ముందు ఇంక ఉండేది చీకటే చీకటి. అయితే ఇంకా ముందుకు సాగిపోతే దీనిని చీకటి అని చెప్పటానికి కూడా వీలులేదు కాని అక్కడకు చేరాక కాంతికి కూడా వీడ్కోలు చెప్పేస్తాము. ఆ తర్వాత ఇంకా ముందుకుపోయి చీకటికి కూడా వీడ్కోలు చెప్పాల్సి ఉంటుంది. అప్పుడు మనం అసలు భాండాగారం (రియాలిటి) ప్రవేశించగల్గుతాం. అక్కడ ఏమి ఉంటుంది? అక్కడ చీకటిగాని, కాంతిగాని అలాగే రాత్రిగాని, పగలుగాని ఉండవు. అయితే గమనం (నడక) మాత్రం ఇంకా ఉంటుంది.

కేసర్ ఉత్తరం అందింది. దేవుని దయవలన ఆమె స్థితి కూడా బాగానే ఉంది. అమ్మకు, చౌబేజీకి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు తెలుపుతున్నాను.

నీ క్షేమం కోరుతూ<br>
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 576

లఖీంపుర్,

16.07.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ సంగతి ఏమిటో దైవానికే తెలియాలి, అది ఏమిటంటే, ఇప్పుడు పగలంతా మధ్యమధ్యలో అకస్మాత్తుగా ఎంత శుష్కించిపోయిన శరీరంగా అయిపోతున్నది అంటే, దాని లోన, బయట ఈ శుష్కించిపోవటం (Dryness) జరిగి వ్యాపించిపోతోంది, ఇంక గత్యంతరంలేక అటు ఇటు తిరుగాడుతున్నాను. ఇప్పుడు ఈ దశలో నాకయితే నా అస్థిత్వం, సత్యత్వం (రియాలిటీ) యొక్క జాడ తెలియకుండా ఉంది. ఇది నావరకే పరిమితం కాకుండా ప్రతి మానవుడు, ప్రతి వస్తువులోను, నాకు చెందిన ఈ దశయే ఉంటోంది అనగా ఏమి లేనట్లుగానే! ఇప్పుడు (రియాలిటీ) సత్యత్వమే సమాప్తమైపోయింది. ఇప్పుడు ఏమిటో, ఎక్కడకు వెళ్తున్నానో కూడా తెలియకుండా ఉంది. ఇప్పుడు ఉన్న ఈ దశలో ప్రతి (Element) తత్త్వం, ప్రతి అణువు కరిగి అంతమైపోయాయి. నా స్థితి ఎలా ఉన్నదంటే, జనం చీమవంటి నన్ను చిదిమివేయవచ్చు కాని, నేను కుట్టునటువంటి కీటకాన్ని కాను. అది ఏమిటోగాని, ప్రతి మానవుడు, ప్రతి వస్తువు నాకు ఒకే విధంగా అనుభవమవుతోంది. మరో విధంగా చెప్పాలంటే, ఒక్క స్థితియే నా దృష్టికి వస్తోంది, ఆ స్థితి యొక్క స్థితియే నా స్వరూపంగా అయిపోయింది.

ఇప్పుడు అది ఏమిటోగాని, ఒక సూక్ష్మ పరదా లేదా నా అజ్ఞానపు పరదా నా కళ్ళెదుటే ఒక్కసారిగా తొలగిపోయింది. ఆ తర్వాత ఉన్న స్థితి ఏమిటంటే, ఇప్పుడు ఈ దశ వంటిది బయట–లోపల ఉంది. అది ఏమిటంటే, దానిలో ఎన్నడూ ఏ మచ్చా పడనట్లుగాను, తెలుపురంగు కూడా లేకపోయినట్లుగాను, ఒక రంగులేని స్థితియే వ్యాప్తమై ఉండి అదే నా స్వరూపంగా అయిపోయినట్లుగాను ఉంది. ఇంక నా స్వరూపం సంగతి ఏమిటంటే, అది రూపంలేని రూపంగాను, రంగులేని రంగుగాను అంగీకరించాను. ఇప్పుడు అసలుతనం, నకలీతనం రెండింటి అంతూ పొంతూ లేదు. ఇప్పుడు ఏ తంతువు / తీగ లేదు. దానిని మీటటమూ లేదు. అయితే, హృదయం కూడా తరచుగా దానంతటి అదే ఒక కంపనం (Vibration) వంటిది ఉంటోంది. కాని దానిని గురించిన పరిజ్ఞానం నాకు ఏమైనా ఉందో లేదో తెలియదు. ఇప్పుడు ఈ మార్గం ఏమిటో తెలియకుండా ఉంది. నిజం చెప్పాలంటే, ఇప్పుడు మార్గంలో మార్గం లేదు. మార్గగాముల్లో మార్గగామి లేదు, ఎక్కడా మార్గదర్శకుడు లేదు.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 577

లఖీంపుర్,

23.07.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ మార్గమేమో కాని, నిజానికి మార్గం లేదు. మార్గగామి లేదు, మార్గదర్శీ లేదు. ఒక పాడుబడిన మైదానం ఉంది. దానిని స్వయంగా మృత్యువే నిద్రిస్తూ ఉన్నట్లుగా పోల్చవచ్చు. ఇప్పుడు నా దశ ఏమిటంటే, నేను

స్వయంగా నన్నే మేల్కొని ఉన్నట్లుగా పొందలేకపోతున్నాను. పోనీ మరణం జరిగింది అని చెబుదామంటే, జన్మించటానికి ఏర్పాటు జరగకుండానే మరణం అని ఎలా అంటాను. ఇప్పుడు నా ఈ దశలో జ్ఞానం, అజ్ఞానం రెండూ సమానంగానే ఉన్నాయి. వ్యర్థమైనవిగా ఉంటున్నాయి. వాటికి అర్థం అంటూ ఏమీ లేకపోయింది. అనుభవం అను దానికి కూడా అర్థం నా అనుభవానికి రావటం లేదు. దశను గురించి చెప్పాలంటే, అది పవిత్రంగా ఉందనిగాని, సరళంగా ఉందనిగాని నేను చెప్పలేను. కాని నాకు ఏమి అనిపిస్తున్నది అంటే, వీటి మూలమే అంతమైపోయిందని అనిపిస్తోంది. జీవితం లేదు, ముక్తీ లేదు. దశ ఎలా ఉంది అంటే, కళ్ళు మూసుకుపోయాయా లేక కళ్ళు మూసుకుని నడుస్తున్నానా అన్నట్లు ఉంది. విశ్రాంతి కూడా ఇక్కడ విశ్రాంతి తీసుకుంటున్నదా అన్నట్లు ఉన్నది. ఇప్పుడు జ్ఞానం లేక స్పృహగాని, పటుత్వంగాని లేవు. నా దశలో ఏ (Element) తత్త్వమూ లేదు, వాస్తవికత (రియాలిటి) లేదు. ఒక అంతులేని మైదానం నాలో కలిసిపోయినట్లుగా అనిపిస్తోంది. నాలో ఇప్పుడు (Activeness) చైతన్యం, (Inactiveness) అచైతన్యం లేవు. అవి రెండూ విలీనమైపోయినట్లు లేదా లయమైపోయినట్లుగా ఉంది. అయితే ఎక్కడ? ఇది నాకు తెలియదు. ఎప్పుడు? ఇది కూడా నాకు తెలియదు.

ఇప్పుడు ఇక్కడ విరాట్ రూపం ఎక్కడ ఉంది. ఇక్కడ సూక్ష్మ రూపం యొక్క జాడ కూడా తెలియదు. జీవన్ముక్త స్థితి కూడా సమాప్తమైపోయింది. వాస్తవంగా చెప్పాలంటే, ఇక్కడ తెలియచేయటం (Expression) లేదు. పోనీ తురీయావస్థ అని చెబుతామంటే, స్వయంగా నాకే ఏదో పనికిరానిదానిని పొందుతున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు నేను చూస్తున్న దశ ఏమిటంటే, రంగు యొక్క చుక్కలు (ప్రేమ అను రంగు) కూడా ఎవరో ఇంతకుముందే తనమీదే వేసుకున్నట్లుగా అనిపిస్తుంది. నన్ను ఎవరు దాని నుంచి రక్షిస్తూ ఉన్నారో, ఆ విధంగా రక్షిస్తూ ఉన్న 'అతడు' తన రూపం నాకు కనిపించకుండా ఎందుకు చాటుచేస్తున్నాడో కూడా నాకు తెలియటం లేదు. నేను వేసారిపోయాను కాని 'అతడు' తనను వెంటబెట్టుకుని ఉంటూ కూడా కనిపించకుండా ఉంచుతున్నాడు. నాలో ఇప్పుడు అంత జ్ఞానం లేదు, తెలివి లేదు. దీనికి అంటే అసలు నా పురోగతి ఉన్నదా లేదా, నేను ఎప్పుడైనా పురోగమిస్తానా లేదా అనే ఆలోచన లేకుండా పోయింది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. పిల్లలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 578

షాజహాన్‌పూర్,
28.07.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ రెండు ఉత్తరాలు, 1956 జులై 16 మరియు 23వ తేదీలవి అందాయి. **దేవుడు ఉన్నాడు అని కాని, దేవుని ఉనికినిగాని నిరూపించదగిన విషయం కాదు. అది అనుభవానికి రావలసినదేగాని మాటల ద్వారా అనగా చర్చల ద్వారా నిరూపించలేము. 'అతడి'ని చూడటానికి ఏదైతే అవసరం ఉందో దాని ద్వారానే 'అతడు' అనుభూతికి అందుతాడు. అలాగే దర్శనం ఇస్తాడు.**

నీ ఆధ్యాత్మిక యాత్రా స్థానం '$K_1$' అయి ఉండగా దానిలో నీ యాత్ర షుమారు మూడవ వంతు పూర్తి అయ్యి నీవు అక్కడ ఆగిపోయావు. ఎందుకంటే, నీవు ఇంక ముందుకు సాగటానికి శక్యం కాదు. అడుగడుగునా ఇప్పుడు తోడుండి నడిపించాల్సి ఉంటుంది. నేను ఈ మధ్య కొద్దిరోజులుగా వేరే ధ్యాసలో ఉన్నాను. కొన్ని చిక్కులు కూడా ఎదురయ్యాయి. దైవం వాటిని పరిష్కరిస్తే నవంబరులో దక్షిణ భారతదేశం వెళ్ళగలుగుతాను. అందుచేత నీ విషయంలో

దృష్టిపెట్టలేకపోయాను. ఇప్పుడు నీ యాత్ర మళ్ళీ కొనసాగుతుంది. దైవం తలిస్తే, ఈ ఉత్తరం నీకు చేరేసరికే దాని అనుభూతి నీకు కలుగుతూ ఉంటుంది. నీవు పంపిన రెండు ఉత్తరాలలోను సమాధానం ఇవ్వదగిన అంశాలు ఏమీ లేవు. ఇంకొక విషయం ఏమంటే, ఇటువంటి సూక్ష్మగతుల గురించి తెలియజెప్పటం కూడ చాలా కష్టమే అవుతుంది. ఎందుకంటే, వాటిని వివరించటానికి తగిన మాటలు దొరకటం కష్టం కనుక, వాటిని వివరించటం కూడా అంతకంటె కష్టతరమవుతుంది. అయినప్పటికీ నేను అతిప్రయత్నంమీద ఎంతోకొంత జవాబు వ్రాయాలనే అనుకుంటున్నాను.

కాశీరామ్‌గారి ఉత్తరం అందింది. ఆయన పత్రికను విడుదల చేయటానికి తొందరపడుతున్నారు. దానిలో 24 పేజీలు హిందీ, 8 పేజీలు ఇంగ్లీషుకు కేటాయించారు. నీవు నీ వ్యాసాలు పంపుతూ ఉండు. దీనికి సంవత్సర చందా 3 రూపాయాలుగా నిర్ణయమైంది. నాకు కూడా ఏదైనా వ్రాయాలనిపిస్తోంది కాని ఏమి వ్రాయాలో తోచటంలేదు. నా మెదడు ముసలిదైపోయిందంటావా? అలాగైతే భగవంతుని దయగలిగినట్లయితే, విషయం, శక్తి వాటికవే వస్తాయి కాని, నా స్వప్రయత్నంతో ఏమీ కాదు.

నీ సోదర సోదరీలకు ఆశీస్సులు. చౌబేజీ మరియు అమ్మకు ప్రణామం. కేసర్ ఉత్తరం చేరింది. ఆమె స్థితి బాగా కొనసాగుతోంది.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 579

లఖీంపుర్,
25.07.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న పూజ్య మాస్టర్ సాహెబ్‌గారు వచ్చేశారు. వారి నుంచి సమాచారం మరియు తమ ఆరోగ్యం గురించి తెలుసుకుని సంతోషం కలిగింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా ఈ స్థితిలో అన్నీ కూడా శక్తిరహితం అని నాకు అనిపిస్తోంది. బయట, లోపల అంతా కూడా శక్తిహీనమే. ఎంతగానంటే..., శక్తి యొక్క అస్థిత్వమే లేనట్లుగా నేను చూస్తున్నాను లేదా నాకు ఏమైనా అయ్యిందేమో. సమస్త ప్రకృతి, అన్నీ నాకు శక్తిహీనంగానే కనిపిస్తున్నాయి. (Existence) ఉనికి అను పేరుతో ఏ వస్తువూ లేదు. అంతా కల్పితమే అన్నట్లు ఉంది. అది ఏమిటో కూడా తెలియదు. అది ఎంతగానంటే, నా శరీరంలో కూడా (Power) శక్తి ఉన్నట్లుగా అనుభవం కావటంలేదు. అలాగే బలహీనత (Weakness) విషయంలో కూడా. ఇటువంటి స్థితియే అన్నింటికీ తగి ఉంది. (Power) శక్తి ఉన్న కేంద్రం కూడా దృష్టికి రావటం లేదు. నేను 'మాలిక్' చరణాలను పట్టుకుని ఉన్నాను. అయినా కూడా శక్తి యొక్క జాడ ఎక్కడా అనుభవం కావటం లేదు లేదా నా స్థితియే ఏదైనా స్థితిలేనిదిగా అయిపోయిందేమో. (Powerless) శక్తిహీనత అంటే ఏదైనా (Helpless) నిస్సహాయ అవస్థ అనటానికి వీల్లేదు.

ఇప్పుడు ఏమిటోగాని, భాగ్యవంతంగాని, పేదరికంగాని అంచనా వేయలేకపోతున్నాను. ఈ రెండు కూడా నాకు శక్తిరహితం మరియు సమానమే. ఇప్పుడు స్థితి యొక్క ఉదయాస్తమానాలు లేవు. ఏదైనా ఉన్నదంటే, ఒక సహజ చైతన్యమేమో కాని, అది కూడా ఉదయాస్తమానాల్లో జతకూడదు, కాని దానివలన నా దశ యొక్క సంగతి తెలుస్తుంది. అయినప్పటికి జ్ఞానం లేదా అజ్ఞానం రెండు సమానమే. రెండూ శక్తిహీనమే. గతంలో, నా ఆంతరికంలో ఎల్లప్పుడూ తెలిసిగాని, తెలియకుండాగాని ఒక నికరమైన ఆనందం నెలకొని ఉండేదని, మరియు నా లోపల నుంచి ఒక ఆత్మ ప్రకాశం ఉండి, దానివలన శరీరం అంతా బయట, లోపల అంతటా ఒక పవిత్ర ప్రకాశం వంటిది అనుభవమవుతోందని, నేను వ్రాస్తూ ఉండేదానను కాని, ఇప్పుడైతే లోన, బయట, శరీరం, ఆత్మ వంటివి ఏవీ

కనిపించటం లేదు. అన్నీ కలిసి ఏకమైపోయాయి కనుక, దీనిని అంధకారం అని చెప్పటానికి వీల్లేదు. ప్రకాశం అంటే అది చాలా భారమైన వస్తువుగా అవుతుంది.

ఇప్పుడు నేను నన్నుగా భావించి పని చేస్తున్నాను, అయినా కూడా (Existence) ఉనికి యొక్క ఆలోచన కూడా ఉండటం లేదు. ప్రాణం పోయిందని చెప్పటానికి వీల్లేదు, అలాగని ప్రాణం లేనిదానను కాదు. నాకు రెండు సమానమే. ఇప్పుడు ఆనందం, ఆనందం లేకుండా ఉండటం అని చెప్పినా రెండు సమానమే. అన్నీ కూడా శక్తిహీనమే మరియు అన్నీ ఒక్కటైపోయాయి.

నాకు ఇప్పుడు అన్నీ కల్పితమేనని అనిపిస్తోంది. వాస్తవంగానైతే అది ఉంది, ఇప్పుడూ ఉంది కాని జాడలేదు. 'మాలిక్' ఏదైనా ఇస్తారేమో అది కూడా తెలియటం లేదు. అలాగని జాడలేకపోవటం లేదు. ఎటువంటి తత్త్వం లేదు. అన్నీ శక్తిరహితమే. దేనియొక్క ఉనికి లేదు. ఇంతకుముందు అయితే, నాకు ఏదో వస్తువు శక్తిని ఇస్తున్నట్లుగా ఉండేది కాని ఇప్పుడు నేనేమీ చెప్పలేను. ఇప్పుడు ఉనికి యొక్క ఉనికియే లేకుండాపోయింది. అంతా ఏకమైపోయింది. ఏదో వస్తువు నన్ను తనవైపు గుంజుకుంటోందని ఇదివరకు వ్రాస్తూ ఉండేదానిని కాని ఇప్పుడు అలా లేదు.

నేను దశను గురించి వ్రాశాను, కాని దానిని బాగా వ్యక్తీకరించటానికి నా మనస్సులో తగిన మాటలు లేవు. నా శిరస్సు (మైండ్) లోపల ఏదో బహుసూక్ష్మమైన పరదాను చింపివేసినట్లయితే నేను ఎక్కడికో ఎగిరిపోవచ్చు అన్నట్లుగా ఉంది. ఎక్కడైతే పాపిడి అంతమవుతుందో అక్కడ ఏదో ఉంటుంది. నేను దానిని చెప్పలేకపోతున్నాను.

చిన్నపిల్లలైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 580

షాజహాన్‌పూర్,
30.07.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ గత ఉత్తరాలకు వ్రాసిన సమాధాన లేఖలు కూడా ఈ కవరులోనే జతపరిచి పంపుతున్నాను. ఇప్పుడు జులై 25వ తేదీ ఉత్తరానికి జవాబు కూడా వ్రాసి దీనిలో పంపుతున్నాను. నేను గత ఉత్తరంలో నీ యాత్ర '$K_1$' స్థానంమీద మూడవ వంతు పూర్తయిపోయి, ఆ తర్వాత నిలిచి పోయిందని వ్రాశాను. నేటి నుంచి దానిలో చైతన్యం మళ్ళీ ఆరంభమవుతోంది. దైవం తలిస్తే, ఈ ఉత్తరం చేరేసరికి నీ యాత్ర పూర్తిస్థాయిలో ఆరంభమవుతుంది. ఇకమీదట నేను ఎంతమేరకైతే ప్రాణాహుతి శక్తిని నీకు ఇస్తూ ఉంటానో దానినిబట్టే నీ యాత్ర కొనసాగుతుంది. దీనిలో నీ తప్పిదం ఏమీ లేదు. అత్యున్నత స్థానాలలో కొంత నెట్టటం లేకుండా ఎవరూ ముందుకుపోలేరు. ఎవరికైతే ఇటువంటి సూక్ష్మగతులు అనుభవమవుతూ ఉంటాయో వారికి మాత్రమే నా మాటలమీద విశ్వాసం ఉంటుంది. తమ స్థితితో సూటిగా దైవాన్ని మెప్పించేటట్లు ప్రేమించగలిగిన ఒకరిద్దరు సెయింట్స్ మాత్రమే దీనిని సాధించగలిగారు. ఇలా చేయగలిగినట్లయితే ఇటువంటి ప్రేమ కూడా చాలా మంచిదే అవుతుంది. జీవితకాలంలో 'అహం' యొక్క ఈ వలయాలను (16 వలయాలు) దాటగలిగిన వారు 'లాలాజీ' మినహా మరెవ్వరూ లేరు. నేను పరిశీలించినంతవరకు, ఇంత ఉన్నతంగా ఎదిగినవారు ఇంతకుపూర్వం ఉన్న మహాత్ములలో ఎవ్వరూ కనిపించలేదు. నా దృష్టిలో ఎవ్వరైనా సరే, తన స్వయంకృషితో సఫలీకృతులు కావటం దుర్లభం అనిపిస్తుంది. ఎందుకంటే, గురువుయొక్క ప్రయత్నం లేకుండా ఏ అభ్యాసి అయినా, స్వయంగా అహంకార రహితంకావాలంటే (అహంకారం లేనివాడుగా కావాలంటే) ఆ ప్రయత్నంలో అతని దేహం నిలవలేదు. (అతని దేహత్యాగం జరగుతుంది) దీనికి తరుణోపాయం ఏమిటంటే,

ఆ అహంను లోపల (ఆంతరికంగా) కొద్దిగా అణచిపెట్టి ఉంచాల్సి ఉంటుంది. అది ఎలా అంటే, అభ్యాసీకి ఆ సంగతి ఎప్పటికీ తెలియకుండా ఉండేటట్లుగా చేయాలి. కన్నులున్నవారు కూడా చూడకుండా ఉండేటట్లు (చూడలేనట్లుగా) చేయాలి. దానిని పోల్చటానికి, కుర్చీ క్రింద ఉన్న ధూళి దానిమీద కూర్చున్నవారికి ఏమీ తెలియనట్లుగా ఉంటుంది. దేహధారణ నిలుపుకోవటానికి ఎంతోకొంత ఈ స్థితిని నిల్వాల్సి ఉంటుంది. నిజం చెప్పాలంటే, నేను "రాజయోగ ప్రభావం"లో చెప్పినట్లుగా 'అహం' పూర్తిగా నశింపుకావటమనేది 'మహాప్రళయ' కాలంలోనే జరుగుతుంది. ఆ సమయంలో అంతా ఏకమైపోయి ఒక (వస్తు) రూపం (Identity) లాంటిది ఏర్పడిపోయి, మళ్ళీ సృష్టి దానినుంచి పునరుద్భవిస్తుంది. అభ్యాసీ 'అహం' యొక్క 'వలయాల'ను దాటుతున్నప్పుడు అహంకారం యొక్క రూపం (Identity) 'చిహ్నం'గా మారుతుంది.

ఇప్పుడు నీ ఉత్తరం గురించి ప్రస్తావిస్తాను. నీకు నీ అస్థిత్వం (ఉనికి) తెలియకుండా పోతున్నదంటే అది లయ–అవస్థకు చెందిన ఒక అత్యున్నత స్థితి. అయితే ఈ స్థితి ఎటువంటి స్థాయికి చేరి ఉండాలంటే, అభ్యాసి ఎంతగా దృష్టి సారించినప్పటికీ దాని ముద్ర (Impression) హృదయంలో ఏర్పడకూడదు. (అనగా దాని భావం ఏమీ ఏర్పడకూడదు) ప్రకృతికి ఏదో ఒకటి (వస్తువు) శక్తి ఇస్తున్నట్లుగా అనిపిస్తున్న నీ అనుభూతి సమాప్తమైపోతున్నది అంటే, అది నీ (Consciousness) చైతన్యం లేదా స్పృహ లేకుండాపోవాలని అనుకుంటున్నట్లుగా తెలియజేస్తుంది. అయితే, దాని సూక్ష్మస్థితి ఉందనిగాని లేదా స్పృహ (చైతన్యం) యొక్క సూక్ష్మగతి ఇంకా కొనసాగుతున్నదనిగాని చెప్పవలసి ఉంటుంది. దైవేచ్ఛ ఉంటే నీ పురోగమన శుభవార్త అందుతుంది. ప్రపంచంలోని జనం యొక్క లక్ష్యం కేవలం స్వచ్ఛమైన చైతన్యం (Pure consciousness) పొందటం మాత్రమే. దానినే వారు భగవత్ సాక్షాత్కారంగా భావిస్తున్నారు. నా ఉద్దేశ్యంలో, ఇక్కడివరకు చేరినవారు 'అసలు' (రియాలిటి) యొక్క మైదానంలోకి కూడా చేరలేదు. నేను ఎవరికైనా ఈ విషయం చెప్పినట్లయితే, నా గొప్పదనం చాటుకోవటానికి నేను ఏదో క్రొత్త ఎత్తుగడ వేశానని విమర్శించవచ్చు. అది వారు ఉన్న సమాజాన్నిబట్టి, కొంతవరకు సహేతుకమే కావచ్చు. ఇంకా చెప్పాలంటే, ఘనమైన పూజాదికాలు బోధించే గొప్ప మహాత్ములు ఉండగా నావంటి అల్పుని మాట ఆలకించేవారు ఎవరు ఉన్నారు.

"నా శిరస్సును క్రమ్మి ఉన్న (ఆచ్ఛాదనం) ముసుగును ఎవరైనా తొలగించినట్లయితే, నేను ఎక్కడికైనా పోవాలనుకుంటున్నాను" అని నీవు వ్రాశావు. నీకు కలిగిన ఈ భావం సరైనదే. శిరస్సుమీద ఎక్కడైతే జుట్టు (పిలక) ముడివేయబడుతుందో దానిని బ్రహ్మరంధ్రం అంటారు. ఇక్కడ నుండి (Direct Revelation) ఆత్మ సూటిగా విడుదలవుతుంది. ఈ స్థానం ఇంకా చాలా దూరంలో ఉంది. దీనికి మధ్య చాలా పాయింట్లు ఉండవచ్చు. వీటి మధ్యగల దూరాన్ని కొలిచినట్లయితే అతిస్వల్పంగానే ఉంటుంది కాని, దూరం గురించి ఆలోచించకూడదు. వీటిలో ప్రతి ఒక్క స్థానం దైవానికి చెందిన ఒక పెద్ద గోళమే (Sphere). దీనిలోని స్థానాలను కొలవటం జరిగితే మనం ఉన్న ప్రపంచం లాంటివి వేలకొలది గర్భితమై ఉంటాయి.

జులై 16వ తేదీతో కేసర్ వ్రాసిన ఉత్తరం వచ్చింది. దానిలో వెలుతురు (ప్రకాశం) ఉండి కూడా చీకటిగా కనిపిస్తోంది అని ఆమె వ్రాసింది. దీనినిబట్టి ఆమె యాత్ర త్రికుటిలో జరుగుతున్నదని అర్థం. దానినే సూఫీలు 'సెయిర్–నఫస్' అని అంటారు.

అస్సాం నుంచి విడుదలయ్యే పత్రికలో ప్రచురణ కొరకు పంపించే వ్యాసాలలో నన్ను గురించిన పొగడ్తలు లేకుండా చూడాలి. లేకపోతే దానిని ఒక ప్రచారంగా భావిస్తారు. అయితే తత్త్వం గురించిన వ్యాఖ్యలు మాత్రం ఉండాలి. మన పుస్తకాలలోని పరిశీలనాంశాలు పేర్కొనటానికి ఎటువంటి అభ్యంతరం ఉండదు. అంతేకాకుండా 'లాలాజీ' పేరు ప్రస్తావించటం చాలా బాగుంటుంది కూడ. కాని అది ప్రకటన లేదా ప్రచారంలాగా ఉండకూడదు. అయితే **వారు** 'అసలు' (రియాలిటి) గురించి చెప్పినవికాని, వ్రాసినవికాని, అలాగే తత్త్వజ్ఞానం (Philosophy) గురించి

**వారు** వివరించిన మాటలుగాని ఉదహరించవచ్చు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 581

లఖీంపుర్,
2.08.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి చాలా సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఏమిటోగాని, నా మనస్సు స్వయంగా నా స్థితి వరకు చేరలేకపోతూ ఉంది. దానిలో కరిగిపోలేకుండా ఉంది. ఇంకొకటి ఏమిటంటే, ప్రతి మానవుడు నాకు ఇదివరలో నా స్వంత మనిషిలాగే ప్రియంగా అనిపిస్తూ ఉండేవాడు, కాని ఇప్పుడైతే నాలో విశ్వప్రేమ (Universal love) లేకుండా పోయింది. ఇప్పుడు నాకు స్వంతమని లేదు, ప్రేమా లేదు. ఇంకా చెప్పాలంటే, నాకు ఎవరిపట్ల ప్రేమ లేదు. విశ్వప్రేమ అనే దానికి ఉనికియే లేనట్లుగా నాకు అనిపిస్తోంది. ఏ తత్త్వం లేదు. అన్నీ ఖాళీ అయిపోయాయి. నా జీవన సర్వస్వమైన 'మాలిక్'పట్ల కూడా నాకు రవ్వంత మాత్రమైనా ప్రేమ లేకుండా పోయింది. ఇదంతా ఏమిటో నాకు అర్థం కావటం లేదు.

ఇప్పుడు స్థిరత్వం కాని, అస్థిరత్వం కాని కలగటమే లేదు. నాకు రెండు సమానంగానే అనిపిస్తున్నాయి. శ్రీ బాబూజీని పిలుస్తూనే ఉన్నప్పటికీ ఎవరిని పిలుస్తున్నానో, ఎందుకు పిలుస్తున్నానో నా దృష్టికి రావటం లేదు. ఎటువంటి రూపం, రంగూ నా కళ్ళెదుటకు ఎప్పుడూ రావటం లేదన్నట్లుగా గ్రహిస్తున్నాను. రోజంతా కళ్ళు చూస్తూనే ఉన్నాగాని అన్నీ కూడా ఒకటిగానే ఉన్నాయి. ఇంకా ఏమిటంటే, ఎవరైనా ఆకుపచ్చని దుప్పటి అడిగినట్లయితే నేను ఆ రంగు ఉన్నదే ఇస్తున్నాను. కాని నా మనస్సులో ఆకుపచ్చ, నీలం, పసుపుపచ్చ అనే భావన ఏమి ఉండటం లేదు. ఎవరైనా కేసర్‌ను పిలిచినట్లయితే నేను కేసర్‌నే పంపుతున్నాను కాని బిట్టోను కాదు. అయితే మనస్సులో కేసర్ మరియు బిట్టోల రూపమే లేనట్లుగా ఉంది. బాబూజీ, ఇదంతా ఏమిటో, ఎందుకు అవుతుందో తెలియటం లేదు. అంతా శక్తిహీనంగా అయిపోయింది. రాత్రి సమయంలో గంటల తరబడి కళ్ళు మూసుకుని పండుకుని ఉన్నా చీకటిలాగ అనిపించటం లేదు. కళ్ళు తెరవబడినాగాని వెలుతురు అనిపించటం లేదు. దీనిని ఒక మృతస్థితి వంటిదిగానే చెప్పాల్సి ఉంటుంది. 'మాలిక్'ను నేను ఎంతగా ప్రేమించాలని అనుకుంటానో అంతగా ప్రేమించలేకపోతున్నాను. కాని తపన కూడా తపనలో విలీనమైపోయింది. నాకయితే తపన మరియు తపన లేకపోవటం రెండూ సమానమేనని అనిపిస్తున్నాయి. నా స్థితిలో ఇప్పుడు వేగం లేదు. నిదానం లేదు. వీటిని గురించిన భావం కూడా నా మనస్సులో లేదు, అంతా ఖాళీ అయిపోయింది. చిన్నపిల్లలైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 582

లఖీంపుర్,
8.08.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. ఈశ్వరుని దయవలన తమరు ఆరోగ్యవంతులుగా ఉన్నారని భావిస్తున్నాను. తమరు సదా ఆరోగ్యంగా వర్ధిల్లాలని 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను.

'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

అదేమిటోగాని, ఇప్పుడు నా అంతఃకరణలో ఆనందం అనేది లేకుండా ఉంది. ఈ రోజు నాకు 'తమరు' నన్ను కలుసుకున్నట్లుగా అనిపిస్తోంది. నేను ఒక్కటిగా అయిపోయాను. ఇప్పుడు ఆనందం, దానితోపాటుగా పూర్తిగా (Balanced state) సామ్యావస్థ ఉంది. ఈ ఆనందం కూడా ఎటువంటిది అంటే, ఆనందం నాకు ఉన్నదా లేక ఎక్కడైనా ఉన్నదా లేదా శ్రీ బాబూజీ పులకించిపోతున్నరా అన్నట్లు ఉంది. (Sub-conscious mind) సుప్తచేతనా మనస్సు (Uniformity) ఏకాకారం దాల్చి బాబూజీలో లయమైపోయింది. ఆనందమైతే ఉంది కాని దానిలో శక్తి (Power) లేనట్లుగా ఉంది.

నా దశ ఎటువంటిది అంటే, నేను ఏకత్వం మరియు ద్వైతం రెండింటిలోనూ వేరుపడిపోయినట్లుగా ఉంది. ఇంతకుముందు నేను, ఏకత్వపు దశను అనుభూతి చెందుతున్నపుడు నాకు కొంచెం భయం వంటిది కలుగుతూ ఉండేది, కాని ఇప్పుడైతే ఎందుకోగాని ప్రయత్నించినా కూడా ఏకత్వం అనేది ఎప్పుడూ అనుభవానికి రావటం లేదు. ఒక మృదువైన కుండ మీద ఎంత ప్రయత్నించినా కూడా ఒక్క నీటి బిందువూ నిలవకుండా జారిపోతున్నట్లుగానే నా స్థితిని పోల్చవచ్చు. ఇప్పుడు ఏ దశా నాలో కలగటం లేదు. నా దశను మరణించిన దానిలాగానో లేక జీవించి ఉన్నదానిలాగానో, తమరు ఏది చెప్పితే అదే నేనుగా ఉన్నాను. ఇప్పుడు నా దశను స్వచ్ఛమైన నమ్రతా దశ అని చెబితేనే సబబుగా ఉంటుందని అనిపిస్తోంది. ఎందుకంటే, అది అంత ఖాళీ దశగా ఉంది. మృత శరీరానికి బట్టలు ధరింపజేసినా, లేదా నగ్నంగా ఉండనిచ్చినా ఒక్కటే ఉన్నట్లుగా ఈ నా దశ ఉంది. ఇప్పుడు అన్నింటితోను వేరుపడిపోయి ఉన్నాను. నేను 'మాలిక్'లో కలిసిపోతే ఏ ఆనందమైతే కలుగుతుందో అంతకుమించిన ఆనందం ఏమి ఉంటుంది. కాని ఇప్పుడైతే నా మనస్సు నా స్థితినే వదిలిపెట్టింది. ఇప్పుడు ఆలోచన కూడా నా స్థితిని పట్టుకుని, స్థితిలో కలపలేదు. ఆ స్థితి అనేది ఎక్కడికో దూరంగా వెళ్ళిపోయింది.

నేనయితే ఇదివరకు అన్నింటిలో ఒకటై ఉన్నాను. (Animate, Inanimate) జడ, చేతనా అన్నింటిలోను నేను ఏకమై ఉండేదానిని, కాని ఇప్పుడైతే నేను వాటివలన వ్యామోహం లేకుండా ఉన్నాను. నిజంగానే అన్నింటితో వేరుపడి ఉన్నాను. నాకు ఎవరితోను ప్రేమగాని, అనుబంధంగాని లేదు. ఇప్పుడు నేను అనుభవించుదానను కాదు. ఎందుకంటే, నా స్థిరత్వం అనేది నశించిపోయింది. నేను, 'నేను'గానే అయిపోయినట్లుగా అనిపిస్తోంది. అయితే, అసలు నేను ఎవరిని? అను చింతలేకపోలేదు. ఎందుకంటే, ఎటువంటి అస్థిత్వం (Identity) లేనట్లుగా అనిపిస్తోంది. నేను 'మాలిక్'లో లయమైపోయానా, లేదా అనేది నా అనుభవానికి రావటం లేదు. ఇప్పుడు నేను 'నేను'గానే అయిపోయాను. ఇప్పుడు నా బాబూజీ ఎక్కడికి వెళ్ళారు? తమరు అసలు నా స్వరూపమే అంటారా? ఇంతకు దశను ఏమనాలి అంటే, కేవలం స్వచ్ఛమైన నమ్రత దశయే అని చెప్పాలి. అది బాగా నీరసించిన ఖాళీ దశగా ఉంది.

ఇప్పుడు నా దశ ఎటువంటిది అంటే, నాకు ఉల్లాసంగా గడపటానికి అంటూ ఏ విషయం లేకపోయింది. నా ఈ దశలో మానసికానందం లేదు. దానికి బదులుగా ఒక శూన్యస్థితి మాత్రం ఉంది. ఆది ఎటువంటి ఒంటరి స్థితి లేదా స్థానం అంటే, అక్కడ ఇతరులు ఎవ్వరూ ప్రవేశించలేరు. అక్కడ ఈశ్వర మహిమకు అవకాశం లేదు. నా లోపల, బయట, కణకణంలోను 'మాలిక్' యొక్క ప్రకాశమే వ్యాపించి ఉన్నప్పటికీ, ఎందుకోగాని 'తమరు' తమ మనోహర రూపాన్ని నా నుంచి హరించి వేశారు. అందుచేత నాకు అది ఎక్కడా కనిపించటం లేదు.

నేను ఇంతకుముందు వ్రాశాను, ఏమని అంటే, పరదా తొలగిపోయినట్లయితే, ఎక్కడికో వెళ్ళిపోయేదానను. అలా జరిగినపుడు దశలో ప్రవేశించి పూర్తిగా అనుభవం పొందే దానను అని. 'మాలిక్' కృపతో దశ అయితే ఇప్పుడు స్పష్టంగా అనుభవానికి వస్తోంది. కాని ఈ పరదా నన్ను పూర్తిగా దానిలో జీర్ణించుకుపోకుండా చేస్తోంది. కుడి హస్తం యొక్క బొటనవ్రేలిపైన, చేయిచాపినపుడు ఎక్కడైతే నాడి ఉంటుందో, సరిగ్గా దానిపైన మణికట్టు నుంచి

బొటనవ్రేలువరకు ఏదో కీటకం ప్రాకుతున్నంతగా తీవ్ర చలనం ఉంటోంది. అలాగే ఎడమ పాదం మీద కూడా అదే స్థానంలో ఆ ప్రాకులాట కనిపిస్తోంది. ఎప్పుడైనా చేతులపైన ఎడమభాగంలో కూడా అనుభవమవుతోంది. ఇది పూర్తిగా ఉదాసీన దశగా అనిపిస్తోంది. పూర్తిగా నిశ్శబ్దమే నా స్వరూపంగా అయిపోయినట్లుగా ఉంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

**ఉత్తరం సంఖ్య – 583**

లఖీంపుర్,

16.08.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉంటుందని అనుకుంటున్నాను. రేపు పరమ పూజ్యులు మాస్టర్ సాహెబ్‌గారు తమవద్దకు రానున్నారు. వారిని కలిశాక తమకు ఇక్కడి జ్ఞాపకాలు మళ్ళీ తాజాగా వస్తాయి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

తమరు ఇక్కడకు వచ్చి ఉన్నారు, కాని నాకు ఆ విషయం జ్ఞాపకం లేదు. దాదాపు మర్చిపోయాను. ఎవ్వరైనా తమవద్దకు వెళ్ళాలి అని చెప్పకపోయినట్లయితే, శ్రీ బాబూజీవద్దకు వెళ్ళాల్సి ఉందని నాకు ఆలోచన రావటం లేదు. మనస్సులో బాబూజీని గురించి నెమరు వేసుకోవటం ఉంటుంది, కాని ఎందుకోమరి వారి జ్ఞాపకం రావటం లేదు. వారి రూపం, రంగు, స్వరం ఏవీకూడా జ్ఞాపకం ఉండటం లేదు. మనస్సుకు సంతృప్తిగా ఉండటం లేదు. దానికి తగిన కోర్కె కూడా ఉండటం లేదు. శ్రీ బాబూజీతో మాట్లాడుతూ కూడా నేను వారిని మరచి ఉన్నట్లుగా చూస్తున్నాను. ఇప్పుడు దశ ఎలా ఉందంటే, మనస్సు బాబూజీ, బాబూజీ అని తలచుకుంటూనే తనను కోల్పోతోంది, అయినా గాని నాకు వారి జ్ఞాపకం కలగటం లేదు. వారి స్వరూపం కూడా జ్ఞాపకం రావటం లేదు, కాని తమరు ఇక్కడకు వచ్చి ఉన్నారో, లేదో కూడా తెలియటం లేదు.

ఈ దశ ఏమిటోగాని, సుఖదుఃఖాల దశ ఇదేనని ఎవరితోనైనా చెబుతున్నానేమో తెలియదు. విలపిస్తున్నానుగాని దాని కారణం ఏమిటో తెలియకుండా ఉన్నాను. నవ్వుతూ ఉన్నాగాని దానికీ కారణం అంతుబట్టకుండా ఉంటోంది. ఇంతకూ యదార్థం ఏమిటంటే, నేను ఎప్పుడూ విలపించలేదు, నవ్వనూ లేదు. మనస్సు పూర్తిగా ఉదాసీనంగా ఉంటోంది. పూజ విషయానికి వస్తే దాని బీజం కూడా ఇంకా పడనట్లుగా ఉంది. అదేమిటోగాని, నేను తమ ఎదుట ఉన్నంతవరకు మామూలుగానే ఉంటున్నాను. కాని, తమ ఎదుటి నుంచి తొలగిపోగానే హృదయం కొంచెం భారంగా ఉంటోంది. కాని స్థితిమీద దీని ప్రభావం ఉండటం లేదు. స్థితి చాలా ఎండిపోయినట్లు గాను, నిస్సారం మరియు ఎడారిలాగాను ఉంటోంది. దానిని చెప్పనలవికాదు. ఆ స్థితి ఇప్పుడు నిలకడగా ఉన్నట్లు నేను చూస్తున్నాను. ఇదే నా స్వరూపంగా అయిపోయింది. అప్పుడప్పుడు స్థితి స్వయంగా చాలా ఎండిపోయినదానిలాగా ఉంటోంది లేదా విచిత్రమైన, వినూతనమైన దిగులుతో ఉంటోంది. ఆ వాడిపోయిన స్థితియే నా స్వభావంగా అయిపోయింది. ఇంట్లోను, బయట అందరితోను మాట్లాడుతున్నాను కాని స్థితి మాత్రం వాడిపోయినదానిలాగే ఉంటోంది. పూజకు చెందిన మాటలు మాట్లాడుతున్నాను, పూజ చేస్తున్నాను, ఇతరులతోను చేయిస్తున్నాను, కాని స్థితిలో ఎటువంటి మార్పు ఉండటం లేదు. అది ఉన్నది ఉన్నట్లుగానే ఉంటోంది. అన్ని ఋతువుల్లోనూ ఒకేలాగ ఉంటోంది. నాలో ఏదైనా లోపం ఉందేమో తెలియటం లేదు.

ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, నేను ఎక్కడ ఉన్నానో కూడా నాకు తెలియకుండా ఉంది. ఇప్పుడు నాకు ఎక్కడా స్థానం లేదు. నా జాడ ఉన్నట్లుగాను లేదు, లేనట్లుగాను లేదు. దాగి ఉన్నది లేదు, బహిర్గతమైనదీ లేదు. ఇప్పుడు ఉన్న దశలో, నేనే కాదు, అందరూ కూడా తమ అస్థిత్వం, ఇల్లూ వాకిలీ లేకుండా తిరుగుతున్నట్లు ఉంది. ప్రతి మనిషీ, ప్రతి విషయంలోను నా కంటె మంచిగాను, ఉన్నతంగాను లేదా శక్తిమంతుడుగాను అనిపిస్తున్నాడు. నా దశ అయితే పూర్తిగా నిరాశాయుతంగా ఉంది. ఏ నిబ్బరం లేకుండా ఉంది. ఇంతకుపూర్వం ప్రపంచపు మంచిచెడుల విషయంలో దృష్టిపడేది కాదు కాని ఇప్పుడైతే ఎప్పుడూ కాకపోయినా ఎంతోకొంత దృష్టికి వస్తోంది. ఇలా ఎందుకో తెలియదు.

ఇప్పుడు దశ ఎలా ఉన్నదంటే, ప్రపంచంతోనే కాకుండా 'మాలిక్'తో కూడా సంబంధం లేకుండా అయిపోయాను. అయినా కూడా ఎటువంటి చింతగాని, కోరికగాని లేవు. 'మాలిక్'తో సంబంధం లేకపోవటం అనేది ఇప్పుడు నా స్వభావంగా అయిపోయింది. ప్రపంచాన్ని గురించిన చింత కొంత ఉంటోంది. ఎందుకంటే, ఇప్పుడు ఇతరుల ఇంటిలో ఎవరికి చెందిన జబ్బు గురించియైనాసరే నాకు చింత లేదా దిగులు ఉంటుంది, కాని ఇదివరకైతే కొంచెం కూడా ఉండేది కాదు. భయం కూడా త్వరగా కలుగుతుంది.

'$K_1$' యాత్ర పూర్తయిపోయినట్లుగా అనిపిస్తోంది. 'మాలిక్' యొక్క కరెంట్ అనగా ప్రాణాహుతి ఎప్పుడూ నాలో ప్రవహించటం లేదనిపిస్తోంది. బహుశా నేను ఋణవాహకం (Negative) కాలేకపోతున్నానేమో. ఇప్పుడు నాలో ఏదైనా చేయాలంటే శక్తి, సామర్థ్యాలు లేవు, కాని ఏ విధమైన ఆత్మగౌరవాన్ని తక్కువ చేసుకొనే చింత లేదు. ఒక ఖాళీ స్థితియే నా స్వరూపంగా అయిపోయింది. ఇప్పుడు నాలుక ఎలా ఉందంటే, దానికి పులుపు, తీపి, చేదు రుచులు తెలియకుండా ఒకే రకంగా ఉంటోంది. పళ్ళు పులిసిపోయాయి అంటాను కాని అది ఏమిటి, ఎలా అనేది తెలియకుండా ఉంది. 14వ తేదీన హృదయం అకస్మాతుగా ఉదాసీనంగా అయిపోయింది కాని దశ నిర్మలంగానే ఉంది. అది స్వయంగానే 15వ తేదీన సరిదిద్దుకుంది. ఇప్పుడు స్థితి ఎంత నిర్మలంగా ఉందంటే, దానిపైన ముసుగు తొలగిపోయిందా అన్నట్లుగా ఉంది. ఇప్పుడు ఆ నిర్మలత్వం ఒక వినమ్ర దశయే కాకుండా, అది దాని స్వభావసిద్ధంగా అయిపోయింది. ఇప్పుడు ఉన్న స్థితి ఇలా లేదు:

**దిల్ మే హై దిల్ కా ప్యారా, మగర్ మిల్తా నహీ।**

**ఆంఖ్ మే హై ఆంఖ్ కా తారా, మగర్ మిల్తా నహీ॥**

అనగా **నా ప్రియుడు నా హృదయంలో ఉన్నాడు, కాని నన్ను కలవటం లేదు. కళ్ళలో ఉన్నాడు నా కనుపాపలాగా, కాని నన్ను కలవటం లేదు.**

ఇప్పుడు దశ మరియు దృశ్యం మారిపోయాయి. నేను గతంలో తమకు వ్రాసినట్లుగా ఇప్పుడు శిరస్సుపైన పరదా లేకుండా ఒక మృదువైన హస్తం చాచి ఉంచబడింది. దాని మూలంగా ఎటువంటి భారం అనిపించకుండా శిరస్సులో ఒక మృదుత్వమే ఉంటోంది. దీనివలన ఎంత పని చేసినాగాని మనస్సులో అలసట ఉండటం లేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 584

లఖీంపుర్,
22.08.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమవద్ద నుంచి ఉత్తరం రాలేదు. అందుకు చింతిస్తున్నాను. దయచేసి తమ సమాచారం వెంటనే తెలియజేయండి. తమరు ఆరోగ్యంగానే ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో

కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఇది ఒక సమతల స్థితి. లోపల బయట అంతటా ఒక సమతల మైదానమే వ్యాపించి ఉంది. ఇప్పుడు దశ పాడుబడిందిగా గాని, నిర్మానుష్యంగా ఉందనిగాని చెప్పను. ఒక బంజరుభూమిలాగా అయిపోయింది. యాత్ర ఇప్పుడు సమాప్తమైపోయింది.

బాబూజీ, ఇప్పుడు ఈ దశ ఏమిటోగాని, శారీరిక శక్తి మరియు మానసిక శక్తి ఒకటిగా అయిపోయాయి. మానసిక శక్తి నాలో ఇదివరకు చాలా బలిష్టంగా ఉండేది, ఇప్పుడు అది ఏమైపోయిందో తెలియదు. శరీరం, మనస్సు ఏకమైపోయాయి అని ఎలా చెప్పవచ్చునంటే, ఏదైనా కోరిక, అవసరం లేకుండానే శరీరం రోజంతా పని చేస్తూనే ఉంటోంది. మనస్సు అయితే ఏమీ చెప్పదు, చేయదు. నా దశ ఎలా ఉందంటే, నాకు మనస్సే లేనప్పుడు నేను నా ప్రభువును ఎలా పొందగలను అన్నట్లు ఉంది. బహుశా మనస్సే లేకపోవచ్చు. అందువలన మనస్సులోకి మనస్సుకి ఇష్టమైన దానిని తీసుకురావాలనుకుంటున్నాను. కాని 'అతడు' రావటం లేదు. 'అతడు' ఎందుకు కోపగించుకున్నాడో నాకు తెలియడం లేదు. ఎంత తపన చెందినాగాని ఒక్క క్షణకాలమైనా ఎదుటికి రావటం లేదు. 'అతడు' కాకుండా నాకు ఇంకా ఏదీ ఇష్టం కాదు. 'అతడు' లేక అంతా శూన్యంగా అయిపోయింది. 'అతడు' లేకుండా నేను నిద్రించటం లేదు, మేల్కొనటం లేదు. 'అతడు' మాత్రం పొరపాటున కూడా నా కళ్ళకు కానరావటం లేదు.

నాకు గ్రహింపు శక్తి ఎక్కువగానే ఉండేది, 'అతడు' లేక ఇప్పుడు ఆ గ్రహింపు కూడా నన్ను విడిచిపెట్టి పోయింది. అలాగే గ్రహింపులేనితనం కూడా నన్ను వీడిపోయింది. నేను ఇప్పుడు ఒంటరితనం మధ్యలో చీకటిలో నిలబడి ఉన్నాను. నిజం చెప్పాలంటే, నాకు 'అతని'పట్ల ప్రేమ కూడా లేదు. మెదడులో పగలంతా వ్యర్థమైన ఆలోచనలు కలుగుతున్నాయేగాని 'మాలిక్'ను గురించిన ఆలోచన ఎప్పుడూ రావటం లేదు. 'మాలిక్' నన్ను ఈ అంధకారంలో, ఈ శూన్యత్వంలో ఒంటరిగా వదిలి ఎక్కడకు వెళ్ళాడో తెలియటం లేదు. బాబూజీ! నా స్థితి ఎందుకు ఈ విధంగా దుర్భరంగా ఉంది. ఇప్పుడు నేను అంటే నేనే మిగిలి ఉన్నానుగాని ఇంకేమీ లేదు. ఇప్పుడు నాలో కవిత్వంగాని, కథలుగాని రావటం లేదు. నా ఆంతరికం ఇంకిపోయిన కన్నీటితో విలపిస్తోంది, తడారిపోయిన గొంతుతో త్రాగుతున్నాను. ఇలా ఎందుకో తెలియటం లేదు.

ఇప్పుడు నేను పూజ (ధ్యానం) చేయించలేకపోతున్నాను. ఎవరిచేతనైనా పూజ చేయిస్తున్నానని భావించినా కూడా ఊపిరిసలపనట్లుగా ఉంటుంది. అందువలన పూజ చేయించాలంటే మనస్సు పారిపోతుంది. ఎప్పుడైనా దానికి అదే సరిదిద్దుకున్నపుడు విశ్రాంతి కలుగుతుంది. సిట్టింగ్ ఇవ్వటానికి ముందుగానైతే మనస్సు కొంత విరక్తిగా ఉంటుంది. మళ్ళీ అందుకు (సిట్టింగ్ ఇవ్వటానికి) సిద్ధపడగానే యథాస్థితికి వస్తుంది. ఇదంతా ఏమిటోగాని, మనస్సు వేసారిపోతోంది. ఎడారిలాగ ఉన్నదానిని మళ్ళీ ఎవరు మరింతగా ఎడారి చేశారు.

నా స్థితి ఏమైపోయింది అంటే, 'మాలిక్' తన బుట్ట తెరచి రకరకాల మంచి ఆధ్యాత్మిక స్థితులతో గారడీ చూపించి మళ్ళీ వాటి అన్నింటిని బుట్టలో సర్దుకుని వెళ్ళిపోయినట్లుగా ఉంది. నేను ఒంటరిగా ఆ నిర్మానుష్యమైన దానిలో 'అతన్ని' మరచిన జ్ఞాపకంతో స్మృతి లేకుండా ఉన్న దాననై 'అతడి' సహాయంతోనే ఆధ్యాత్మిక మార్గాన్ని దాటుతూ ఉన్నాను. అలా కాదనుకుంటే, 'అతని'ది ఏమైనా ఉన్నట్లయితే, దాని సహాయంతోనే 'అతని' వద్దకే చేరతాను. నేనైతే తప్పనిసరిగా వెళ్ళాల్సిందే, ఎలాంటి తోడ్పాటు లేకపోయినా కూడా –అని తలపించునటువంటిదే నా ఈ స్థితి. ఇప్పుడు ఏ మైదానం లేదు. ఏ మార్గం లేదు. ఆ ఏమీ లేదనుకున్నదే అంతా ఉన్నట్లు అనిపించేదే నా దశ, దాని సహకారంతోనే నేను అక్కడికి చేరిపోతాను. ఇల్లూ వాకిలీ జాడలేదు. కల్పితంగాని, సత్యత్వం (రియాలిటీ)గాని జాడ తెలియకుండా ఉన్నాయి. చీకటి, వెలుతురుల జ్ఞానం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్తున్నారు. కేసర్ ప్రణామం చేస్తోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 585

లఖీంపుర్,
30.08.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

23వ తారీఖున పూజ చేయిస్తున్నపుడు అకస్మాత్తుగా కుమారస్వామిగారి హృదయంలో కొంత చీకటిగా ఉన్నట్లు గమనించాను, తర్వాత ఈశ్వరుని కృపతో అది సరిదిద్దుకుంది. ఇప్పుడు పూజ చేయించటం మరియు చేయటం రెండూ సమానమేనని అనిపిస్తోంది. ప్రాణాహుతిని అంచనా వేయటం కూడా నేను ఇప్పుడు మరచిపోయాను. అయితే విశ్వాసం మూలంగా గాని, మరిదేనివల్లనైనాగాని నిర్మలీకరణ చాలా శీఘ్రంగా జరుగుతున్నట్లు గమనిస్తున్నాను. దాని ప్రభావం వెంటనే కనిపిస్తోంది. అంతే కాకుండా ప్రతిపని విషయంలోనూ ఈ విధంగా విశ్వాసంతోనే జరుగుతుందని అనిపిస్తోంది. ఇప్పుడు శక్తిగాని, సామర్థ్యంగాని లేకపోయినప్పటికీ ప్రభావం చాలా తొందరగా కనిపిస్తోంది. ఎం.కె. గణేషన్‌గారి స్థితి ఎందుకు నిలిచిపోయిందో తెలియదు. పూజ చేయించటంలో అతనికి మనస్సు లగ్నం కావటం లేదు మరియు ప్రభావం ఉంటున్నట్లుగా కూడా కనిపించటం లేదు. ఇప్పుడు మళ్ళీ 'మాలిక్' కృపతో దారిలోకి వస్తున్నారు. అయినప్పటికి ఇంకా ఇదివరకటిలాగా ఉత్సాహం, పట్టుదల పూర్తిస్థాయికి రాలేదు, ఇంకా వస్తూనే ఉంది.

శిరస్సు వెనుక ఎక్కడైతే పిలక ముడి వేయబడుతుందో, అనగా మెడకుపైన ఎక్కడ గుంటలాగా ఉంటుందో, దానికి కొంచెం ఎగువన సూటిగా, సున్నితం, చల్లదనం వంటిది వెలువడుతున్నట్లు తెలుస్తోంది. ఎవరోగాని వెనుక ఉన్న మూత వంటి దానిని పైకి లేపాలనుకుంటున్నట్లు అనిపిస్తోంది. అయితే దానిని కుదిపినట్లయితే, మళ్ళీ సరవుతోంది. శిరస్సు వెనుక ఉన్న ఎముక మెత్తబడి, దాని నుండి ఏదో వడకట్టబడుతోంది. అది మెత్తబడటం కాదు కాని, కరిగిపోతున్నట్లు ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్తున్నారు. కేసర్ ప్రణామం చేస్తోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 586

లఖీంపుర్,
02.09.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి వ్రాసిన ఒక ఉత్తరం ద్వారా తమ సమాచారం తెలిసింది. తమరు కడుపునొప్పితో బాధపడుతున్నారని తెలిసి ఇక్కడి వారందరికీ దిగులుగా ఉంది. తమరు త్వరగా

ఆరోగ్యవంతులయ్యేట్లుగా ఈశ్వరుడు అనుగ్రహించుగాక! 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

అందరూ 'మాలిక్'ను గురించి చర్చించుకుంటున్నారు, ఆనందపరవశులవుతున్నారు. కాని నాకైతే 'అతడు' ఎవరో తెలియదు అన్నట్లు నా స్థితి ఉంది. 'అతడు' ఏమీ కాదు, 'అతడే' కాదు, ఇంకెవ్వరూ కూడా నాకు ఏమికానట్లుగా ఉంది. మంచంమీద పండుకొని ఉంటున్నాను. కాని 'అతడి'ని ఎప్పుడూ తాకలేకపోతున్నాను. గోడలు, చెట్లు మరియు పుష్పాలు తాకుతున్నాను, చేతిలోకి తీసుకుంటున్నాను, కాని వాటిని తాకనట్లుగా అనుభూతి చెందుతున్నాను. దశ మాత్రం పూర్తిగా స్వచ్ఛంగా వ్యాపించి ఉంది. ఏదో శక్తి శిరస్సులో తిరుగుతున్నట్లుగాను, కాని దానికి ఎక్కడా ఆవరణ దొరకనట్లుగాను ఉంది. అయితే 'మాలిక్' కృపతో 3,4 రోజుల నుండి ఎముక అనేది లేకుండా కేవలం వాయువు మాత్రమే ఉన్నట్లుగా అనిపిస్తోంది. శరీరం మాత్రం పుష్పంలాగా ఎగురుతూ ఉంది. దశను తేలికగా ఉందని చెప్పితే దానికి ఇంకా భారం పెంచినట్లుగా అవుతుంది. నాకు పవిత్రత, అపవిత్రత రెండూ ఒకే అర్థాన్ని ఇస్తున్నాయి. ఇప్పుడు ఎలా ఉండేదో, ఏది ఉన్నదో అలాగే ఉండేది. ఈ విధంగా చెప్పాలంటే నాకు బాగుందనిపించటం లేదు. ఎందుకంటే, ఇక్కడ ఎవరూ లేరు. అలా ఉంది, ఇలా ఉంది అని అనటానికి కూడా ఏమీలేదు. ఇప్పుడు ఎందుకోగాని నాకు నా ఆత్మోన్నతి ఎంత మాత్రం తెలియటం లేదు. దశ మాత్రం బంజరుభూమిలాగా ఉంది. కనుక దానిలో ఎటువంటి ఆశ ఉండదు. నాకైతే పూజలో ఎంతమాత్రం ఆసక్తి లేదు. అందరు అలాగే ఖాళీగా (స్పందన లేకుండా) కూర్చున్నట్లుగా ఉంది. నన్ను ఎవరైనా, ప్రాపంచిక భ్రమలో కూరుకుపోయిన స్థితి కలిగినదానిగా చెప్పినట్లయితే అది సరైనదిగా ఉంటుందనుకుంటాను.

ఇంతకుముందు నేను ఎప్పుడైనా 'అతని'తో వేరుగా గాని, 'అతను' లేకుండా గాని ఎప్పుడైనా ఉన్నట్లు జ్ఞాపకం లేదు అని వ్రాస్తూ ఉండేదానను. నేను 'అతని'తో వేరై ఉండవచ్చు అనేది పూర్తిగా అసంభవంకాగా ఇప్పుడు దశ అందుకు విరుద్ధంగా ఉంది. నాకు, 'అతని'తోగాని, మరెవ్వరితోనైనాగాని కలిసి ఉండటం జరగలేదని ఇప్పుడు అనిపిస్తోంది. నా కణకణంలోను 'అతడు' ఎన్నడూ కలవనే లేదు. ఇప్పుడు ఏం చేయాలో తెలియటం లేదు. నా దృష్టి శూన్యమైపోయింది. దృష్టియేకాదు, లోన బయట అంతటా శూన్యమైపోయింది. ఇదే నా స్వరూపంగా అయిపోయింది. అయితే వాస్తవానికి ఇప్పుడు స్వరూపం అంటూ ఉండదు, ఎలా ఉన్నది అలాగే ఉంటుంది. ఉత్సవాల (జన్మాష్టమి వగైరాలు) సందర్భంలో పూజ లేదా సిట్టింగ్‌ల వాతావరణంలో ఆనందం, ఉత్సాహం పొందటానికి బదులు నా మనస్సు గాబరాపడుతోంది. దశ సరళంగాను, స్వచ్ఛంగానే ఉంటున్నది. అది నమ్రతకు నగ్నరూపంలాగ వ్యాపించి ఉంటోంది అని చెబితే సవ్యంగా ఉంటుంది కాని, నేనుగాని, దశగాని నమ్రత కలిగి లేము. ఇంకేముంది, నమ్రత యొక్క నగ్నరూపం విస్తరించి ఉంది అనియే చెబుతున్నాను. నా శరీరం యొక్క కణకణం కూడా దానిలాగే అయిపోయి ఈ దశలో మునిగి విస్తరించి ఉంటోంది. ఇలా ఎందుకు అనిపిస్తోందో ఏమోగాని, మరెవ్వరూ లేకుండా నేను ఒంటరిగాను, నిరాటంకంగాను, నిర్భయంగాను సాగిపోతున్నట్లుంది. 'మాలిక్' ఉన్నట్లు కూడా తెలియటం లేదు. ఇంతకుపూర్వమైతే ప్రతి పనిని 'మాలిక్'యే ఈ (శరీరం) యంత్రం ద్వారా చేయిస్తున్నట్లు ఉండేది. కాని ఇప్పుడైతే నేను ఒంటరి దానినే. అంతా నా కొరకే చేస్తున్నట్లుగా అనిపిస్తోంది.

ఇప్పుడు నాకు ప్రతి మనిషీ (Initiated person) దీక్షాధారిగా కనిపిస్తున్నాడు. రాత్రి నేను ప్రతి మానవుడు నాచేత దీక్షబూనినట్లుగా చూశాను. ఇది పనికిరాని మాటయే అయినప్పటికీ, ఇటువంటి ఆలోచన నాకు ఎన్నడూ స్వప్నంలోనైనా ఇప్పటివరకు రాలేదు. ఇదేమిటో నాకు అర్థం కావటం లేదు. హృదయం కొల్లగొట్టబడింది. ఇప్పుడు నేను సేవ ఎందుకు చేయటం లేదంటే, దానిలోనే నాకు ఆనందం కలుగుతోంది. అలాకాకపోతే 'మాలిక్' కోసం, మిషన్ కోసం పనిచేస్తూ ఉంటాను. ఇప్పుడు నా ఆత్మ, 'మాలిక్' ఆత్మలో కలిసిపోయింది. ఎక్కడా నా అస్థిత్వం అంటూ లేదు. ఇప్పుడు అదీ (అస్థిత్వం) కరిగిపోయింది. లీనం కావటం కూడా లీనమైపోయింది. నావద్ద ఇప్పుడు

అమ్మడానికి, కొనటానికి శక్తిగాని, స్తోమతగాని లేవు. ఇప్పుడు నాకు 'మాలిక్' ఏది ఇచ్చాడో, ఏది ఇస్తాడో ప్రతిదానికి నేను ధన్యవాదాలర్పిస్తాను. అసలు ధన్యవాదాలు కూడా ఎలా అర్పిస్తాను! ఎందుకంటే, నా అణువణువూ అభివందనంగా మారిపోయింది. నా చిత్రం స్వయంగా 'మాలిక్'కు చెందిన అభివందనాల రూపంగానే అయిపోయింది. 'మాలిక్' అభీష్టం ఎలా ఉందో అలాగే అవుతుంది. హృదయాన్ని కమ్మి ఉన్న ప్రతి పరదా ఎగిరిపోయింది. ప్రతి ద్వారమూ తెరుచుకుపోయింది. బుద్ధి యొక్క దర్పణం స్వచ్ఛంగా అయిపోయింది. దృష్టి ఇప్పుడు దృష్టిగా కాకుండా 'మాలిక్' యొక్క దివ్యదృష్టిగానే తయారైపోయింది. ఇప్పుడు ప్రతి అణువూ దర్పణంగా తయారైపోయింది. ప్రతి కణమూ శుద్ధమైపోయింది. అయితే దానిలో ఎటువంటి చిత్రంగాని, రూపంగాని ప్రతిబింబించటం లేదు. అది నిశ్చలంగా, స్థిరంగా ఉండిపోయింది. తెలుసో, తెలియకనో మనస్సు ఎంత నమ్రతగా వంగి ఉంటున్నదంటే, ఎక్కువగా మాట్లాడటానికి కూడా ఇష్టపడటం లేదు. ఇంతకుముందైతే దశ అనేది హృదయానికి మంచిదిలాగా అనిపించేది, ఇప్పుడైతే అలా లేదు. హృదయానికిగాని, మనస్సుకుగాని మించి ఏదీ లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్తున్నారు. కేసర్ ప్రణామం చేస్తోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 587

షాజహాన్‌పూర్,
06.09.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరాలు 1956 ఆగష్టు 22, 30 మరియు సెప్టెంబర్ 2వ తేదీలవి అందాయి. నీ ఉత్తరాన్నింటిలోను ఉన్నత ఆధ్యాత్మిక స్థితి యొక్క లయ–అవస్థ వ్యక్తమవుతోంది. చిట్టచివరికి చేరేసరికి ఇంకా లయ–అవస్థ ఎంత జరగవలసి ఉందో ఆ దైవానికే తెలియాలి. ఆ విధంగా లయం కావటమే ఈ స్థితియొక్క అద్భుతం అయి ఉండగా, ఆ అద్భుతంవల్లనే మళ్ళీ దాని నుంచి బయటకు దూకటం కూడ దాని ప్రభావంగానే ఉంటుంది. ఇటువంటి విభిన్న రకాల లయ–అవస్థల యొక్క స్థితులను చూసి నాకే మతిపోతోంది. నా ఈ పరిశోధనలో ఎంత జీవితకాలం వ్యయం చేశానో తెలియకపోగా ఇంకా వాస్తవాలు వెల్లడవుతూనే ఉన్నాయి. భారతదేశంలోని మహాత్ములు ఒకరిద్దరయితే రామాయణ గ్రంథాన్ని ఇంటిలో ఉంచి, దానిని పూజిస్తూ ఉన్నట్లయితే వారికి మోక్షం కలుగుతుంది అని చెప్పేటటువంటి దుస్థితికి దిగజారిపోయారు. ఇలాంటి వారిని ఉద్దేశించి ఒక సరైన ఛలోక్తి ఉంది. అది ఏమిటంటే, "ఈ సౌందర్యానికి ఎంత గర్వమో చూడవయ్యా!" అని. దీనితో ఒక చరణం పూరించినట్లయితే, "ఇస్ హుస్నపర్ యహ్ నఖరె, చేలోంకా ఖుదా హాఫిజ్" అనగా ఈ సౌందర్యంతో గర్వించు శిష్యులను భగవంతుడే రక్షించాలి. నేను ఇక్కడ 'గర్వం' అని ప్రయోగించిన మాట విశిష్టమైన అర్థాలను కలిగి ఉంది. ఈ మాట పరిహాసంతో కూడిన మాటన్నది వాస్తవమే. అటువంటి మహానుభావుల బండారం బయటపడాలని ఉద్దేశపూర్వకంగానే ఈ పదాన్ని ప్రయోగించాను. వారి విద్య అటువంటిది కావటమేకాక దానితో వారు ప్రతిష్ట పొందాలనుకుంటారు. ఒకవేళ ఎవ్వరైనా వారిని ఆశించిన విధంగా గౌరవించకపోయినట్లయితే వారి కోపావేశాలు (Thermometer) థర్మామీటర్‌లోని (Mercury) పాదరసపు ఎత్తు పెరిగినట్లు పెరిగిపోతుంది. వర్షాకాలంలో భూమి మీద మొలిచే పుట్టగొడుగుల్లాగా వీరిని కూడా పెరికివేసే సమయం వస్తుంది. ఇటువంటి విషయాలమీద చాలా వ్రాయాలని నాకు అనిపిస్తుంది కాని దాని వలన ప్రయోజనం లేదు. దివ్యత్వ తరంగాలు తరుముకుంటూ వచ్చినపుడు, ఆ సత్యత్వం (రియాలిటీ) వెలుగులోకి వస్తుంది.

1956 సెప్టెంబర్ 5వ తేది రాత్రి గం 11.30 ని॥లకు నిన్ను నేను '$L_1$' స్థానంమీద నిలిపాను. ఈ స్థానం చీకటి కలిసిన కాంతిగల మైదానంగా అనిపిస్తోంది. నిజం చెప్పాలంటే, దాహార్తితో "నీరు ఎక్కడా?" అంటూ వెదుక్కుంటూ ఉండే చాతకపక్షిలాగా అన్వేషిస్తూపోయేవారే ఈ మైదానాలను దాటగలుగుతారు. నేను నా తల్లిగారిని పిండదేశపు స్థానాలన్నింటినీ దాటించి బ్రహ్మాండ మండలం చేర్చినట్లుగాను, ఆమె శరీరమంతటా 'అజప' ఉత్పన్నమైనట్లుగాను నీవు గ్రహించిన మాట వాస్తవమే. బ్రహ్మాండ మండలంలో ఆమె ఆధ్యాత్మిక యాత్ర తనకు తెలియకుండానే జరిగిపోతోంది. ఆమె బలహీనతను దృష్టిలో పెట్టుకొన్నందువల్లనే, ఆమె మెదడుమీద ఎటువంటి ఒత్తిడి కలగకుండా ఉండటానికి ఆ విధంగా చేశాను. ఆమె శారీరిక బలహీనత ఏ స్థాయిలో ఉన్నదంటే, కాలకృత్యాలు తీర్చుకోవటానికి కూడా ఆమెను పట్టిలేవదీయవలసి వస్తోంది. ఆమెకు ఉబ్బసం తీవ్రంగా ఉంది. నాకు కూడా స్వల్పంగా ఉబ్బసం ఇబ్బంది కలిగించింది. తర్వాత అది దానికదే తగ్గిపోయిందో లేక నేను ఒకటి రెండుసార్లు 'శీతోపలాడ్' చట్నీ తినడంవల్లనో తెలియదుగాని, నాకు ఉపశమనం కలిగింది.

శ్రీ కాశీరామ్‌గారి నుంచి ఉత్తరం వచ్చింది. ఆయన పత్రికను ప్రచురణార్థం కలకత్తాకు పంపించారు. తరువాత సంచిక కొరకు వ్యాసాలు పంపమని కోరుతూనే ఈ విధంగా వ్యాసాలు అందుతూ ఉంటే పత్రిక విరామం లేకుండా ముద్రించబడుతూ ఉంటుంది అని వ్రాశారు.

కేసర్ ఉత్తరం కూడా అందింది. ఆమెకు మంచి స్థితి నడుస్తోంది. ఏదో వ్రాసి ఉన్న ఒక చిన్న కాగితం నాకు ఇప్పుడే అందింది. దానిలో ఉన్న శీర్షిక ఈ విధంగా వ్రాయబడి ఉంది.

"కఛలాకు చెందిన శ్రీ 108వ స్వామీ దయానంద మహరాజ్ సరస్వతిగారి నిర్వాకం" అని ఉంది. ఆయన కఛలాకు చెందినవారు. ఒక స్కూలు నడుపుతున్నారు. అసలు విషయం ఏమిటంటే, ప్రభుత్వం అందుకుగాను 300 బీగాలు (150 ఎకరాలు) వ్యవసాయ (సేద్య) భూమిని ఇచ్చింది. దానిలో వచ్చే ఆదాయమంతా తన స్వంతంగా వాడుకుంటున్నారు. ఎవ్వరూలేని ఉపాధ్యాయులు, విద్యార్థుల పేర్లను వ్రాసి ఉపాధ్యాయు లందరి జీతాలను తానే తీసుకుంటున్నారు. ఈ విషయం ప్రభుత్వ మంత్రివర్గానికి తెలియచేయబడింది, అని వ్రాశారు. శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడుగా నా పేరున ఈ కాగితం వచ్చింది. ఆ కమిటీ వారికి ఏదో రకంగా మన మిషన్ సంగతి తెలిసి, దానిని నాకు పంపించారు. మహాత్ములనబడేవారి పరిస్థితి ఈ విధంగా ఉంది. వారు గౌరవించబడాలని వారే కోరుకుంటారు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 588

లఖీంపుర్,

06.09.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ దగ్గర నుండి చాలా రోజులుగా ఉత్తరం ఏమీ రాలేదు. ఎందుకో తెలియదు. దయచేసి తమ ఆరోగ్య స్థితిని వెంటనే తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నా దశ ఎలా ఉంది అంటే, అది సంభ్రమాశ్చర్యాలతో కూడిన స్థితియో లేదా శాంతి వంటి స్థితియో, ఏదిగా ఉందో తెలియదు. అసలు నా ఉనికి ఉందో, లేదో కూడా తెలియదు. ఎందుకంటే, నా ఆలోచన యొక్క స్థితి ఎలా ఉంది అంటే, దానిలో ఏదైనా ఉందో, లేదో తెలియదు. రెండూ సమానమే అయినాగాని దానిని గురించి ఏమైనా ఆలోచించుదామని అనుకున్నా ఏమీ తలంపుకు రావటం లేదు. అంతా మరచిపోయాను అన్నా, మరచిపోలేదు అన్నా ఏదీ కూడా సరిగాదు.

శ్రీ బాబూజీ, ఈ రోజు నన్ను తమరు '$L_1$' పాయింట్ మీదకు చేర్చారు. అందుకు అనేక ధన్యవాదాలర్పిస్తున్నాను. తమ ఈ దీనురాలైన కుమార్తెమీద దయచేసి తమరు ఇటువంటి దయాదృష్టినే నిలిపి ఉంచగలరు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్తున్నారు. కేసర్ ప్రణామం చేస్తోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 589

లఖీంపుర్,
11.09.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. చదివి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

చాలా రోజుల నుండి వెన్నెముక యొక్క వెన్నుపూసలలో కొంచెం అధికంగా సరసరమని ప్రాకినట్లుగాను, ఎడమవైపు వీపు యొక్క వెడల్పాటి ఎముక, కంఠానికి దిగువన ఉన్నదానిలో ఇరువైపుల కూడా ఉన్న ప్రక్కటెముకల్లోనూ అలాగే సరసరమంటూ ప్రాకినట్లుగాను ఉంటోంది. దాని నుంచి ప్రకాశం కూడా వెలువడుతున్నట్లుగాను అనుభవమవుతోంది. నా స్థితి ఎంత నమ్రత లేక వినయపూర్వకంగాను, సున్నితంగాను ఉంది అంటే, దానిలో నాకు మంచిగాని, చెడుగాని కనిపించటం లేదు. దీనిని లయావస్థ అని అంటే, చాలా భారంగా అనిపిస్తోంది. అంతేగాక దీని అనుభూతి కూడా నాకు లేదు. ఏదో హఠాత్తుగా సంభ్రమానికి (stunned) గురైనట్లుగా ఈ దశ ఉంది. లోపల, బయట ఒక తదేక దృష్టి నిలిచి ఉన్నట్లుగా ఈ స్థితి ఉంది. ఇటువంటి దశ లేదా మైదానమే వ్యాపించి ఉన్నది, మైదానమే కాదు, శూన్యాకాశంలాగా లోన, బయట వ్యాపించి ఉంది.

తమరైతే సెప్టెంబర్ 5వ తేదీన పై పాయింట్‌కు పెంచారు కాని మొన్న రాత్రి 10 గంటలకు నేను పండుకొని ఉన్నాను. అలా పండుకొని ఉండగానే ఏమైందోగాని ఒక్క క్షణంపాటు కాలు ముందుకు సాగిపోతున్నట్లు అనిపించింది. నన్ను ఎవ్వరో మేల్కొల్పినట్లుగా ఒక్క కుదుపు కలిగి నిర్ఘాంతపోయాను. అప్పుడు వెంటనే ఒక్క క్షణంలోనే ఈశ్వరీయ ప్రకాశం ఒక క్షణంపాటు వ్యాపించినట్లు అయ్యింది. అది ఏమిటో నాకు అర్థం కాలేదు, ఇప్పటికీ ఆశ్చర్యంతోనే ఉన్నాను. అప్పటి నుంచి ఎటువంటి దశ వ్యాపించి ఉన్నది అంటే, దానిని శూన్యాకాశమనిగాని, నమ్రత దశ యొక్క సత్యత్వం అనిగాని లేదా దాని సారమనిగాని చెప్పవచ్చు. ఎంత మృదువైన, నిదానమైన దశ వ్యాప్తమై ఉందంటే, అది నా భావనకు (conception) అందటం లేదు. నేను ఏమని చెప్పాలో అది 'మాలిక్'కే తెలియాలి. నిన్నటి నుంచి ఎవ్వరైతే పూజ చేశారో వారు కూడా నా లోపల, బయట వ్యాపించి ఉన్న ఈ దశనే తెలిపారు. శూన్యం, నిశ్చల దశయే అని అందరూ చెబుతున్నారు.

బాబూజీ, ఇది ఎంత శూన్య దశ అంటే, దీనిని ఎంత తేలికగా చెప్పినప్పటికీ ప్రతి శబ్దం భారీగానే ఉంటుంది. ఎందుకంటే, తేలిక అన్నా, భారం అన్నా అవి రెండూ నాకు సమానమే అన్నట్లు అనిపిస్తోంది. దశ యొక్క సరైన అర్థం వ్యక్తం చేయటం సాధ్యపడటం లేదు. అదే స్వయంగా వ్యక్తమవుతూ ఉంటే నేనేమి వ్యక్తం చేయాలి? దీనిని ఎలా అర్థం చేసుకుంటే అలా అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ఈ దశను ఈ విధంగా వివరించవచ్చు.

**కబిరా ఖుడా బాజార్‌మేఁ, సబ్‌కీ మాంగే ఖైర్।**

**న కాహూసే దోస్తీ, న కాహూ సే బైర్॥**

దీని అర్థం: కబీరు బజారులో నిలబడి ఉన్నాడు. అందరి క్షేమం కోరుతున్నాడు, అతడు ఎవ్వరికీ మిత్రుడూ కాదు, ఎవ్వరికీ శత్రువు కాదు, అని.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 590

లఖీంపుర్,
17.09.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారు కూడా అక్కడికి చేరుకుని ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నేను తమకు ఉత్తరాలు ప్రేమ మరియు ఉత్సాహభరితంగా వ్రాయటం లేదు, ఉప్పొంగిన ఆవేశంతోను వ్రాయటం లేదు. కాని దాని నడక ప్రతిస్థితిలోనూ సమతుల్యంగానే ఉంటోంది. నిద్రలోను, మెలకువలోను, తెలిసి ఉన్నా, తెలియక ఉన్నా కూడా ఇదే సమస్థాయిలో ఉంటోంది. ఇంతకుపూర్వమైతే నాకు భవిష్యత్తులో జరగబోయేవి, అటువంటివి ఏవైనా సంగతులన్నీ నా ఎదుట స్వయంగా ప్రత్యక్షమవుతూ ఉండేవి, వాటి జాడ తెలుస్తూ ఉండేవి, కాని ఇప్పుడు అలా తెలియటం లేదు.

'నేను' అను శబ్దం ఎంత చులకనగా అయిపోయిందంటే, నేను దానిని ప్రయోగిస్తున్నాను కాని అది నా భావనలోకి రావటం లేదనిపిస్తోంది. దీనిని (నేను) ఉపయోగించటంలోను, ఉపయోగించకపోవటంలోనూ ఏమీ ఆటంకం ఉండటం లేదు. రెండూ సమానమేనని అనిపిస్తోంది. ఇప్పుడు దశ ఏమిటి, ఎటువంటిది అనేది నాకు తెలియదు. అది స్వయంగానే వ్యక్తమవుతుంది. నాకు ఇప్పుడు ముందు వెనకలు, లోపల బయట అనేవి ఏవీలేవు, అన్నీ ఏకమైపోయాయి. ఎందుకోగాని, ఒంటరిగా ఉన్నా ఒంటరితనం అనిపించటం లేదు. ఇద్దరు ఉన్నా కూడా ద్వైతం అనిపించటం లేదు. పూర్వం నేను సదా 'మాలిక్'తో కలిసి ఇద్దరుగానే ఉంటూ ఉండేదానిని కాని, ఇప్పుడు 'మాలిక్' జ్ఞాపకానికి వచ్చినా లేదా ఎదుటనే ఉన్నా ద్వైత భావనయే కలగటం లేదు. అదే విధంగా, పని చేస్తూన్నప్పుడు పనిచేస్తున్న అనుభూతిగాని, పని లేకుండా ఖాళీగా కూర్చున్నప్పుడు, పని చేయనట్లు అనుభూతిగాని ఎన్నడూ ఉండటం లేదు. విశ్రాంతి తీసుకుంటున్నాగాని, విశ్రాంతి తీసుకుంటున్న అనుభూతిగాని, పాడుతున్నా, మాట్లాడుతున్నాగాని పాడుతున్న మరియు మాట్లాడుతున్న అనుభూతి కూడా కలగటం లేదు. అన్నీ ఈ విధంగా ఉంటూ ఉన్నా కూడా, ఈ మాటలన్నీ నిరుపయోగమనిగాని, వ్యర్థం అనిగాని, పనికిరానివనిగాని ఎన్నడూ అనుభూతికి రావటంలేదు.

ఇప్పుడు హృదయంలో అల్పమైన బాధ, తపన ఉన్నప్పటికీ దానిలో బాధగాని, వేదనగాని అనుభవం కావటం లేదు. అలా కాకుండా కేవలం ఏదో ఒక విషయం ఉంది కాని అది అర్థం కావటం లేదు. స్థితి మీద పొగ వంటి చీకటి అలుముకుని ఉంటుంది, కాని మళ్ళీ శుభ్రమైపోతుంది. అది ఏమిటో తెలియదు. ఈ దశ ఎటువంటిది అంటే, నేను ఎవరికైనా ప్రాణాహుతినిచ్చి పూజ (ధ్యానం) చేయిస్తూ ఉన్నపుడు వారికి మనస్సు లగ్నం కానటువంటి స్థితియే ఉంటుంది.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 591

షాజహాన్‌పూర్,
19.09.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరాలు సెప్టెంబరు 11 మరియు 17వ తేదీవి చేరాయి. నేను ధ్యానం ప్రారంభంచేసే సమయానికి ఉన్నటువంటి ప్రాపంచిక విషయాలు వేటిని గురించీ నాకు అనుభవం లేదు. అయితే (Nature) ప్రకృతికి సంబంధించిన విషయాలు మాత్రం నా అనుభవంలోకి వస్తూ ఉంటాయి. కనుకనే నేను, నా తల్లిగారి అన్నమయకోశం మినహా మిగిలిన కోశాలన్నింటినీ (అనగా పొరలు) తొలగించి వేశాను. దానిని కూడా ఛేదించటం జరిగితే కొన్ని పవిత్రం, తీవ్రం అయినటువంటి శక్తులు ఉద్భవించే అవకాశం, దాని మూలంగా ఏదైనా మంచిగా గాని, చెడుగా గాని మాట్లాడినట్లయితే ఆ విధంగా జరిగే అవకాశం ఉన్నందున ఆ పని చేయాల్సిన అవుసరం లేకపోయింది.

ఇప్పుడు స్వామి రామేంద్ర దేవ్‌గా వ్యవహరించబడుతన్న పండిట్ లక్ష్మీ చంద్ర తన మిషన్‌ను విభజించి, దానికి “దివ్యపథ్ ప్రదర్శక్ మండలి” అని నామకరణంచేసి, దాని విధి విధానాలను రూపొందించారు. దానిని గురించి నాకేమీ బాధలేదు కాని, ఈ దిగువ చెప్పిన వాక్యం యదార్థమని నిరూపితమవుతుంది: మేరే ఘర్ సోం ఆగేలాయీ, నామ్ ధరో వై సంధర్.” ఈ వ్యక్తిని గురించి నాకు జాలి కలుగుతుంది. విద్యావంతుడైన అతని శిష్యుడు హరిశరణ్ “యోగ వేదాంత ముక్తావళి” అను గ్రంథాన్ని చాలా ప్రతిష్ఠాత్మకంగా రచించాడు. పుస్తకంతోపాటు దాని నియమాలు కూడా పంపిస్తున్నాను కనుక వాటిని చదువు. మాస్టర్ సాహెబ్‌కు కూడా ఇస్తే, తీరిక దొరికినప్పుడు వారు కూడా చదువుతారు.

ఇటీవల నీ నుండి వచ్చే ఉత్తరాలకు జవాబులు వ్రాయాలంటే మాటలు దొరకటంలేదు. నీవు ఏదో విధంగా నీ అలోచనలు, అనుభూతుల్ని వివరించగలుగుతున్నావు. పొగవస్తూ ఉందంటే అక్కడ నిస్సందేహంగా అగ్ని ఉన్నట్లే. వెన్నెముకమీద, దాని దరిదాపుల్లోను జరజరమనిపిస్తోంది అంటే అక్కడ కంపనాలు (Vibrations) కలుగుతున్నట్లుగాను, ఆ స్థానం చైతన్యమవుతున్నదని దాని అర్థం. నదిలో ఒకచోట కెరటం ఏర్పడినట్లయితే అది నది అంతటా వ్యాపిస్తున్నట్లుగానే దీనిని పోల్చుకోవాలి. వెన్నుముకలోని అన్ని పూసల్లోను శక్తులు నిగూఢంగా ఉన్నాయి. ఈ పూసల్ని ఆధ్యాత్మికతకు వెన్నుముక వంటిదిగా చెప్పినప్పటికీ తప్పుకాదు. వెన్నెముకలోని ఈ పూసలమీదనే ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) ఇవ్వటమనేది కూడా ఒక విధానంగా ఉంది. ఏ ఏ చక్రాలమీద కావాలనుకుంటే వాటిలో ఆధ్యాత్మిక యాత్ర కొనసాగించగలరు. మహాత్ములు ఎవ్వరూ ఈ విధానాన్ని కనుగొని ప్రయోగించినట్లుగాని, వాటిని కనిపెట్టటానికి కృషి చేసినట్లుగాని నాకు తెలిసినంతలో ఎప్పుడూ జరగలేదు. నేను దీనిని మాత్రం నీకు సూచనగా తెలియచేస్తాను. అది ఏమిటంటే, నీవు ఏదైనా చక్రం మీద ప్రభావం కలిగించాలి అనిగాని, ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభించాలనిగాని తలచినట్లయితే దానికి సంబంధించిన వెన్నుపూసకు వెనుక ఉన్న పూసపైన ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) ఇవ్వాలి. ఈ విధానానికి పెద్దగా శిక్షణ నివ్వాల్సిన అవసరం కూడా లేదు. కనుక దానిని గురించిన పరిశోధన (Research) కూడా వ్యర్థమే. నేను కొంతమంది మీద ఈ విధానాన్ని ఆచరించాను.

నీవు పడుకొని ఉన్నప్పుడు కలిగిన కుదుపులు (Jerks) గురించి వ్రాశావు. ధ్యానం చేయటం ప్రారంభించిన 2 సంవత్సరాల తర్వాత నాకూ ఈ విధంగానే అనుభవమయ్యాయి. కాని వాటికి కారణం నీ ఉత్తరంలో దీనిని గురించి నీవు వ్రాసిన తర్వాతనే నాకు అర్థమయ్యింది. ఎప్పుడైతే మెదడులో దీక్ష ఏర్పడుతుందో అప్పుడు జనానికి కలిగిన ఆలోచనలు ‘బ్రహ్మాండం’లో తేలియాడుతూ ఉంటాయి. అవి మనల్ని స్పర్శించినపుడు ఒక రకమైన కుదుపు

అనుభూతమవుతుంది. అంతేగాకుండా, మన స్వంత ఆలోచన కూడా మనల్ని వదిలి ప్రవహించిపోయి మళ్ళీ మనల్ని తాకినపుడు కూడా ఇటువంటి కుదుపు కలుగుతుంది. ఇటువంటి స్థితిలో మనం నివ్వెరపోయి ఉలిక్కిపడినట్లుగా జరుగుతుంది. ఒక సూది రంధ్రం నుంచి దివ్య కాంతి దూసుకు రావటం కూడా దీనికి ఒక కారణం. కనుక నీ విషయంలో అది దివ్యకాంతిపుంజము మూలంగానే జరిగింది. అప్పుడు నీకు బదులుగా అక్కడ దివ్యకాంతియే ఉన్నట్లుగా నీవు గ్రహించటం వలన తేటతెల్లమవుతున్న విషయం ఏమిటంటే, నీ అస్థిత్వం (Identity) పూర్తిగా లేకుండాపోయింది. ఇప్పుడు అసలైనది (Originality) ప్రారంభమవుతున్నది. అయితే ఈ స్థితి అసలైనదానికి వేయిరెట్లు భారంగా ఉంటుంది.

నీవు సెప్టెంబరు 17వ తేదీన వ్రాసిన ఉత్తరం ప్రకారం నీలో ఉన్నతమైన లయావస్థయే ఉన్నదని తెలుస్తోంది. నీలో ఒక రకమైన హృదయవేదన ఉంటున్నదని, దానివలన నొప్పిగాని, బాధగాని కలగటంలేదని వ్రాశావు. దీని మూలంగా ఏదో కావలసి ఉందని, దాని కొరకు వ్యధ కలుగుతోందని స్పష్టంగా తెలుస్తుంది. ఇప్పుడు నొప్పి యొక్క తీవ్రత కొంచెం ఎక్కువగా అనుభూతి చెందడానికి అర్థం, ఏదో పొందాలి అని నీవు తెలుసుకోవడం మూలంగానే. ఈ స్థితిలో చీకటి క్రమ్మినట్లుగాను, మళ్ళీ దాని తెర తొలగిపోతున్నట్లుగాను ఉంటోంది అని వ్రాశావు. అక్కడ స్థూలత్వం పూర్తిగా తొలగిపోతున్నదని దాని అర్థం. అటువంటి ఉన్నత ఆధ్యాత్మిక దశలో అంత స్థూలం అనుభూతి చెందటం జరగదు. కనుక ఆ పరిస్థితిని 'ఆత్మనుబట్టే దేవదూత" అని చెప్పాల్సి ఉంటుంది.

ఎంత సూక్ష్మమైన స్థానమో అంతే సూక్ష్మమైన స్థూలత్వం ఉంటుంది అని దాని అర్థం. కనుక ఆ స్థానంలో ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభమై, కొనసాగుతున్నప్పుడు దానికి అడ్డుపడుతున్న వాటిని గురించి ఆలోచన కూడా ఆవిరైపోతుంది.

ఇంకొక విషయం వ్రాయాల్సి ఉంది. బాధ, నొప్పి లేనటువంటి తపన గురించి నీవు వ్రాశావు. బహుశా కొన్ని రోజుల తర్వాత ఇలాంటిది జరగవచ్చు. దీనిని ఎలా ఊహించుకోవాలంటే– నీకు ఎప్పుడైనా గాయమయ్యింది అనుకుందాం. తర్వాత ఆలోచించినమీదట దానిని నీవు మరచిపోయినట్లుగానే అనిపిస్తుంది. అయితే ఆ విషయం నీ దృష్టి నుంచి పూర్తిగా తొలగిపోయినట్లుకాదు. దానితో సంబంధం నిలిచి ఉంటుంది. కనుక ఆలోచన కూడ ఎంతో కొంత ఉంటుంది. అది పేరుకు మాత్రం ఆంతరికంగా స్వల్పంగా ఉంటుంది. అందుచేత తపన ఉన్నదనటానికి చిహ్నం ఏమిటంటే, మనం ఏ విధంగానైతే తపన కలిగి దానిని పెంచుకున్నామో అదే విధంగా దాని స్వభావం అలా తయారవుతూ ఉండటమే.

కేసర్ ఉత్తరం అందింది. ఆమె ఆధ్యాత్మిక స్థితి బాగా కొనసాగుతోంది.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 592

లఖీంపుర్,
22.09.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ దయతో కూడిన ఉత్తరం నిన్న వచ్చింది. చదివి చాలా సంతోషించాను. తమ కృపకు ధన్యవాదాలు ఎలా తెలపాలంటారు! దయచేసి ఈ దీనురాలిపట్ల ప్రేమను ఇదే విధంగా కొనసాగించండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నేను పూజలో గంటలకొద్దీ కూర్చున్నప్పటికీ, ఆ పూజ యొక్క ఆనందపారవశ్యం కలగటం లేదు. సాధన చేస్తున్నాగాని ఏమి అర్థం కాకుండా ఎందుకు ఉంటుందో తెలియటం లేదు. నా విషయంలోనే కాకుండా, నాకు ఏ మానవుడు కూడా సాధన (ధ్యానం) చేస్తున్నట్లుగా అనుభూతి కలగటం లేదు. సాధన హోమానికి అర్పితమైపోయినట్లుగా ఉంది. ఇపుడు నేను 'సాధన' అను శబ్దం వింటే అదేదో నూతన శబ్దంలాగ అనిపిస్తోంది. నాకు దానితో ఎప్పుడూ పరిచయం లేనట్లు అనిపిస్తోంది. రోజు అంతా మాట్లాడుతూనే ఉన్నాగాని, ఏ శబ్దం యొక్క అనుభూతి కలగటం లేదు. చెవులకు ఎటువంటి ధ్వని సోకటం లేదు. అందుచేత అంతా శూన్యంగా అయిపోయిందా అన్నట్లు ఉంది. బయట, లోపల అంతా ఏకాగ్రమైపోయినట్లు ఉంది. కాని ఆ ఏకాగ్రత కూడా ఇప్పుడు అనుభూతికి రావటం లేదు. ఇప్పుడైతే ప్రతి పని అనగా జీవనం, మాట్లాడటం, పని చేయటం వంటి వాటి గమనం ఒకే విధంగా ఉన్నట్లు ఉంది. ఒక స్థాయి ఉంది, ప్రతి పనీ దాని ద్వారానే జరుగుతోంది. కాని నేనయితే సమాన గమనం యొక్క దరిదాపులలో కూడా నేను ఉన్నట్లుగా గాని, అది నా స్థావరంగా గాని అనిపించటం లేదు. అనగా నా ప్రమేయం ఏమీ ఉండటం లేదు. ఇప్పుడు నా దశ ఒక ప్రత్యేకత కలిగి సాధారణ ఫకీరీ దశ (సెయింట్లీ)గా ఉంది. ఏ బాధా లేదు. విశ్రాంతి యొక్క అనుభూతి ఉండటం లేదు. ఇప్పుడు నా స్థితి దీనాలాపంగా ఇలా చెబుతోంది:

**"బాహ్ ఛుడాయే జాత్ హెు, నిర్బల్ జాని కె మోహె।**

**హృదయ్ తె జబ్ జాహుగె, మర్ద్ బదౌంగె తోహె॥**

అనగా, నన్ను నీవు నిర్బలురాలుగా భావించి వీడిపోతున్నావు. ఎప్పుడైతే నీవు నా హృదయం నుంచి తప్పించుకుపోతావో అపుడు నిన్ను ధీరునిగా చెబుతాను.

కాని ఇప్పుడు నాకు ఇలా చెప్పటానికి కూడా సంకోచంగా ఉంది. ఎందుకంటే, ఎప్పుడు కూడా నాకు 'అతని' అనుభూతియే కలగటం లేదు. హృదయంలో 'అతడి' గురించిన తపనా లేదు. హృదయం ఎంత బలీయంగా ఉందంటే, దాన్ని ఓడించటానికి ఎవ్వరికీ సాధ్యపడదు. అందువలన పైన చెప్పిన "హృదయం వీడి ఎప్పుడు వెళ్తావో" అను మాట ప్రయోగించాను. కాని నా అంతఃకరణలో ఎటువంటి ఆలోచనా లేదు. అదేమోకాని, ఇప్పుడు వ్యాపించి ఉన్న స్వచ్ఛమైన దశయే నా స్వరూపం అన్నట్లుగా ఉంది. అంతకుమించి, తెలిసో తెలియకనో, నిద్రలోనూ మెలకువలోను ఉన్నటువంటి ఒక సరళసామ్య దశ వంటి దానిని, ఎల్లప్పుడు ఉంటున్నటువంటి దానిని నేను కనీసం స్పర్శించలేకపోతున్నాను. అదేమిటోగాని, సామ్యావస్థలో వ్యాపించి ఉండి కూడా దానికి దూరంగానే ఉంటున్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 593

షాజహాన్‌పూర్,

20.09.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం సెప్టెంబరు 22వ తేదీది చేరింది. స్వామి రామేంద్రదేవ్‌గారు 'వేదాంత ముక్తావళి' అను గ్రంథాన్ని నాకు పంపించారు. దీనిని పంపించటంలో ఉద్దేశ్యం తనవద్ద కూడా (లేఖకులు) రచయితలు ఉన్నారని నాకు తెలియజెప్పాలని అయి ఉండవచ్చు. నేనయితే యోగ్యులైనవారి ముందు స్వయంగా నా కలం జారవిడవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉన్నాను. నాకు అంతగా జ్ఞానం, సామర్థ్యం లేదు. అయినా ఇటువంటివారు నాలో ఏదో జ్ఞానం, సామర్థ్యం ఉన్నాయని తలుస్తారు. అది నాది కాదు. అది 'అతడి' సమర్థత, నేను మాత్రం 'అతని'

ద్వారం ముందు ఒక అర్థిలాగా స్థిరంగా కూర్చుండిపోయాను. ఆ పుస్తకం గ్రామీణులకైతే చాలా బాగుంటుంది. దానిలోని పాటలు పాడుకుంటూ వారు ఉల్లాసంగా ఉంటారు. దానిలో ధూమపానం మీద ఒక అధ్యాయం కూడా ఉంది. దానిని నేను ఎర్రసిరాతో గీత గీశాను. నేను లఖనౌర్ వెళ్ళినప్పుడు నేను హుక్కా పీల్చటం గురించి అభ్యంతరం తెలియజేశారు, అది చేయదగినది కూడ. ఒక అభ్యాసీ అభిప్రాయంలో దీని ద్వారా (నిరసన) నాకు సలహా ఇవ్వబడింది, ఒక విధంగా చెప్పాలంటే హెచ్చరిక చేయబడింది– కనుక నేను దానిని విడిచిపెట్టాలని. నా లోపాన్ని ఎత్తి చూపినందుకు నేను అతనికి హృదయపూర్వక ధన్యవాదాలర్పిస్తున్నాను.

ఇప్పుడు ఆయన తన స్వంత సంస్థను ఏర్పాటుచేసుకొని, నియమాలు సిద్ధం చేశాడు. ఆయన ధరించే రంగు దుస్తులు ఇప్పుడు ఆయనను గురువుగా చేశాయి. కొద్దిపాటి సంకుచిత భావాలు ఎటువంటి అద్భుతాలు సృష్టించాయో ఇప్పుడు నీవు గమనించే ఉంటావు. ప్రతి ఒక్కరినీ భగవంతుడు ఇటువంటి వాటినుంచి రక్షించుగాక! **ఎవ్వరినైతే భగవంతుడు తనవైపు ఆకర్షిస్తాడో, అట్టివారు మాత్రమే సఫలీకృతులవుతారని 'లాలాజీ' చెప్పిన మాట నాకు జ్ఞాపకం వస్తోంది.** అతడు (రామేంద్రదేవ్) నేత్రహీనుడైనప్పుడు నేను అతని అంతర్దృష్టిని తెరవటానికి ప్రయత్నించి తెరవగలిగాను. కాని ప్రతి స్థితికీ ఒక (Nuclues) మూలం ఉన్నందున, నేను తొందరపాటుగా ఏదైనా చేసినట్లయితే అది విచ్ఛిన్నమవుతుంది. కనుక, అప్పుడు నేను స్వయంగా వెంటనే ఆ పనిని నిలుపుదల చేశాను. నేను బాగా అనుభవం లేనటువంటివాడను కావటమే కాకుండా, ఇటు అటు దిక్కులు చూసే స్వభావం లేనటువంటివాడను కూడ. దైవం నావలన అటువంటి తప్పులు దొర్లకుండా ఉండునటువంటి జ్ఞానాన్ని నాకు ఇవ్వాలి. అతడు (రామేంద్రదేవ్) పరిసర గ్రామాలలో తిరిగి సత్సంగీలను తయారు చేయటానికి ప్రయత్నిస్తున్నాడు. అతని సంస్థలో 30 లేదా 40 మంది అనుచరులు ఉన్నారు. ఇంకా ఎక్కువమంది చేరే అవకాశం ఉంది. అందుకు నాకు ఏమీ అభ్యంతరం లేదు. ఇంతకీ ఆయన చేస్తున్నది భగవంతుని పేరు మార్మోగించటమే (వినిపించేటట్లు చేయటమే).

నేను ఇప్పుడు ఇంక నీ ఆధ్యాత్మిక స్థితిని గురించి చర్చిస్తాను. ఒక ఉన్నతశ్రేణికి చెందిన లయ–అవస్థ నడుస్తోంది అనీ, నడుస్తున్న స్థితిని గురించి నేను నీకు ఏదైనా వ్రాసే ముందు చెప్పాలని అనుకుంటున్నాను. ఉన్నటువంటి స్థానం, చేరవలసిన స్థానం తెలియకపోవటం అనునది, కట్టడం (అహం) నిల్పిన పునాది యొక్క జాడ లేకపోవటంగా ఉంటుంది. దానికి అర్థం ఏమిటంటే, భక్తియొక్క పెనుగాలుల తీవ్రత దానిని (అహం) పూర్తిగా నాశనం చేశాయి. ఇప్పుడు దాని స్థానంలో 'విశ్వాసం' అనేది నెలకొని ఉండి, దానిమీద ఆ నిర్మాణం తయారౌతుంది. దీనిని అర్థమయ్యే విధంగా చెప్పాలంటే, గాలిలో మేడలు కట్టినట్లుగా చెప్పాలి. ఈ పటుత్వమైన దానిని (అచంచలమైనది) విశ్వాసం యొక్క ఉన్నత స్థితిగా చెబుతారు. ఇది కూడా కరిగిపోయినపుడు, సముద్ర తీరానికి (గమ్యం) చేరటంగా చెబుతారు. ఏ విషయాలైతే మన ఉన్నతికి తోడ్పడ్డాయో, అవే మనకు ఆధారభూతంగా నిలిచి భుజాలు (Sides) ఏర్పాటు చేస్తుంది. ఆ భుజాలను (Sides) ఎందుకు ఏర్పాటు చేస్తుందంటే, బాహ్యవిషయాలు దాని కేంద్రంలోకి ప్రవేశించి దానితో నిర్మితమైనదానిని చెడగొట్టకుండా ఉండాలి అని. ఇంక దాని పనిని పూర్తి చేశాక దానంతటది కరిగిపోతుంది. దీని అర్థం ఏమిటంటే, **మన ఉన్నతికి ఏయే మంచి బంధనాలు సహకరించాయో అవి తమ పని ముగించాక తొలగిపోతూ ఉంటాయి.**

ఏ పనినైనా సరే హృదయపూర్వకంగా చెప్పినప్పటికీ, బాగా పరిశీలించినమీదట అది ఇష్టంగా గాని, అయిష్టంగా గాని చేసినట్లు అనిపించటం లేదని నీవు వ్రాశావు. దీనికి అతిసరళమైన అర్థం ఏమంటే, కోర్కెలు అతిస్వల్పంగా ఉంటున్నప్పటికీ కోరిక లేకపోవటం (అయిష్టం) అనేది ఇంకా నిలిచి ఉంది. ఇప్పుడు నా విషయంగా చెప్పాలంటే, నా మానసిక స్థితి మారినందువలన, అది గతంలో దాని నలముకొని ఉన్న ప్రాపంచిక విషయ పర్దాను తొలగించి వేసింది. అనగా గతంలో, దానిలో ప్రపంచం తాలూకు విషయాలు ఎక్కువగా ఉండేవి. వాటిలో పూర్వం మైమరచిపోవటం (నిషా) ఉండేది. మరి ఇప్పుడు ఉన్న మగత స్థితిలో అతడు (అభ్యాసి), నిషా వదిలిన తర్వాత కలుగుతున్నటువంటి

ఈ సూక్ష్మగతి ఎవరికి సంబంధించి ఉన్నదా అని అన్వేషిస్తున్నాడు. అలా కాకుండా, ఇప్పుడు నీవు (ఆధ్యాత్మిక) మగత యొక్క ప్రభావం కూడా తొలగించి వేశావు. దాని మూలంగా ఇప్పుడు నీ గతి ఎలా ఉందంటే, అది అసలు (రియాలిటి)కి చాలా సమీపంలో ఉన్నట్లుగా ఉంది. ఈ విషయం ఈ విధంగా ఉన్నప్పుడు, మళ్ళీ అతనికి ఇప్పటివరకు అతను కల్పించుకున్న ఝంఝుటనాలే జ్ఞాపకంలో ఉంటాయి. దానిలో ఉన్న లోపం ఏమిటి అని ప్రశ్నించుకోవలసి వస్తుంది. ఆ లోపం ఏమిటంటే, అతడు ప్రాపంచిక విషయాలలో నిమగ్నమై ఉన్నప్పుడు అనుభవమైనట్టి ఇక్కట్లలో ఉన్న ఆనందాన్ని పొందుతున్నాడు. మొదట అతనికి సంస్కారాల జ్ఞానం ఉండేది. కాని ఇప్పుడు ఆధ్యాత్మిక స్పృహ లేక చైతన్యం కలిగి ఉన్నాడు. అతడు వాస్తవికతను (రియాలిటి) వెదకటానికి కావలసినది ఇదే. వెదకటం, అన్వేషణ అనే వాటికి అర్థం ఏమిటంటే, అతని మనస్సులో ఏదో విషయం నాటుకున్నదని లేదా అతనికి అనుభవానికి వచ్చిన పరిమళానికి సంబంధించిన పుష్పం యొక్క అన్వేషణగాని అయి ఉంటుంది.

ఈ కొద్దిమాటల్లో నేను నీ స్థితులన్నింటికీ జవాబు, నీ ఉత్తరం మొత్తానికి జవాబు ఇచ్చాను. స్వల్పవిషయాల గురించి వ్యాఖ్యానించలేదు. మానవునికి దైవంలో లయ-అవస్థ చేకూరినప్పుడు, అతడు స్వయంగా అతనికి ప్రసాదించబడిన (Faculties) విభాగాలతో పని చేయటం అనేది మానవుని స్థితికి ఒక ప్రత్యేకత చేకూరినట్లవుతుంది. అందరికీ తెలిసినటువంటి ఒక అద్భుత విషయాన్నే నేను తెలియజెప్పాను. అయితే స్వల్పంగానైనా అతనిలో మానవీయత నిలిచి ఉంటుంది. ఒకవేళ ఈ మాత్రం మావనీయత కూడా లయమైపోవటం జరిగినప్పుడు వెంటనే అతని జీవితం చెల్లిపోతుంది. ఇది అతిసాధారణ విషయం, కాని నా బడాయిగా (గొప్పదనం) చెప్పాను.

నీ సోదర సోదరీలకు ఆశీస్సులు. అమ్మగార్కి, చౌబేజీకి ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 594

లఖీంపుర్,
28.09.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

రాత్రిపూట నాకు ఏమవుతుందో ఏమిటో తెలియటం లేదు. ఏమిటంటే, నేను నిద్ర నుంచి లేస్తూ ఉండగా, శిరస్సు మధ్యలో, పాపటి నడుమలో పిలక ఉండే చోటుకు నాలుగు వ్రేళ్ళు వెడల్పున ఇవతల అనగా ముందుకు, ఎక్కడైతే తమరు సహస్రదళకమల స్థానంగా చెప్పారో దాని నడుమ నుండి ఏదో విషయం పైదానితో అనగా ఉన్నత ప్రాంతంతో సంబంధం కలిగి ఉన్నట్లుగా అనుభవమవుతోంది. అలా నిద్రలో ఎన్నో ఆలోచనలు ముసురుకుంటూ ఉంటాయి. అప్పుడే ఈ విషయం అనుభవమవుతూ ఉంటుంది. నేను ఒకసారి తమకు వ్రాసి ఉన్నాను- శిరస్సులో ఏదో అంతుబట్టనిది ఉంటూ ఉన్నదని, శిరస్సును బద్దలుచేసి బయటకు పోవాలనుకుంటోంది అని. ఎప్పుడైతే ఈ విషయం సర్దైపోయిందో, అప్పటి నుంచే పైన వివరించిన విషయాలు ఆవృతమయ్యాయి. మేల్కొన్న తర్వాత ఇంక పగలంతా ఇది అనుభూతికి రాదు.

ఇప్పుడు నేను ఒక దీనురాలను లేదా దరిద్రురాలను కాదని అనిపిస్తోంది. పదిమందికి తినబెట్టి, నేను తిని సంతృప్తి చెందే దశగా ఉంది. ఇప్పుడు ఈ దశ ఏమిటోగాని, నేను నిద్రిస్తున్నపుడు సామ్యావస్థయే వ్యాపించి ఉంటూ ఉన్నట్లుగాను, దానిలోనే నేను వ్యాపించి ఉన్నట్లుగాను అనిపిస్తోంది. కాని నిద్రలేవగానే ఆ విధమైన సామ్యావస్థ ఎప్పుడూ నాకు అనుభవం కావటంలేదు. సుప్తచేతనా మనస్సు (Sub-conscious mind) యొక్క స్వరూపమైతే సామ్య

సరళ అవస్థగా అయిపోయింది అన్న మాట ఖాయం. బహుశా అదే నాకు నిద్రలో అనుభవమవుతూ ఉండవచ్చు. నిద్రలో నేను తమకు సమీపంగా చేరుతున్నట్లుగా అనిపిస్తోంది. తమ అంతరాత్మలోనే నా ఉనికి వ్యాపించి ఉంటోంది. 'తమ' నేత్రాల సామ్యజ్యోతిలోనే నేను వ్యాప్తమైపోతున్నట్లుగా ఉంది. అయితే మేల్కొనగానే ఇవన్నీ మాయమైపోతున్నాయి. నా ఆంతరికం ఆ దశ యొక్క స్వరూపంగానే అయిపోయినట్లుగా నేను నిక్కచ్చిగా చూస్తున్నాను. అయితే నాలో ఏమీలేదు. ఆంతరికంగా అన్నీ ఉండి కూడా నా ఈ దశ ఎలా ఉందంటే, నేను ఎప్పుడూ ఆంతరంగంలోకి చొరబడనట్లు గాను, ఒకవేళ చొరబడినా ఎక్కడ అంటె, నిజం చెప్పాలంటే, నాకయితే ఎక్కడా ఆ ఆంతరికంగాని, బాహ్యంగాని కనిపించటం లేదు. నా దశ ఎలా అయిపోయింది అంటే, ఖాళీగా అంటే నా జీవనం, మాట్లాడటం, చేయటం వంటివన్నీ ఖాళీగా అయిపోయాయి. బహుశా ఇందుకే నాలో ఎటువంటి (Artificiality) కృత్రిమత్వంగాని, (Reality) సత్యత్వంగాని లేకుండా పోయాయి. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

**ఉత్తరం సంఖ్య – 595**

లఖీంపుర్,

5.10.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం నిన్న చేరింది. చదివి సంతోషించాను. తమ ఆరోగ్యం కొంత మెరుగయ్యిందని తెలిసి సంతోషం కలిగింది. నా ఆరోగ్యం కూడా క్రమక్రమంగా బాగుపడుతోంది కనుక చింతించాల్సిన పనిలేదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా ఈ దశలో తురీయావస్థ కూడా నిద్రించినట్లుగా ఉంది. కాదు, అలాకాదు, అది కూడా మరణించిపోయినట్లు ఉంది. (Everlasting Peace) శాశ్వత శాంతిలో విలీనమైపోయి ఉండవచ్చు. అది మరణించి ఉందో లేక జీవించి ఉందో నాకు కూడా తెలియకుండా ఉంది. ఎందుకంటే, ఎవరైనా ఎడతెగకుండా మాట్లాడుతూ ఉన్నట్లయితే అతనికి ఆ మాటలమీద పట్టూ ఉండదు. ఆ తర్వాత దాని జ్ఞాపకం ఉండదు అన్నట్లుగా చూస్తున్నాను. నా జీవన్మరణాలకు ఇప్పుడు అదే దశగా ఉంది. పూర్తిగా సమతల మైదానంలో ఉన్నాను. చీకటి వెలుగులూ లేవు. వాయువూ, దాని తరంగాలు లేవు. సదా, సర్వదా పూర్తిగా శాంతి సామ్రాజ్యం నెలకొని ఉన్నట్లు ఉంది. అదే నా స్వరూపంగా అయిపోయింది.

ఇప్పుడు నా ఆంతరికం మరియు స్వరూపం నిస్సారంగా అయిపోయాయి, వాటిమీద ఏ విషయం ప్రభావితం చేయలేనట్లు ఉంది. నాకు ఇప్పుడు మనస్సు ఉన్న అనుభూతి కూడా కలగటం లేదు. ఇంక మనస్సే లేకపోయాక అభివ్యక్తం చేయటం ఎలా జరుగుతుంది. ఏ విషయాలు అయితే నాకు పురోగమించటానికి సహాయకారిగా ఉండేవో అనగా శ్రద్ధ, విశ్వాసం, ప్రేమ మరియు భక్తి అనేవి, నేను ఉన్న సముద్ర తీరాన కూలిపోయిన గోడలాగా కూలి కప్పబడిపోయినట్లుగా ఉంది. ఇంతేగాకుండా, ఇప్పుడు సమత్వం కూడా నిద్రించిపోయింది కనుక నేను ఉపయుక్తమైన మాటలు మాట్లాడవచ్చు అను జ్ఞానం కూడా నాకు లేకపోయింది. పూర్తిగా శూన్యం మరియు అంధకారం వ్యాపించి ఉన్నాయి. ఇప్పుడైతే ఈ సముద్రపుగాలి యొక్క ప్రభావమే నన్ను తనలో ఇముడ్చుకోవాలని అనుకుంటోంది. మరి నేను కూడా స్పృహ కోల్పోయినట్లు ఉంటున్నాను. అందువలన ఎప్పుడైనా కాలు జారి సముద్రంలో పడిపోతానేమో కూడా తెలియకుండా ఉంది. శరీర కవచం (పాము కుబుసం విడిచినట్లుగా) తొలగిపోయినట్లు ఉంది. శరీరం శరీరంలాగా అనిపించటం లేదు. శరీరం శరీరంలాగా లేదు. ఎందుకంటే, ఈ సముద్రపు గాలి యొక్క ప్రభావం ఏదైతే ఉందో దాని రూపంలాగానే నా రూపం కూడా అయిపోయింది. ఇంకా దశ ఎలా ఉందంటే, ఇది సముద్ర

తీరమా లేక సముద్రంలోనే ఉన్నానా అని తరచుగా మరచిపోయి ఉంటున్నాను. తీరం లేదా ఒడ్డు అని ఎందుకు అంటున్నానంటే సముద్రం దరికి చేరుతూనే నేను దానిలో ఈదుతున్నాను. అలా ఈదకుండా ఉండలేకపోతున్నాను. నాకు జబ్బు జబ్బుగా కాకుండా అది దశగానే అనిపిస్తున్నందున 'మాలిక్'కు ఈ జబ్బును గురించిన సమాచారం ఇవ్వటం లేదు. అది కూడా దశతోనే కలిసిపోతున్నట్లు చెప్పవచ్చు.

మరొక విషయం ఏమిటంటే, 'ఆలస్యం' అను శబ్దం నాకు సహించరానిదిగా ఉంటుంది. సముద్రంలో అడుగుపెట్టగానే దానిని వేగంగా ఈదుకుంటూ దాటిపోవాలనిపిస్తోంది. సముద్రంలోకి దిగటమే ఆలస్యం, ఎందుకంటే, నాకు ఎటువంటి ఆటంకాలుగాని, అవరోధాలుగాని దానిని దాటడంలో ఏమీ ఉండవు. అదేమిటో తెలియదు కాని అన్నీ నా పొట్టలోనే ఉన్నాయా అని అనిపిస్తోంది. సముద్రమంతా నా హృదయంలో ఉంది. ఎందుకంటే, బహుశా నేను దాని ప్రభావంలోనే ఇమిడిపోయి ఉంటాను.

తురీయావస్థ కూడా నిద్రించిందా అన్నట్లు ఉంది. ఇక్కడ ఒక శ్మశానం వంటి దశ లేక ఒక విచిత్రమైన మృత్యుదశ ఉంది. దేని తీరమంతా నిద్రించి ఉందో అటువంటి సముద్రం ఒడ్డుననే ఉన్నాను. అయితే దానిలో నిద్ర అనేది లేదు. అన్ని కలలు కూడా సమాప్తమైపోయాయి. మహాప్రళయపు స్థితిలో అంతా చీకటియే వ్యాపించి ఉన్నట్లుగా అనిపిస్తోంది. అలాకాదు కాని, మహాప్రళయపు అవస్థ కూడా కరిగి నునుపూగా అయిపోయింది. ఇంకేముంది, ఇంక మిగిలింది చీకటి అంటే చీకటి మాత్రమే (అనగా తమ్).

ఇప్పుడు నాకు నాలో విశ్వాసంగాని, అమాయకత్వం (అజ్ఞానం) గాని తోడుగా లేవు. నిశ్చలత్వం కూడా కరిగిపోయింది. ఇచ్ఛాశక్తి రవ్వంత కూడా లేకుండాపోయింది. అది ఎంతగానంటే, పూజ (ధ్యానం) అయితే చేయిస్తున్నానుగాని, సిట్టింగ్ (ప్రాణాహుతి) వస్తున్నదా లేదా అని తెలియటం లేదు. ఇచ్ఛ మరియు శక్తియే లేనపుడు ఇచ్ఛాశక్తి మాత్రం ఎక్కడి నుండి వస్తుంది.

ఇప్పుడు ఒక క్రొత్త విషయం చూస్తున్నాను. ఎవ్వరైనా కష్టాల్లో ఉన్నపుడు వారి కోసం ప్రార్థన ఎన్నో విన్నపాలతోగాని, ఎంతసేపైనాగాని చేస్తూ ఉన్నా ఏమీ ప్రభావం అనగా ఫలితం ఉన్నట్లుగా అనిపించటం లేదు. ఒకవేళ ప్రభావం ఉన్నా కూడా అది నామ మాత్రంగానే. కాని ఒక్కసారిగా నాలో ఒక్కపట్టుపట్టి ప్రార్థించినట్లయితే పని వెంటనే కాకపోయినా కాని శరణాగతి దశలో ఇచ్ఛాశక్తి పనిచేయ నారంభిస్తుంది. అది చాలా ఉత్తమంగాను, స్వాభావిక రీతిలోను జరిగిపోతుంది. కాని ఆంతరికంగా అది ఎలా జరుగుతుందో నాకు తెలియదు. అది (అనగా పని) దానంతటదే జరిగిపోతుంది. ఇటువంటి స్థితి రాగానే పని జరిగిపోతుంది అని (అనగా అనుగ్రహం కలుగుతుంది అని) నాకు అనుభూతి కలుగుతుంది. కాని అందులో విశ్వాసం కాని, నిశ్చలత్వంగాని లేవు. ఇది క్రొత్త విషయం కాదు కాని, అనుభవానికి ఇటువైపు అటువైపు అంతా ఒకటిగా అయిపోయింది. కనుక ఇంక అటూలేదు, ఇటూలేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 596

లఖీంపుర్,

30.10.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ నుంచి ఉత్తరం రాలేదు. తమరు ఆరోగ్యంగానే ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నాలో ఎటువంటి దశ ఏర్పడింది అంటే, నేను నిద్రిస్తున్నంతసేపూ నేను 'మాలిక్'లో ఏకమైపోయి వ్యాపించి ఉన్నట్లుగాను, మళ్ళీ మేల్కొనగానే ఏమీ జరగనట్లుగాను అనిపిస్తుంది. దశ ఉన్నది ఉన్నట్లుగానే ఉంటుంది. అది సమీపంగాను కాదు, దూరంగా గాను కాదు. రెండూ సమానమే అయిపోతున్నాయి.

నేను ఒక కలగన్నాను. అందులో తమరు నాకు ఏదో తినిపిస్తున్నారు. అందులో రుచిగాని, రుచి లేకుండా గాని లేవు. తర్వాత కొన్ని దుస్తులు ధరింపజేసి, "ఇప్పుడు బాగుంది" అని అన్నారు. ఇప్పుడు ఈ దశ ఏమిటోగాని, నేను కళ్ళు తెరుచుకుని ఉన్నానా లేక మూసుకుని ఉన్నానా అనేది గుర్తించలేకున్నాను. రెండూ ఒకటిగానే ఉన్నాయి. ఒక అలసిపోయిన బాటసారి కొంత విశ్రాంతి తీసుకుని, నిద్రించి లేచినపుడు అతనికి అలసట గురించిగాని, విశ్రాంతి గురించిగాని జ్ఞాపకం ఉండనట్లుగా నా దశ ఉంది. ఇంకొక దశలో, ఎప్పుడైనా ఒక క్షణంపాటైనా స్వయంగానే ఒక మనిషి శూన్యగతిలో (Inactivness) ఉన్నపుడు ఎలా ఉంటుందో అటువంటిదే నా స్థితిగా ఉంది. కావాలనుకుంటె దీనిని నిరాలోచనా స్థితిగా చెప్పవచ్చు.

ఇప్పుడు నా ఈ దశలో, అనుభవం అను తెరమీద ఏ రంగూ పడటం లేదు, ఏదీ పోవటమూ లేదు. ఈ తెర వెనుక (అనగా అనుభవం అను తెర) తల, కాళ్ళుగాని, ఆది అంతాలుగాని, అనంతంగాని ఏవీలేవు. ఇటువంటి శుష్కించిపోయిన సముద్రంలోనే నా నివాసం అయిపోయింది. అక్కడ చెప్పటంగాని, చేయటంగాని, ఉండటంగాని, ఆలోచనా ధారగాని ఏమీ ఉండటం లేదు. ఇవన్నీ ఇక్కడే, ఇటువైపునే విడిచిపెట్టబడినట్లుగాను, ఉండిపోయినట్లుగాను అనిపిస్తోంది. అక్కడ హృదయం యొక్క ఉనికిగాని, మనస్సు యొక్క చేరికగాని లేదు. వీటన్నింటికి ఆవల ఒక బంజరు భూమి ఉండగా దానిలోనే నా నివాసంగా ఉంది. నిశ్శబ్దం అనేది దానికి ఎన్నోరెట్లు భారీగా ఉంటుంది. అక్కడ దానికి కూడా ప్రవేశం లేదు. నా దశ ఏమిటోగాని, ఈ తనువు, మనస్సు ప్రాపంచిక విషయాలలో లగ్నమై అందులోనే సహజీవనం చేస్తున్నాయేమో తెలియటం లేదు. అసలు అక్కడ ప్రపంచమే లేకపోయింది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 597

లఖీంపుర్,

10.11.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారిని ఉద్దేశించి వ్రాసిన పోస్టుకార్డులోని విషయాలు విని ఆనందం కలిగింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో, నా మెదడులో ఏవైనా కొన్ని ఆలోచనలు సమకూర్చి ఒక్క నిమిషమైనా నిలుపుకుందామంటే సాధ్యపడటం లేదు. ఆ విధంగా ఆలోచనలు వస్తూ పోతూ ఉంటాయిలే అనుకున్నాగాని అసలు అవి వస్తున్నది ఎక్కడ, బలవంతంగా ఎవరో అడ్డగిస్తున్నట్లుగా అనిపిస్తోంది. దృష్టి అంతరంగంలోకి ఒక్క సెకను కాలమైనా చొరబడటం లేదు, అంతరంగాన్ని స్పర్శించటం లేదు, బలవంతంగా కూడా స్పర్శించటం లేదు. మనస్సు ఏకాగ్రత దాల్చటం లేదన్నట్లుగా ఉంది. ఏకాగ్రత అన్నా, చలిస్తోంది అన్నా రెండూ ఒక్కటే అని నాకు అనిపిస్తోంది. ఫొటోకు నాలుగువైపులా మామూలుగా కొంత ప్రకాశవంతంగా చేస్తాము. ఆ విధంగా నాలుగువైపులా కాదు కాని ఎలాగైతే మన నీడ ఎదుట నడుస్తుందో అదే విధంగా ప్రకాశమైతే కాదు కాని ఒక కాంతి వంటిది ఏర్పడి ఉంటోంది. అనగా నా బయట

వాతావరణంలో ఒక కాంతి (తేజస్సు) వ్యాపించి ఉంది. అది ఏర్పడింది అంటె శాశ్వతంగా ఉంటోంది, కాని ఆ నీడ ఎవరిదో నాకు తెలియటం లేదు. ఈ తేజస్సు సదా ఎందుకు నన్ను వెన్నంటి ఉంటుందో నాకు తెలియటం లేదు. ఈ తేజస్సులో అంధకారం లేదు, వెలుగు లేదు. ఈ తేజస్సు ఎక్కడ, ఎందుకు ఉత్పన్నమైందో తెలియదు. ఈ విధంగా చెప్పవచ్చు : నా బాబూజీ షాజహాన్‌పూర్‌లో ఉంటున్నారు, కాని వారి తేజస్సు నన్ను వెన్నంటియే ఉంటోంది అని. ఈ దశ ఏమిటోగాని, దృష్టి లోపలికి ఎప్పుడూ మరలటంలేదు. ఒకవేళ దానిని మరల్చినా కూడా క్షణకాలమైనా అక్కడ నిలవటం లేదు. ధ్యానావస్థ స్థితి కూడా ఎప్పుడూ కలగటం లేదు పూజలో ఎంతసేపు కూర్చుని ఉన్నా కూడా. బాబూజీ, నేనైతే ఎప్పుడూ నా ప్రియతముని ప్రేమించలేదని, ఎప్పుడూ అర్చించనైనా లేదని, మరియు వందనమైనా చేయలేదన్నట్లుగా ఉంది. నేను నా మనస్సులోని 'మాలిక్'ను కూడా ఎప్పుడూ దర్శించనట్లుగానూ ఉంది. ఈ వేదనయే అప్పుడప్పుడు బాధిస్తోంది. ఇప్పుడు నా హృదయంలో బాధగాని, వేదనగాని, తపనగాని ఏవీలేవు. అయితే, ఈ హృదయంలోపల ఎక్కడో దెబ్బ తగిలి ఉంటుందని, దాని స్మరణ ఎప్పుడైనా కలుగుతూ ఉండవచ్చని మాత్రం నాకు జ్ఞాపకం ఉంది. అయినా అది కూడా తెలియదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 598

షాజహాన్‌పూర్,

16.11.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం 10.11.1956వ తేదీది అందింది. నీ యాత్ర ఇప్పుడు '$M_1$' స్థానం మీద సాగుతోంది. నీవు వ్రాసిన స్థితి దానికి చెందినదే. దీనికి పూర్వం ఉన్న స్థానం '$L_1$' కాగా దాని తర్వాత స్థానం ఇది. నీవు ఉత్తరంలో చూసి దీని వెనుక ఉన్న స్థానం '$L_1$' గానే నిర్ధారణచేసి వ్రాయి.

నీ దృష్టి ఆంతరికంగా పోవటంలేదని, బలవంతంగా కూడా ఆ విధంగా జరగడంలేదని వ్రాశావు. "నగ్నంగా ఉన్నది స్నానమాడితే మాత్రం దిగతుడచబడేది ఏముంటుంది" అని హిందీ సామెత ఒకటి ఉంది. దేనితో నయితే నీవు హత్తుకుపోవలసి ఉందో దానితో హత్తుకుపోయావు. నీవు స్వయంగా కరిగిపోయిన తర్వాత, దాని ప్రభావంవలన కలిగే అనుభూతులు నీ అనుభవానికి ఇప్పుడు వస్తాయి. నీవు, నీ చుట్టూరా ఉన్న తేజస్సు, నీవు దేనితోనయితే హత్తుకుపోయావో అదే! ఈ మూడవ దానిని ఉద్భవింపజేసింది, ఇది పూర్తిగా స్వచ్ఛమైనది కూడ. ప్రతి మానవునిలోను ఇది (ఈ కాంతి) ఉంటుంది. కాని చెడు ఆలోచనలు, పూర్తిగా ప్రాపంచిక విషయాలలో ఉండేవారిలో ఇది ఉండదు లేదా ఏ మార్పులేకుండా ఈ విధమైన తేజస్సు ఉంటుంది. నీకు నేను ఒక క్రొత్త విషయం చెబుతున్నాను. **మానవునికి మార్పులేని స్థితి (Changelss Condition) కలిగినపుడు ఈ తేజస్సు లేదా ప్రతిబింబం విశ్వమంతటా వ్యాపించిపోతుంది.** మనస్సు విసుగు చెందకపోవటం (లేక అలసిపోకపోవటం) అనుదానికి కారణం, ఇప్పుడు నీ మనస్సు నీది కాకుండా పోయింది కనుకనే. నీ ఉత్తరానికి సంక్షిప్తంగా సమాధానం ఇచ్చాను. పిన్నలకు ఆశీస్సులు, చౌబేజికి ప్రణామం.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 599

లఖీంపుర్,

13.11.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందనుకుంటున్నాను. ఇప్పుడు తమ ఆరోగ్యం ఎలా ఉంది? తమ ఆరోగ్యస్థితిని గురించి దయచేసి వ్రాయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా ఈ దశలో, కర్మ బంధనంతో నేను బంధించబడి ఉన్నానో లేక స్వతంత్రురాలిగా ఉన్నానో తెలియటం లేదు. బంధనమన్నా, స్వతంత్రత అన్నా రెండూ ఒకటిగానే అనిపిస్తున్నాయి నాకు. బంధనం, స్వతంత్రత, ఆత్మ, ఈశ్వరుడు, సాధన, సాధకుడు, ప్రేమ, భక్తి, పూజ ఇవన్నీ నాకు గాలి మాటలుగా అనిపిస్తున్నాయి. ఈసారి షాజహాన్‌పూర్‌లో ఎటువంటి స్థితి కలిగింది అంటే, తమరు, నేను ఎదురెదురుగా మంచం మీద పూజలో కూర్చుని ఉన్నాగాని నా ఎదుట ఎవరో కూర్చుని ఉన్నట్లుగా నాకు ఎప్పుడూ అనిపించలేదు. అలాగే కలుసుకోవటం కూడా తెలియదు. కాని తిరిగి వస్తూ ఉండగా మనస్సు పీకుతోంది. దానికి కారణం కూడా నాకు తెలియదు. స్వయంగానే మనస్సు ఉదాసీనంగా అయిపోతోంది. నాకు అక్కడకు వెళ్ళటం, అక్కడ నుంచి రావటం, రెండూ సమానంగానే ఉన్నాయి. ఈ దశ ఏమిటోగాని, దీనిలో కలయిక కలగటం లేదు. విరహ బాధ కూడా ఉండటం లేదు. ఈ రెండింటి అర్థం ఒకటే అన్నట్లుగా ఉంది.

ఇంతకుపూర్వమైతే మనస్సు అతిదీనంగాను, వినమ్రంగాను ఉండేది, కాని నాకు ఇప్పుడు రెండూ సమానంగానే అనిపిస్తున్నాయి. ఇప్పుడు దశ ఎలా ఉందంటే, నా కోసం నేను లేను, నా కోసం నాదిలేదు, అంతా ఖాళీ అయిపోయినట్లు అనిపిస్తోంది. లోన లొటారం పైన పటారం అన్నట్లుగా ఈ దశ ఉంది. నాది, నీది, నేను, నీవు అనేవి ఒకే శబ్దంగాను, ఒకే అర్థం కలిగి ఉన్నట్లుగాను, వాటిని అవసరాన్నిబట్టి స్వతహాగానే ఏమీ తెలియకపోయినా ఎప్పుడెప్పుడు ఉపయోగించాలో అలా ఉపయోగిస్తున్నాను. నేను అమాయకురాలిని కాదు, అజ్ఞానినీ కాదు, తెలివికలదానినీ కాదు, అయినాగాని అన్నీ జరిగిపోతున్నాయి అనగా చెప్పటం, చేయటం, జీవించటం వంటివన్నీ ప్రకృతి ద్వారానే జరిగిపోతున్నాయి అన్నట్లు నా దశ ఉంది. అందుచేత నాకు ఏమీ తెలియదు. ప్రకృతి నడిపించినట్లుగానే అన్నీ నడుస్తున్నాయి. నా శరీరం ఇటు అనగా ప్రకృతితో అనుసంధానమై ఉందా లేక అటు అనగా ఈశ్వరుడు లేదా 'మాలిక్'తో అనుసంధానమై ఉందా అని కూడా గుర్తించలేకపోతున్నాను. ఇటు, అటు రెండూ కూడా నా వశంలో లేవు. నేను నా మెదుడుకు విశ్రాంతి కల్పించాలనుకున్నాగాని, అది నిద్రలో కూడా ఏదో ఒక పని చేస్తూనే ఉంటోంది అని నేను గ్రహిస్తున్నాను. అది ఏమిటి, ఎలా, ఎక్కడ పని చేస్తున్నదో కూడా నాకు స్వయంగా తెలియదు. అదేదో 'మాలిక్'కే తెలియాలి. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 600

లఖీంపుర్,

19.11.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. తమ కుటుంబీకుల సమాచారం తెలిసి సంతోషం కలిగింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా శరీరంలోని సర్వాంగాలు జ్ఞాపకంగానే అయిపోయాయి. అలాకాదు, కాని ఈ స్థితి ఇలా ఉంది: ప్రేమ, భక్తి, జ్ఞానం, అజ్ఞానం, జ్ఞాపకం, విస్మరణ లేదా అన్ని సాధనల యొక్క సృష్టి నా శరీరాంగం నుంచిగాని లేదా దాని వలన ప్రకాశించబడిన కాంతి ద్వారానే జరిగింది. ఇంకొక స్థితి ఏమిటంటే, నా కాంతికి దేనితోనూ సంబంధం లేకుండా ఉంది. నేనైతే అంటరానిదానిగా ఉన్నాను, ఉంటున్నాను, ఉంటాను కూడా. ఎందుకంటే, నాలో సాధనకు నివాసం లేదు, అలాగే సుగంధానికి చోటులేదు. నేనైతే ఒక ఉనికి ఉండి, తయారయ్యే దానిని కాదు, నశింపు అయ్యేదానినీ కాదు. ఇంకా ఏమిటంటే, అసలు ఉనికి అంటూ ఉన్నదానినో, కాదో కూడా తెలియదు. ఎందుకంటే, ఇది ఒక ఆలోచన మాత్రంగానే ఉండిపోయింది. ఆ ఆలోచన కూడా ఏమీలేనిదిగా ఉండి దానిలో వత్తిడిగాని, బలంగాని లేదు.

ఇంకొక దశ ఎటువంటిది అంటే, నేను ఎక్కడెక్కడకు వెళ్ళినాగాని కాంతి ఉంటోంది. విద్యాలయంలో (కాలేజీలో) ఎంతో విద్యుత్కాంతి వెలుగు లీనుతూనే ఉంటున్నాగాని, నేను ప్రవేశించగానే ఒక్కపెట్టున అంతా కాంతివంతమైనట్లుగా ఉంటుంది. నా సుప్తచేతనం (Sub-consciousness) వెర్రిది. అశాంతితో ఉంటుంది. నా చైతన్యంకు ఏమీ తెలియటం లేదు. నాకు బాధగాని, తపనగాని ఇంకేమీగాని లేవు. ఇంకొకటి ఏమిటంటే, నాకు అర్థశతాబ్దం పూర్తయ్యింది అని 'తమరు' చెప్పినప్పుడు నాకు స్వయంగా ఏమని అనిపిస్తుందంటే, నేనొక బాలకుని ఎదుట ఉన్నప్పుడు నేను కూడా అదే వయస్సుతో ఉన్నట్లు అనిపిస్తుంది. నా ప్రవృత్తి (Nature) ఏమిటో నాకు స్వయంగా తెలియకుండా ఉంది. వయస్సుకు పరిమితి కూడా లేదు. ఇప్పుడు ఒక అవధూతవంటి దశ కలుగుతోంది, కాని అది అవధూత వంటి అవధూత కాదు కాని నా సుప్తచేతనం (Sub-consciousness) అవధూత గతిని ప్రాప్తం చేసుకుంది. ప్రతి ఆధ్యాత్మిక దశ మరియు మహిమల అస్తిత్వం నశించిపోయి అంతా మామూలుగాను, సమంగాను అయిపోయినట్లుగా చూస్తున్నాను. నేను తేజస్సు అని వ్రాసినటువంటిది కూడా తరిగిపోతున్నట్లుగాను లేదా వ్యాప్తమైపోయినట్లుగాను ఉంది. హృదయం వ్యాకులపడుతున్నట్లు గాను, మనస్సు ఒక అజ్ఞానదిశగా కలిసిపోయేందుకు పరుగెడుతున్నట్లుగాను అనిపిస్తోంది. అయితే ఏ దశా నాకు తెలియనిది కాదు, అజ్ఞాతమూ కాదు. స్థితి స్థితిలేనిదిగా ఉంది, అది వశం కాకుండా ఉంది. హృదయం అను పుస్తకం తెరచి ఉంచబడింది కాని అందులో ఏమీ వ్రాయబడి ఉండలేదు. ఆంతరికం అంతా శూన్యంగాను, ఖాళీగాను ఉండిపోయింది. యదార్థం ఏమిటంటే, నా దశ ఏది అయి ఉన్నాగాని నేను దానిని స్పృశించటం లేదు. అస్పృశ్యంగాను లేను. దానితో వెంట ఉండి కూడా వేరుగానే ఉంటున్నాను. అలా వేరుగా ఉంటూ కూడా నేను ఒక్కర్తినే ఉన్నాను. ఇది నా స్థితిగా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 601

లఖీంపుర్,

22.11.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. నా ఆరోగ్యం కొంత చెడిపోయింది. అయినాగాని ఇప్పుడు బాగానే ఉంది. చింతించాల్సిన అవసరంలేదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ సముద్రంలో అన్నీ అంతమైపోయాయని అనిపిస్తోంది. ప్రతిదశ వచ్చి అంతర్ధానమైపోతోంది. విశాల సముద్ర గర్భంలో ఒక పైసాగాని, అణాగాని (ఏదైనా నాణెం) విసిరివేస్తే కనిపించకుండాపోయిన విధంగానే ప్రతి దశ

యొక్క అస్థిత్వం అంతమైపోతోంది. అవధూతావస్థ దశ కూడా ఇలాగే అయిపోయింది. అనగా ఈ లోతైన సముద్రంలో అంతులేకుండా పోయినట్లుగా ఉంది. నా ప్రస్తుత దశ ఏమిటంటే, నేను తమాషా చూస్తున్నదానిలాగా అనిపిస్తోంది. కొంతసేపటికి దానిలో అప్పుడప్పుడు శాంతి, ఆనందం కలుగుతాయి. అయితే నా అస్థిత్వం కూడా లేదు. అది కూడా ఈ సముద్రంలో ఎప్పుడో విలీనమైపోయింది. అందువలన నేను తమాషా తిలకిస్తున్న ప్రేక్షకురాలిగానే ఉన్నాను. ఇంతుకుమించి ఇంకేమీ తెలియదు. విషయాలుగాని, దశగాని నా స్థితి కంటె ఉన్నతమైన వాటిని కూడా సూటిగా గ్రహించగలుగుతున్నట్లుగా నా దశ ఉన్నదని అనిపిస్తోంది. నాకు అప్పుడు కొంచెంలో కొంచమైనా అనుభవం గ్రహింపుకు వస్తోంది.

నా ఈ దశలో ఎలా ఉందంటే, నా (Sub-consciousness) సుప్తచేతనా మనస్సు ఏదో మరో ప్రపంచంలో కోల్పోయి, మరచిపోయి ఉన్నట్లు అనిపిస్తోంది. ఈ సుప్తచైతన్యం (Sub-consciousness) విశ్వమంతటా వ్యాపించి పోయినట్లుగా ఉంది. కాని నా చైతన్యం మాత్రం ఎప్పుడూ కూడా ఒకే విధంగా ఉంటోంది. నేను ఏదైనా పని చేయాలంటే, అది ఎప్పుడూ మరచిపోను. ఇంకా ఏమయ్యిందంటే, మెదడులో ఆలోచనలను ఏకత్రాటిపై, అనగా సంఘటితం చేసి ఉంచలేకపోతున్నాను. ఒక్క సెకను కాలమైనా ఆలోచనలు స్థిరంగా ఉండటం లేదు. నేను (Sub-consciousness mind) సుప్తచైతన్య మనస్సు అనేది లేకుండా పోయాక ఆ సుప్తచైతన్యం (Sub-consciousness) అని ఎందుకు వ్రాస్తున్నానో తెలియటం లేదు. దాని ఉనికియే లేకుండా పోయింది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 602

లఖీంపుర్,
28.11.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. నా ఆరోగ్యం ఇప్పుడు ఇంకను బాగు కాలేదు. ఈశ్వర కృపతో అంతా మేలవుతుంది. తమరు విచారించవద్దు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ! నా ఈ దశలో బాహ్యాంతరాలు తారుమారైనట్లుగా ఉంది. నా శరీరంలో బాహ్యాంతరాలు అనేవి, 'మాలిక్'లో కలిపివేద్దామనుకున్నాగాని, లయం చేద్దామనుకున్నాగాని అవి దొరకటం లేదు. ఇప్పుడు ఏమి తీసుకురావాలి, ఎక్కడి నుండి తీసుకురావాలి. సమర్పించి వేయాలనుకుంటే, అది ఎక్కడా అరువుకు కూడా దొరకటం లేదు. నా మనస్సు అంతటా నా 'మాలిక్' అంటే ఎంతో ప్రేమ ఉంది. అందుకని అంతా 'అతని'కి సమర్పించివేయాలని మనస్సు కోరుకుంటోంది. అయితే అంతా ఏమిటి, నాకయితే ఏమి దొరకటం లేదు. ఇప్పుడు అంతా దిక్కుతోచకుండా ఉంది. నేను ప్రేమ యొక్క పరిభాషను తెలుసుకుందామని అనుకునేదానను, కాని అలా తెలుసుకోవటానికి బదులు నాకు తెలిసింది ఏదో, దానిని కూడా మరిచిపోయాను. అంతేకాదు, ఏదైతే తెలుసుకోవాలని అనుకున్నానో, అది కూడా మర్చిపోయాను. ఇప్పుడింక భక్తిలో అడుగిడటం కూడా అసంభవమే.

ఇప్పుడు నా దశ, సాధారణ మనుష్యులందరి దశలాగానే అయిపోయింది. ఏ వస్తువు లేదా విషయం నాకు స్థితి యొక్క జాడ తెలుపుతూ ఉండేదో, అది స్వయంగా దేనిలో విలీనమైపోయిందో తెలియదు. ఇప్పుడు నేను ఏదైనా

చేయాలంటే, ఏమి చేయాలి? ఆధ్యాత్మికత, బ్రహ్మవిద్య అనేవి ఒక మానసిక భ్రమయేనని, అది కూడా తొలగిపోతూ ఉంటుందని నాకు గ్రహింపుకు రావటం లేదు. ఇప్పుడు మనస్సులో 'స్వయం' (సెల్ఫ్) ఏమీలేదు. కాని కొంచెం తపన వంటి దానిని ఎవరో అంటిపెట్టి ఉంచుతున్నట్లు అనిపిస్తోంది. మనస్సైతే లేదుకాని, బలవంతంగా ఏదో వస్తువు మనస్సు అను పేరుతో అంటి పెట్టుకుని ఉన్నదనిపిస్తోంది. ఏమైనా చేద్దామనుకున్నా, చెబుదామనుకున్నా ఏదీ అనుభవంలోకి రావటం లేదు. ఈ దశయే శరీరానికి కూడా చెంది ఉంటోంది. ఎవరి పేరైనా ఉచ్చరిస్తూ ఉందామనుకున్నాగాని, అతడు ఎదుట నిలిచి ఉన్నా కూడా ఏమి అనుభూతికి రావటం లేదు. నా శరీరమే నాకు ఎప్పుడూ అనుభూతికి రావటం లేదు. నాకైతే అంతా భ్రమయేనని అనిపిస్తోంది. ఆ భ్రమయే ఉంది. అలా కాకపోతే నాకు ఏమైందనుకోవాలి. ఏముందో, ఏది లేదో తెలియకుండా ఉంది. తరచుగా కొద్ది సెకన్ల సమయంపాటు శరీరం మరణం దాల్చి ఉంటోంది. అలా ఉండి కూడా శరీరమంతా స్థిరంగా ఉంటోంది.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 603

షాజహాన్‌పూర్,
05.12.1956

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలన్నీ చేరాయి. వ్రాసేవారు అందుబాటులో లేనందున జవాబు వ్రాయలేకపోయాను. ఇది నీ ఉత్తరాలన్నింటికీ జవాబుగా ఉంటుంది –**"బెల్లం కంటె తీయన భగవానుడు, బయటా లోన ఒకే రకంగా."** ఎప్పుడైతే (రియాలిటి) వాస్తవికతతో సంబంధం కలిగి ఉండి, దానిలో మిళితమైపోతామో, అప్పుడు ఆంతరికంగాను, బాహ్యంగాను మన దృష్టిలో భేదం ఉండదు. మిషన్ అభివృద్ధి కొరకు కేసర్ ఏమేమి చేస్తూ ఉందో, వాటిని చేస్తూ ఉండమని చెప్పు. నేను దక్షిణ భారతదేశంలో ఉన్నంతవరకు, అక్కడి జనులు మిషన్‌వైపు ఆకర్షితులయ్యేట్లుగా ఆమెను దృష్టి పెట్టమని చెప్పటంతోపాటు నీవు కూడా చేస్తావు కదా! నేను డిశంబర్ 10వ తేదీన బయలుదేరి డిశంబర్ 14వ తేదీకి తిరుపతికి చేరతాను. మళ్ళీ మూడు రోజుల తర్వాత మద్రాసు వెళ్తాను. అక్కడి నుండి లేఖ వ్రాయటానికి ప్రయత్నిస్తాను.

నీవు పంపిన 17 రూపాయలు చేరాయి. దానిలో 15 రూపాయలు పంపించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, నీవద్ద కూడా ఎంతోకొంత ఉండాలి కదా!

చౌబేజీ మరియు అమ్మకు ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 604

లఖీంపుర్,
9.12.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. కాని ఈ రోజు ఇంకా ఏదో వ్రాయాలనిపించింది. విశేషమైన విషయం ఏమీలేదు, అయినప్పటికీ ఇప్పుడు ఏదైతే దశ ఉన్నదో దానిని గురించి వ్రాస్తున్నాను.

నా దశ ఎలా ఉంది అంటే, నన్ను ఎవరో బలవంతంగా ఇటు (అనగా స్మృతిలేని దశ నుంచి స్మృతి ఉన్న దశలోకి) లాగుతున్నారు అన్నట్లుగా ఉంది. అలాకాకపోతే, నేను కోల్పోటం కాదు కాని, నశింపు అయిపోవాలి అనుకుంటున్నట్లుగా ఉంది. బహుశా అందువల్లనే తరచుగా శరీరం తనంతట తానే మృతప్రాయంగా అయిపోతోంది.

ఎవరైనా బలవంతంగా జీవనాన్ని నాకు అంటగట్టి ఉంచినా కాని అలా జీవించి ఉన్న అనుభూతిని ఎప్పుడూ కలగనివ్వటం లేదు. ఎప్పుడైతే తరచుగా శరీరం (లేదా దశ) మృతప్రాయమైపోయినపుడు 'అతని' బలవంతం ఏమిటో తెలుస్తోంది. తర్వాత మళ్ళీ మేల్కొన్నపుడు, ఎవరో బలవంతంగానే మేల్కొల్పినట్లుగానే అనిపిస్తోంది. వణుకుతున్నంతయిదిగా వ్రేళ్ళనుంచి తరచుగా కంపనం (Vibration) ఉంటోంది తీవ్రంగానే. అలా ఉన్నాగాని నాకైతే ఆ కంపనం (Vibration) యొక్క అనుభూతియే కలగటం లేదు. శరీరం యొక్క కణకణాలన్నీ స్థిరంగానే ఉంటున్నాయి. కాని ఎందుకోగాని, దృష్టిని కేంద్రీకరించి ఎవ్వరినైనా పూజ చేయించాలని ఒక పాయింట్ మీద స్థిరంగా ఉంచినా కూడా దానిలో ఈ కంపనాన్ని ఎవరు కల్పిస్తున్నారో తెలియటం లేదు. ఎవరో ఆ పాయింట్‌ను (లేదా దృష్టిని) కుదిపేస్తున్నారు.

నా ఈ దశ ఎలా ఉంది అంటే, బ్రహ్మ లేక జీవుడు, ఆత్మ లేదా పరమాత్మ అనేవి అన్నీ గాలిమాటలులాగా అనిపిస్తున్నాయి. నాకయితే బ్రహ్మ, జీవుడు, ఆత్మ, పరమాత్మ ఇవేవీ లేనట్లుగానే అనిపిస్తోంది. జనులు వీటిని వ్యర్థమైన భ్రమగా భావించి వీటిని వ్రాయలేదేమోనని అనుకుంటున్నాను. నేను భ్రమ (Whim) అని అంటున్నా కూడా, దానిలో ఏదో ఉంటుంది, కాని నా దగ్గరైతే ఏమీలేదు. ఏ దశయైతే ఉందో అది మృత సమానంగాను, ఇంకా ఏదైతే ఉండి ఉంటుందో అదీ మృత సమానంగాను, అలాగే రాబోయే దశ కూడా మృత ప్రాయంగానే ఉండబోతోందని అనిపిస్తోంది. ఇదంతా ఏమిటో తమకే తెలియాలి, తమ నిర్వహణకే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 605

లఖీంపుర్,

18.12.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. నాకు అప్పుడప్పుడు తమ జ్ఞాపకం బాగా వస్తూ ఉంటుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా ఈ దశలో నేను ఒక అంతులేని మైదానంలో వెళ్ళుతున్నట్లుగా ఉంది. అక్కడ ఆత్మకు ప్రవేశం లేదు. బ్రహ్మ యొక్క ఉనికి కూడా లేదు. నాకు ఏమి అనిపిస్తోంది అంటే, ఈశ్వరుడైతే ఈశ్వరుడు కావచ్చును, కాని ఆత్మమట్టుకు ఆత్మ కాదని అనిపిస్తోంది. ఇలా ఎందుకో తెలియటం లేదు. ఆత్మ అనేది ఎవ్వరిలోనైనాగాని, ఎక్కడైనాగాని లేదు. ఈశ్వరుడైతే అందరిలో ఉన్నాడు కాని ఆత్మ ఎవ్వరిలోనూ లేదు. ఇదంతా చూస్తూ ఉంటే, కేవలం వినీ వినిపించని గాలి మాటలులాగా ఉన్నాయి. నా దశ ఎలా ఉందంటే, భోజనం అన్నా ప్రసాదమన్నా ఒకటేనని అనిపిస్తోంది. ఎవరిదైనా ఎంగిలి అన్నం తిన్నా కూడా అది నాకు ప్రసాదంగానే అనిపిస్తుంది. కాని ప్రసాదం యొక్క ఆలోచనగాని, అనుభూతిగాని లేదు.

తరుచుగా శరీరంలో అంతటా తీవ్రమైన కంపనం (Vibration) కలుగుతుంది. నా యొక్క ఈ కంపనం విశ్వమంతటా వ్యాపించి ఉన్నట్లుగా ఉంటుంది. కాని ఈ ప్రకంపనం (Vibration) పవిత్ర రూపంగా ఉంటుంది. కంపనం అంటే కంపనమే అయినప్పటికీ నాలో ఉన్నది కూడా అదే. మాట్లాడుతుండగా ఈ కంపనం తొలగిపోతుంది. ఈ శరీరం ఎక్కడికి వెళ్ళినాగాని ఈ ప్రకంపనం వ్యాపించిపోతుంది. ఇంక మరొకటి ప్రకాశమనేది వ్యాపించి ఉన్నాగాని అది ప్రకాశహీనంగానే ఉంటుంది. ఒకవేళ ఈ ప్రకంపనంలో శరీరం జోడించి పని చేసినట్లయితే ఎంత తీవ్రంగా ఉంటుంది అంటే, వెంటనే శరీరం దానిని స్వయంగా విడిచిపోతుంది. అది ఏమిటో తెలియదు. ఇప్పుడు నాలో ఇచ్ఛగాని, శక్తిగాని లేవు. కాని ఈ కంపనంలో ఏ మాత్రమైన శరీరాన్ని జోడించినట్లయితే పని జరిగిపోతుంది. అది ఏమిటో తెలియదు గాని, ప్రతి మనిషి నాకు గురువుగా అయిపోయాడు, కాని నాకు నా 'మాలిక్' జాడ కనిపించటం లేదు. 'అతని' కోసం ప్రపంచమంతా వెదకినట్లయితే 'అతడు' నేనుగానే కనిపిస్తున్నాను కాని ఇంకెవ్వరూ ఉండటం లేదు. అనేకత్వం గాని, ఏకత్వంగాని ఎప్పుడూ ఉండటం లేదు.

నాకైతే ఇప్పుడు సర్వశక్తిమంతుడుగాని, సర్వవ్యాపిగాని, సర్వాత్ముడుగాని ఎవ్వరూ లేరనిపిస్తోంది. ఈ స్థితి ఏమిటోగాని అంతుబట్టటం లేదు. అయినాగాని నేనొక వియోగినిగా ఉన్నాను. ఎందుకంటే, నాలుగైదు రోజుల క్రితం నేనొక గీతం విన్నాక శరీరం ఉదాసీనంగా అయిపోయింది. కణకణం అశాంతిగా అయిపోయింది, ఎందుకో తెలియదు. శరీరం ఈ విధంగా అయిపోయనప్పటికీ కూడా ఈ అశాంతి అనేది 'మాలిక్' దగ్గర నుండి వస్తున్నట్లుగా అనిపిస్తోంది. అది అలా వచ్చి మళ్ళీ వెంటనే వెళ్ళిపోతుంది. గుండెను ఎవరూ పట్టుకుని ఉండకపోతే కణకణం పగిలిపోతుందని అనిపించింది. ఇంకొక దశ ఎలా ఉందంటే, 'బాబూజీ' చాలా దూరంగా వెళ్ళిపోయారు అని ఎవ్వరైనా చెప్పినట్లయితే, నా ప్రాణం దూరంగా వెళ్ళిపోతోంది, ఆ తర్వాత ప్రకాశ వంతమైన వాతావరణం వ్యాపించి ఉంటోంది. ప్రకృతి, పరమాత్మ అను మాటలన్నీ వినీ వినకుండా గాలిలో కలిసిపోయేవాటిలాగ ఉన్నట్లు ఈ దశ అనుభవమవుతోంది. ఇప్పుడు నా మనస్సులో రాముడు-రహీమ్‌గాని, ప్రకృతి-పరమాత్మగాని, ఈశ్వరుడు మరెవ్వరైనాగాని లేరు. ఈ మాటలు వింటూ ఉంటే ఏదో భ్రమగా అనిపిస్తోంది. ఇటీవల నాకేమీ అర్థం కావటం లేదు. రాత్రిపూట ఎవరో బలవంతంగా పడుకోబెట్టి ఉంచుతున్నారని అనిపిస్తోంది. ఏదైనా చప్పుడైతేతప్ప పండుకొని లేవటం లేదు. కావాలనుకుంటే రాత్రి 2 గంటలప్పుడైనా లేచి కూర్చుంటాను. నిద్రలేమివలన బద్ధకం కూడా అనిపించదు, శరీరంలో అలసట కూడా ఉండదు.

నా ఈ దశలో అశాంతి అనేది లేదు. ఎవరో నన్ను అంటిపెట్టుకుని ఉంటున్నారు లేదా ఎప్పుడైనా తపన అయినా కలుగుతోంది. 'మాలిక్' మాత్రం నన్ను ఎప్పుడూ అశాంతిగా ఎందుకు ఉండనివ్వటం లేదు అంటే నా అశాంతి మూలంగా వాతావరణం అంతటాను, కణకణంలోను అశాంతి యొక్క పరమాణువులు ఉరకలు వేస్తూ ఉంటాయి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

**ఉత్తరం సంఖ్య - 606**

లఖీంపుర్,

21.12.1956

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఆరోగ్యం ఇప్పుడు బాగుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా ఈ దశ ఏమిటోగాని, జీవిస్తూ ఉంటూ మరణిస్తున్నట్లు అనిపిస్తోంది. నిండుగా ఉన్న ఆహ్వానితులమధ్య కూర్చుని ఉంటాను. వారిలో కనీసం 5 నిమిషాలపాటు ప్రశాంతంగా, మౌనంగా కూర్చున్నట్లయితే, నేను ఎక్కడ ఉన్నానో, ఎక్కడ లేకుండా ఉన్నానో తెలియనంతగా స్పృహ లేకుండా ఉంటున్నాను. స్పృహలోకి వచ్చాక కూడా కొంతసేపు మాట్లాడలేకపోతున్నాను. ఆ విధంగా ఈ దశ అయితే నా స్వభావంగా అయిపోయింది. స్పృహ ఉండీ, లేకుండా రోజులు గడుస్తున్నాయి.

ఇప్పుడు ఆదేమిటో గాని, నా కణకణాల్లో లోన, బయట, ఎక్కడా కూడా 'మాలిక్' యొక్క సుగంధం (ఉనికి) అనుభవం కావటం లేదు. ఒకప్పుడు అయితే నాకు ప్రతి మనిషితోను, ప్రతి వస్తువుతోను అనుబంధం ఉన్నట్లుగా అనిపిస్తూ ఉండేది. అక్కడ ఎవ్వరైనా ఉన్నారో, లేదో తెలియకపోయినప్పుడు ఇంక ఆ అనుబంధం ఎక్కడ ఉంటుంది. 'మాలిక్'లో స్వయంగా నాకు 'మాలిక్' యొక్క సుగంధం రావటం లేదు. నేను పూజ (ధ్యానం) ప్రారంభించక పూర్వం ఉన్నటువంటి దశయే ఉంది అనగా నిత్యవ్యవహారాల్లో నిమగ్నమై ఉండటం మినహా ఆధ్యాత్మికత యొక్క ఆలోచన లేనప్పటి దశ. గృహ కార్యకలాపాల జ్ఞానం లేకపోవటంతప్ప అంతా ఇలాగే ఉంటోంది. ఇంటి పనులు కూడా జరిగిపోతూనే ఉన్నాయి. అయినాకాని వాటి జ్ఞానం ఉండటం లేదు. ఎందుకంటే, ముందు చేయాల్సిన పనులు గురించిన ఆలోచనా లేదు. జరిగిపోయిన వాటి గురించిన చింతా లేదు. దశ ఎంత సమానస్థాయిలో ఉందంటే, నాకు స్వయంగా నన్ను గురించిన జ్ఞానం ఉండటం లేదు. ఆఖరికి జ్ఞానం గురించిన జ్ఞానం కూడా ఉండటం లేదు. నా దశ ఎలా ఉందంటే, నేను ఎంతగా ఆలోచించినా లేదా ధ్యాస నిలిపినాగాని ఇప్పుడు ద్వైతం యొక్క జాడగాని, ద్వైత రహిత భావన (ఏకత్వం)గాని లేదు. వీటిపై నా దృష్టి నిలపటానికి నాలోన ఇంక శక్తి కూడా లేదు. ఇప్పుడు ఈ దశలో అణువణువు నుంచి 'బాబూజీ' యొక్క శక్తి ప్రకాశిస్తూ ఉంది. నా శరీరంలోని ప్రతికణంలో నుంచి 'బాబూజీ' యొక్క శక్తి ప్రకాశిస్తూ ఉంది. ఆ శక్తి ఏమిటో నాకు తెలియదు.

శిరస్సు యొక్క స్థితి ఎలా ఉందంటే, దానిలో అంతటా మిరుమిట్లు గొల్పుతున్నట్లు అనిపిస్తోంది. అయితే మిరుమిట్లుగొల్పుటమంటే, ఇది ప్రకాశం అని నేను ఎంతమాత్రం భావించటం లేదు. శరీరం అంతటా ఇటువంటి మార్పునే నేను గమనిస్తూ ఉన్నాను. అసలు ఈ దశ నాదో, కాదో కూడా నాకు తెలియటం లేదు. కాని దశ అనేది దశ అవునో కాదో, ఎందుకంటే, నేను సదా ఎండిపోయి ఉంటున్నాను. దీనికి ఋతువులతో పనిలేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 607

లఖీంపుర్,
13.01.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను దద్దా ద్వారా పంపిన ఉత్తరం తమకు అంది ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా బాగున్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా ఈ దశ ఎలా ఉంది అంటే, పూజ చేయకుండా మామూలుగా కూర్చుని ఉండి కూడా కళ్ళు మూసుకొని తెరచినప్పుడు నాకు 5,7 నిమిషాలుపాటు ఏమీ కనిపించటం లేదు. కళ్ళు మూసినా, తెరచినా రెండూ ఒకే విధంగా

ఉంది. ఏమీ కనిపించటం లేదు, ఏదైనా స్పర్శించినా తెలియటం లేదు. ఇంతేకాదు, కళ్ళు మూసుకుని అటు ఇటు తిరిగినా లేదా కళ్ళు తెరచి తిరిగినా గాని భేదం ఏమీ కనిపించటం లేదు. పూర్వం నాలోపల ఎప్పుడూ ఒక తపన వంటిది గూడుకట్టుకుని ఉండేది. ఆ తపన ఏమిటంటే, 'మాలిక్'ను చేరుకోవటం, 'అతడి'ని పొందటం, 'అతడి' కోసం మరణించటానికైన సిద్ధపడటం వంటివి. కాని ఇప్పుడైతే ఎందుకో తెలియదు కాని, లోపల శాంతి వ్యాపించి ఉంటోంది. దప్పికగాని, తపనగాని లేవు. మనస్సులో వీటిని పునఃస్మరించుకుంటున్నప్పటికీ మనస్సుపై ప్రభావం ఉండటం లేదనిపిస్తోంది. అదేమిటోగాని, నేను ఏదైనా చేసినా కూడా అది నటనలాగా నాకు అనిపిస్తోంది. నేనేం చేయను? నా ప్రతి శ్వాసలోను, నరనరాల్లోను, హృదయంలోను ఇమిడి ఉన్న నా 'మాలిక్' కోసం త్యాగం చేయటానికి సిద్ధపడిన నా ప్రాణం, ఇప్పుడు వీటన్నింటితోపాటు కరిగిపోయి, శుభ్రమై పోయింది. ఇప్పుడు హృదయంమీద దాని ప్రభావం ఉండటం లేదు. నన్ను నేను కొట్టుకున్నాగాని దెబ్బ తగలటం లేదు. ఎవ్వరినైనా తిట్టినాగాని తిట్లు వినిపించటం లేదు. ఇప్పుడు ఈ దీపంలో తైలం ఆవిరైపోయింది. తాళంచెవి కూడా పట్టుతప్పిపోయింది. నూలు విచ్చెలో ఎరుపురంగుగా కళ రాలేదు. నూలు విచ్చె అమ్మకు ఇచ్చాను. కాని ఎరుపురంగు నూలు విచ్చె ఎక్కడా దొరకలేదని చెప్పాను. కాని 'మాలిక్' మాత్రం ప్రతిస్థితిలోను నన్ను కాపాడుతున్నాడు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 608

లఖీంపుర్,
16.01.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తమ సమాచారం తెలిసింది. తమ ఆరోగ్యం ఇప్పుడు బాగుందని తెలిసి సంతోషమయ్యింది. ఈశ్వరుడు తమరిని సదా ఆరోగ్యంగా ఉంచుగాక! 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా దశలో ఎలా ఉందంటే, ఎవ్వరైనా 'మాలిక్'పట్ల ప్రేమతో అశాంతిగా ఉన్నాగాని, తపించిపోతున్నాగాని నా హృదయం మీద ఎటువంటి ప్రభావం ఉండటంలేదు. హృదయం లోపల ఏమి ఉన్నాగాని ఎవరు కూడా వశంతప్పకూడదని కోరుకుంటుంది. వాస్తవానికి హృదయం ఒక రాయి వంటిది. దానిని ఎవరైనా వశపర్చుకోవాలని ప్రయత్నించినట్లయితే అది నాకు సరైనదిగా అనిపిస్తుంది. ఎందుకో తెలియటం లేదు కాని, ఆంతరంగిక విషయాన్ని బహిర్గతం చేయటం మంచిది కాదనిస్తోంది. ఈ స్థితిలో నాకు ఇప్పుడు ప్రేమ కూడా ఒక మలినమేనని, అది ఇప్పుడు తుడిచిపెట్టబడిందని నాకు అనిపిస్తోంది. ఇప్పుడైతే నిద్రయే రావటంలేదు. ఇంక ఎలా ఉందంటే, నేను 'బాబూజీ'కి ఉత్తరం వ్రాస్తున్నాను, అప్పుడు ఆకలి వేసి ఉంటే ఆ ఉత్తరంలో 'బాబూజీ' ఆకలి వేస్తోంది అని వ్రాసేస్తున్నాను. ఏ మాట దాగటం లేదు. ఉన్నది ఉన్నట్లుగా బహిర్గతమవుతోంది అందరి ఎదుట. ఇదంతా ఏమిటో 'తమ'కే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 609

లఖీంపుర్,
22.01.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ క్షేమంగానే ఉన్నాము. అక్కడ తమరు కూడా క్షేమంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నా దశ ఏమిటోగాని, నా స్థితి యొక్క దృఢత్వం, వగైరా ఎక్కడకు పోయాయో తెలియటం లేదు. దశ ఇప్పుడు శుద్ధంగా ఉంది, దాని స్వభావం కూడా మృదువుగానే ఉంది. ఇంతకుపూర్వం నా దశ ఎలా ఉండేది అంటే, ఎవ్వరైనా నా గురించి ప్రశంసచేస్తూ ఉన్నట్లయితే, నాలో అంతటా ఒక రకమైన సంతోషలహరి కలుగుతూ ఉండేది. నేను దానిని 'మాలిక్' యొక్క ప్రశంసగా మార్చుతూ ఉండేదానను. అప్పుడు ఆనందంగా ఉండేది. కాని ఇప్పుడు ఏమిటోగాని ఈ ఆనందలహరి అయితే స్వల్పంగానైనా వస్తోంది కాని, దానితో నాకు సంబంధం ఉండటం లేదు. అందుచేత తరచుగా ఇప్పుడు ఏమి అనిపిస్తున్నదంటే, ఈ లహరి ఎక్కడ ఉంది, దేనిలో ఉంది అను సందేహంతో ఏమీ తెలియటం లేదన్నట్లుగా ఉంది. పూర్వం నా దశ ఎలా ఉండేదంటే, నేను ప్రతి ఒక్కరికీ బానిసననీ, సత్సంగ్ సోదరుల చరణాలముందు తల వంచి ఉంటున్నట్లుగాను ఉండేది. కాని ఇప్పుడేమో నా స్థితి ఒక విగ్రహంలాగా ఉంది. వైరాగ్యమే నా స్థితి యొక్క స్వరూపంగా అయిపోయింది. తమ దగ్గర నుంచి తిరిగివచ్చేవారి రాకతో తమ గురించిన మాటలు వినటంలోను, తమ సందేశం వినటంలోను కొంత అశాంతి ఉంటూ ఉండేది. కాని ఒకటి రెండు రోజుల్లోగా తమ సమాచారం తెలుసుకోవటం కోసం మనస్సులో కొంత నిరీక్షణ ఉంటోంది. కాని మనస్సుతో నిరసన లేదా విభేదించటం వచ్చేది కాదు. అది ఉన్నది ఉన్నట్లు శాంతంగానే, ప్రతి సందేశం అందినట్లుగానే ఉంటుంది. ఇప్పుడు మనస్సుకు తృప్తి కలిగింది. ఈ మాటలు వింటూ ఉంటే స్వప్నంలో గొణుక్కుంటున్నట్లుగా అనిపిస్తోంది. ఇదే విధంగా ఉత్సవం గురించిన ఆలోచన వచ్చినపుడు, అక్కడికి వెళ్ళటానికి తహతహలాడుతూ అశాంతి కలుగుతుంది. ఆ ఆలోచనయే రాకపోతే మాత్రం మనస్సు ఉన్నది ఉన్నట్టుగానే ఒక విగ్రహంలాగా ఉండిపోతుంది. ఉత్సవం యొక్క ఆలోచనను 'మాలిక్' కల్పించకపోయినట్లయితే ఉత్సవం జరిగిపోయి ఉండేది. నాకు ఈ విషయం తెలిసి ఉండేది కాదు.

మొన్న షుమారు 8,9 గంటలకు కుడిచేతి ప్రక్క ఎముకలో ఒక కదలిక లేక వణుకు లాంటిది కలిగి వ్రణం నుంచి ఏదో మేకు వంటిది బయటకు వచ్చినట్లుగా అనిపించింది. ఇప్పుడు నాకు ఏ సమాచారంగాని, సమాచారం లేకపోవటంగాని లేదు. ఇలా ఉన్నా ఇది దశ కాదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 610

లఖీంపుర్,
29.01.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ నుంచి నాకు ఉత్తరం రాలేదు. బహుశా తమరు ఇతర పనుల్లో నిమగ్నమై ఉంటారు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు పూర్తిగా ఆలోచనారహిత స్థితియే నా జీవనంగా అయిపోయింది. చెప్పటం, చేయటం, జీవనం అన్నీ కలిసి ఒకటిగా అయిపోయి ఉంది. ఇంతేకాదు, లోన బయట అన్నింటా నిరాలోచన దశయే వ్యాప్తమై ఉంది. దశలేని దశయే నా స్వరూపంగా అయిపోయింది. ఇంకా ఏమిటంటే, ప్రతి ఒక్కరిలోపల ఇదే దశ వ్యాపించి ఉన్నట్లుగా నాకు అనిపిస్తోంది. అలాంటివారు పూజ (ధ్యానం) చేస్తున్నవారు అయినా, కాకపోయినా సరే. నా దశ ఎలా ఉందంటే, పూజ కొరకు పూలు త్రెంచి ఎక్కడో ఉంచి వస్తాను, మరచిపోతాను, కాని మళ్ళీ వాటిని పొందినపుడు, అవి వ్యర్థమైపోయాయి అని అనిపించదు. అవి కూడా నాకు పూజకు ఉపయోగించిన పూలతో సమానంగానే అనిపిస్తాయి.

ఇప్పుడు దశ ఏమిటంటే, ఒక విశ్రాంతి స్థానంగా ఉంది. ఎలాంటిది అంటే, నేను చేసిందేమి లేదు, చేయవల్సింది లేదు, తీసుకోవాల్సింది లేదు, ఇవ్వాల్సింది లేదు, చెప్పాల్సిందీ లేదు, వినాల్సింది లేదు. ఇప్పుడు దశపై ధ్యానం (దృష్టి) నిలిపినా కూడా ఇదే దశ ఉంటోంది. నేను మరచిపోయినా కూడా అదే దశ ఉంటోంది. అలా కాకుంటే ఇలా చెప్పవచ్చు. ఈ జ్ఞాపకం యొక్క అవస్థగాని, మరపు యొక్క అవస్థ అయినాగాని ఇప్పుడు అవస్థలనేవి విశ్రాంతి తీసుకుంటున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ధ్యానమా (జ్ఞాపకమా) లేక మరుపా, ఏమని చెప్పాలి. నిరాలోచన యొక్క ఆలోచనయే వ్యాప్తమై ఉంది. అంతే ఇంకేమీ లేదు. ఎంత సరళం మరియు తేలికైనది అంటె, ఆలోచన అనేది భారంగా అనిపిస్తోంది. ఎందుకంటే, దానిలో మునగటం సాధ్యపడదు, దానిని స్పర్శించగలమో లేదో కూడా తెలియదు. ఇప్పుడింక దృష్టియే దశలో విలీనమైపోయింది అని అనిపిస్తోంది.

యదార్థం ఏమిటంటే, దీనిని ఆలోచన అని చెప్పినా లేక నిరాలోచన అని చెప్పినా దశ అనిగాని, దశలేని దశ అని చెప్పినా గాని, అక్కడ అనగా నాలో దేనికీ ప్రవేశం లేదు. ఏమి చేయటానికైనా ప్రవేశం లేదు, అలా చేయటానికి ఏమైనా మిగిలి ఉందన్న అనుభూతీ లేదు. నాతోపాటు పూజలో కూర్చున్న అభ్యాసులకు ఎవరికైనాగాని ఈ దశయే అనుభవమవుతోంది. ఇప్పుడు విశ్రాంతియే విశ్రాంతి తీసుకుంటున్నట్లుగా ఉంది.

వెన్నెముక అంతా ఒక్కసారిగా తిన్నగా అయిపోయింది. కొంచెం తేలికపాటి చల్లదనం వంటిది, పక్షులు రెక్కలార్చినపుడు ఉన్న కంపనం వంటిది అనుభవమవుతోంది. అలాగే ఒక నమ్రత వంటి దశ కూడా దానిలో వ్యాపించి ఉంది. నాకయితే, ఏ ఆధారం మీద నా జీవనం నిలబడి ఉందో, ఆ ఆధారమే నాకు దశ అంతటిలోను మునగటానికి లేదా లీనమైపోవటానికి ఆటంకంగా ఉందని అనిపిస్తోంది.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 611

లఖీంపుర్,
24.02.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ ఉత్తరం రాలేదు విచారంగా ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో ఇలా ఉంది. బస్సులో కూర్చుని వెళ్తూ ఉంటే నేను ఇంట్లో కూర్చున్నానో లేక బస్సులో కూర్చున్నానో గుర్తించలేక పోతున్నాను. ఎక్కడికైనా వెళ్ళినట్లుగా కూడా అనుభవం కావటం లేదు. ఎవరి ఇంట్లోనైనా కూర్చుని ఉంటే, నా ఇంట్లో కూర్చున్నానో లేక మరెవ్వరి ఇంట్లో కూర్చున్నానో తెలియటం లేదు. అలాగే నా ఇంట్లోనే

కూర్చుని ఉన్నాగాని ఎవరి ఇంట్లోనైనా కూర్చున్నానేమోనని అనిపిస్తోంది. యదార్థం ఏమిటంటే, ఇప్పుడు నాకు ఇల్లు, వాకిలి యొక్క అనుభూతియే కలగటం లేదు. ఎక్కడ కూర్చున్నా ఇదే సంగతి. అంతా బంజరులాగే అయోమయంగా ఉంది.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 612

లఖీంపూర్,

25.02.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను నిన్ననే తమకు ఒక ఉత్తరం వ్రాశాను. ఈ రోజు మళ్ళీ వ్రాస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో ఎలా ఉంది అంటే, ఎవ్వరైనా పూజలో (ధ్యానంలో) బాగుంది అనిపించిందా అని అడిగినట్లయితే, నేను ఏమి చెప్పలేకపోతున్నాను. ఎందుకంటే, బాగుందో లేక బాగుండలేదో నాకు తెలియటం లేదు. అంతేగాక బాగుందని అనుభవం కలిగినా కూడా నాకు దాని జాడ తెలియటం లేదు. నాకు బాగుందని అనిపిస్తోందా లేక ఇంకెవ్వరికైనా అనేది కూడా తెలియనంతగా మర్చిపోతున్నాను. నాకు బాగుందని అనిపించినట్లయితే అందరికీ కూడా అదే భావం, అదే దశగా ఉన్నట్లు నాకు అనుభవమవుతోంది. నాకు సరళా జిజ్జీని గురించిన దిగులు ఉండేది, కాని ఈ దిగులు ఎవరికో తెలియనట్లుగా ఉంది. ఇదివరకటిలాగా సంస్కారాల మరకలు నా హృదయం మీద నిలవటం లేదు.

ఇప్పుడు ఉన్న దశ ఏమిటంటే, కస్తూరీ, నిన్ను గురించి బాబూజీ బాగా జ్ఞాపకం చేసుకున్నారు అని ఎవ్వరైనా చెప్పినట్లయితే, కస్తూరీ ఎవ్వరు? ఎవ్వరి విషయంలో ఈ మాటలు వచ్చాయి అనేది కూడా నా గ్రహింపుకు రావటం లేదు.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 613

షాజహాన్‌పూర్,

06.03.1957

ప్రియమైన కుమార్తె కస్తూరి,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరాలు 1957 ఫిబ్రవరి 24, 25వ తేదీలవి చేరాయి. జడ్జిగారి (కస్తూరిగారి బంధువు) ఉత్తరం కూడా అందింది. దీనిలో చింతించాల్సిన విషయం ఏమీ లేదు. ఎందుకంటే, ప్రతి ఒక్కరూ బాగుండటానికి ప్రయత్నించవలసిన అవుసరం ఉంది. కనీసం ఒక్కరైనా నాలాగ తయారైనట్లయితే మన మిషన్ యొక్క లక్ష్యం నెరవేరినట్లే. నేను 22 సంవత్సరాల కృషితో పొందగలిగిన ఆ అంతిమశక్తి యొక్క ప్రభావాన్ని పొందగలగినవారు ఇప్పటివరకు ఆ స్థాయికి ఏ ఒక్కరూ తయారుకాలేదు. నిస్సందేహంగా, మిషన్‌లో మంచివారు ఉన్నారు. వారిలో ఆ దివ్యకాంతి కూడా ఉంది. ఇది చాలా మంచి విధానం. దీనిలో అభ్యాసి ఆధ్యాత్మిక శిక్షణ ఇచ్చేవారి (ఆధ్యాత్మిక గురువు) రూపాన్ని దర్శిస్తూ ఉండాల్సి ఉంటుంది. నేను నా గురుమహరాజ్‌వద్దకు వెళ్ళినపుడు, వారి ఎదురుగా కూర్చొని, వారి ముఖారవిందాన్నే బాగా చూస్తూ ఉండేవాడిని. నీవు ఇప్పుడు '$N_1$' పాయింట్ మీద ఉన్నట్లుగా నీకు నేను చెప్పాను. కాని నేను ఆ పాయింట్ మీద ఎక్కువ దృష్టి పెట్టలేదు. దాని ప్రభావమైతే అనుభవానికి వచ్చింది కాని దాని పని ఇంకా ప్రారంభం కాలేదు.

మానవుడు తనవన్నీ పూర్తిగా కోల్పోయినపుడు, అతనికి వాస్తవిక జీవితం ప్రాప్తమవుతుంది. నిజానికి అన్నీ పోగొట్టుకోవలసిందే. నీవు ఆ విధంగా కోల్పోతూనే ఉన్నావు. నేను తిరుపతి వదిలి రేణుగుంట చేరి అక్కడ మద్రాసు వెళ్ళటానికి రైలు మారినప్పుడు, డాక్టర్ కె.సి. వరదాచారిగారి శిష్యులు కొంతమంది కలిశారు. వారికి వరదాచారిగారు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఆధ్యాత్మిక బోధనలు వినిపించేవారు. ఆ ప్రయాణంలో నేను కూడా వారికి ఒక పాఠం చెప్తూ "నీకు నీవుగా కరిగిపోవాలి" (Liquidate yourself) అని బోధించాను. ఆ మాట నాకు ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. నీవు అదే విధంగా స్వయంగా చేసుకుంటూనే పోతున్నావు. నేను నిన్ను జ్ఞాపకం చేసుకుంటున్నట్లుగా నీకు తెలిసినప్పుడు, ఆనందపు అలలు నీ శరీరమంతటా ఉరకలువేసి, తర్వాత యధాప్రకారంగా అయిపోతున్నట్లుగాను, అప్పుడు కస్తూరి అంటె ఎవరో తెలియనట్లుగాను ఉంటోంది అని నీవు ఉత్తరంలో వ్రాశావు. నీవు నీ ఉనికిని కోల్పోవటమే కాకుండా నీ జ్ఞాపకాన్ని నీవు మర్చిపోయావు అని దాని అర్థం. దీనిని లయ-అవస్థ యొక్క ఉత్తమశ్రేణిగా చెప్పాలి. నీ ఉత్తరంలో నీవు ఒక మంచి వాక్యం వ్రాశావు. అది, "నేను నా ప్రేమబంధంతో తమర్ని బంధిస్తూ నన్ను నేనే పోగొట్టుకున్నాను" అని. దాని అర్థం, భక్తి అను బంధం ఏదైతే నిన్ను బంధించి ఉంచిందో అది తన బంధనాన్ని తొలగించింది. మనం భక్తితోనే ముందుకు సాగిపోవాలి, కాని దాని ఆవరణ ఎప్పుడైతే తొలగిపోతుందో అప్పుడు అది జ్ఞానంగా మారుతుంది. ఆ జ్ఞానం యొక్క తపన ఎప్పుడు సమాప్తమైపోతుందో అప్పుడు అది సత్యత్వం (రియాలిటి)గా మారుతుంది. ఎప్పుడైతే భక్తి యొక్క ఆవరణ తొలగిపోతుందో అప్పుడు జ్ఞానం యొక్క స్థితి కలుగుతుంది. దాని తర్వాత మరపుస్థితి ఆరంభమవుతుంది. అనగా జ్ఞానస్థితి యొక్క భావం తొలగిపోతూ ఉన్నప్పుడు దివ్య జ్ఞానం (Divine Wisdom) ఆరంభమవుతుంది. ఆ జ్ఞానం యొక్క ప్రభావం తొలగిపోతూనే విజ్ఞానం యొక్క పరదా అనగా విజ్ఞానమయకోశం (జ్ఞాన భాండాగారం) బ్రద్దలైపోతూ ఉంటుంది. అపుడు మన జ్ఞానం, బుద్ధి (వివేకం) దివ్యమైపోతాయి. విజ్ఞానమయకోశం బ్రద్దలైన తర్వాత ఏమి జరుగుతుంది? అనేది ప్రశ్న. దివ్యజ్ఞానం కూడా తనవంతుగా అసలు భాండాగారంలో (మూలాధారంలో) లయం కావటం ప్రారంభమవుతుంది. ఈ విధంగా జరిగిన సందర్భంలోకి ఏ అభ్యాసియైనా చేరగలిగినపుడు, అతని వాక్కులో (Automatic Divine Wisdom) అప్రయత్నపూర్వకమైన దివ్యజ్ఞానం వెలువడుతూ ఉంటుంది. అయితే ఈ క్రొత్త మేళవింపు సమాప్తమైపోతుంది అని అనుకోకూడదు. (రియాలిటి) వాస్తవికతలో ఉన్నటువంటి ప్రభావమే నరనరాల్లోను ప్రవహించటం మొదలైనపుడు మాత్రమే దాని జాడలేకుండా పోయినట్లుగా గ్రహించాలి.

నేను ఫిబ్రవరి 5వ తేదీన రాత్రి ఒక కలగన్నాను. దానిలో నేను కొంతమంది అభ్యాసులకు సిట్టింగ్ ఇస్తున్నాను. ఆ సందర్భంలో అభ్యాసులు ప్రాణాహుతిని పొందుతూ ఉండగా, ఆకాశం చేతికందుతున్నంత దగ్గరగా వచ్చినట్లుగాను, ఆకాశంలోని నక్షత్రాల వెలుగు చాలా (Dim) కాంతిహీనంగా ఉన్నట్లుగాను నేను చూసాను. నాకు ఇప్పటికీ ఆ దృశ్యం చూడాలనిపిస్తోంది. దీనిని గురించిన వివరణ ఆ దైవానికే తెలియాలి. స్వప్నమైతే చాలా బాగుంది.

చౌబేజీ మరియు అమ్మకు ప్రణామం. మీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 614

లఖీంపూర్,

8.03.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం ఈరోజే చేరింది. చదివి చాలా సంతోషించాను. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తమకు కొద్దిగా జలుబు, దగ్గు ఉన్నట్లుగా తెలిసింది. తమరు దయచేసి మందులు సరిగా వాడండి. 'మాలిక్'

కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో, నాకు ఎప్పుడైనా నన్ను జ్ఞాపకం చేసుకోవాలని ప్రయత్నించినా కూడా వ్యర్థమైపోతోంది. అలాగే నేను నన్ను మరచిపోవాలని ప్రయత్నించినట్లయితే, ఎలా ఉంటున్నదంటే వేదిక (స్టేజి) మీద ఒక నాటకానికి ముందు తెర మీద ఏవో మాటలు జరుగుతున్నట్లుగాను, లోపల పరిస్థితిని జీర్ణించుకోవటానికి శక్తి కూడా లేనట్లుగాను అనిపిస్తోంది. సిట్టింగ్ తీసుకుంటున్నప్పుడు దానికి తగిన స్పందన లేకుండా ఖాళీగా కూర్చుంటున్నాను. నేను సిట్టింగ్ ఇస్తున్నప్పుడు ప్రాణాహుతి వెళ్తున్నదా లేదా అనేది కూడా తెలియటం లేదు. ఎందుకంటే, అది (ప్రాణాహుతి) నన్ను స్పర్శించటం లేదు. నేను ఒక రాయిలాగా అయిపోయాను. అయితే నేను మానవులకు మాత్రం రాయిని కాను; అనగా వారికి హాని కలిగించే దానిని కాదు. వారి కష్టాలు, బాధల్లో సదా తోడుగానే ఉంటున్నాను. కాని పూజలో మాత్రం రాయిలాగా ఉన్నాను.

నా దశ ఎటువంటిది అంటే, మానవీయమైనదిగాని, ఈశ్వరీయమైనదిగాని, 'మాలిక్'దిగాని, ప్రార్థనదిగాని ఏ శక్తి లేనట్లుగా ఉంది. నిర్వహించే శక్తిగాని, వినాశక శక్తిగాని లేవు. శక్తి అను మాటకు అర్థమే లేకుండాపోయింది. దశ యొక్క అనుభవం పొందటంలో ప్రాపంచిక జీవనంగాని, ఆధ్యాత్మిక దశల అనుభవంగాని పూర్తిగా దరిచేరటం లేదు. కేవలం ఒక్క అంచనా వేయటం మాత్రమే సాధ్యపడుతోంది, అది కూడా 'మాలిక్' కృపవల్లనే లేదా బలవంతంగానైనా అనుకోవచ్చు. ఇప్పుడు నా లోలోపలనే స్వయంగానే నా ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి ప్రవాహం) జరుగుతోంది. శిరస్సు మధ్యలో సహస్రదళకమలం స్థానంలోనే ఎడమవైపున ఎవరో చేతి బొటనవ్రేలితో శిరస్సు నొక్కిపట్టినట్లుగా అనిపిస్తోంది. ఏదో స్థితి నాలోపల నుంచి బయటకు వ్యాపించిపోతున్నట్లుగా అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, దానిమ్మ లోనుంచి పూరేకలు విచ్చుకున్నట్లుగా (లేదా చిచ్చుబుడ్డిలాగా) లోపలి నుంచి దానిలాగే దశ బయటకి వ్యాపిస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఇటువంటి అనుభవం ఎప్పుడూ కలగలేదు. నాతో ఎవ్వరైనా నీవు స్వతంత్ర ఆత్మవు అని అంటె కూడా నాకు దాని సంకేతం దొరక్కపోగా చివరకు స్వతంత్రత అంటే ఏమిటి అన్నట్లుగా అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, చిన్నపిల్లల ఆటలోలాగా నన్ను ఎవరైనా బాలుడు బంధించినట్లయితే, అప్పుడు కూడా ఆ బంధనం యొక్క అనుభూతి కలగటం లేదు. ఏదైనా దశ వ్యాపించి ఉన్నా, లేకపోయినా, నేను మాత్రం యధాతథంగానే ఉన్నట్లు అనిపిస్తోంది. నాలోనైతే ఏ స్థితిలోనూ ఎప్పుడు కూడా మార్పు ఉండటం లేదు.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

**ఉత్తరం సంఖ్య – 615**

లఖీంపూర్,
15.03.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని భావిస్తున్నాను. ఇక్కడ అందరూ క్షేమంగానే ఉన్నాము. అక్కడ తమరు కూడా క్షేమమేనని తలుస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇంతకుక్రితమైతే నాకు నాలుగువైపులా పవిత్ర వాతావరణం నెలకొని ఉన్నట్లు ఉండేది. నేను ఎక్కడికి వెళ్ళినా, అక్కడ పవిత్రతా తరంగాలు వ్యాపించేవి. కాని ఇప్పుడు అటువంటిది నా అంచనాకు రావటంగాని, అనుభూతి కలగటంగాని లేదు. అంతేకాదు, నేను తమవద్దకు వచ్చినప్పుడైనా నాకు ఇటువంటి అనుభూతి కలగటం లేదు. పవిత్రత కూడా ఒక మురికిదే అని, అది హృదయం నుంచి తుడిచిపెట్టుకుపోయిందనీ నాకు అనిపిస్తున్న మాట

యదార్థం. అంతేకాదు, చెప్పటానికైతే 'శ్రీ బాబూజీ', 'శ్రీ బాబూజీ' అని వల్లెవేస్తున్నాను గాని, అది కేవలం ఒక ఉచ్చరించటంగానే ఉండిపోతోంది. ఏ మనిషి యొక్క ఉనికి ఊహకందటం లేదు. ఇంకేముంది, ఇప్పుడు ఈ హృదయంమీదనే కాకుండా ఈ రాతిమీద కూడా ఏ మాలిన్యం లేకుండా పోయింది. పూజ విషయంలో కూడా ఇదే. ఈ శిల శిలలాగానే ఉండి పోతుంది. ఇది నా పరిస్థితి. శరీరమంతా ఇప్పుడు ఒక శిలా విగ్రహంలాగా అయిపోయింది. ముందు, వెనుక ఎక్కడా కూడా కరగటం కాని, సరళత్వంగాని, మృదుత్వంగాని అనుభవం కావటం లేదు. ఇంకేముంది ఇప్పుడు కస్తూరీ లేదు. ఆమె రూపం ఒక శిలగా అయిపోయి నీటితో తడిసినాగాని తడవటం లేదు. పూలు వెదజల్లినాగాని అలంకరించబడటం లేదు. ఇంకేముంది, ఇప్పుడు శ్రీరామచంద్ర మిషన్ యొక్క భవన నిర్మాణంలో పునాది రాయిగా పేర్చటంలోనే ఈ రాయి 'మాలిక్'కు ఉపయోగపడుతుంది. 'మాలిక్' ఈ రాతిని ఎత్తి ఎక్కడైనా పైన పెట్టవచ్చు లేదా మరెక్కడైనా పెట్టవచ్చు లేదా ఎక్కడా పెట్టకపోయినాగాని అక్కడ పడి ఉంటుంది. అది మట్టికొట్టుకుపోయినా, దుమ్ముతో పూడుకుపోయినాగాని నేను ఎలా ఉన్నానో అలానే ఉన్నాను.

నేను ఇంతకుపూర్వం ఒక ఉత్తరంలో వ్రాశాను. ఏమంటే, స్పృహలేకపోయి ఉండి కూడా నాలోపల ఒక స్పృహవంటిది కలిగింది అని. కాని ఇప్పుడైతే ఈ స్పృహలేమి యొక్క ముసుగే తొలగిపోయినట్లుగా అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, స్పృహ యొక్క మాలిన్యం కూడా పడటం లేదు. ఇప్పుడు నాకేమీ తెలియటం లేదు. ఆంతరిక దృష్టి (అంతర్దృష్టి) కూడా ఎప్పుడూ కలగకపోయినాగాని 'మాలిక్' నన్ను 'సెయింట్'గా అంటున్నారు. నాకు ఇప్పుడు ఇటువంటి దశ అనుభూతికి రావటం లేదు కాని 'తమరు' నావారు, 'తమరు' చెప్పే మాటలన్నీ నాకు నచ్చుతాయి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 616

లఖీంపూర్,

24.03.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశ ఎటువంటిది అంటే, రాయిని ఎవ్వరైనాగాని నదిలో వేసి చల్లబర్చినా, అగ్నిలో వేసి వేడిచేసినా రాయి రాయిగానే ఉండిపోతుంది. దాని నుంచి బూడిద కూడా రాలదు. ఇంతకుక్రితం నాకు జనులందరూ ఛాయా మాత్రంగా కనిపించేవారు. కాని ఇప్పుడైతే ఎందుకోగాని నాకు ఛాయా మాత్రంగా కాకుండా, అందరూ యధాతథంగానే ఉన్నట్లు అనిపిస్తోంది. పూజ (ధ్యానం)కు పూర్వం ఏ స్థితి ఉండేదో ఇప్పుడూ అలాగే ఉంది. ఈ దశ కూడా ఇప్పుడు ఎలా ఉందంటే, ఒక మసకబారిన స్మృతి (జ్ఞాపకం) మాత్రం ఎప్పుడైనా ఎవ్వరికో వస్తున్నట్లు ఉంటుంది. శరీరమంతటా మరియు మెదడులో ఒక కంపనం వంటిది ఉంటోంది. అయితే నా దశ ఎలాంటిది అంటే కొంత విచిత్రంగా ఉంది. ఎందుకంటే, శరీరంలో ఎప్పుడూ ఆ కంపనం ఉంటూనే నాకు దానితో సంబంధం లేనట్లుగాను, అది నన్ను స్పర్శించనట్లుగాను అనిపిస్తోంది. యావత్తు శరీరం యొక్క ఎముకలు, మాంసం, నరనరాలు అన్నీ నిద్రపోయినట్లుగా అనిపిస్తోంది. అవన్నీ ఎలా ఉండేవో అలాగే అయిపోయాయి. బహుశా అందుకే వీటిలో భారం లేకుండా పోయింది. ఉన్నవి, లేనివి అన్నీ ఎలా ఉన్నాయో అలాగే అయిపోయాయి. ఇప్పుడు ఏమయ్యింది అంటే, రోజంతా మాట్లాడుతూనే ఉన్నాను, కాని దానితో నాకు సంబంధం ఏమీ లేనట్లుగానే ఉంది. మాట్లాడుతూ ఉండటం వలన ఏ భారం లేదు.

యథా[ప్రకారం మాట్లాడుతూనే ఉన్నాను. ఎందుకంటే, ఆ మాట్లాడటం యొక్క ఎరుక నాకు లేకుండా ఉంది. ఆ మాటలు [ప్రాపంచికమైనవి కావచ్చు లేదా ధ్యానానికి చెందినవి కావచ్చు. నాకు మాట్లాడుతున్న అనుభూతియే ఉండటం లేదు. 'మాలిక్' సామ్యావస్థను గురించి బాగా [ప్రశంసించారు. కాని నా స్థితి ఎంత దిగజారిపోయింది అంటే, సామ్యావస్థ అనేది 'అతడి'ని కనీసం స్పర్శించగలదా లేదా అని. ఎన్నడూ జరుగదు అనేదే నా జవాబు.

అదేమిటోగాని, కళ్ళు మూసుకుని పండుకొని ఉన్నాగాని, కళ్ళు మూసుకోవటం లేదన్నట్లుగా అనిపిస్తోంది. కళ్ళు మూసినా, తెరచి ఉంచినా దశ ఒక్కటిగానే ఉంటున్నది. ఇంకా ఏమిటంటే, కళ్ళు మూసి ఉంచుకుని కూడా నాలుగు వైపులా బాగా తిరిగి రాగలుగుతున్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ [ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 617

లఖీంపుర్,

27.03.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ [ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తామెల్లరి కుశల సమాచారం తెలిసింది. తమకు అప్పుడప్పుడు శ్వాస ఇబ్బంది కలుగుతూనే ఉంది. ఈశ్వరుడు త్వరగా ఈ బాధను నివారించుగాక! 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి [వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఉన్న స్థితిలో నాలోని తపన తగ్గి, శాంతిస్తూ ఉంది. అగ్ని ఆరిపోయింది, బూడిద కూడా తుడుచుకుపోయింది. ఈ అగ్ని ఎటువంటిది అంటే, అది కాలిన మచ్చ కూడా మిగల్చకుండా పోయింది. అది చూసినవారు ఎవ్వరికైనాగాని ఇక్కడ అసలు అగ్ని ఎప్పుడైనా ఉన్నదా అనిపించేలాగా ఉంది. ఆధ్యాత్మికోన్నతి గురించి నాకు ఏమి తెలియటం లేదు. జ్ఞాపకం అనేది నన్ను సతాయిస్తుంది, కాని దానిని నేను ఎంచలేకపోతున్నట్లుగా అనిపిస్తుంది. ఇంకొక స్థితి ఎటువంటిది అంటే, లోపలైతే ఎంతోకొంత ఆనందమైతే ఉంటుంది కాని, అసలు ఈ ఆనందం ఎవరికి కలుగుతోంది. అది నాకా, మరెవ్వరికైననా అనేది సరిగ్గా ఎంచలేకపోతున్నాను. కష్టాలు, బాధలు, మొదలైన వాటిలో ఇదే స్థితి ఉంటోంది. కొన్నిసార్లయితే పూర్తిగా మోసపోతున్నాను. బలహీనత కారణంగా రోజంతా కళ్ళు మూసుకుని పండుకుని ఉంటున్నాను కాని, నేను బలహీనంగా పండుకుని ఉన్నానా లేక ఇంకెవ్వరైనా బలహీనతతో పండుకున్నారా అని నా అంచనాను స్థిరపరుచుకోలేకపోతున్నాను. కేవలం బాధ, బలహీనత యొక్క అనుభూతి అయితే కలుగుతోంది, కాని అది ఎవరికి అని గట్టిగా నిర్ధరించుకోలేకపోతున్నాను. నా ఆత్మోన్నతి విషయంలో కూడా ఇదే పరిస్థితిగా ఉంది. ఉన్నతి అనే దానిని మాత్రం అంచన వేయగలుగుతున్నాను. దశ యొక్క అనుభూతి కూడా కలుగుతోంది కాని నేను మాత్రం స్వయంగా యథాతథంగానే ఉండిపోతున్నాను. ఇది ఏమిటోగాని, నా స్థితి తారుమారుగా అయిపోయింది. 'మాలిక్' నన్ను ఉన్నతిలో కూడా భాగస్వామిచేసి ఉంచుతున్నాడు. కాని నేను మాత్రం ఎలా ఉన్నానో అలాగే ఉంటున్నాను. ఎవ్వరైనా విముక్తి ఆత్మను (Liberated Soul) గురించి చర్చించినపుడు, ఇదంతా నాకు తెలిసిందేలే అని అనిపిస్తుంది కాని, నాకేమి తెలియకుండా ఉంటోంది. నాకు ఏమి తెలియదు. ఈ మాటలన్నీ నాకు ఎంతమాత్రం మహత్తరమైనవిగా అనిపించటం లేదు. అంతా మామూలే అన్నట్లుగా అనిపిస్తోంది. నా ఈ దశలో నాలోని భక్తి కూడా మరణించినట్లుగా ఉంది. ఎంత గొప్ప మహాత్ముని పేరు గురించి విన్నాగాని నాలో భక్తి భావం కలగటం లేదు. విముక్తాత్మ (Liberated Soul) గురించి వింటున్నాగాని, పూజ్యభావం ఉత్పన్నం కావటం

లేదు. ఎవ్వరైనా 10 వలయాలు లేదా 12 వలయాలు దాటారు అని విన్నాగాని, నాలో ఎటువంటి భక్తి జనించటం లేదు. ఎన్ని మహిమల గురించి విన్నా కూడా భక్తిభావం మేల్కొనటం లేదు.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 618

షాజహాన్‌పూర్,
03.04.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలు అన్నీ చేరాయి. ఈ సూక్ష్మస్థితులను తగిన మాటలతో ఎలా వివరించి చెప్పాలో అర్థం కావటం లేదు. ఈ కారణంగా నీకు జవాబు ఇంతవరకు ఇవ్వలేకపోయాను. అయినప్పటికీ ఏదో విధంగా వ్రాయాలనే భావించాను. వ్రాయటం ప్రారంభించగానే, లయ–అవస్థ, దాని తర్వాత దాని యొక్క లయ–అవస్థ తీరం చేరాలంటే ఇంకా చాలా దూరం ఉన్నట్లుగా అనిపించింది. మనం ఏ విషయాలనైతే మనలో ఉత్పన్నం చేసుకున్నామో, అవన్నీ వాటి కారణాలతో 'వారి'లోనే లయం చేయాల్సి ఉంది.

"ఈ ప్రపంచం అనేది లేదు, కాని మన ఆలోచనలు దానిని ఉన్నట్లుగా తలపించాయి" అని ఎవరో వ్రాశారు. వ్రాసినవాని విజ్ఞత ఇది. కాని విషయం ఏమిటంటే, మనం మన పరివారంతోసహా (రియాలిటి) వాస్తవికతకు చేరినప్పుడు, ఆ వాస్తవికత (రియాలిటి) కూడా ఒక వస్తువు అన్నట్లు అనిపిస్తుంది. మనం అనేకంగా ఉన్నప్పుడు మనకు అనేకత్వమే మన ముందు ఉంటుంది. ఎప్పుడైతే మనం ఒక్కటైపోతామో అప్పుడు ఒకే వస్తువుగా అందరికీ అనిపిస్తోంది. ఎప్పుడైతే ఏకత్వం యొక్క భావనగాని, అనేకత్వం యొక్క భావనగాని లేకుండా పోతాయో, అప్పుడు మనకు ఇంకేదీ కనిపించదు. అయితే ఇక్కడితో ఇది అంతం కాదు. దీనినే నీవు "ఇంతకుపూర్వం నాకు అన్నీ ఛాయా మాత్రంగా కనిపించేవి, కాని ఇప్పుడు ఆ ఛాయగాని, మరేమీగాని లేదు" అని వ్రాశావు. ఈ స్థితిలో ఎవ్వరైనా మాట్లాడినట్లయితే ఎవ్వరైతే మాట్లాడవలసి ఉందో **వారే** (దైవం) మాట్లాడతారు. ఈ పరిస్థితినే నీవు నీ ఉత్తరంలో పలువిధాలుగా వ్రాశావు.

చౌబేజీ మరియు అమ్మకు ప్రణామం. మీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 619

లఖీంపూర్,
3.04.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారిని ఉద్దేశించి వ్రాసిన తమ ఉత్తరం చేరింది. దానిలో తమ బలహీనత గురించి తెలిసి కొంచెం బాధ ఎక్కువైంది. 'తమరు' త్వరగా కోలుకోవాలని ఈశ్వరుని ప్రార్థిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

పూజ్య బాబూజీ, నా స్థితి ఏమిటోగాని, పావన ఈశ్వరీయ ధార కూడా నన్ను స్పర్శించటం లేదు కనుక అది కూడా నన్ను పవిత్రంగా చేయలేకపోతోంది. ఇంకా ఏమిటంటే, పూజకు చెందిన లక్షణాలు కూడా నాలో ఏమీ లేవు.

నేను ఏం చేయాలి? ఇప్పుడు పవిత్రత, అపవిత్రతల ఎరుక కూడా లేదు కాని శాంతి లేదు. ఈరోజు నుంచి దశ యొక్క అలసత్వం నశించిపోయింది. మనస్సులో ఏదో బాధ, ఎప్పుడైనా తళుక్కుమంటుంది. అప్పుడు దాని ప్రభావం బాధలేని బాధ యొక్క ఎరుక మాత్రం కలుగుతుంది. అయితే ఇప్పుడు ఏదీ కూడా నా ప్రియతముని జ్ఞాపకాన్ని కలిగించటం లేదు. ఇపుడు (Meeting) కలయిక మరియు (Separation) వేర్పాటుల మాలిన్యం కూడా తొలగిపోయింది. ఇప్పుడు దశ ఎంత లోతుగా నడుస్తూ ఉందంటే, దానిని అంటిపెట్టుకుని ఉన్నా కూడా, అంటి పెట్టుకుని ఉన్న భావన యొక్క భారాన్ని కూడా సహించలేనట్లుగా ఉంది. కాని ఈ అంటిపెట్టుకోవటం, భావం లేదా ఎరుక –ఏవీ కూడా దానిని మాలిన్యం చేయలేవు. ఈ దారిలేని దారి మీద తీసుకు వెళ్ళగలిగిన వారు కేవలం నా బాబూజీ ఒక్కరు మాత్రమే. నేను ఎలా ఉన్నానో కూడా నాకు తెలియదు. తెలుసుకోవాలను భావం కూడా నాకు లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 620

లఖీంపుర్,

6.04.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. చాలా కాలంగా తమరు ఇక్కడకు (లఖీంపుర్‌కు) రాలేదు. ఎప్పుడైనా అవకాశం ఉంటే ఇక్కడ కూడా ఒకటి రెండు రోజులు ఉండండి. ఇక్కడ అందరూ క్షేమంగానే ఉన్నాం. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా ఈ దశలో తెలియటం, తెలియకపోవటం, నాకు రెండూ సమానంగానే అయిపోయాయి. తెలుసుకోవటం అంటె ఏమి తెలుసుకోవాలో, తెలుసుకొనకపోవటం అంటే ఏమి తెలుసుకొనగూడదో నాకు తెలియటం లేదు. నా దశ ఎటువంటిది అంటే, నా మనస్సు, నా బాబూజీనే దశగా స్వీకరించింది. ఈ విధంగానే శ్రీ బాబూజీతో ఉన్నట్లుగా భావించి కేవలం ఆలోచన ద్వారా అంటిపెట్టుకునే ధ్యాసతో ఉంటున్నాను. అయినప్పటికీ దీని ప్రభావం కూడా నామీద అంతగా లేనట్లుగా చూస్తున్నాను. ఇలా అంటిపెట్టుకుని ఉన్నాను అనే ఆలోచనను కూడా మరచిపోతున్నందున సంతోషం కలగటం లేదు. ఎందుకోగాని శిరస్సులోని నరాలన్నీ వదులైపోయినట్లుగా అనిపిస్తోంది. చివరకు ఎముకలు కూడా బోలుగా, మెత్తగా అయిపోయినట్లుగాను, దివ్యకాంతి ప్రతినరం నుంచి వెలువడుతున్నట్లుగాను అనిపిస్తోంది. దానిలో ప్రకాశమేకాదు, ఒక అల్పమైన జ్యోతి బయటకు వెళ్ళుతున్నట్లుగాను లేదా ఆ జ్యోతి వడకట్టబడి సన్నగా వస్తున్నట్లుగాను ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 621

షాజహాన్‌పూర్,

10.04.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలు 1957 ఏప్రియల్ 3,6 తేదీలవి చేరాయి. రెండింటికి కలిపి సమాధానం ఇస్తున్నాను. నీలో ఇప్పుడు ఆరోగ్యం బాగుపడటానికి అవసరమైన శక్తి ఉత్పన్నమవుతోందని అనుకుంటున్నాను.

నీవు నీ 3.4.1957వ తేదీ ఉత్తరంలో "నాలో పవిత్రత ఉన్నట్లుగా కూడా నాకు అనిపించటం లేదు" అని వ్రాశావు. ఆ విషయమై చెప్పాలంటే, అపవిత్రత ఉన్నప్పుడు పవిత్రత యొక్క భావం కలుగుతుంది. ఏ వస్తువునైనా పోల్చి చూడకుండా దాని వాస్తవికత వెల్లడి కాదు. భగవంతుని అంతు ఎందుకు తెలియటం లేదంటే, 'అతడి'ని పోల్చిచూపటానికి అందుకు తగినది ఏమీ లేకపోవటమే. స్థితిలో మార్పు జరుగుతూ ఉంది కాని, సూక్ష్మాతి సూక్ష్మంగా ఉండటం మూలంగా తెలియకపోతోంది. మార్పులేని స్థితి (Changeless stage) ఎక్కడ ఉంటుందో దానితో మానవుని చేరిక అంతమైపోతుంది. 'బాధలేని బాధ'యే బాధ యొక్క నిజమైన స్వభావం. ఒక మనిషి దాహార్తి తీర్చుకోవటానికి నీటి కోసం అన్వేషిస్తూ ఎడారిలో ప్రయాణించి ఎంతో దూరం చేరతాడు. నీటి కోసం కలిగిన వ్యాకులత అతడి ఆలోచనలను భగ్నపరుస్తుంది. ఆ విధంగా వ్యాకులత చెందుతూ ఉంటూనే వివశుడై చేయగలిగింది ఏమీలేక చివరకు ఒక రకమైన శాంతి (ఊరట) దశను పొందుతాడు. అయితే వాస్తవంగా దాహార్తి తీరిన తృప్తి మాత్రం కలగదు. అతని కృషికి ఫలితంగా ఎక్కడో ఒకచోట వర్షం కురుస్తుంది. అది నది రూపందాల్చి, సముద్రంలో ఒక భాగమవుతుంది. అప్పుడు నీరు, అతడు దేనికోసం అన్వేషించాడో దాని ఆవశ్యకత రెండూ సాధించాడు. ఆ విధంగా కురిసిన వర్షపు నీరు ఎక్కువై ఒక చెరువు నిండినట్లయితే, మరింక నది మరియు సముద్రం గురించిన ఆలోచన ఎక్కువ సమయం నిలవదు. అదే విధంగా 'అతడ్ని' (దైవాన్ని) చేరుకోవాలనే కోరిక సన్నగిల్లుతుంది. ఎందుకంటే, అతనికి కావలసినది ఏదో లభ్యమైంది. లేదు అనే బాధ లేకుండా ఆ వస్తువు సూక్ష్మరూపంలో నిలిచి ఉంది. ఈ చెరువులోని నీటినంతటినీ త్రాగివేసి అది పూర్తిగా ఖర్చయిపోయిన తర్వాత, అప్పుడు రిజర్వాయర్ దృష్టికి వస్తుంది. దాని అన్వేషణ ప్రారంభమవుతుంది. ఈ విధంగా నీ ఉత్తరంలో వ్రాసినటువంటి "కలయిక, వేరుపడుట" వంటి స్థితిలను తెలియజేసాను. సముద్రం ఇంకా చాలా దూరంలో ఉంది. నీవు ఉన్న స్థానం నుంచి కనీసం అది కనిపించటం లేదు కూడ! అయినప్పటికీ సముద్ర సమీపానికి చేరే సూచనలైతే ఖచ్చితంగా ఉన్నాయి.

**నీవు నిన్ను ఋణస్థురాలుగా భావించుకుంటున్నావంటే, నీవు కుదవ పెట్టినదానిని (Security), దేనినైతే మీ అందరికోసం నావద్ద దాచిపెట్టబడిందో దానిని తీసుకోవటం ఆరంభించినందుకు కృతజ్ఞత తెలుపుతున్నాను. ఎందుకంటే, అది ఎవరికోసం భద్రపరచబడి ఉందో, దానిని తిరిగి ఇవ్వవలసిన జవాబుదారీ నాకు లేకుండాపోతుంది. (రక్షణలో ఉంచిన దానిని (Divine Treasure) దివ్య నిధిగా అర్థం చేసుకోవాలి.)**

నీవు ఏప్రియల్ 6వ తేదీ ఉత్తరంలో "నేను తెలుసుకోవాల్సింది ఏది, తెలుసుకోవాల్సిన అవుసరంలేనిది ఏది?" అని వ్రాశావు. నీలో కోర్కెలు ఏమీలేవు అని దాని అర్థం. "శిరస్సులో ఏ పదార్థం (Matter) లేనట్లుగా ఉంది" అని వ్రాసినదానికి అర్థం –పలుచని పదార్థంతో కూడా నీకు సంబంధంలేనట్లుగా ఉండటమే. కనుక అవ్యక్తగతి సమీపంలో ఉన్నట్లుగా గ్రహించాలి. సూక్ష్మత్వంలో లయ–అవస్థ కలుగుతున్నప్పుడు, బాహ్యప్రపంచం యొక్క ఆవరణలు (పొరలు) తొలగిపోతాయి. దానిమూలంగా లోపల, బయట కూడా అంతా ఒక్కటిగానే అనిపిస్తుంది. ఇది చాలా మంచి స్థితి. అయితే ఏ స్థితిలోను నిలకడగా ఉండిపోవటం జరగదు. శిరస్సులో ఏదో తేలిక పడినట్లుగా అనిపించటం అనేది శారీరక బలహీనతకు చెందినది.

అమ్మ మరియు చౌబేజీకి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 622

లఖీంపుర్,

14.04.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఆశీర్వాదాలతో నిండిన ఉత్తరం అందింది. చదివిన తర్వాత అత్యంతానందం కలిగింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఎలా ఉందంటే, నేను అందరినీ పేరుపెట్టి పిలుస్తున్నాను, కాని ఆ పేరుతోపాటు ఎవ్వరి రూపంతోను ఎటువంటి సంబంధం ఉండటం లేదు. పుస్తకంలో ఎవరిదైనా పేరు 'కల్లూ' అని చదివినట్లయితే, అలా చదవబడటమేగాని, దానికి సంబంధించిన వ్యక్తి యొక్క రూపం ఎంతమాత్రం నా ఎదుటకు రాదు. కాని ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇటువంటి స్థితి ఉన్నా కూడా నేను కేసర్‌ను బిట్టో అనిగాని, బిట్టోను కేసర్ అనిగాని సంబోధించటం జరగదు.

ఇప్పుడు ఉన్న ఈ దశ ఎటువంటిది అంటే, శరీరమే కాకుండా, లోన బయట అన్నీ కూడా కంపనరహితమై పోయాయి. అప్పుడప్పుడు అకస్మాత్తుగా హృదయంలోనైతే తప్పనిసరిగా కొంచెం కంపనం ఉంటుంది కాని మిగిలినదంతా వ్యర్థంగానే ఉండిపోయింది. నా ఈ ప్రపంచం ఏమిటో తెలియదు కాని, అన్ని పనులు చేస్తూనే ఉన్నాను. నా శరీరం మాత్రం చలించటం లేదు. సమస్త ప్రపంచంతోను సంబంధం కలిగి ఉన్నా ఆ సంబంధం ఏమిటో తెలియటం లేదు. కంపనం అనేది ఎటువంటి విషయంగా అయిపోయిందంటే, దానికి అర్థమే లేనట్లుగా ఉంది. అందరితో మాట్లాడుతున్నాను గాని, అక్కడ ఎవ్వరూ ఉండరు, ధ్వనీ ఉండదు. ఆఖరికి శ్వాసకార్యం జరిగినా, జరగకపోయినా కూడా దానితో నాకు సంబంధం లేనట్లుగా ఉంది. మరణించటం, జీవించటం రెండూ సమానమేనని అనిపిస్తోంది. ఇప్పుడు దశ ఎలా ఉందంటే, నాకు ఏ కోరిక లేదు. 'మాలిక్'కూ కోరిక ఉండటం లేదు. అయినా గాని నాకు ఇంకా తెలియనిది ఏమిటంటే, నేను 'అతని' కోరిక ప్రకారం నడుస్తున్నానా లేదా అని, అదేమిటో తమకే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతున్నది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 623

లఖీంపుర్,

15.04.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. తమరు కుశలంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటోగాని, **ఎవ్వరైనా గాని పూజ చేస్తున్నట్లయితే, అది నాతో ఎంతసేపటివరకు జరిపించబడుతుందో ఆ అభ్యాసీ కూడా నా స్థితి వంటిదే కలిగి ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఆ అభ్యాసీ ఈశ్వరునిలో సంపూర్ణమైన లయావస్థ కలిగి ఉన్నవానిగా నాకు అనిపిస్తాడు.** ఈ రోజు రాత్రి ఒక స్వప్నం వంటిది చూశాను. దానిలో ఒక బలిష్ఠుడైన మనిషి, చిన్నగడ్డం ఉన్నవారు, పరమశాంతి మరియు ప్రసన్నమూర్తిమంతుడు అయిన మహాత్ముడు, "ప్రభూ, నా అవగుణాలపై దృష్టి సారించవద్దు" అను భావభరితమైన భజనలు పాడుతున్నట్లుగా ఉంది. నేను చాలా దూరం నుంచి నడుస్తూ

వస్తున్నాను. వారిని సమీపిస్తూనే వారి చరణారవిందాలను పట్టుకున్నాను. వారు కూడా నన్ను ఒక బాలకునిలాగా వెంటనే నిలబెట్టి "నీ మృత్యువు మీద నేను ఆనందదాయకమైన పాటపాడుతున్నాను" అని చెప్పారు. ఇంకేముంది, అప్పటినుండే మేల్కొన్న తర్వాత కూడా నాకు ఒక వింత స్థితి కలిగింది. దానిని నేను వ్యక్తం చేయలేను, అది విలాపం కాదు, నవ్వూ కాదు. స్థితి నా మనస్సుకు హత్తుకుంది. అప్పటి నుండి ఇంటిలో ఒక ఆశీర్వచన వాతావరణం నెలకొంది. "ప్రభూ! నా అవగుణాలపై దృష్టి సారించవద్దు" అను పవిత్ర ధ్వని వినిపించిన బాటలోనే ఈ మహాత్మునివద్దకు చేరుకుంటూ ఉన్నాను, వారి పాదాలు పట్టుకుంటున్నాను. వారి రూపమైతే ఖచ్చితంగా కొంత భిన్నంగా ఉంది కాని, ఆ గొంతు ధ్వని మరియు దాని మాధుర్యం, నా పరమప్రియులైన 'తమ'తోనే బాగా పోలి ఉన్నాయి. ఆ స్వరం మాత్రం కొంచెం బిగ్గరగా ఉంది. ఇదంతా ఏమిటో, తమకే తెలియాలి. నాకు అర్థమైన దానిని వ్రాశాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 624

షాజహాన్‌పూర్,

19.04.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం ఒకటి 14.4.1957వ తేదీది, మరొకటి 15.4.1957వ తేదీగలది అందాయి. ఏప్రియల్ 19న నా జీవనం యొక్క నూతన సంవత్సరం ఆరంభమైంది. మీరందరూ ఏదో విధంగా నా జన్మదినోత్సవాన్ని ఆనందంతో జరుపుకొని ఉంటారు కాని నాకయితే నా జీవితకాలం నుంచి ఒక సంవత్సరం గతించిపోయినందుకు విచారపడుతున్నాను. ఈ రోజున, నీవు చెప్పినట్లుగానే చేశాను. అందరూ కూడా 'మాలిక్' కృపతో లబ్ధి పొంది ఉంటారు.

గత ఉత్తరంలో నీ స్థితిని వ్యక్తం చేయటానికి రూపకాలంకార వాక్యాలతో వర్ణించవలసి వచ్చింది, దానికి తగిన వేరే విధానం ఏమీ తోచనందున. నీకు ముందుకు వెళ్ళడం, వెళ్ళకపోవటం రెండూ సమానమేనని అనిపించడం, నిన్ను నీవు పూర్తిగా మరచిపోయావని చెప్పటానికి ఇది నిరూపణ. దాని తర్వాత ఏదైతే మిగిలి ఉన్నదో అది కూడా లయమైపోతూ ఉంది. నీవు చేరవలసిన చోట గుడారం నాటబడి ఉంది, అని నీవు వ్రాసింది సరియైనదే. **అభ్యాసీ చేరవలసిన స్థానానికి అవసరమైన బీజం మొదటి సిట్టింగ్‌లోనే వేయబడుతుంది. మన 'లాలాజీ సాహెబ్' శిక్షణ యొక్క విశిష్టత ఆ విధంగా ఉంటుంది. ఎవరైతే ఈ బీజం నిలుపుకుంటారో వారు పురోగతి చెందుతూ ఉంటారు. అభ్యాసీ యొక్క గ్రహణశక్తి బాగున్నట్లయితే ఆనందం యొక్క సముద్రం (ఆధ్యాత్మిక సముద్రం) మొదటి రోజు నుంచే అనుభూతికి రావటం ఆరంభమవుతుంది.**

నీవు నీ ఉత్తరంలో మరణం, జీవనం రెండూ ఒక్కటిగానే అనిపిస్తున్నాయి అని వ్రాశావు. నీకు ఇప్పుడు జీవన్మరణాలతో సంబంధం లేకుండాపోయిందని దాని అర్థం. ఆ రెండింటి సంబంధాలు తెగిపోయాయి. అంటే అది జీవనమోక్ష-అవస్థ అవుతుంది. అది నీకు ఇదివరకే ప్రాప్తమయ్యింది. దానికి ప్రమాణంగా ఈ వాక్యం కూడా తోడవుతుంది -"ఎప్పుడైనా మృత్యువుయొక్క మృత్యువు కూడా జరిగినట్లయితే, దానిలో నుంచి ఉత్పన్నమైన జీవనం, మనం ఎవ్వరి అన్వేషణలో ఉన్నామో వారి జాడ తెలుపుతుంది." అయితే ఇంకా ముందుకు సాగిపోవాల్సియే ఉంది.

నీవు ఏప్రియల్ 15న వ్రాసిన ఉత్తరంలో, నీవు స్వప్నంలో చూసినట్లుగా వ్రాసినది చాలా బాగుంది. ఇప్పుడు వాస్తవిక జీవనం ప్రారంభమైపోయిందని దాని అర్థం. నేను అభ్యాసం ఆరంభించినప్పటి నుంచి ఇప్పటివరకు,

ముక్తిపొందిన ఆత్మలను స్వప్నంలో మాత్రమే చూస్తూ ఉండేవాడిని. వారంలో కనీసం రెండుసార్లు ఇటువంటి కలలు రావటంతోపాటు ఒక విధమైన కృపను కూడా పొందాను. దాని స్థాయి ఎటువంటిది అంటే, దానిని భరించటం మానవమాత్రునికి అసాధ్యం. లాలాజీ సాహెబ్ గొప్పదనం ఏమిటంటే, నేను భరించనలవిగాని దానిని 'వారు' స్వీకరించేవారు. ఆ విషయం నాకు తెలుస్తూ ఉండేది. దీక్ష (Initiation) పొందే సందర్భంలో చాలమంది మహాత్ములు నాకు కలలో దీక్ష నిచ్చారు. నేను దీక్షకు అంగీకరించనప్పుడు, నా స్వభావం అందుకు అనుకూలంగా మార్చబడేది. 'మాలిక్'పట్ల అధికంగా ప్రేమ కలిగినవారికి ఇటువంటి విషయాలు తటస్థపడుతూ ఉంటాయి. ఇలాంటివి మన అభ్యాసులలో ఎవరికి జరగలేదు.

నీ యాత్ర '$N_1$' మీద పూర్తయింది. ఇప్పుడు '$O_1$' స్థానంలో ప్రవేశం కలుగుతుంది. నీ ఆరోగ్యం ఇంకా బాగుపడాలని కోరుకుంటున్నాను. డాక్టర్ కె.సి. వరదాచారిగారి నుంచి ప్రేమ పూర్వకమైన ఉత్తరాలు వస్తున్నాయి. దైవానుగ్రహం వలన ఆయన మంచి ఆధ్యాత్మిక ఉన్నతిని పొందుతూ ఉన్నారు.

చౌబేజీ మరియు అమ్మకు ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 625

లఖీంపుర్,
21.04.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది, చదివి చాలా సంతోషించాను. ఇక్కడ అందరూ కుశలమే. 'తమరు' కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటో నాకు తెలియకున్నది. ఒక్కరేమో వృద్ధావస్థలో ఇలా అవుతుందని, మరొకరైతే బాల్యావస్థలో ఇలా ఉంటుందని అంటారు కాని నా స్థితి ఏమిటంటే, రెండూ ఒక్కటేనని అనిపిస్తుంది. ప్రతి స్థితి ఒకే విధంగా ఉంటోంది. ఇంకా ఏమిటంటే, నా స్థితిని (అవస్థను) స్థితి అని చెప్పటం కూడా అర్థం లేనిదే అవుతుంది. ఇది నేను భావిస్తున్నటువంటి దశ, ఈ భావిస్తున్నది ఏమిటంటే, నేను బాబూజీనే నా వెంట తీసుకొని వెళ్ళుతున్నట్లు, అది కూడా రోజంతా మరపుస్థితిలోనే వెంట తీసుకొని వెళ్తున్నా కూడా నా వెంట లేనపుడు ఇంక వెంట తీసుకుని వెళ్ళేది ఏముంటుంది. ఇంకా ఏమిటంటే, ఎల్లప్పుడు ఉంటూ ఉన్న కూడా ఎప్పుడూ ప్రత్యక్షం (దర్శనం) కావటం లేదు. ఇంక దర్శనం, దర్శనమే కానపుడు ఇంక దర్శనమంటూ ఏముంటుంది? అది ఎటువంటి అలౌకిక మార్గమైనా, ఎటువంటి అలౌకిక అవ్యక్తగతియైనా, దానిని గురించి చెప్పాలన్నా, వినాలన్నా నాకు తృప్తి కలుగదు.

నా దశ ఆది, అంతాలకు అతీతమైనదిగానే ఉంటుంది. శిరస్సు మధ్యలో పాపిడికి కుడివైపు ఒక వ్రేలు అంతటి స్థానంలో కంపనం వంటిది ఉంటుంది. అలాగే శిరస్సులో నుదుట అంతాను మరియు ముక్కు యొక్క మొత్తం ఎముకలోను ముక్కు చివరివరకు రోజంతా తరచుగా ఒక సరసరమను కదలిక ఉంటుంది. వ్రేళ్ళ యొక్క ప్రతి కణం ఖాళీగాపడి ఉన్నట్లుగా అనిపిస్తోంది. వీపు అంతాను, వెన్నెముక యొక్క పూసల్లోనూ, చివరపూస క్రిందివరకూ పైన ఎక్కడ నుండో కదలిక వస్తూ ఉంటుంది. 2,3 నెలల నుంచి నాభిలోపల చాలా తేలికైనది ఉన్నట్లుగా ఉంది. అది లోపలకు వ్యాపించి పోయినట్లుగాను ఉంది. నా శరీర నిర్మాణమే మారిపోయినట్లుగా ఉంది. నాలో మార్పు జరిగిందో లేదో నాకు తెలియదు. కాని నా ఆత్మ మాత్రం తిరగబడి పోయింది. కాని తిరగబడిపోయి ఏమైపోయిందో తెలియదు, అది తమకే తెలియాలి లేదా తమ నిర్వహణకే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతున్నది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 626

లఖీంపుర్,
9.05.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారిని ఉద్దేశించి వ్రాసిన తమ ఉత్తరం చేరింది. దాని ద్వారా తమ సమాచారం తెలిసింది. తమ ఆరోగ్యం బాగుందని తెలిసి అందరికీ సంతోషం కలిగింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఎందుకోగాని పూర్తి శరీరం యొక్క నరనరాలు శుభ్రంగాను, ఖాళీగాను అనిపిస్తున్నాయి. శరీరం అలా ఉంటూనే హృదయం మీద కొద్దిగా భారం ఉంటోంది. ఈ విధంగానే నా దశతో వ్యవస్థ కొంచెం భారంగానే అనిపిస్తోంది. ఎందుకోగాని ఇప్పుడు కళ్ళు మూయటం ఎప్పుడూ అనుభవం కావటం లేదు. దశలో తెరచుకుని ఉంటున్నాయి.

అది ఏమిటో దైవానికే తెలియాలిగాని, హృదయంలో ఇదివరకు ఉన్నట్లుగా ప్రవాహం లేదు. ఇదివరకు ఉన్నంత ఆనందమూ దానిలో లేదు. ఇప్పుడు బయట, లోపల పాడుబడిన ఉద్యానంలాగానే అయిపోయింది.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 627

లఖీంపుర్,
9.05.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఒక ఉత్తరం వ్రాసి పంపాను. అది తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇప్పుడు దశ ఇంకొంచెం మార్పు చెందింది. దానిని గురించి నేను అర్థం చేసుకున్నదానిని వ్రాస్తున్నాను.

నా జీవితంలో ఒక భాగమైన జ్ఞాపకం కూడా తుడిచిపెట్టుకు పోయింది. అలాకాదు కాని, జ్ఞాపకం యొక్క జ్ఞాపకం అనగా ఒక విధమైన జ్ఞాపకం మరపుస్థితిలో కూడా ఉంటూ ఉండేది. అది కూడా ఇప్పుడు (Sub-conscious Mind) సుప్తచేతనా మనస్సులో శుభ్రం గావించబడి హృదయం పూర్తిగా తేలికగాను మరియు స్వచ్ఛంగాను (ఖాళీగా) అయిపోయింది. (Sub-conscious Mind) సుప్తచేతనా మనస్సులో కూడా ఒక విధమైన స్పృహ ఎప్పుడూ ఉంటూ ఉండేది. కాని ఇప్పుడు ఏదో ఒక తెలియని వస్తువు వచ్చి అన్నింటిని తుడుచివేసి తిరిగి వెళ్ళిపోతుంది. కాని అదేమిటో, దాని అస్తిత్వం గురించి నాకేమి తెలపటం లేదు. ఇప్పుడు స్పృహలేమి, స్పృహ ఉండటం (Unconsciousness and Consciousness) కూడా ఏమి అనుభూతి కలగటం లేదు. ఇప్పుడు 'మాలిక్' కూడా నాకు అతనితో పూర్వం సంబంధం లేనట్లుగాను, ఇప్పుడూ లేనట్లుగాను గైర్‌హాజర్ అయిపోయినట్లుగాను అనిపిస్తోంది. నేను ఎవ్వరినైతే 'మాలిక్' అని పిలుస్తున్నానో అతడి గురించిన సమాచారం నాకేమీ తెలియదు. నాకు 'అతడి'ని గురించి

తెలియకపోయినాగాని, హృదయంలో ఏదో తపన లేని తపన ఉంది. దానితో నేను స్థిరంగా, నిశ్చలంగా ఉండలేక పోతున్నాను. అది పూర్తిగా లేదు అని అనిపించనివ్వటం లేదు. ఈ దశ ఎలా ఉందంటే, ఎవ్వరో నా చేయిపట్టుకుని నడిపించుకు వెళ్తున్నట్లుగాను, అలా పట్టుకున్నట్లుగాని, అంటిపెట్టుకుని ఉన్నట్లుగాని ఒక్క క్షణకాలమైనా నాకు అనుభూతి కలగటం లేదు. అలా అంటిపెట్టుకోకుండా వేరుగా నడచి వెళ్తున్నప్పటికీ, నాకు వేరేగా నడుస్తున్నట్లుగాని, అంటిపెట్టుకుని ఉండలేదనే అనుభూతిగాని కలగటం లేదు.

నిన్న రాత్రి నాకు ఒక కల వచ్చింది. దానిలో ఒక విశాల దేహంతో మూర్తీభవించి ఉన్న మహాత్ముడు నా నుదుటి మీద తన హస్తం ఉంచి– "నీవు ఎలాంటి అపరాధం చేయలేదు, నీవు తప్పక జీవించాలి, లేచి పనిచెయ్యి" అని చెప్పారు. అప్పటినుంచి హృదయం నుంచి– "నా వలన తమకు ఎటువంటి కష్టమూ కలగటం లేదు" అనేది కరిగిపోయింది. నా ఆరోగ్యంలో తాజాదనం వచ్చేసింది. నేను లేచి కూర్చున్నాను, నా కళ్ళు తెరుచుకున్నాయి. వారు నాకేమీ పని అప్పగించలేకపోయారు. ఇప్పుడు నేనింకా జీవించాల్సి ఉంది. ఎందుకు? అది తెలియదు. ఇప్పుడు ఏదైనా స్థితి రానున్నదేమో, అదీ తెలియదు. వెళ్ళిపోతూనే ఉన్నాను. నేను 'మాలిక్'ను హృదయ పూర్వకంగా ప్రేమించలేనా? నేను ఆ దివ్య సౌందర్యానికి అర్పితం కాలేనా? ఎందుకంటే, ఇప్పుడు నాలో నాకు చెందిన నిర్వాకమే లేదు. నాలుగువైపులా వ్యాపించి ఉన్నటువంటి ప్రకాశం ఇప్పుడు జాడ లేకుండా పోయింది. 'మాలిక్' ఏదో దివ్యమైనది లేదా అలౌకికమైన దశను సాదృశ్యం చేస్తూ వెళ్ళుతున్నారేమో అన్నట్లుగా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 628

లఖీంపుర్,

18.05.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ నుంచి చాలా రోజులుగా ఉత్తరం రాలేదు. అలాగే తమ సమాచారం తెలియలేదు. చాలా దిగులుగా ఉంది. తమరు కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇది చాలా ఖాళీ దశగా ఉంది. నమ్రత దశ కూడా దీని కంటె భారమైనదిగా ఉండి ఆలోచనకు కూడా అంతుచిక్కనిదిగా ఉంది. ఆ ఖాళీ దశ యొక్క అంచనా ఎడారి వంటిదిగాను, నిర్మానుష్యంగాను మరియు ఖాళీదిగాను చెప్పితేనే ఊహించతరమవుతుంది; లేకపోతే దానికి పోలిక అంటూ ఏదీ ఉండదు. ఈ దశ ఎటువంటిది అంటే, మధురమైనది (తీపియైనది) కాదు, చేదు అయినదీకాదు. దీనిలో పిచ్చి (ఉన్మాదాని)కి కూడా అవకాశం లేదనిపిస్తుంది. అలాకాదు, ఇప్పుడు ప్రవేశానికి కూడా ప్రవేశం లేదు. ఇప్పుడు ఉన్న విషయం ఏమిటంటే, 'తమరు' నాకు నేర్పుతూ వెళ్ళండి, నేను నేర్చుకుంటూ వెళ్తాను. ఇంక స్థితి అంటూ ఏమీలేదు. ప్రేమ మరియు భక్తితో సంబంధం లేదు, అది (సంబంధం) కూడా కరిగిపోయింది. నాకు ఇప్పుడు (Intiation) దీక్ష కూడా అనుభూతి కావటం లేదు. ఎక్కడ, ఎప్పుడు, దీక్ష ఎటువంటిది అనేది ఏమీ జరగనట్లుగా ఉంది.

ఇప్పుడు దశ ఎలా ఉందంటే, ఏ సమావేశంలోకి వెళ్ళినాగాని అంతా బంజరులాగానే కనిపిస్తోంది. నా స్వంత స్వరూపం కూడా బంజరుగా అయిపోయింది. నేను మాట్లాడటం, నవ్వటం (కలగలుపుగా ఉండటం) తక్కువగనుక, జనం నాకు ఏమైనా ఇబ్బందిగా ఉందేమో అనుకుంటారు. నా స్వరూపమే అలా బంజరుగా

అయిపోయినపుడు, నేనేమి చేయగలను! ఎవ్వరైనా ధ్యానం నుంచి లేచినాగాని తప్పుగా అనిపించదు. అలా ధ్యానంలో కూర్చోనిచ్చినా, కూర్చోనివ్వకపోయినా ఏమీ అనిపించదు. అలాగే ఏదైనా విశేషమైన పూజ జరిగినా గాని దానిపట్ల ప్రేమలేదు. పూజలో నా దేవతయే ప్రత్యక్షం కానపుడు ఇంక ఆ పూజ ఎందుకు? నాకు పూజ అంటూ లేకపోయింది. నా రూపమే శూన్యంగా అయిపోయింది. నా స్వరూపం చలనరహితం, నిశ్చలంగా అయిపోయింది. నేను అసలు ఏమిటో నాకు తెలియకుండా ఉంది. నేను ఏమి చేయాలో కూడా తెలియటం లేదు. ఇప్పుడు లోన, బయట అంతటా శూన్యతయే రాజ్యమేలుతోంది. ఒక విచిత్రమైన మృతస్థితి వంటిది ఉంది. ఒకటి, రెండు కూడా తెలియటం లేదు. ఇపుడు నా స్థితి ఏమిటోగాని, నా ముందు వెనుక అంతా కరిగిపోయి అంతా ఒక్కటిగా అయిపోయినట్లుగా ఉంది. నేను ఒక వివాహానికి వెళ్ళాను. అయినప్పటికీ నాకు అంతా బంజరులాగానే అనిపించింది. అంత జనసమూహంలో కూడా కోలాహలంగాని, అశాంతిగాని అనిపించకుండా అంతా శాంతంగా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

**ఉత్తరం సంఖ్య - 629**

షాజహాన్‌పూర్,

27.05.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరాలు అందాయి. జవాబు ఏమి వ్రాయాలి అని ఆలోచిస్తున్నాను. ఎందుకంటే, ఇప్పుడు నీ స్థితిని వ్యక్తం చేయలేకపోతున్నావు. అలాగే నేను దానిని వివరించలేకపోతున్నాను. అది సాధ్యపడినపుడు నేను జవాబు వ్రాయాలని అనుకుంటున్నాను. నీ ఉత్తరాలలో ఏమి వ్రాశావో నాకు ఇప్పుడు జ్ఞాపకం లేదు. బహుశా నీవు ఇప్పుడు ఎడారి గాలిని అనుభవించావని, ఆ ఎడారి తత్త్వాన్ని గురించి నీ ఉత్తరాలలో వ్యక్తం చేశావని భావిస్తున్నాను. ఇప్పుడు ఈ ఎడారి తత్త్వాన్ని లోతుగా పరిశీలించినట్లయితే, దాని ప్రభావం ఆలోచనల మీద ఉంటుందని తెలుస్తుంది. ఇది '$O_1$' యొక్క స్థితియే, కాని దానిని నీవు సరిగ్గా వ్యక్తం చేయలేకపోయావు. ఎవరి ఇంట్లోనైనా మృత్యువు వాటిల్లినప్పుడు అక్కడి వాతావరణంలో సంతోషం లేకుండా పోయినట్లుగానే, ఇక్కడి స్థితి ఉంటుంది. మనకు ఇప్పుడు ఈ ఎడారితనం కూడా చనిపోవాల్సిన అవుసరం ఉంది. ఇప్పుడు ఏమనిపిస్తూ ఉందంటే, ఎవరిదో మృత్యువు జరిగింది. కాని ఈ ఎడారితనం యొక్క మృత్యువు ఇంకా జరగలేదు. దీనికోసం కొంత నిరీక్షణ అవసరం, అది జరగటానికి ఇంకా కొంత సమయం పట్టుంది. వాస్తవానికి ఇది మన స్థితియే కాని చాలాకాలం గడచిన తర్వాత మన దృష్టికి వస్తుంది. ఎడారితనం మరణించటం అంటే, మనం స్వయంగా ఆ స్థితికి చేరాలని అర్థం. సామాన్యంగా, మరణం తర్వాత కూడా ఏదో మిగిలి ఉంటుంది. ఆ మిగిలి ఉన్నది కూడా మరణించాలి. కాని మృత్యువు సంభవించిన తర్వాత కూడా దాని అంశ కొంత మిగిలి ఉంటుంది. ఎప్పుడైతే ఈ అంశలన్నీ ముగిసిపోతాయో అప్పుడు భూమాతో సంబంధం కలిగే అవకాశం ఉంటుంది.

అమ్మ మరియు చౌబేజీకి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 630

లఖీంపుర్,

28.05.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కొంచెం అస్వస్థులుగా ఉన్నట్లు నిన్న పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తెలిసింది. తమకు శ్వాస ఇబ్బందిగా ఉన్నదని తెలిసింది. తమ ఆరోగ్యం ఇప్పుడు బాగుపడి ఉంటుందని ఆశిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ! నేను ఈశ్వర్, ఈశ్వర్ అంటూ పునరుచ్చరించుతున్నాను. కాని ఈశ్వరుని ఛాయ నాపై ఉదయించింది. "పేరు విని అక్కడకు చేరాను, కాని చూస్తే అక్కడ ఎవ్వరూ లేరు." నేనయితే దోపిడీకి గురై, బంజరుగా అయిపోయి తిరుగుతున్నాను. ఇప్పుడు చెప్పాలంటే, దేని మూలంగానైతే దశలు ఏర్పడుతూ ఉండేదో, ఇప్పుడు ఆ మూలం అనేదే లేకుండాపోయింది. పూజ చేస్తున్నా లేక చేయిస్తున్నా కూడా దేనిలోను ఈశ్వరీయ ధార (ప్రాణాహుతి ధార) యొక్క ఉనికి కూడా తెలియటం లేదు. నాకైతే ఈ మాటలన్నీ మరచిపోయినట్లుగా అనిపిస్తోంది. నాలో పూజాతత్వమే లేకుండా పోయింది. ఇప్పుడు దశ అనే శబ్దం నా స్థితి కంటె భారంగా అనిపిస్తోంది.

ఇప్పుడు నా దశ ఎటువంటిది అంటే, ఇప్పటివరకు నేను అనుభవించినవి అన్నీ కూడా తుడిచిపెట్టుకు పోయినట్లుగా ఉంది. నేను పాడినా, వాయిద్యం మ్రోగించినాగాని ధ్వని ఏమి వినిపించటం లేదు. ఎక్కడైతే మూలం ఉందో దానితోనే సంబంధం తెగిపోయి మామూలుగా అయిపోయినట్లుగా అనిపిస్తోంది. బంజరు అనే దానిని కూడా మరచిపోతున్నాను. దానిని మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం చేసుకుని నిలుపుకుంటున్నా కూడా దాని వలన ఏదైనా అనుభవంగాని, ఆనందంగాని ఉంటుందని అనుకున్నాను. కాని నేనే స్పృహ కోల్పోయి ఉన్నాను కనుక అవి చేజారిపోయాయి. అప్పుడప్పుడు ఏదో ఒక మైదానం (లేదా స్థానం) యొక్క గాలి సోకుతుంది, కాని దానిని గురించి ఏమి చెప్పలేకపోతున్నాను. దానిని పట్టుకోవటానికి ఇప్పుడు నాలో శక్తి కూడా లేదు. ఆ అంతుచిక్కనిదానితో స్నానమవుతుంది కాని అలా స్నానమాడి కూడా పొడిగానే ఉంటున్నాను.

శిరస్సు మధ్యలో ఎక్కడైతే పాపిడి చీలి ఉంటుందో, ఆ పాపిడికి అంచున ఐదు వ్రేళ్ళతో నొక్కి ఉంచినా కూడా ఆ హస్తం క్రింద ఏదో మేల్కొన్నట్లుగా ఉండి, అది పైకి పెల్లుబుకి రావటానికి విలవిల్లాడుతుంది. అది ఆ విధంగా విలవిల్లాడుతూనే చేతిక్రింద అణగి ఉంటుంది. ఈ దశ ఎటువంటిది అంటే, ఇంతకుపూర్వం అచేతన దశ (Condition of Inactiveness) తరచుగా ఏర్పడుతూ ఉండేది, ఇప్పుడు ఎలా ఉందంటే, అదే నా స్వరూపంగా అయిపోయింది. నేను ఎటువంటి మైదానాన్ని దాటుతూ ఉన్నాను అంటే, దానిలో నా స్వరూపమే కలిసిపోయినట్లు ఉంది. ఇంకా ఈ అచైతన్య స్వరూపం దాటిపోతూ ఉంది. ఇప్పుడు నేను ప్రవేశించి ఉన్న వలయంలో అంతా పవిత్రతయే ఉంది. నా స్వరూపం నుంచి నన్ను తొలగించినట్లయితే, ఈ వలయం యొక్క దశను గురించి నేను ఏమి చెప్పలేను. నేను షాజహాన్‌పూర్ వెళ్ళాలని ఎంతగా తలంచినా, వెళ్ళలేకపోయినా కూడా అది నాకు తప్పుగా ఏమి అనిపించటం లేదు. ఇప్పుడు ఎటువంటి దశ లేక మైదానం అంటె ఎవరైనా స్పృహతప్పిపోయేటంతగా అలసిపోయిన బాటసారికి విశ్రాంతి మరియు నిశ్చింత లభించినటువంటిదిగా ఉంది. అనగా బాటసారి సముద్రపు ఒడ్డుకు చేరినంత సంతృప్తి అన్నట్లుగా ఉంది. ఇప్పుడు దశ ఏమిటంటే, ఆనందం కోల్పోయిన విధవరాలులాగా ఉంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 631

లఖీంపుర్,

4.06.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమకు ఒక ఉత్తరం వ్రాసి పూజ్య మాస్టర్ సాహెబ్‌గారికి ఇచ్చాను. అది తమకు అంది ఉంటుందని అనుకుంటున్నాను. నా ఆరోగ్యం ఇప్పుడు బాగానే ఉంది. తమరు కూడా ఆరోగ్యవంతులై ఉంటారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు పాయింట్స్ లేదా స్థానాల్లో ఎలా ప్రయాణించాలో నాకు తెలియటం లేదు. ఎందుకంటే, వాటిలో ఆలోచనకు తావులేదు. అలా లేదు అనేది గ్రహించటం కూడా మరచిపోతున్నాను కనుక ఇంక ప్రయాణం గురించిన తలంపు మాత్రం ఎక్కడ ఉంటుంది! అయితే 'మాలిక్' ఏమి చేస్తున్నారంటే, ఎదుట మైదానం వంటిది వ్యాపించి ఉందునట్లుగానే చేస్తూ ఉండటంతో ఆలోచించకుండా ప్రయాణం మొదలై, సమాప్తమైపోతోంది కూడా.

ఇప్పుడు దశ ఎటువంటిది అంటే, దీనిలో నవ్వులేదు, ఆనందం లేదు, పాడటం, ఏడ్వటం లేవు. ఇప్పుడు గుప్పిడి తెరచినట్లుగా ఉంది. అసలు ఎందుకు వెళ్ళాను అనిగాని, ఇప్పటివరకు ఏమి జరిగిందనిగాని తెలియకుండా ఉంది. కాని ఒక్కటి మాత్రం ఖాయం. ఏమిటంటే, దశ నుంచి ఎవ్వరైనా ఒక్క సెకను కాలమైన నన్ను తొలగించినట్లయితే ఆ కట్టుబాటును అంగీకరించను. స్థితి అయితే లోతైనది కాదు, లోతు తక్కువది కాదు, ప్రకాశమైనది కాదు, అంధకారమైనది కాదు, ఆది అంతం ఉన్నది కాదు, ఉదయం సాయంత్రాలు ఉన్నది కాదు, చల్లనిది వెచ్చది కాదు, ఊసరక్షేత్రం కాదు, సుక్షేత్రమూ కాదు. ఇప్పుడు కళ్ళు మూసినా చీకటిగా లేదు. కళ్ళు తెరచినా కాంతిగా లేదు. స్థితి మంచిదనిగాని, చెడ్డది అనిగాని చెప్పదగదు.

శిరస్సులో పాపిడికి ఎడమవైపున ఏదో ఊహకందనిది దిగినట్లుగా ఉండి, శిరస్సుకు ఎడమవైపున పూర్తిగా తిరుగుతూ ఉంది. బాబూజీ, నేను ఎక్కడ ఉన్నా 'మాలిక్'కు చెందిన దానిగానే ఉంటాను. ఎలా ఉన్నా 'అతని'కే చెందినట్లుగానే ఉంటాను. 'మాలిక్' గమ్యం తెలిపినా తెలపకపోయినా, నేను 'మాలిక్'కు మాత్రమే చెంది ఉంటాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 632

లఖీంపుర్,

17.06.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అంతా కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఉన్న దశ ఏమిటంటే, జ్ఞాపకం, జ్ఞాపకమంటూ అందరికీ చెప్పుతూ ఉంటాను. కాని జ్ఞాపకానికి అర్థం ఏమిటో నాకు స్వయంగా తెలియదు. ఇంకా ఏమిటంటే, తమరు ఎలాగైతే పూజ చేయించటం ఆరంభిస్తారో, అలాగే ఎప్పటివరకు అయితే పూజ చేయిస్తూ ఉంటారో అప్పటివరకు అప్రయత్నంగానే ఆలోచనల పెనగులాటతో బంధించబడి ఉంటుంది. దాని వలన నాకు విశ్రాంతిగా ఉంటుంది, దాని మూలంగా కూర్చుండి ఉంటాను.

ఈ స్థితియేగనుక రాకపోయినట్లయితే, కళ్ళు మూసుకోగానే శరీరం గాబరా చెంది కళ్ళు తెరుచుకుపోతాయి. రోజంతా కొంచెం భారం మరియు కొంచెం బాధ వంటిది కలుగుతూ ఉంటుంది. ఇదే విధంగా పూజ చేయిస్తూ ఉన్నప్పుడు కూడా హృదయంలో కొంచెం బాధ మరియు భారం ఉత్పన్నమవుతూ ఉంటాయి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 633

షాజహాన్‌పూర్,
04.07.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం చేరింది. మీరందరు బాగా ఉంటున్నందుకు 'మాలిక్'కు ధన్యవాదాలు తెలుపుతున్నాను. నీ స్థితిని గురించి ఈ విధంగా వ్రాస్తున్నాను.

**నానక్ శూన్య సమాధిమే, నహీం సాంఘ్ నహీం భోర్।**

శ్రీ నానక్ (సెయింట్) వెల్లడించిన దాని ప్రకారం, శూన్యసమాధిలో ఎప్పుడూ ఉదయం లేదా సాయంత్రం ఉండవు, అని భావం. అమ్మ మరియు చౌబేజీకి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 634

లఖీంపుర్,
12.07.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి చాలా సంతోషించాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఈ దశ ఏమిటోగాని, తరచుగా కూర్చుని ఉండగానే తూలటం వంటిది అనుభవమవుతోంది. అదేమిటో తెలియకుండా ఉంది. ఆంతరికంగా చూసినపుడు, నాకు నేనే ఎప్పటినుంచి తూలుతూ ఉన్నానో తెలియకుండా ఉంది. తరచుగా ఎప్పుడైనా ఆ తూలుడుకు ఏదో తట్టినట్లుగా గాని, లేదా చైతన్యం వంటిదిగాని కలిగినపుడు, లోపల శూన్యతనే పొందుతున్నాను. ఇలా తూలటం వలన ఆనందంగాని, మరేదైనాగాని పొందటం లేదు. కాని కళ్ళు లోలోపలికి చొరబడుతూనే, శరీరం స్వయంగా ఊగటం ప్రారంభమవుతుంది. దీనిని గురించి మనస్సులో కొంత ఆశ్చర్యం కలుగుతూ ఉంటుంది. ఏమని అంటే, ఇటువంటి పట్టుదల మరియు ప్రేమతో 'మాలిక్' నన్ను ఎలా సాకుతున్నారూ అని. లోపల, బయట అంతటా ఒక విచిత్రమైన నిశ్శబ్దం వ్యాపించి ఉంటోంది. అలా వ్యాపించటమే కాదు, అది నా రూపంగానే అయిపోయింది. నేను ఒక వింతైన విషయం గమనిస్తున్నది ఏమిటంటే, శక్తి యొక్క లేదా ఇచ్ఛాశక్తి జాడయే లేకుండా పోయింది. దానికి బదులు ఒక రకమైన పట్టుదల ఏర్పడి, అది స్వయంగా పనిని పూర్తి చేయిస్తుంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 635

షాజహాన్‌పూర్,
16.07.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం 12.7.1957వ తేదీది, కేసర్ ఉత్తరం కూడా అందాయి. చౌబేజీ తన ఆత్మోన్నతిని కోరుకుంటున్నారని అనటంలో సందేహం లేదు. కాని ఆయన తన శరీరానికి విశ్రాంతిని అన్ని విధాలుగా సమకూర్చుకోవాలి అను స్వభావం కలిగి ఉండటంచేత, అభ్యాసం చేస్తున్నప్పటికీ దానిమీద హృదయపూర్వకంగా తన దృష్టిని నిలుపలేక పోతున్నారు. దానికి కారణం ప్రేమ లోపమేనని చెప్పాల్సి ఉంటుంది. ఇదే కాకుండా ఆయనలో ఏర్పడిన ఒక అలవాటు మూలంగా, ఆయన ఈశ్వరప్రాప్తిని కోరుకుంటున్నప్పటికీ, భగవంతునితో సంబంధం ఏర్పరుచుకోలేకపోతున్న కారణంగా చాలా లోపాలు ఏర్పడ్డాయి. ఇప్పటివరకు ఆయన ఎవరినీ తన వశం చేసుకోవటంగాని (తనవారుగా చేసుకోవటంగాని), తాను స్వయంగా ఎవరికీ వశమైపోవటంగాని (శరణాగతి పొందటంగాని) చేయలేదు. ఈ రెండింటిలో ఏ ఒక్క దానినీ చేయలేదు. ఈ విషయమై ఆయన బాగా ఆలోచనచేసి, విశ్రాంతి అనుదానికి స్వస్తి పలికి, దైవంతో అనుసంధానం కొరకు దీక్ష బూనితే, అప్పుడు జీవితం సంస్కరించబడుతుంది అనగా ఆత్మోన్నతి కలుగుతుంది. **నేటివరకు ఆధ్యాత్మిక చరిత్ర ప్రకారం, జనం ఈశ్వరప్రాప్తి కొరకు ఎన్నో త్యాగాలు చేసిన తర్వాతనే దైవాన్ని చేరగలిగారు. అది కూడా ఒక జీవితకాలంలో కాకుండా ఎన్ని జన్మలు పొందితే ఆ దైవాన్ని ప్రాప్తింపచేసుకోగలిగారో తెలుస్తుంది. నేను త్యాగం చేయమని కూడా చెప్పను. నేను చెప్పేదంతా మీ మనస్సును 'అతని' వైపు మరల్చండి. అది కూడా ఎంత ధృఢంగానంటె బలవంతంగా మరల్చినప్పటికీ ఎటువంటి పరిస్థితిల్లోను అది తిరిగి మరలకూడదు (చలించకూడదు).**

ఇప్పుడు నీ స్థితిని గురించి వివరిస్తాను. '$O_1$' మీద నీ ఆధ్యాత్మిక యాత్ర పూర్తయింది. ఇక్కడ నీవు గుర్తించిన నిశ్శబ్దం ఆ స్థానాన్ని తెలియపరుస్తుంది. ఈ నిశ్శబ్దం అనేది ఒక విధమైన శక్తి. అది ఇతరుల పురోగతికి ఉపయోగపడుతుంది. అంతేగాకుండా ఏ ప్రదేశాన్నయినా ఎడారిగా తయారు చేయటంలో కూడా ఉపయోగపడుతుంది. కాని దైవాజ్ఞ లేకుండా ఈ శక్తిని ఉపయోగించకూడదు. **నీవు "కూర్చుని ఉండగా తూలిపోతున్నట్లు అనుభవమవుతున్నది" అని వ్రాశావు. ఇది ఆత్మ యొక్క నృత్యం. ఇంకా లోతుగా వెళ్ళి దానిని సహజరీతిలో చూసినట్లయితే ఇంకా అనేక అర్థాలు తెలుస్తాయి. ఆత్మయే ఆత్మగా (అనగా ఆత్మ మాత్రమే) ఉన్నప్పుడు, సృష్టి యొక్క ఆవిర్భావం సంభవించిన సందర్భంలో ఎటువంటి క్షోభ కలిగిందో అదే రకంగా ఈ ఆత్మ నృత్యం ఉంటుంది. అనగా ఆ నృత్యం క్షోభకు ప్రతిరూపంగా ఉంటుంది.**

కేసర్ ఉత్తరం అందింది. "ఎక్కడ చూస్తున్నానో, దేనిని చూస్తున్నానో నాకు తెలియడం లేదు" అని ఆమె వ్రాసింది. హృదయం బాహ్యవస్తువులతో ప్రభావితం కాకుండా ఉండగలుగుతోంది. దాని మూలంగా సంస్కారాలు ఏర్పడటం లేదని దాని అర్థం. హృదయం కరిగిపోవటం, ఆత్మ కరిగిపోవటం వంటివి ఆమె వ్రాసింది. దీని అర్థం ఏమిటంటే, ఆమె శారీరక స్పృహ (Body consciousness) క్రమక్రమంగా తొలగిపోతున్నది అని.

అమ్మ మరియు చౌబేజీకి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 636

లఖీంపుర్,

14.07.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి వ్రాసిన ఉత్తరం ద్వారా సమాచారం తెలిసింది. తమరు ఆరోగ్యంగా ఉన్నారని తెలిసి సంతోషం కలిగింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఏమైందో ఏమోకాని, ఏ శక్తి అయితే నన్ను ఎప్పుడూ తనవైపు గుంజుకుంటూ వస్తూందో, దేని సహాయంతో నేను దానితోపాటు ఈడ్చుకుంటూ వెళ్ళానో, అది ఇప్పుడు కొంతకాలం నుంచి పూర్తిగా ఆగిపోయింది. ఆ విధంగా ఆకర్షించినటువంటి దాని ఆకర్షణ శక్తి ఏమయ్యిందో ఏమోకాని, ఇప్పుడు ఇంకా ఆకర్షించునట్టి అవకాశం తొలగిపోతోంది. ఇది ఏమిటో నాకు తెలియదు.

ఎప్పుడు తమరు ఇక్కడి నుండి వెళ్ళారో అప్పటినుంచి రాత్రంతా కలల్లో ఫంక్షన్స్, జనసందోహాన్ని చూస్తున్నాను. ఆ కలల్లో అప్పుడప్పుడు నేను 'మాలిక్' ఒడిలో ఉన్నట్లుగాను, దాదాపు దగ్గరగానే కూర్చుని ఉంటున్నట్లుగానే అనుభూతి చెందుతున్నాను. తరచుగా తమరు నా శిరస్సుపై చేయి ఉంచుతూనో లేక నిమురుతూనో ఉన్న దృశ్యాన్ని ఇప్పుడు కూడా జ్ఞాపకం చేసుకుంటే శరీరం గగుర్పాటు చెందుతోంది. ఇప్పటిదాక రకారకాలైన మౌన తరంగాలు మరియు వాటి దొంతర్లు గురించిన ప్రవేశం లేదా అంచనా మాత్రమే ఉండేదో, అది ఇప్పుడు అన్నివైపులా సమతలంగా వ్యాపించి ఉంది. అలలయొక్క తాకిడి కూడా ఇప్పుడు నా దృష్టికి రావటం లేదు. ఈ దశ ఎలా ఉంది అంటే, పొదలు, ముళ్ళపొదలు అన్నింటినీ దాటుకుంటూ, నడిచిపోతూ కూడా అలసట అనేది లేకుండా చల్లదనంలో నిద్రించిన తర్వాత అనుభూతి కలుగు విశ్రాంతి వంటిది విస్తరించి ఉంది.

ఇప్పుడింక అన్నీ మర్చిపోయాను. దీనిని పూజ ప్రారంభించకపూర్వం ఉన్న స్థితి అని చెప్పటం కూడా వ్యర్థమని అనిపిస్తుంది. స్థితి అను శబ్దం కూడా విలువలేనిదిగా ఉంది. ఇప్పుడు ఈ స్థితి ఏమిటో తెలియదు కాని, తెలియకుండా తూలినాగాని, సూక్ష్మదృష్టితో చూసినాగాని, జ్ఞానేంద్రియాలలో ఆనందం యొక్క అనుభూతి కలగటం లేదు. అలాగే ఆనందం లేకపోయిన అనుభూతి కూడా కలగటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 637

లఖీంపుర్,

28.07.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం వచ్చింది. చదివి సంతోషించాను. నామీద ఉన్న 'మాలిక్' యొక్క అపార కృపకు ఎంతగానో ధన్యవాదాలర్పించవలసి ఉంటుంది. 'వారి' ఇటువంటి కృపయే ఈ నిరుపేదరాలు మీద నిలిచి ఉండుగాక!

ఈ విశ్వంగాని, సృష్టిగాని, కర్తగాని, క్రియగాని లేనట్లే అనిపిస్తోంది. ఇప్పుడు నిశ్శబ్దం యొక్క ఉనికి కూడా లేదన్నట్లుగా ఉంది. లోన-బయట, ముందు-వెనుక, ఆపాదమస్తకం అనగా తల నుంచి పాదాలవరకు ప్రశాంతం (Calm) మరియు నిశ్చలత (Quiet) యొక్క స్వరూపంగా అయిపోయింది. అంతా ఏకమైపోయింది. నా వ్యవహారం, పద్ధతి, నడవడిక అన్నీ ఇటువంటి స్థితిలోనికే రూపొందించబడినట్లు ఉంది. దశ అయితే ఇది కూడా కాదు, అది ఏదై

ఉందో అదిగానే ఉన్నట్లు సహజంగా అయిపోయింది. దశ అయితే నాలాగ స్వయంగా అలాగే ఉంది. ఈశ్వరుని బహిర్గతమైన రూపం నా నాలుగువైపులా వ్యాపించి ఉంది. శరీరం అంతటిలోను ఆ రూపం జీర్ణించుకుపోయినట్లుగాను, నా హృదయంలో ఇదంతా జీర్ణమవుతున్నట్లు గాను ఉంది. ఈశ్వరుని దివ్యత్వం, విరాటత్వం నాలో కలిసిపోయాయి అన్నట్లుగా ఉంది. ఒక రకమైన ఉల్లాసభరితదేహ స్థితిలో నేను కలిసిపోతూ సాగిపోతున్నాను. ప్రతికణం నుండి స్థూలత్వం పిండి బయట పడవేసినట్లుగా ఉంది. నా శరీరం యొక్క కణకణం మధించబడింది మరియు ఈశ్వరుని విరాట్ స్వరూపం నా హృదయంలో లీనమైపోతూ ఉన్నట్లుగా అనిపిస్తోంది. అది కూడా ఎంత వేగంగాను, బలంగాను లీనమైపోతూ ఉందంటే, ఇంతగా ఉన్న ఈ విరాటత్వమంతా ఎక్కడ లీనమైపోతూ ఉందో కూడా నాకు తెలియటం లేదు. ఇదంతా ఏమిటో తమకే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 638

లఖీంపుర్,

12.08.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు తావూజీకి వ్రాసిన ఉత్తరం వచ్చింది. దానినిబట్టి తమ కుశల సమాచారం తెలిసింది. ఇక్కడ కూడా అందరూ క్షేమమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఏదో హద్దు తొలగిపోయి ఒక దివ్యధార వంటిది ప్రవహిస్తున్నట్లుగా అనిపిస్తోంది. ప్రతి జీవి యొక్క అహం దీనిలో మునిగిపోయినట్లుగా ఉంది. ఒక విరాట్ రూపం వ్యాపించి, అదంతా నా హృదయంలో లీనమైపోతూ ఉన్నట్లుగా ఉంది. ఈ శరీరం యొక్క స్వరూపం స్వచ్ఛంగాను, సరళంగాను అయిపోయింది. హృదయం పూర్తిగా సరళం మరియు వినమ్రత యొక్క రూపంగా అయిపోయింది. నా దశ ఎలా ఉందంటే, 'మాలిక్'తో పూర్తిగా అనుబంధం లేనటువంటి స్థితిగా ఉంటోంది. వీటన్నింటికి నేను ఒక ప్రేక్షకురాలిగానే ఉన్నాను. ఇదీ నా స్థితి. ఇలా ఎందుకు జరుగుతున్నదో నాకు అర్థం కావటం లేదు.

బాబూజీ, ఒక రోజున ఏమైందంటే, ఇద్దరు అభ్యాసీ సోదరులు పూజ చేయటానికి కూర్చున్నారు. అప్పుడు ఒక్కసారిగా దానంతట అదే, హృదయం యొక్క సంబంధం శ్రీ లాలాజీ సాహెబ్‌తో కలిగినట్లుగాను, ప్రాణాహుతి తమరే ఇస్తున్నట్లుగాను అనుభవమైంది. ఆ రోజున అందరూ ఆనంద పరవశులైపోయారు. ఇదంతా నాకు అర్థం కావటం లేదు, వ్యాకులపడుతున్నాను. నేనయితే ఒక నిరుపేదరాలైన, 'వారి' కుమార్తెను మాత్రమే. ఇప్పుడు నా ఈ స్థితిలో 'మాలిక్'తో అనుబంధం లేకుండాను, పూజపట్ల వైరాగ్యంగాను ఉంటోంది.

నాకు ఇప్పుడు సరళత్వం యొక్క భావన కూడా లేదు. నా దశ ఎలా ఉందంటే, కొనుగోలు చేసిన వస్తువును ఎప్పుడైనా 'మాలిక్' ఏ విధంగానైనా ధరింపజేసినప్పటికి అది యదాతథంగానే ఉంటోంది. దాని భావన ఎప్పుడైనా మనసులో కలిగినప్పటికి అది నన్ను స్పర్శించటం లేదు. ఏదైనా వచ్చినా, రాకపోయినా, నాకు తెలియకపోయినాగాని ఏ వస్తువు కూడా నన్ను స్పర్శించలేనట్లుగా ఉందని నా శాంతి యొక్క అనుభవం కూడా చెబుతోంది. సందర్భానుసారంగా ఏవో వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, కాని అవేవీ నాకు సంబంధం లేనట్లుగానే ఉంటోంది. ఈ దశలో, అనేక ఆలోచనలు ఉంటున్నప్పటికీ, అవి స్థితిని పట్టి ఉంచలేకపోతున్నాయి. అయితే ఖాళీగా ఉండటంలో కూడా బాగానే ఉందనిపించటం ఆశ్చర్యంగా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 639

లఖీంపూర్,

26.08.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. ఇప్పుడు నా అనుభవానికి వచ్చిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ! ఇదేమిటోగాని నేను పూర్తిగా ఖాళీగానే ఉండిపోతున్నాను. ఇది నా స్వభావం అయిపోయినట్లుగా ఉంది. 5,6 రోజుల నుండి ఒక ఉదాసీనత మరియు మరపుస్థితి ఉంటోంది. నేను గత్యంతరంలేక తిరుగుతున్నాను. దీనిని మరపు అనాలో, ఖాళీది అనాలో నాకు తెలియటం లేదు. అందరూ ఉన్న సమూహంలో కలిసి ఉండటంవలన మార్పు వస్తుందేమోనని భావిస్తున్నాను, కాని అలా జరగటం లేదు.

నిన్న ఉదయం ఏమయ్యిందో ఏమోకాని, నా కణకణం నా ఎదుట చెల్లాచెదురుగా పడి ఉన్నట్లుగా అనిపించింది. నేను ఒక్కొక్క కణాన్ని ఎత్తి పరిశీలిస్తున్నపుడు, అవి నావికాకుండా ఈశ్వరీయశక్తి రూపంగా అనుభూతి చెందాను. మళ్ళీ చూసినపుడు తమ కణకణమూ విరజిమ్మబడినట్లు ఉంది. ఏ కణాలైతే ఇంతకుముందు చూశానో వాటిలో ఇవి లీనమైపోతూ అంతర్థానమైపోయినట్లుగా అనిపించింది. ఇప్పుడు నాకు వాటి జాడయే లేదు. అంతకుమించి ఇంకేమీ క్రొత్తగా జరగలేదు. ఇప్పుడు నా ఆంతరికం ఎంత స్వచ్ఛంగా ఉందంటే, అది గాజుతో కూడా పోల్చదగినది కానట్లుగా ఉంది. ఇది పూర్తిగా సాధారణ స్వచ్ఛ దశ. పూజ చేయిస్తున్నపుడు, తమరు పూజ చేయిస్తున్నట్లుగా ఆలోచన కలుగుతోంది. ఇలా చేయవచ్చునా లేదా అనేది కూడా మామూలుగానే అయిపోయింది. ఇప్పుడు నేను నా ఆలోచన మీద ధ్యాసపెట్టలేకపోతున్నాను. దానికి తగిన శక్తి కూడా నాలో లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 640

షాజహాన్‌పూర్,

31.08.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం 1957 ఆగష్టు 26వ తేదీన వ్రాసినది అందింది. నీ ఆధ్యాత్మిక స్థితిని చూసి నేను అమితానందం పొందాను. ఇప్పుడు ధ్యానం చేయటం అసంభవమే అవుతుంది. అంతేకాదు అది ఒక బంధనమే అవుతుంది. ఈ బంధనంతో బంధించబడకుండా విముక్తి (Liberation) కలగదు కూడ. నీవు నీ శరీరంలోని కణాలన్నీ చెల్లాచెదురైనట్లుగా చూశావు అంటే, ఏ పరమాణువులతోనైతే నీవు కూర్చబడ్డావో అవి నీలో సృష్టిస్తూ, చైతన్యపరుస్తూ ఉన్నాయి. అవి తమ పనిని నిర్వర్తించటం నిలిపివేసినపుడు, దాని మూలంగా ఒక సహజమైన దశ, చాలా ఉన్నతస్థాయికి చెందినటువంటిది ఏర్పడుతుంది. దీనిని జీవనమోక్ష దశగా జనం అనుకొని, దీనికిమించి మరేదిలేదని, సాధన ఇక్కడతో ముగిస్తారు. వారి చెవుల్లో బిగ్గరగా "ఈ స్థితి ఏమిటి?" అని నీవు ప్రశ్నించవచ్చు. ప్రతికణం

దైవశక్తిగా మారుతున్నాయని నీవు అనుభూతి చెందుతున్నావంటే, దాని అర్థం పరమాణువులు తమ మూలస్థితిని సంతరించుకుంటున్నాయి అని. అయితే దానిలో కొంత స్థూలత్వం (భారం) ఖచ్చితంగా ఉంది. దానిని తూకం వేయటం సాధ్యపడే విషయం కాదు. "ఇప్పుడు నా శరీరంలోని పరమాణువులు ఆ స్థానంలోకి చేరుతున్నాయి" అని నీవు చెప్పటంలో అర్థం ఏమిటంటే, ఆ ఉప్పు ఈ పరమాణువులను కూడా ఉప్పుగా మార్చివేసి, మిగిలి ఉన్న భారాన్ని తొలగించటంలో సహాయపడుతున్నాయన్న మాట. (ఉప్పు అను దానిని ఈశ్వరీయ శక్తిగా భావించి ఆశక్తియే ఈ పరమాణువులలో సమకూరి ఆ భారాన్ని తొలగించటంలో తోడ్పడతాయి అని అర్థంచేసుకోవాలి.)

అమ్మగార్కి నా ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 641

షాజహాన్‌పూర్,
02.09.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నేను ఒక ఉత్తరం వ్రాసి పంపించాను. అది నీకు చేరే ఉంటుందని అనుకుంటున్నాను. నీకు వైద్యం చేయటం మొదలు పెట్టారని అనుకుంటాను. దైవకృపతో నీకు త్వరగా రోగ విముక్తి కలగాలని కోరుకుంటున్నాను. నేను డిశంబర్ రెండవ వారంలో ఢిల్లీ వెళ్తాను, కాని ప్రయాణం ఇంకా నిర్ణయం కాలేదు.

అమ్మకు నా ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 642

షాజహాన్‌పూర్,
04.09.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం వచ్చింది. నేను రెండు ఉత్తరాలు వ్రాసి నీకు పంపించాను. అవి నీకు చేరే ఉంటాయని అనుకుంటున్నాను. నీవు ఇప్పుడు నీ వ్యాధిని నయం చేసుకోవటం, ఆరోగ్యాన్ని సమకూర్చు కోవటం మీద దృష్టి నిలపాల్సి ఉంది. వీటినే పూజగా భావించుకో. ఎందుకంటే, మన శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవటం మన కర్తవ్యం. దానివలన భగవంతుడ్ని ఆరాధిస్తూ ఇతరులకు సేవలు చేయవచ్చు.

నీవు వ్రాసిన దానిలో, ముందుకు పోవటానికి నీ హృదయం తపించిపోతున్నది అనేది వాస్తవమే. అయితే ఇప్పటివరకు నీకు కలిగిన స్థితులన్నీ వ్యాపించిపోతున్నాయన్న విషయం నీవు పరిశీలించలేదు. ఈ విధంగా వ్యాప్తి చెందటం కూడా దేవుని వరప్రసాదమే.

నేను ఢిల్లీ వెళ్ళటం ఖాయమే. అందుకు ప్రయత్నం కూడ చేస్తున్నాను. అయితే నా గృహ సమస్యలు నన్ను పోనివ్వటంలేదు. ఎందుకంటే, కుటుంబ అవసరాల కోసం చాలా ముఖ్యమైన పనులు నన్ను అడ్డుకుంటున్నాయి.

అమ్మకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 643

లఖీంపుర్,

5.09.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ కృపతో వ్రాసిన ఉత్తరం అందింది. చదివి సంతోషించాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు అన్ని దశలూ విస్తరించి ఉన్నాయి. నా లోపల, బయట ప్రతికణంలోను (దశ యొక్క ప్రతికణంలోను) వ్యాప్తి జరిగిపోయింది. నాభిలో ఏదో తెరుచుకోవాలని అనుకుంటున్నట్లుగా అనిపిస్తోంది. తరచుగా, ఏదో తెరచుకోవటానికి అన్నట్లుగా బాధ కలుగుతోంది. నాలోన, బయట అంతటా చాలా మృదుత్వం వ్యాపించిపోయింది. అలా కాదంటే, అదే నా స్వరూపంగా అయిపోయింది అంటే బాగుంటుందేమో. నా రూపం అంతా తెల్లని రాయిలాగా అయిపోయింది అని అనిపిస్తోంది. హృదయం మీద ఏదో కంపనం (Vibration) వంటి దాని అనుబంధం (Link) బంధించి ఉంచినట్లుగాను, ఈ కంపనం ఎక్కడి నుండో వస్తోంది అన్నట్లుగాను ఉంది. ఇప్పుడు నిరంతరం ఎటువంటి సమాన శాంత (Uniformly peaceful) దశ ఉంటున్నది అంటే, నిద్రిస్తున్నా, మేల్కొంటున్నా మరియు మరచి ఉంటున్నా కూడా అదే విధంగా ఉంటోంది. ఎవ్వరిదో సమస్త బాధ హరించివేయబడినట్లుగా ఈ దశ అనిపిస్తోంది. నవ్వటంగాని, విలపించటంగాని అలాగే జీవించటంగాని, మరణించటంగాని నాకు చేతగానట్లుగా ఉంది. ఎలా ఉన్నానో అలానే ఉన్నాను లేదా ఒక రాతిబండలాగా వ్యాపించి ఉన్నాను. తూలటం, పచార్లు చేయటం రాదు, సమూహంలో ఉండటం అయిష్టంగాను ఉండదు, ఏకాంతమూ ప్రియంగా ఉండదు, ఇంకేదైనాగాని ప్రియం, అప్రియం అనిపించటం లేదు. ఎటువంటి భావం నా దరికి రావటం లేదు. నాకు అన్నీ సమానంగానే అనిపిస్తున్నాయి. నా స్వభావంలో ఎటువంటి మార్పు కలిగింది అంటే, నేను ఇప్పుడు మాట్లాడలేకపోతున్నాను అవి భక్తికి చెందినవైనా, ఏదైనా చర్చకు చెందినవైనా. ఎందుకంటే, మనస్సులో మాటలు ఏమీ రావటం లేదు. అయినాగాని, మధ్యలో చొరబడి మాట్లాడాలనుకుంటే మాట్లాడుతున్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 644

షాజహాన్‌పూర్,

15.09.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. 1957 సెప్టెంబర్ 5వ తేదీన నీవు వ్రాసిన ఉత్తరం అందింది. "నడుస్తూనే ఉన్నప్పటికీ నడుస్తున్నట్లుగా అనిపించటం లేదు" అని నీవు వ్రాశావు. నడుస్తూ నడుస్తూనే ఆ నడకను నీవు మరచిపోయావు అని దీని అర్థం. అనగా చేస్తున్న పనుల సంస్కారాలు ఎక్కడా ఏర్పడటం లేదు. నేను ఏదో ఒక ఉత్తరంలో వ్రాశాను, అయినప్పటకి మళ్ళీ వ్రాస్తున్నాను. బ్రహ్మకు నిర్వచనం నేను ఈ విధంగా తెలుపుతున్నాను:

**"బిన్ పగ్ చలై, సునై బిన్ కానా।**

**కర్ బిన్ కర్మ, కరై విధి నానా॥"**

**కాళ్ళు లేకుండానే నడిపిస్తాడు, చెవులు లేకుండానే వినిపిస్తాడు, చేతులు లేకుండానే అన్ని పనులను చేయిస్తాడు. అనగా భక్తుని ప్రమేయం లేకుండానే ఇలాంటి అద్భుతాలను దైవం నిర్వహిస్తాడు అని అర్థం.**

నీవు చైతన్యాన్ని అభివృద్ధి చేయటం గురించి వ్రాశావు. ముతకభాషలో చెప్పాలంటే, **మరణించిన తర్వాత ఏ జీవితమైతే కలుగుతుందో అదే అసలైన జీవితం. చౌబేజీ యొక్క కస్తూరీ మరణించింది. ఇప్పుడు ఉన్నది 'మాలిక్' యొక్క కస్తూరీ. అంతటా ఆమె దివ్య సుగంధమే వ్యాపించి ఉన్నది.**

"ప్రపంచంలో ఏది ఎవరివద్ద ఉన్నదైనాసరే దానిని తమరు (బాబూజీ) ఇచ్చినదే" అని నీవు వ్రాశావు. అలా కాకుండా, నీకు చెంది ఉన్నది ఏదైనా సరే, అది ఈ జనంచేతనే ఇవ్వబడింది అనేటటువంటి అనుభూతి కలిగినట్లయితే అది ఇంకా బాగుంటుంది.

అమ్మగార్కి ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 645

లఖీంపుర్,
17.09.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు తావూజీని ఉద్దేశించి, పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా పంపిన ఉత్తరం విని సంతోషం కలిగింది. తమ ఆరోగ్యం కూడా బాగుందని తెలిసి ఆనందం కలిగింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈరోజు ఉదయం నేను ఒక ఆనంద దాయకమైన స్వప్నాన్ని చూశాను. దానిలో అంతా ప్రకాశమే వ్యాపించి ఉంది. ఇంతగా ఈశ్వరీయ ప్రకాశం వ్యాప్తమై ఉండగా, అయ్యో, ఈ ప్రపంచమంతా ఎక్కడికి పోయిందా అని ఆలోచిస్తున్నాను. నాకైతే తెలియటం లేదు కాని, ఏదైనా మహాప్రళయం జరిగిపోయిందా అనిపిస్తోంది. ఇలా చూస్తూ చూస్తూ ఉండగానే నేను స్వయంగా ఆ ప్రకాశమంతటిలోను వ్యాపించిపోయాను. ఎందుకో తెలియదు కాని మనస్సులో ఏదో ఒక మూల నేను ప్రియతముని కలవలేకపోయాను అన్న ఆలోచన మెదులుతూ ఉంది. అప్పుడు నేను కూడా నశించిపోయాను. ఇంతలో రెండు చేతులు పైకి లేస్తున్నట్లుగాను, నేను అలా అంతమవుతూనే చెబుతున్నాను– "ఆ చేతులను నేను గుర్తుపట్టుతున్నాను. వాటి ఒడిలోకే నేను చేరవలసి ఉంది" అని. అప్పుడు ఆ చేతులు కనుమరుగైపోయి ఇంకో రెండు చేతులు వచ్చాయి. అప్పుడు కూడా నేను పై మాటలనే చెబుతున్నాను. ఇలా మళ్ళీ మళ్ళీ జరుగుతుండగానే చివరకు ఆ రెండు చేతులు రాగానే "ఇవి నాకు తెలిసిన చేతులే, వాటిని చేరుతూనే నేను వాటిలో కలిసిపోయాను" అని అరిచాను. అప్పుడు నేను మేల్కొని, నేను అంతమైపోతూనే వాటిలో ఎలా కలిసిపోయాను, ఎవరిలో కలిసిపోయాను అని ఆలోచించసాగాను. కాని నాకు అంతుచిక్కలేదు, ఎందుకంటే, దీనిని అర్థం చేసుకోవాలనుకుంటే, హృదయం గాబరా చెందుతున్నట్లుగా ఈ దశ తయారైంది. ఇప్పుడు మాటలు కూడా రావటం లేదు. ఏమి చెప్పటానికిగాని, అర్థం తెలియజేయటానికిగాని అవకాశం లేకపోయింది. ఎందుకంటే, ఏదో బాధ, తపన మూలంగా అశాంతిగా ఉన్నాను. అది ఎవరిలో ఉంది, ఎక్కడ ఉంది, ఎందుకు ఉంది అని తెలుసుకోలేకపోతున్నాను. కాని బాధ ఉందో, బాధ లేదో కాని అది నన్ను కొట్టుతోంది కాని గాయం కానివ్వటం లేదు. నేనొక కొండరాయినే, నిజంగా దాని స్వరూపమే నాదిగా ఉంది. శిల ఎలా చెమటోడ్చదో నేను అలాగే ఉన్నాను. దానిని ఎక్కడ పడవేసినా అలా ఉన్నది ఉన్నట్లుగానే ఉంటుంది. నదిలో పడవేస్తే దానికి కష్టం ఉండదు. అలాగే ఒడ్డున వేసినా విశ్రాంతి పొందదు. దానిని ఎవ్వరైనా ఎత్తి

విసిరిపారవేసినా గాని దానికి దెబ్బ అనిపించదు. ఇంతకూ అసలు తెలియని విషయం ఏమిటంటే, నేను ఆ రాయి సంగతి చెబుతున్నానా లేక నా సంగతియా? నేను అంతర్లీనం కాలేను, ఎందుకంటే, ఇంకా నాలో శక్తియే లేదు కనుక. అంకురించటానికి అంటూ నాలో బీజమే లేకపోయింది. స్థితి ఇప్పుడు స్థితిలేని స్వరూపమే దాల్చింది.

ఇది ఎటువంటి వింతైన దశ అంటే, దానికి స్వయంగా దిశ, దశ ఏదీ తెలియనట్లుగా ఉంది. నేను 'మాలిక్' విషయాలు మాట్లాడుతూ పైకి ఆనందపరవశంగానే ఉన్నాగాని, ఆ ఆనందం లేక పారవశ్యం అనేవి నా మనస్సును స్పర్శించలేకపోతున్నాయి. లోన, బయట అంతా ఒకటిగానే నేను చూస్తున్నప్పటికీ ఇంకా ఏదో తెలియనిది ఉంటోంది. ఇప్పుడు దశ మార్పు చెందుతూ ఉన్నాగాని, సరళం, సామ్యస్థితిలో మాత్రం ఎటువంటి మార్పు కలగటం లేదు అన్నట్లుగా నేను గమనిస్తున్నాను.

చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 646

లఖీంపుర్,
19.09.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. అక్కడ కూడా అందరూ కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా ఈ దశ ఒక సర్పం, చుంచెలుకలాగా ఉంది. సర్పానికి దానిని విడిచిపెట్టాలని అనిపించదు, పట్టుకోవాలనీ అనిపించదు. నాకు ఇదివరకైతే నా కణకణం మైనంలాగా మెత్తగా అయిపోయినట్లుగా అనిపించేది. ఆ విధంగా మైనంలాగా ఉన్నటువంటిది ఇప్పుడు రాయిలాగా అయిపోయింది. బాబూజీ, ఇప్పుడు నేను ఏమి అవ్వాలో అది నా వశంలో లేకుండాపోయింది. 'మాలిక్' నన్ను తన ఇష్టప్రకారం మైనంలాగా మృదువుగా గాని, రాయిలాగా గాని చేయవచ్చు. నేను మాత్రం ఏ విధంగా వచ్చానో అదే విధంగా జీవించాల్సి ఉంది. అదేమీకాదు, ఇంక పోవటమూ లేదు, రావటమూ లేదు, నాకు ఇంకా సొంత స్థావరమంటూ లేదు.

చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 647

షాజహాన్‌పూర్,
22.09.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీవు వ్రాసిన ఉత్తరం సెప్టెంబరు 11వ తేదీది అందింది. అలాగే నీ గత ఉత్తరానికి జవాబుగా నేను సెప్టెంబరు 15వ తేదీన వ్రాసిన ఉత్తరం నీకు చేరే ఉంటుందని అనుకుంటున్నాను.

అభ్యాసీ ఆధ్యాత్మిక ఉన్నత శిఖరానికి చేరినపుడు ఒక విధమైన ధ్వనిరహిత ప్రతిధ్వని (Soundless echo) ఉత్పన్నమై, దాని తీవ్రత (అధోముఖంగా) క్రిందివైపుగా దిగి వస్తుంది. ఈ స్థితి గురించి నాకు తెలుసు, కాని ఇది ఎలా జరుగుతుందో నాకు బోధపడలేదు. ఇప్పుడు నీ మూలంగా ఈ విషయం నా దృష్టికి వచ్చింది కనుక దీనిని గురించిన

పరిజ్ఞానం పెంచుకోవటానికి పరిశీలన చేస్తున్నాను.

కబీర్ సాహెబ్ ఈ విధంగా చెప్పాడు– “సింధువులో (సముద్రంలో) బిందువు కలిసిపోతుందని అందరికీ తెలుసు, కాని బిందువులో కూడా సింధువు (సముద్రం) కలిసిపోగలదని చాలా అరుదైన వారికే తెలుసు” అని. “నా సమస్తరూపం తెల్లనిరాయిలాగా అయిపోయింది” అని నీవు వ్రాశావు. అది ఆ అనంతం యొక్క శక్తి తీవ్రతయే. నాభిలో నీకు ఏవో తెరుచుకుంటున్నట్లుగా అనుభూతి కలుగుతున్నది అంటే దానికి దిగువన రెండు లేదా మూడు చక్రాలు ఉన్న కారణంగానని గ్రహించాలి. మన విధానంలో నయితే వీటి సంగతి తర్వాత చూస్తాము. అవి ఒక్కటొక్కటిగా తెరుచుకునేట్లు చేస్తాము. వీటిలో మహత్తులు (సిద్ధులు) కల్పించే శక్తి కూడా ఉంటుంది. మనం వీటిని గురించి పట్టించుకోనప్పుడు మాత్రమే అవి తెరవబడతాయి. నీకు కలిగిన ఈ అనుభవం సరిగ్గానే ఉంది. నాకు కూడా దీని అనుభవం ఉంది.

నీ హృదయంలో కలుగుతున్న ప్రకంపనలు, అవి నా నుంచే వస్తున్నాయి. నీవు చూసినటువంటి స్వప్నం, బిందువులో సింధువు కలిసిపోయిన ఉదంతాన్ని నిరూపిస్తోంది. చివరిలో నీకు కనిపించిన హస్తాలు వాస్తవమైనవే. వాటితో నీకు మంచి దీవెనల ఫలితం కలుగుతుంది.

ఇప్పుడు నీవు ఏ స్థానంలో ఉన్నావో వ్రాయి. ఎందుకంటే, ఆ విషయం నేను మరచిపోయాను. నేను మతం అనుదానికి నిర్వచనం ఎక్కడో వ్రాశాను. అది నీకు జ్ఞాపకం ఉంటే తెలియజేయి.

అమ్మకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 648

లఖీంపూర్,
27.09.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. సంగతులు తెలిశాయి. ఈశ్వరుడు తమకు దీర్ఘాయుష్షును, ఆరోగ్యాన్ని ప్రసాదించుగాక! ‘మాలిక్’ కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఏమైపోయిందో ఏమోగాని, ఎంతో గొప్పవాడుగాను, సర్వవ్యాపిగాను, సర్వశక్తిమంతుడు గాను అనిపించినట్టి నా ‘మాలిక్’ ఇప్పుడు ఒక సాధారణ మానవునిలాగా అనిపిస్తున్నాడు. ఘనతగాని, విశేషంగాని ఏమి కనిపించటం లేదు. దీనికి కారణం, నా దృష్టియే మారిపోవటమా లేక ఇంకా ఏమైనా జరిగిందా అనేది తెలియటం లేదు. ఆ ‘మాలిక్’ యొక్క ఖజానాయే ఖాళీ అయిపోయినట్లుగా అనిపిస్తోంది. ‘అతడు’ కూడా సాధారణ జనసామాన్యంలాగానే అయిపోయాడు. ఎవరైనా పెడితే తిన్నట్లు లేకపోతే లేనట్లుగా నా పరిస్థితి ఉంది. ప్రపంచం దృష్టిలో నేనొక కీలుబొమ్మలాగా అయిపోయాను. ప్రతిదీ, ఆఖరికి ఆధ్యాత్మికతకు కూడా ప్రపంచమే ఇస్తున్నట్లుగా ఉంది.

ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, ఏ రోజు నుంచి అయితే తమరు “స్వస్థత చేకూరేంతవరకు హాపుర్‌ను వదలకూడదు” అని వ్రాశారో, అలాగే నా దశ ఉంది. ఆ రోజు నుంచే అదే మాట ప్రకారం నా స్వభావం దానంతట అదే తయారైపోతూ ఉంది. మొదటగా నేను హాపుర్‌ను వదలి వెళ్ళాలని ఆతృత ఉండేది కాని ఇప్పుడు ఆ విధంగా లేకుండా మామూలుగానే ఉన్నాను. ఇప్పుడు నాకు దసరా సందర్భంగా ఒక చోటుకు చేరి ఉన్న సోదర సోదరీలతో కలవాలను ఆసక్తి కూడా తగ్గిపోతోంది. పరీక్షల గురించి కూడా ఆలోచించటం లేదు.

శరీరమంతా జడత్వం దాల్చినట్లుగా అనిపిస్తోంది. ఎంత పని చేసినాగాని, కణకణంలో (Activity) చైతన్యం ఉత్పన్నం కావటం లేదు. నేను ఇప్పుడు ఒక జడత్వమూర్తిగా అయిపోయాను. ఇప్పుడు '$P_1$' పాయింట్ నాలో పొడసూపినట్లుగా అనిపిస్తోంది. కాని ఇప్పుడు నాలో ఉప్పదనంలేని ఉప్పురాయిలాగా ఉంది. ఎవ్వరైనా ఈశ్వర ప్రేమకై విలపిస్తూ ఉంటే, అది నాకు పిల్లవాడి ఆటలాగా అనిపిస్తోంది. కాని ఎవ్వరైనా కష్టం వచ్చి ఏడుస్తూ ఉన్నట్లయితే అది హృదయ విదారకంగా అనిపిస్తుంది. సేవ చేస్తున్నంతసేపూ హృదయంలో తృప్తి కలుగుతూ ఉన్నా కూడా ఆంతరికం మాత్రం రాయిలాగానే ఉంటోంది. ఈ భేదం ఏమిటో మరి. పూర్వం నేను మూర్తిపూజ చేస్తూ ఉండేదానను, ఇప్పుడైతే నేనే స్వయంగా చైతన్యంలేని విగ్రహంలాగా అయిపోయాను. అయినా నేను అందుకు చింతించటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 649

లఖీంపుర్,

28.09.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్ననే తమకు ఒక ఉత్తరం వ్రాసి పోస్ట్ చేశాను. నాకు కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

నా ఈ దశలో, ఏదో ఉరవడిగా నాలోకి దిగివస్తున్నట్లుగాను, వచ్చినది వచ్చినట్లు నాలో జీర్ణించుకుపోతున్నట్లుగాను ఉంది. ఈ ఏదో అని చెప్పబడుతున్నది పవిత్రత మరియు శుభ్రతకు చెందినదిగా ఉంది. అందుచేత దానిలో భారమనేది లేదు. అయితే ఇంతకుపూర్వమైతే నాలో ఏదైనా దశ జీర్ణించుకపోతున్నపుడు, కణకణం, నరనరం దానిని పీల్చుకుంటున్నట్లుగా ఉండేది. ఇప్పుడు దృశ్యమే మారిపోయింది. ఆకర్షణలేని ఆకర్షణగా అయిపోయింది. అనగా ఉధృతంగా వచ్చే ఆ దివ్యధార క్రిందికి దిగివచ్చి జీర్ణించుకుపోతున్నట్లుగాను, జీర్ణించుకునే శక్తి లేకపోయినాగాని అంతా జీర్ణించుకపోతున్నట్లుగాను ఉంది. హృదయమను ఖజానా ఖాళీ అయిపోయినాగాని ఈ ఉధృతి వస్తూనే ఉంది. ఇదేదో గమ్మత్తుగా అనిపిస్తోంది. నాకయితే 'మాలిక్' యొక్క శక్తి నాలో జీర్ణించుకపోతున్నట్లుగా అనిపిస్తోంది. 2,3 రోజులుగా 24 గంటలూ, రేయింబవళ్ళు ఆ శక్తి అలా జీర్ణించుకుపోతూనే ఉంది. శక్తి యొక్క కేంద్రమే నాలో జీర్ణించుకపోతున్నట్లుగాను, దానికి పరిమితిగాని, భారంగాని లేనట్లుగా ఉంది. శక్తి ఉండి కూడా శక్తిహీనంగా అనిపిస్తోంది. ఇందులో ఒక తమాషా ఏమిటంటే, ఇక్కడ ఆటగాళ్ళూ లేరు, పందెంకాసేవాళ్ళూ లేరు, నర్తించేవారూ లేరు. నాలో నేను మాట్లాడుకుంటూ ఉంటే, తమరు చెప్పిన మాటలే వల్లిస్తున్నట్లు ఉంది. అది ఎంత స్వాభావికంగా నంటె, నోటి నుండి దురుసుగా 'తమరు' చెప్పారు అని వెల్లడించినట్లుగా ఉంది.

ఇప్పుడు అంతా ఆశ్చర్యకరంగాను, తమషాగాను ఉన్నాగాని నాకయితే అంతా సహజమే అన్నట్లుగా ఉంది. పూర్తిగా స్వాభావికంగాను, లెక్కలేనట్లుగాను లేదా ఉదాసీనంగాను అయింది. దానిని గురించి చెప్పినా చెప్పకపోయినా అది ఒక స్వభావంగా అయిపోయింది. శరీరంలోకి, హృదయంలోకి ఒక సహజ ధార వంటిది ఏర్పడి ఉంటోంది. ఒకవేళ నేను దానిని మర్చిపోయినా కూడా, అది యదాతథంగానే ఉంటోంది. నా లోపల, బయట అంతా శుచి, పవిత్రతల రూపంగా అయిపోయింది. ఎలా ఉందంటే, నేను మాట్లాడుతున్నానా లేక పవిత్రత లేక సత్యత్వం వెలువడుతున్నాయా అన్నది కూడా తెలియటం లేదు. ఇది కూడా ఒక విచిత్రమే. ఇప్పుడు నాలో మనస్సుకు లోబడి

ఏదీ ఉండటం లేదు. దీనిని మనస్సు అనవచ్చు. చేతనా మనస్సు అనిగాని, సుప్తచేతనా మనస్సు అనిగాని లేదా అధిచేతనా మనస్సు (Conscious, Sub-Conscious & Super Conscious mind) అనిగాని చెప్పవచ్చు. నాకయితే ఇవన్నీ వ్యర్థమైన మాటలుగానే, దివ్యత్వం లేనివిగానే అనిపిస్తున్నాయి. నేనైతే ఒక జడత్వ రూపంగా అయిపోయాను. దానిని ఎవ్వరేమని అనుకున్నా నేను పట్టించుకోను. ఇది ఒక అలౌకిక నిశ్చింత సాగర స్వరూపంగా అయిపోయింది. నా అంగాంగాల్లోను, నరనరాల్లోను దివ్యత్వమే వ్యాపించి ఉంది. ఇదే నా స్వరూపంగా అయిపోయింది. జీవితంలో మాయను దాటిన ఒక **దివ్యత్వం** చేకూరినట్లుగా ఉంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 650

షాజహాన్‌పూర్,

09.10.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరాలు 1957 సెప్టెంబర్ 27, 28వ తేదీలవి చేరాయి. స్వామీజీని నీవు కలుసుకోవటం మంచిదే. ఆయన నావద్దకు రావటం చాలా కష్టం. ఒకవేళ వచ్చినప్పటికీ నా గురించి ఎటువంటి అభిప్రాయం కల్పించుకుంటారో కదా! ఎందుకంటే నావద్ద గుర్తించదగిన స్థితులు ఏమీలేవు. నా ప్రాణాహుతితో ప్రతి ఒక్కరూ సంతృప్తి చెందరు. ఎందుకంటే, దానిలో ఆకర్షణ ఉండదు గనుక. శరణాగతి బాగుండి అది అభ్యాసీకి తెలియకపోతే అతని స్థితి ఒక కొయ్యబొమ్మలాగా ఉంటుంది. **"శరణాగతి" అంటే ఏమిటి? అది 'మాలిక్' స్థితి యొక్క నకలు, అదే తర్వాత అసలుగా అయిపోతుంది.** ఆ తర్వాత దాని సాంద్రతతో సంబంధం లేకుండాపోతుంది. అనగా మనం మన అంతిమస్థితికి చేరతాము. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఈ స్థితి యొక్క మహిమను గురించి బాగా వర్ణించాడు. ఈ విధంగా, దివ్యశక్తి ధారను దింపడం నేను నీ నుండి తెలుసుకున్నాను. దాని వలన నాకు అటువంటి స్థితిని ఇతరులలో కల్పించటం ఎలాగో తెలిసింది. నేను దీనిని గురించి ఆలోచన చేస్తూనే ఉన్నప్పటికీ నాకు దాని అంతుబట్టలేదు. ఎప్పుడైతే దీనిని ప్రత్యక్షంగా చూసానో అప్పుడు దీని గురించి స్పష్టంగా తెలిసింది. దానిని "బిందువులో సింధువు కలిసిపోవటం"తో పోల్చినట్లయితే బాగా అర్థం చేసుకోవటం జరుగుతుంది. ఈ స్థితిని బిందువులో సింధువు కలిసిపోవటంగా చెప్పినప్పటికీ, ఆ హద్దు కూడా తొలగిపోవటం జరిగి, మనం ఒక బిందువు మాత్రమేనని గ్రహించలేని సమయంలో ఆ దివ్యశక్తి దిగి వస్తుంది. ఎటువంటి స్థితి కలగాలంటే, అన్నీ ఒకే (Surface) ఉపరితలంగా అయిపోయేటట్లు ఉండాలి. అప్పుడు ఇంకొక షరతు కూడా ఏమిటంటే, ఆ దివ్యశక్తి తనతోపాటు తెచ్చిన దాని సంగతి కూడా తెలియనిదిగా ఉండాలి. ఆ తర్వాత ఏమవుతుందో, దానిని చెప్పటానికి మాటలు లేవు. బహుశా దీనిని ఈ విధంగా వివరించవచ్చు. ఇక్కడ దివ్యశక్తి లేదు. సముద్రం (సింధువు) లేదు, బిందువు లేదు. అనగా ఈ మాటల ద్వారా 'ఏదైతే' అభివ్యక్తం చేయబడిందో దాని ఉనికి కూడా లేకుండా పోవాలి. ఇప్పుడు దానిని ఏమని చెప్పాలి? 'నెగేషన్' అని చెప్పవచ్చు. ఇక్కడ చెప్పడమంటూ ఏమీ ఉండదు. "ఇది కాదు, ఇది కాదు' అంటూ చెప్పుకుంటూ ముందుకు వెళ్ళాలి. అయినప్పటికీ ఈ "లేదు" అనే దానికి కూడా ముగింపు లేదు. ఇంకా ఏదో ఉంది అనే భావం మనల్ని విడిచిపెట్టదు. అమ్మకు ప్రణామం. నీ సోదర సోదరీలకు నా ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 651

లఖీంపుర్,

14.10.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది, చదివి చాలా సంతోషపడ్డాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ! ఇప్పుడు నేను- చైతన్యం, అచైతన్యం వాస్తవానికి ఏమీకావని తెలుసుకున్నాను. అయితే ఒక పల్చటి ఆవరణ మాత్రం ఉంది, అది తొలగిపోగానే కళ్ళను క్రమ్మి ఉన్న చీకటి వంటిది శుభ్రమైపోయినట్లుగా ఉంది. ఇప్పుడు అంతటా ప్రకాశమే వ్యాపించి ఉన్నది అణువణువులోను, కణకణంలోను, లోన బయట కూడా. ప్రతి చేతనాచేతనాలు అన్నింటి నుంచి ఒక అనుపమానమైన శాంతిరూపం కలిగిన దివ్య ప్రకాశం వెలువడుతోంది.

ఈ స్థితిలో దశ ఎలా ఉందంటే, బయట లోపల అంతటా ఒక సమతల భూతలం వ్యాపించి ఉంది. ఇప్పుడు నేను రాయినీగాను, కొండనూగాను. ఒక విచిత్రమైన సమతల రూపమే నా కణకణానికి చెందినదిగా ఉంది. శరీరం లేక రూపం అనే మాటేమిటి, అంతటా సమతల భూమియే వ్యాపించి ఉంది. ఈ దశ ఏమిటోగాని, దీనిలోకి వచ్చేదీ, పోయేదీ ఏదీలేదు. 'మాలిక్'కు సమర్పించటానికి అయితే నా దగ్గర ఏమీ లేకపోయింది.

నేను ఇదివరకు కణకణంలో ఒక దివ్యత్వం నిండి ఉందని వ్రాశాను. కాని ఇప్పుడు అలాంటిది ఏమీ లేదు. ఇప్పటివరకు దివ్యధారతోపాటు వస్తున్నటువంటి దాని మత్తులో కొద్ది రోజులుగా రేయింబవలు ఏదో కోల్పోయినదానిలాగా ఉండేదానను, కాని ఇప్పుడైతే ఆ ఆనంద పారవశ్యం లేదు, అలసత్వం లేదు, కోల్పోవటమూ లేదు. స్పృహ లేదా చైతన్యం ఎప్పుడూ కూడా గమ్యం లేనిదానివరకూ చేరటం లేదు. ఇప్పుడైతే మకాం లేదా గమ్యస్థానం ఎక్కడా లేకపోయింది. ఇంక అంతటా గమ్యస్థానం అనేదే లేకపోయింది వ్యాపించి ఉంది. ఇప్పుడు నాకు ఈ దశలనేవి కేవలం చెప్పటానికి మాత్రమేనని అనిపిస్తోంది. వాస్తవానికి ఇప్పుడు దశలు అనేవి ఎక్కడా లేవు. ఇప్పుడు నిరావరణమైనటువంటిది, దశ కానటువంటిదే వ్యాపించి ఉన్నది లేదా ఇంక ఒక్క భూతలం మాత్రమే వ్యాపించి ఉన్నట్లుగాను, నా శరీరమే ఆ భూతలంలాగా అయినట్లుగాను, ఇంకా చెప్పాలంటే, అది ఒక గాజుపలకలాగా అయిపోయి ఉన్నది ఉన్నట్లుగా కనిపిస్తున్నట్లుగాను ఉంది. ఇదివరకైతే సిట్టింగ్ ఇస్తూ ఉండేదానను, కాని ఇప్పుడు అది నావల్ల కావటం లేదు. పేరుకైతే కూర్చుంటున్నాను గాని, ఆ సిట్టింగ్ ప్రయోజనం ఉంటున్నదో లేదో తెలియదు. ఒక సమతల భూతలంగానే నా స్వరూపంగా ఉండగా ఆ సిట్టింగ్ ఎక్కడ నుండి పోతుంది!

సమస్త దివ్యత్వం మరియు అలౌకికత్వం నాలో జీర్ణించుకుపోయినట్లు అనిపిస్తోంది. నేను 'మాలిక్' ఎదుట యధాతథంగా నిలబడి ఉన్నట్లుగా ఉంది. దానిని (అనగా ఆ స్థితిని) "సూరదాస్ కరి కమర్ పర్ భరై న దూజా రంగ్" అనగా సూరదాస్ కవి చెప్పినట్లు నల్లని కంబళిమీద ఇంక ఇతర రంగేదీ ఎక్కదు అన్నట్లుగా పోల్చవచ్చు. అన్నీ కూడా ఎక్కడకుపోతున్నాయో తెలియదు. నామీద వాటి ప్రభావం లేదు. ఒక మాయా రహిత దశ వ్యాపించి ఉన్నట్లుగాను, అలా వ్యాపించి ఉండటమేగాక అది అంతా నాలో కలిసిపోయి శాంతించినట్లుగాను ఉంది. మాయను అతిక్రమించిపోయిన ఒక అనుపమాన దివ్య స్వరూపమే నాది అయిపోయినట్లు అనిపిస్తోంది.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 652

షాజహాన్‌పూర్,
27.10.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం 14.10.1957వ తేదీది అందింది. దీనికి జవాబు ఇవ్వటానికి ఆలస్యమైంది. 5.12.1957న దక్షిణ భారతదేశానికి వెళ్ళటం నిశ్చయమైంది. నీనుంచి ఉత్తరం ఏదీ రాలేదు. కనుక ప్రతిరోజూ నీ ఆరోగ్యం గురించిన ఆలోచన ఉంటోంది. త్వరగా జవాబు వ్రాయి.

నేను నీకు వ్రాసిన ఉత్తరాలలో ఏదో ఒక దానిలో వ్రాసినటువంటి దానికి అర్థం ఏమిటంటే, పైనుంచి ఏదైతే దిగివస్తూ ఉందో, అది క్రింది వరకూ వ్యాపిస్తోంది. ఇప్పుడు సరిసమానమైన (సమత్వం) స్థితి ఏర్పడింది, కాని అది నెమ్మదిగా ఉంది. అనగా నీ స్థితి కలిగి ఉన్న స్థానం '$O_1$', దాదాపుగా సమత్వంగా ఉంది. నీకు నీ స్వంత ఇల్లు, ఇతరుల ఇల్లు అన్నీ ఒకలాగానే అనిపిస్తున్నాయి. దీని అర్థం నీ హృదయంలో ద్వైతభావం తొలగిపోయింది. అందువలన అన్నీ నీవిగానే అనిపిస్తున్నాయి. దైవానుగ్రహం కలిగితే దీని తర్వాత ఎటువంటి ఆలోచన మనస్సులో లేకుండా పోతుంది. అది వాస్తవిక (రియాలిటి) స్థితి అవుతుంది.

నీవు స్పృహ కలిగి ఉండటం, స్పృహ లేకపోవటం కలిగిన దశ గురించి వ్రాశావు. అది నీ స్థితిగా ఉంది. ఇప్పుడు నా స్థితి కూడా ఇటువంటిదే. నడుస్తున్నపుడు కాళ్ళు, ఎత్తు పల్లాలు ఉన్న భూమిమీద పడినపుడు, పడిపోబోతూ తప్పించుకుంటున్నానంటే నేను స్పృహ కలిగి ఉన్నానని అనిపిస్తుంది. మానసిక వృత్తులన్నీ ఎక్కువగా వాస్తవికతలో లయమైపోయి నపుడు, ఇటువంటి స్థితి కలుగుతుంది. అలా కాకుండా మనస్సు పూర్తిగా తన సత్వత్వంలో లయమైపోవటం జరిగినట్లయితే ఇంక జీవితం ముగిసిపోతుంది. అందుచేత కొంత స్పృహ కలిగి ఉండటం అవసరమని నేను భావిస్తున్నాను.

అమ్మగార్కి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 653

లఖీంపుర్,
28.10.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. తమరు బాగున్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఒక శూన్య లేదా ఖాళీ దశ లేదా స్థానం ఉంది. దీనిని (No World) లేనిప్రపంచం అని చెప్పటం బాగుంటుందేమో. ఎప్పుడైతే లేనిప్రపంచం అంటామో అప్పుడు దానిని (No Word) లేనిమాటగా చెప్పాల్సి ఉంటుంది. డప్పు మ్రోగించినా లేక ఏదైనా పెద్దగా శబ్దం కల్పించినా గాని, శూన్య హృదయాన్ని ఆ శబ్దాలు తాకి తిరిగి వస్తున్నట్లుగా అనిపిస్తోంది. అంతా శూన్యమే. శరీరం మరియు కణకణమూ శూన్యంగానే ఉన్నాయి. స్థితి శూన్య రూపమే దాల్చింది. ఇప్పుడు ఈ శూన్యత్వం కూడా ఎలా ఉంది అంటే, నేను, 'అది' ఒక్కటే అయిపోయినట్లుగా ఉంది. నేను శూన్యం అని వ్రాస్తున్నానంటె అది నన్ను గురించే అన్నట్లుగా ఉంది. తినేది, త్రాగేది అన్ని రుచిలేనట్లుగానే అనగా శూన్యరుచిగానే ఉన్నట్లు అనిపిస్తోంది. అయితే నేను స్థితి యొక్క తేలికదనాన్ని మరియు దాని లోతును

(అగాధాన్ని) పొందలేకపోతున్నాను. నేను ఒక ధరాతలం (భూతలం) లాగా ఉన్నాను. నా స్వరూపం కూడా అదే. అయితే భేదం ఏమిటంటే, శిల అయితే ఘనపదార్థంలాగా ఉంటుంది కాని నాలోని తేలికదనం మరియు సరళత్వం యొక్క అంతుచిక్కటం లేదు. స్థితిని ఇప్పుడు వైరాగ్యం అని చెప్పదగినిదిగా గాను లేదు, ఉదాసీనమైనది అనీ చెప్పదగినదిగాను లేదు. నిర్మలత్వం (Softness) యొక్క అంతు కూడా చిక్కడం లేదు. లోన, బయట అంతటా ఒకే స్థితిగా ఉండి అది కూడా అంతుచిక్కనిదిగా ఉంది.

బాబూజీ, నేను ఇప్పుడు ఎంత చిన్నదానిగా అయిపోయాను అంటే, నాకు అంతా అగాధంలాగానే అనిపిస్తోంది. ఆ అగాధంలో ఏముంది అంటే, 'ఏమిలేదు' (Nothing) అని మాత్రమే చెప్పగలను. నా దశ ఇప్పుడు ఒక ఉల్లిగడ్డ లాగా ఉంది. దానిని పొరలు పొరలుగా చీల్చుకుంటూ పోయినట్లయితే చివరకు 'ఏమీలేదు' అన్నట్లుగానే ఉంటుంది. అయితే ఆ 'ఏమిలేదు' అను దాని మీదనే అన్ని రేకలు ఏర్పడి ఉన్నాయి. కనుక 'ఏమిలేదు' అనేదే నా దశగా ఉంది. నా కణకణమూ ఏమీలేనట్లుగాను అయిపోయాయి. ఒకవేళ ఈ 'ఏమిలేదు' అను దానిమీద ధ్యాస పెట్టినట్లయితే అగాధం (Infinite) లేదా (Unlimited) అపరిమితం అనేదే అనుభవమవుతోంది. ఈ అపరిమితం అను దానిమీద దృష్టి నిల్పినా కూడా ఏమీలేదు అనేదే అనుభవమవుతోంది. ఈ పరిస్థితి ఏమిటో అర్థం కావటం లేదు. అదేమిటో 'మాలిక్'కు గాని, తమకుగాని తెలియాలి. నాకయితే ఏమీ అర్థం కావటంలేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 654

షాజహాన్‌పూర్,
05.11.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీవు అక్టోబరు 28వ తేదీన వ్రాసిన ఉత్తరం అందింది. ఇప్పుడు శ్రీ రాఘవేంద్రరావుగారు గుల్బర్గాలో ఆ (బ్రాంచి) శాఖ యొక్క వార్షికోత్సవం ఘనంగా జరుపుతున్నారు. దక్షిణ భారతదేశంలో నిప్పు మండటం (అనగా సంస్థ ప్రచారం) ఆరంభమైంది. ఇప్పుడు జనమైతే చాలా తక్కువగా వస్తున్నారు. అక్కడ నేను సంవత్సరంలో కనీసం 3 నెలలు ఉండాల్సిన అవసరం ఉంది. డిశంబరు 5 నాటికి నేను దక్షిణ భారతదేశానికి వెళ్తాను. తిరుచునాపల్లిలో ఎమ్.కె. గణేషన్ నడుపుతున్న కేంద్రాన్ని మూసివేయాలని అనుకుంటున్నాను.

అమ్మకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 655

లఖీంపూర్,
31.10.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి వ్రాసిన ఉత్తరం ద్వారా తమ ఆరోగ్యం గురించి తెలుసుకుని సంతోషించాను. ఈశ్వరుడు తమ ఆరోగ్యాన్ని ఇదే విధంగా స్వస్థతగా ఉంచినట్లయితే అందరికీ ఆధ్యాత్మిక లాభం చేకూరుతుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు, సర్వదా నిశ్చలంగాను, స్థిరంగాను ఉన్నట్లు నేను వ్రాసినది మర్చిపోవటమో లేక అనుభవానికి రాకపోవటమో జరుగుతోంది. ఇప్పుడైతే ఉన్న దానిని ఉన్నట్లుగానో లేక ఏమీ లేనట్లుగానో ఉంటున్నాను. నా స్థితి ఎలా ఉందంటే, జీవన్మరణాలు రెండూ ఒక దారిగానే అనిపిస్తున్నాయి. బ్రహ్మానందం (Divine Bliss) మరియు నిరానందం (No Bliss) ఒకే బాటకు చెందినవిగా ఉన్నాయి. ఈ సందర్భానికి తగ్గట్లుగా కబీరు చెప్పిన మాట "కబ్ మరిహాం, కబ్ పాయిహాం పూరన్ బహ్మానంద్" అనగా నేను ఎప్పుడు మరణిస్తానో, ఎప్పుడు పొందుతానో పూర్ణబ్రహ్మానందాన్ని అను మాట స్ఫురణకు వస్తోంది. నేను పూర్తిగా గ్రామీణురాలను, నాకేమి తెలుసు దాని విలువ? మరణించాలో, జీవించాలో కూడా తెలియటం లేదు. నా దశ– "బర్రె ముందు వీణ వాయించినా ఆ బర్రె నెమరు వేస్తూనే ఉన్నట్లు"గానే ఉంది. దానికి జీవితపు విలువ తెలియదు. జీవితం కోల్పోవటం, నిలుపుకోవటం రెండూ ఒక్కటిగానే ఉంటాయి. బాబూజీ, నాకు ఇప్పుడు మహత్తు లేక విశిష్టత అనబడేవి రెండూ లెక్కకు రావని తెలుసుకున్నాను.

ఇప్పుడు లోన, బయట నాకు శూన్యత్వం యొక్క అనుభూతి కూడా కలగటం లేదు. పరిమితి (Limited), అపరిమితి (Unlimited) అను రెండు శబ్దాలు ఒక్కటిగానే అనిపిస్తున్నాయి. చివరలో వ్రాసే మాట 'ఉన్నది' అనేది, కేవలం వాక్యం పూర్తి చేయటానికేగాని మరేమీ కాదు. ఇంకొక యదార్థం ఏమిటంటే, దశ అనేది వ్రాయటానికి ఒక నెపం వంటిది మాత్రమే పురోగమనమైతే ఇప్పుడు పూర్తిగా నిలకడగా ఉంది. ఈ గమనమే కాదు, వ్యవస్థ అంతా కూడా స్థిరంగా ఉండిపోయింది. ఇంకొక తమాషా ఏమిటంటే, ఇప్పుడు స్థిరత్వం, అస్థిరత్వం లేకుండా పోయాయి. స్వరూపమంతా ఉన్నది ఉన్నట్లుగా ఉండిపోయింది. ఇలా ఉన్నది ఉన్నట్లుగా ఉండిపోయింది అని చెప్తే కూడా కొంత భారమే అనిపిస్తోంది. అయినా ఏమీకాదు కాని చెప్పాల్సి ఉంది కనుక చెప్తున్నాను. 'మాలిక్' యొక్క ఉనికిని కూడా మాటమాత్రంగా చెబుతున్నాను, అంగీకరిస్తున్నాను. కాని యదార్థం ఏమిటి అంటే, ఏదైె ఉందో అదే ఉంది. అది దాచాలన్నా దాగటం లేదు. అదేమిటోగాని నాకు ఇప్పుడు పూజను కూడా దాని శ్రీకారం చుట్టలేదన్నట్లుగానే అనిపిస్తోంది. 'మాలిక్' నన్ను చదివిస్తారో, లేదో అది 'అతని'కే తెలియాలి. నాకు ఇప్పుడైతే చదవటంగాని, నేర్చుకోవటంగాని జ్ఞాపకం లేకుండా ఉన్నాయి. 'అతడు' ఏది తలిస్తే అది చేస్తాడు, అంతే.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 656

లఖీంపుర్,
04.11.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉంటుందని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఈ దశ ఏమిటోగాని, నాలో (Receiving Power) గ్రహణశక్తి బొత్తిగా లేకుండా పోయింది. అలాకాదు, (Power) శక్తి అను పేరుతో ఉన్న ఏ వస్తువు కూడా నాలో లేకుండా పోయింది. అంతేకాదు, ఇంతకుపూర్వం తమరు ఏదైతే నా కొరకు చేస్తూ ఉండేవారో, వాటి అన్నింటినీ నేను అర్థం చేసుకుంటూ ఉండేదానను. దానిని తమరే చేస్తున్నట్లు గ్రహించేదానను. కాని ఇప్పుడు నేను అనుభూతినే పొందలేకపోతుంటే ఇంక (Receiving) స్వీకరించేది ఏముంటుంది? నేను పూర్తిగా ఖాళీగా ఉండి పోతున్నాను. నా స్వరూపం (ఐడెంటిటీ) కూడా ఖాళీ అయిపోయింది.

నరనరమూ స్వచ్ఛంగా అయిపోయింది. ఇంకేముంది, నేను పూర్తిగా పవిత్రంగా అయిపోయాను. ఒక పవిత్రుని బాధ, రూపం మరొక పవిత్రవంతునికి మాత్రమే తెలుస్తుంది. బాధ ఏమిటో, ఏమి వ్రాయాలో నాకు తెలియటం లేదు. నేనయితే బాధ లేనిదానిగా అయిపోయాను. నేను ఇప్పుడు రాయినీకాదు, మైనమూ కాను. బయట, లోన అంతటా (Inactive) అచైతన్యమే ఉంటోంది.

'మాలిక్' ప్రేమ యొక్క అపార నిధి చూస్తూ ఉంటే నాలో ఎక్కడ పీల్చుకుపోయిందో తెలియటం లేదు. అభ్యాసీ సోదర సోదరీల ప్రేమ మాత్రమే ఈ రాతి ప్రతిమను తమ ప్రేమ జలంతో తడుపుతూ ఉంది. నా 'మాలిక్' రానున్నారు. కాని నేను ఒక మూగ బొమ్మలాగా సంచరిస్తున్నాను. 'మాలిక్' ఈ బాలిక (కస్తూరీజీ)ను ఎంతసేపు అయితే తమ స్మరణలో నిలుపుకొని  ఉంటారో అంతసేపు మాత్రమే నాలో వారి కలయిక యొక్క ఉత్సాహం నిలిచి ఉంటుంది. ఆ తర్వాత అది ఎక్కడ నుండి వస్తుందో అక్కడే సమాప్తమైపోతుంది. అటువంటప్పుడు నేను సేవా కార్యాలు ఏ విధంగా నిర్వహించగలను. అయితే అన్నీ యాంత్రికంగా జరిగిపోతుంటాయి కాని నాకయితే తెలియదు. కనుక నేను ఇప్పుడు అందరి సేవకురాలను అని చెప్పుకోవటానికి కూడా అవకాశం లేదు. అందుకు తగిన ప్రేరణ కూడా నా అంతరంగంలో కలగటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 657

షాజహాన్‌పూర్,
09.11.1957

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం వచ్చింది. నేను ఇప్పుడు "జీవించు, ఆరోగ్యంగా ఉండు" అని మాత్రమే వ్రాయాల్సి ఉంది. నేను మీ తల్లిగార్ని, నిన్ను అక్కడే ఉంచమని, డాక్టర్‌గారు వెళ్ళమని చెప్పేంతవరకు అక్కడే ఉండనీయమని కోరాను. ఒకవేళ ఉత్సవ సమయంలో కూడా వైద్యం గురించి డాక్టర్‌గారు నీవు అక్కడ ఉంటే బాగుంటందని తలిస్తే, నీవు అక్కడే ఉండు. ఉత్సవానికి రావద్దు.

అమ్మకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 658

లఖీంపూర్,
29.11.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. చదివి చాలా సంతోషించాను. ఇక్కడ కూడా అందరు కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా ఈ దశలో ఎలా ఉందంటే, కృత్రిమత్వం మరియు నకిలీతనం అన్నింటినీ ఎవ్వరోగాని క్రమక్రమంగా పిండేసి, కరిగించి అంతం చేసినట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడింక దశలో కృత్రిమత్వం (కల్పితం) మరియు నకిలీతనం రెండూ లేకుండా పోయాయి. అస్థిత్వమేలేని ఒక యంత్రంలాగా నేను ఉన్నాను. ఈ దశలో నేను స్వతంత్రురాలనుగా

ఉండి కూడా స్వతంత్రురాలను కాను. ఇదంతా ఏమిటో తమకు మరియు తమ నిర్వాకానికే తెలియాలి. నాకయితే 'మాలిక్'తోనే పని ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 659

లఖీంపుర్,
17.12.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు క్షేమంగా చేరి ఉంటారని భావిస్తున్నాను. తమకు దగ్గు బాగా వస్తోంది కనుక ఏమైనా నెమ్మదించిందా లేదా అలాగే ఉందా! దయచేసి నిర్ణీత సమయం ప్రకారం మందులు తీసుకుంటూ ఉండగలరు. ఇక్కడంతా క్షేమమే. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక స్థితిని వ్రాస్తున్నాను.

నా దశ ఎలా ఉందంటే, రాత్రిళ్ళు నిద్ర ఎలా ఉంటున్నదంటే, నిద్రపోతూనే ఉంటాను, అయినా గాని సన్నని స్వరంగాని, తేలికపాటి ధ్వనిగాని చెవులకు సోకుతూనే ఉంది. నా 'మాలిక్' నన్ను పూర్తిగా తనలో నింపుకోవాలనేదే నా ప్రార్థన. ఇప్పుడు అహం యొక్క బీజం దగ్ధమైపోయింది. ప్రేమను అనుగ్రహించినా అనుగ్రహించకపోయినాగాని, తమదే అయిన ఈ వస్తువును తమదిగా స్వీకరించాలి. నా సూక్ష్మ శరీరం లేదా నా ఆంతరిక శరీరం ఒక్కపెట్టున ఒక్క క్షణంపాటు ప్రకాశించి అదృశ్యమైపోయింది. అప్పటినుండి శారీరక వ్యవస్థ యొక్క ముసుగు తొలగిపోయి అంతా పూర్తిగా ఖాళీ అయిపోయినట్లుగా అనిపిస్తోంది. దశ ఎలా ఉందంటే, దానిని స్వచ్ఛంగా ఉన్నదని చెప్పినా, సరళం మరియు మృదువుగా ఉన్నదని చెప్పినాగాని అది తగినదిగా అనిపించటం లేదు. నాలోని ఏదో ఒక వస్తువు హఠాత్తుగా నశించిపోయి అదృశ్యమై పోయింది. ఆ వస్తువు ఏమిటో చెప్పనలవి కాకుండా ఉంది. నేను వ్రాస్తూ ఉండినటువంటి నా స్వరూపం, ఇదే ఆ స్వరూపమా లేక ఇలా అయిపోయిందా అన్నట్లుగా ఉన్నా కూడా అది కూడా ఇప్పుడు అంతర్ధానమై పోయింది. ఇంక చెప్పటానికి నా దగ్గర ఏమీలేదు. ఈ దశ ఏమిటో ఖచ్చితంగా చెప్పాలంటే, తమకు అర్థమయ్యేలా ఎలా వ్రాయాలో నాకు తెలియటం లేదు.

ఇప్పుడు తేలికదనం కూడా నాలో లేకుండా పోయింది. ఎందుకంటే, ఇది కూడా చెప్పనలవి కావటం లేదు. నిజం చెప్పాలంటే, ఇప్పుడు దశను గురించి తేలికదనమని, సరళమని లేదా పవిత్రమనిగాని ఏమి వ్రాసినా కూడా అది కృత్రిమమైనదిగా వ్రాసినట్లు అవుతుంది. స్థితిలో ఎటువంటి విశేషమూ లేదు. ఇంకా ఏది వ్రాసినా కూడా నకలుగానే నాకు అనిపిస్తోంది. అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 660

లఖీంపుర్,
20.12.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ఉత్తరం ద్వారా తమ ఆరోగ్యం కొంతవరకు బాగానే ఉందని చదివి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి, అర్థం చేసుకొన్నది అంతా

వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఉన్న దశ ఎటువంటిది అంటే, నిద్ర మేల్కొంటున్నపుడు కళ్ళు విప్పుకొని చూస్తున్నాను. అయినా కూడా ఏమవుతున్నదంటే, ఎవ్వరైనా నా ఎదుట ధ్వని కల్పించినా కూడా నాకు వినిపించటం లేదు. పూర్తిగా ఒక (Blank) శూన్యం మరియు (Innocent) అమాయకమైన దశ నా స్వరూపంగా అయిపోయింది. నేను ఏ తప్పుచేయనిదానిగా కూర్చొని శూన్యత్వాన్ని నిరీక్షిస్తూ ఉన్నట్లు తరచుగా నా కన్నులలో వ్యాపించి ఉంటోంది. దానిని నేను శూన్యంలో కూర్చుండిపోయి శూన్యాన్నే నిరీక్షిస్తూ నన్ను కోల్పోతున్నాను అంటె సమంజసంగా ఉంటుందని అనుకుంటాను. ఇటువంటి స్పృహ లేదా చైతన్యం ఎక్కువగా రాత్రిపూట నిద్రిస్తూ ఉంటున్నప్పుడుగాని, పగలు ఎప్పుడైనా కుదుపు వంటిది కలిగినప్పుడుగాని అనుభవమవుతుంది. ఇదే నా దశ యొక్క ముఖ్యాంశంగా అయినట్లు అనిపిస్తోంది. నా ఉద్దేశ్యంలో (Blank) శూన్యం అంటె పూర్తిగా (Empty) ఖాళీ అని కాదు, కాని నా (Definition) పరిభాషలో అది స్వయంగా ఏకాంతమే అవుతుంది. స్వయంగా 'అతడు' ఒక్కడే. 'అతని' గురించి చెప్పాలంటే, ఇంకా ఉంది, ఇంకా ఉంది (నేతి, నేతి) అని చెప్పవచ్చు. (Infinite) అనంతం అనేది 'అతని' (Limit) హద్దు అని చెప్పాలి. నమ్రత యొక్క ప్రభావం కూడా దానికి వెనకబడిపోయింది. ఇప్పుడు ఉన్న దశ ఎలాంటిది అంటే, దానిని సత్యమన్నా, అసత్యమన్నా దానిలో దేని స్పర్శ అయినా రవ్వంత మాత్రం కూడా లేదు. అది అన్నింటికి అతీతమైనది, అంటరానిది. ఎందుకంటే, దానిని ఇప్పుడు ఏదీ తాకలేదు కూడా. అది ఈ విధంగా అనిపిస్తుంది. సాధారణంగా యోగి యొక్క ప్రాణం వెడలిపోయే సమయంలో, శిరస్సులో ఒక రంధ్రం ఏర్పడి దాని ద్వారా వెడలిపోతుందని అంటూ ఉంటారు. కాని నేను గమనిస్తున్నది ఏమిటంటే, శిరస్సులో పాపిటికి సూటిగా ఒక గుంట ఏర్పడి ఉంది అని. అదేమిటో నాకయితే తెలియదు. దానిని తమరే చెప్పగలరు.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 661

లఖీంపుర్,
26.12.1957

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. అక్కడ తాము అందరూ కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఈ దశలో ధ్యానం యొక్క ధ్యాస కలగ్గానే మనస్సు గాబరా పడుతోంది. స్థితి అనేది మనస్సు యొక్క ఊహకు మించిపోయింది. ఒక ధార ఏకధాటిగా, ఆటంకం లేకుండా ఉన్నటువంటిది నిరంతరం ప్రవహిస్తూ ఉంది. దాని గమనం సమానంగా ఉంది. ఎందుకోగాని శ్వాసలో కొంత భారంగా ఉంటోంది. ఇప్పుడు వీపు వెనుక ఉండు ఆధ్యాత్మిక ప్రపంచం అంతా నా హస్తగతంగా ఉన్నట్లు ఉంది. కాని దానిపట్ల విరక్తిగానే ఉంది. ఈ నిత్యం నేను చూస్తున్నది ఏమిటంటే, అఖండమైన దశలో మనస్సే ఒక దశగా మారి అంతర్లీనమైపోయింది. ఎందుకంటే, ఇప్పుడు నిద్రలో కాని, మేల్కొని ఉన్నాగాని మనస్సు అనేది ఉన్నట్లే అనిపించటం లేదు. అదేమిటో తెలియదు. ఇప్పుడు ధ్యానంలో దశను గ్రహింపుకు తెచ్చుకుంటున్నప్పుడు మనస్సు నిర్బంధించబడి వ్యాకులత చెందుతోంది. ఇది పూర్తిగా (Simple and Innocent) సాదా మరియు అమాయక దశ. మహా శూన్యతయే నా రూపంగా అయిపోయింది.

ఇప్పుడు శక్తి మరియు ప్రయత్నం లేకుండానే ఒక విలక్షణమైన క్షేత్రంలో ఈదుకుంటూపోతున్నాను. అదేమిటోగాని మెడకుపైన మరియు శిరస్సు వెనుక ఒక నొప్పివంటిది ఉంటోంది. నా నరనరాల్లోను ఒక విచిత్రమైన విలక్షణత (Pecularity) వ్యాపించి ఉంది. అప్పుడప్పుడు ఆ నొప్పి తీవ్రంగా ఉంటోంది. కాని దశ వెనుక ఒక అజ్ఞాతమైనది ఏదో వ్యాపించి ఉన్నట్లుగాను, అది పూర్తిగా రూపం దాల్చనట్లుగాను ఉంటోంది. అది ఏమిటా అని దృష్టిని వెనక్కు మళ్ళించి చూసినట్లయితే అది (Mastery) ఆధిపత్యంలాగా అనిపిస్తోంది. కాని దానిమీద కూడా ఏదో వ్యాపించి ఉన్నట్లుగా అనిపిస్తోంది. అయినా కూడా ఎదుట మైదానం మరియు గాలి విస్తరించి ఉన్నట్లు అనుభవమవుతోంది. ఇప్పుడు విషయం ఏమిటంటే, ఏ కారణంగానైతే అన్ని దశలు వ్యాప్తమయ్యాయో, ఇప్పుడు దశలు లేకుండా కేవలం కారణమే నిలిచి ఉంది. అలా కాదనుకుంటే, మహా శూన్యతయే ముందు–వెనుక, బయట–లోపల, నరనరాల్లో వ్యాప్తమైపోయింది అని చెప్పవచ్చు. ఇప్పుడు జడత్వమే (అచైతన్యమే) నా రూపంగా అయిపోయింది. అయితే ఈ ఎండిపోయిన జడత్వంలో కూడా నేను నిమగ్నమై ఉన్నాను. ఎటువంటి మహా శూన్యత్వం వ్యాపించి ఉన్నదంటే, దానిలో శబ్దంగాని, నిశ్శబ్దంగాని మిగిలి ఉండలేదు. ఇప్పుడు అన్ని దిక్కులా నిర్మలమైన నూతనమైన క్షేత్రమే ప్రత్యక్షంగా ఉంది. ఇప్పుడు నా కణకణంలో ఒక (Pecularity) విలక్షణత వ్యాపించిపోయింది. ఎందుకంటే, ఇక్కడ వ్యాపించి ఉన్నది అటువంటి క్షేత్రమే కనుక. ఈ నూతన క్షేత్రంలో పూర్తిగా (Simplicity) సామాన్యతయే వ్యాపించి ఉంది. ఒక (Innocent condition) అజ్ఞాన దశయే నిత్యం నాలో సరిసమానంగా ప్రవహిస్తూ ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 662

లఖీంపుర్,

9.01.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమవద్ద నుంచి చాలా రోజులుగా ఒక్క ఉత్తరమూ రాలేదు. దాని మూలంగా తమ కుశల సమాచారం కూడా తెలియని కారణంగా చింతిస్తున్నాను. దయచేసి తమను గురించిన సమాచారం త్వరగా తెలియజేయండి. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఎటువంటి (Uncovered) ముసుగులేని దశ ఉందంటే, దానిని ఎటువంటి ముసుగుతో కూడా దాచటానికి వీలుపడనిదిగా ఉంది. ఇప్పుడు ఒక విచిత్రమైన పీల్చుకొను స్వభావం మరియు సరళమైన సామాన్యతయే వ్యాపించిపోయింది. ఒక (Pecularity) అద్భుతమైన విలక్షణత్వమే నా నరనరాల్లోను, బయట–లోపల కణకణాల్లోను వ్యాపించిపోయింది. దానిలో (Mastery) ఆధిపత్యమే వ్యాపించి ఉంది. ఇప్పుడు నా దశలో, నేను అదృశ్యమైపోతూ ఉండగా నా 'మాలిక్' కూడా కనుమరుగైపోవటమేగాక 'అతడు' కూడా అదృశ్యమైపోయినట్లుగా ఉంది. ఈ దశ ఇలా ఉంది:

**నిజ కొ గఁ వాయా రోయ్‌కర్, పియా గఁవాయా హాఁ సి।**

**ఘర్–బాహర్ అంధియారా మా, ఉడతీ బుర్ఖుతీ సాఁ సి॥**

అనగా, నేను విలపిస్తూ నన్ను కోల్పోయాను, నవ్వుతూ నా ప్రియుని కోల్పోయాను. నా ఇంటా బయటా అంధకారం వ్యాపించి ఉండగా దానిలో నేను ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో శ్వాస జరుపుకుంటున్నాను, అని.

ఆధిపత్యమైతే (Mastery) వ్యాపించి ఉంది, కాని ఇప్పుడు (Spiritual Power) ఆత్మిక శక్తి మరియు (Will-Power) ఇచ్ఛాశక్తి కూడా విలీనమైపోయినట్లుగా ఉంది. వాయువుకు కూడా ప్రవేశం లేనటువంటి మైదానం ఎదుట

ఉండగా ఇంక ఆధిపత్యం (Mastery) ఏమిటి మరియు అధిపతి (Master) ఎవరు? ఇది ఖాళీది, చదరం, సాదా మరియు ఊసరమైనటువంటి దశగా ఉంది. మహా శూన్యతయే దాని చుట్టూరా వ్యాపించి ఉందనిగాని లేదా దాని ఇల్లు అనిగాని, ఇంకా చెప్పాలంటే, మహా శూన్యతే దాని ముసుగు అని చెప్పవచ్చునుగాని దశ మాత్రం దానిని కూడా తాకనట్లుగా ఉంది. అది తనలోనే నిమగ్నమై ఉంది. ఎటు చూద్దామనుకున్నా గాని లేదా మెడ వంచుదామనుకున్నాగాని అందుకు తగిన తీరిక ఎక్కడ ఉంది? ఒడ్డుకు చేరిపోయాను. ఇంక గడ్డిపోచంత ఆధారం మాత్రం ఎందుకు అనిపిస్తుంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 663

లఖీంపుర్,
20.01.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి వ్రాసిన ఉత్తరం ద్వారా తమ సమాచారం తెలిసింది. తమకు కొంత మేలు జరిగిందని, శ్వాసపరమైన ఇబ్బంది కూడా తక్కువగా ఉందని తెలిసి సంతోషమైంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశ ఎటువంటిది అంటే, పూజ చేయటానికి కూర్చుంటూ ఉంటే, నా లోపలి చక్రాలన్నీ సమాప్తమైపోయినట్లుగా ఉంది. హృదయంలోకి ప్రాణాహుతి ధార కొనసాగుతూ ఉంది. హృదయం కూడా కరిగి, అంతమైపోయి, ఏమీ మిగలకపోతే ఇంక ఎలా దృష్టి పెట్టాలి. ఎముకలు అన్నీ కరిగిపోయి అంతమైపోయాయి. భారం అనిపించేటటువంటిది ఏదీ కూడా ఇప్పుడు నా లోపల, బయట లేదా శరీరంలోను లేకుండా పోయింది.

శ్వాస ఎంత తేలికగా ఉందంటే, దాని ఆగమన నిర్గమనం కూడా తెలియనంతగా ఉంది. ఇదంతా ఏమిటో మరి, అది తమకే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 664

లఖీంపుర్,
31.01.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ కుశలమే. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఎలా ఉన్నదంటే, శిరస్సు వెనుక, మెడ భాగానికి పైన, ఒక పాయింట్ మీద ఒక అగ్నిపర్వతం వంటిది ఏదో పైకి పెల్లుబుకటానికి వత్తిడి చేస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఎప్పుడైతే శిరస్సులో పాపిడికి సూటిగా గుంట వంటిది ఏర్పడిందో, అప్పటినుంచి శిరస్సుపై నిలిపి ఉంచిన ఆ ఐదు వ్రేళ్ళతో కూడిన హస్తం తొలగిపోయినట్లుగా అనిపించింది. నా దశ ఎలా ఉందంటే, నేను పూర్తిగా జడత్వంలాగా లేదా అచైతన్యంగా ఉండి కూడా పనులన్నీ

జరిగిపోతున్నాయి. విలాపం, నవ్వు అన్నీ యథాతథంగా జరిగిపోతున్నాయి, కాని ఇంకనూ కొయ్యలాగా లేదా జడత్వందాల్చి ఉండటంతో ఏదీ తక్కువ కాకుండా (Balanced State) సామ్యావస్థలోనే ఉంటోంది. దానిలో ఎప్పుడూ నిదానంగాని, వేగంగాని సంభవించటం లేదు, ఉన్నది ఉన్నట్లుగానే ఉంటోంది.

మొన్న రాత్రి అకస్మాత్తుగా ఒక స్వరం లాంటిది– ఇప్పుడు మరణించటానికి కూడా అవకాశం లేదు అన్నట్లుగా వినిపించింది. **తరచుగా రాత్రిపూట స్వప్నంలో ఎన్నో పవిత్రాత్మలు నా మీద పుష్పవర్షం కురిపిస్తున్నట్లుగా అనిపిస్తోంది. అవి సరిగ్గా పూలు కాకపోయినా ఏదో వర్షిస్తున్నట్లుగా మాత్రం ఉంది. అప్పుడప్పుడు నా గురించి ఏదో గుసగుసలాడుతున్నట్లు అనిపిస్తోంది. నిద్రలేచాక ఈ కలలో మాటల వంటివి వాస్తవమేనని తెలుస్తోంది.** నాకు జడ చైతన్యాలు రెండూ సమానార్థక శబ్దాలుగానే అనిపిస్తున్నాయి.

ఇంతకుపూర్వం నేను, నా 'మాలిక్' శరీరాలు రెండుగాను, ఒకే ప్రాణంగాను అనిపించేది. కాని ఇప్పుడైతే శరీరాలు కాని, ప్రాణాలు కాని అనుభవం కావటం లేదు. ఇంతకుముందు నేను సమస్త ప్రపంచం నాకు అచేతనమైనదిగా అనిపిస్తున్నట్లు వ్రాశానుగాని ఇప్పుడైతే అటువంటిది ఏమీ అనుభవం కావటం లేదు. ఇప్పుడు ప్రపంచం లేదు, అనుభవం లేదు, అంతమైనది లేదు, అంతంకానిది లేదు. ఏదైనా ఉన్నదంటే, అది అంతులేనిది అనగా అనంతం, మరైతే దాని అనుభవం లేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 665

లఖీంపుర్,
11.02.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు తావూజీని ఉద్దేశించి నారాయణ దద్దా ద్వారా పంపించిన ఉత్తరం చేరింది. సమాచారం తెలిసింది. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఒక విచిత్రమైన స్థితిగా ఉంది. అన్నివైపులా ఎటుచూసినా ఆశ్చర్యమే ఆశ్చర్యంగా ఉంది. సాకారం, నిరాకారం (రూపం, రూపం లేకుండా ఉండటం) అనేవి తప్పుగాను లేదా భ్రమగాను అనిపిస్తున్నాయి. అసలు నేను ఏమి వ్రాయాలో కూడా తెలియటం లేదు. పూజ ప్రారంభించక పూర్వం ఏ దశ అయితే ఉండేదో అదే ఇప్పుడు నా నివాస స్థానంగా అయిపోయింది. అదే నా స్వరూపంగా అయిపోయింది. ఆధ్యాత్మికోన్నతి లేదా ఉన్నతి లేకపోవటం అనేవి రెండూ నాకు సమానంగానే ఒకే అర్థంగా అయిపోయాయి. 'మాలిక్' నా పురోగతిని నాలో ప్రేరేపించినట్లయితే దానివలన ముందుకు సాగిపోతాను. 'అతడ్ని' కలవటానికి ఎందుకోగాని 'మాలిక్' నాకు చిక్కటం లేదు. నేను ఇప్పుడు ఒక స్థానంలో కూర్చుండిపోయాను. బహుశా ఎప్పుడైనా 'అతడు' దయతో వస్తూ పోతూ కలుస్తాడేమో. అయితే ఎక్కడ కూర్చుండి ఉండాలో అనగా ఆదిలోనా, అంతంలోనా లేక మధ్యలోనా అనేది తెలియటం లేదు.

అందరూ 'బాబూజీ', 'బాబూజీ' అని చెప్తూ ఉంటారు, కాని 'బాబూజీ' ఎక్కడ ఉన్నారు, ఎలా ఉంటారు అని ఎవ్వరైనా చెప్పాలి. ఎవ్వరైనా 'నేను' బాబూజీని కలిసి వస్తున్నాను అని, అన్ని విషయాలు చెబుతూ ఉన్నట్లయితే అవి నాకు కల్లబొల్లి మాటలుగాను, కల్పితంగాను అనిపిస్తున్నాయి. ఎందుకంటే, ఎవ్వరైనా, ఎప్పుడైనా 'బాబూజీ' వద్దకు చేరుకున్నాగాని, మళ్ళీ అతడు నాకు చెప్పటానికని తిరిగివస్తాడా, అలా రావటం సంభవమేనా అనిపిస్తుంది. నేను కూడా మనస్సులో 'బాబూజీ', 'బాబూజీ' అని జపిస్తున్నాను అంటే అవన్నీ పైపై మాటలే (అనగా కృత్రిమమైనవే). అవి

ఎందుకోగాని మనస్సులోపల వాస్తవంగా అనిపించటం లేదు. మనస్సుకు హత్తుకోవటమూ లేదు. ఇప్పుడు అంతా నిశ్శబ్దమైపోయింది. అనగా జీవన్మరణాలు, శాంతి–అశాంతులు, తపన, కలత (ఆవేదన) మరియు మార్గం కూడా అన్నీ మౌనంగా ఉండిపోయాయి. ఏ వస్తువో తెలియదు కాని, అది ఒక పరదా లేదా ముసుగు వంటిది చేబూని నా స్థితిని శాశ్వతంగా కప్పి ఉంచే ప్రయత్నంలో నా స్థితి మీద ఉంటున్నట్లుగా అనిపిస్తోంది. అయినప్పటికి ఎప్పుడైనా 'మాలిక్' కల్పించిన స్పృహ మాటిమాటికీ ఆ పరదాను తొలగించి నాకు ఏదైనా ఇచ్చి వెళ్ళినాగాని నేను మళ్ళీ మళ్ళీ అలాగే అయిపోతున్నాను. ఇదంతా ఏమిటో అర్థం కావటం లేదు. నేను 'మాలిక్' ఇచ్చినటువంటి దానిని ఎందుకు సమీకరించుకోలేకపోతున్నాను? కొంతసేపు అయినా నేను దానిని (మాలిక్ ఇచ్చిన దానిని) సంరక్షించుకోలేక పోతున్నాను. 'మాలిక్' ఎంతసేపు అయినా ఆఖరికి ఒక్క క్షణంపాటు అయినా దేనినైనా ఇస్తే క్షణకాలంలోనే నేను దానిని పొందుతున్నాను. అయితే నేను గమనించినది ఏమిటంటే, దేనిలోనైతే నేను ఆ క్షణకాలమైనా లయమై ఉంటున్నానో అదేమీ లేనేలేదు అని. ఎందుకంటే, ఏదైనా ఉండి ఉంటే అది నాలో లయమై ఉండేది. కాని నేను స్వయంగా దానిలో లయం కాలేకపోతున్నాను. ఎవరైనా పరదా తొలగించి 'అతని'తో ఒక్కటిగా చేసినా గాని, మళ్ళీ నాకు 'అతని' జ్ఞాపకమే ఉండటం లేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 666

లఖీంపుర్,

28.02.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఈ రోజు హరిదద్దా ద్వారా అక్కడి సమాచారం తెలిసింది. తమరు ఆరోగ్యంగా ఉండాలన్నదే ఈశ్వరునితో నా ప్రార్థనగా ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, శ్రీ బాబూజీ యొక్క కణకణం కరిగిపోయి నా శరీరం అంతటిలోను లయమైపోతున్నట్లుగా అనిపిస్తోంది. అది ఆగిపోవటం లేదు. ఈ ప్రవాహమే కొనసాగుతున్నట్లుగా ఉంది. కాని నా ఆంతరికం మరియు సూక్ష్మత్వం ఇప్పుడు ఏమీ లేకుండా పోయాయి. ఇప్పుడు ఈ స్థూల శరీరంలోనే 'వారి' కణకణాలన్నీ లయమై అదృశ్యమైపోతున్నట్లుగా ఉంది. ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, నాకు ఆధ్యాత్మికత లేక ప్రాపంచికత రెండూ సమానమైన అర్థం కలిగినవిగానే అనిపిస్తున్నాయి. (Especiality) విశేషత మరియు (Greatness) మహనీయతకు చెందిన వస్తువు ఏదీ కూడా నా గ్రహింపుకు రావటం లేదు. వాస్తవానికి అవన్నీ అర్థంలేనివిగాను, విలువలేనివిగాను నాకు అనిపిస్తోన్నాయి. ఎందుకోగాని నాకు ఏ భ్రమ కలుగుతోంది అంటే, నేను ఒక అశ్వంగా అయిపోయి, 'మాలిక్' నా మీద సవారీ చేస్తున్నట్లుగాను, అయినా గాని ఏమీ బరువు లేనట్లుగాను, ఇంకను 'అతడు' హూఁ హూఁ అంటూ తరచుగా నాపై హుంకరిస్తున్నట్లుగాను ఉంది. ఇది ఏమిటో నాకేమీ అర్థం కావటంలేదు. ఇంకొకటి ఏమిటంటే, నేను (Divine glow) అలౌకికత్వాన్ని (దివ్యకాంతి) నా కణకణంలోను లయమైపోయినట్లుగా చూశాను. ఇప్పుడు (Worldly) లౌకికత్వం మరియు (Divine) అలౌకికత్వం నాకు చెప్పటానికి రెండూ సమాన శబ్దాలుగానే ఉంటున్నాయిగాని అన్యత్రా ఇంకేమీ కాదు. ఎటువంటి (Divinity) దివ్యత్వంగాని, (Greatness) మహనీయతగాని, (Especiality) విశిష్టతగాని, పూజలోగాని, 'మాలిక్'లోగాని ఇంకను నాలోగాని లేనట్లుగానే ఉంది. ఇప్పుడు ఉన్న దశలో ఎడారి కూడా ఎడారిగా లేదు, ఇంకొక రకంగా చెప్పాలంటే, ఆ ఎడారియే నా స్వరూపంగా

అయిపోయినట్లుగా ఉంది. అయితే దాని మీద మృత్యువు వంటి మౌనం ఆవహించి ఉంది అని చెప్పాలి, కాని ఇప్పుడు మృత్యువు కూడా మృత్యువు కాదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 667

లఖీంపుర్,

05.03.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. తమ ఆరోగ్యం ఇప్పుడు బాగుందని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా ఈ దశలో, నేను ఒక వృత్తంలో పూర్తిగా లయమై ఉన్నాను. దాని రంగు రాగి వర్ణంలాగ ఉంది. ప్రతి మానవుడు నాకు ఒక అవతారశక్తిగా అనిపిస్తున్నాడు. వారు జనన మరణాలు లేనివారుగాను, స్వయంగా కనిపిస్తున్నట్లు ఉన్నవారుగాను అనిపిస్తోంది. అయినప్పటికీ జన్మించినమీదట కొంత సంతోషం మరియు మరణించిన మీదట కొంత విచారంగాను తప్పకుండా అనుభవమవుతోంది. ఇది అంతా ఆలోచనాపరంగానే అయినప్పటికీ నేను ప్రతిదానితోను అనగా ప్రతి సందర్భంలోనూ వినమ్రంగా శిరస్సు వంచియే ఉన్నట్లుగా అనిపిస్తోంది. అయితే నేను అవతారకశక్తి వ్యాపించి ఉన్నది అని వ్రాసింది ఏదైతో ఉన్నదో అది పూర్తిగా నాకు తెలియనిదిగా ఉంది. ఎందుకంటే, శక్తి అనేది కేవలం నాకు ఒక ప్రయోగపూర్వక శబ్దంగానే ఉండిపోయింది. దానిలో ఎటువంటి భారంగాని, ప్రకాశంగాని, మార్గంగాని లేవు. నేను కేవలం ప్రాపంచికంగా ఉంటున్న మనిషిని మాత్రమే. ప్రపంచమే ఏమిటి, సమస్త సృష్టి, ప్రకృతి మరియు పరమాత్మ లేక ఆత్మ, జీవుడు లేక బ్రహ్మ –ఇవన్నీ ఏవో కొన్ని గ్రంథులుగా ఉన్నటువంటి వాటిని 'మాలిక్' శుభ్రంచేసి వేశాడు. వీటిని గురించి ఎటువంటివి నా మైండ్ ప్రశ్నించటం లేదు. ఇతరుల ద్వారా వీటిని విన్నా కూడా మనస్సు మొగ్గుచూపటం లేదు. ఇవన్నీ నాకు వ్యర్థమైన మాటలుగా అనిపిస్తున్నాయి. వాటిని నేను అర్థం చేసుకోలేకపోతున్నాను కూడా. ఇప్పుడు నా కోసం ఎటువంటి విషయాలు అనగా ప్రశ్న, జవాబు, సమస్యలు ఏమీ లేకపోయాయి. అందుచేత ఏదైనా వ్రాయవలసివస్తే కష్టమవుతోంది. ఏమి వ్రాయాలన్నా, ఏ ఆలోచనలూ రావటం లేదు. అసలు ఏమీ లేకపోతే ఇంక వ్రాసేది ఏముంటుంది. ఒకవేళ ఏదైనా వ్రాసినా కూడా దానిని చదువుతూ ఉంటే అంతా శూన్యంగానే అనిపిస్తోంది. ఇంతకు పూర్వమైతే, సంకల్పం చేసినంత మాత్రాన్నే అన్ని విషయాలు మరియు వాటికి సంబంధించిన మాటలు స్వయంగానే నాలో ధారాపాతంగా వస్తూ ఉండేవి. కాని ఇప్పుడైతే అన్నీ మృత్యువు యొక్క మృత్యువులాగా మౌనందాల్చి లోన, బయట వ్యాపించి ఉంటున్నాయి. నేను ఇంతకుపూర్వం చైతన్యలేమిలో కూడా ఒక రకమైన చైతన్యం కలిగిందని వ్రాశాను, కాని ఇప్పుడైతే అటువంటిది ఏమీ లేదు. ఇంకేముంది, నేను ఇప్పుడు ఒక సాధారణ ప్రాపంచిక మానవుని మాత్రమే. ఇంతేకాకుండా, మనస్సులో ప్రియతముడైన 'మాలిక్' స్మరణ అయితే ఉంటోంది. కాని అది కూడా నాలాగే ఉంటున్నట్లు అనిపిస్తోంది. ఇదంతా ఏమిటో నాకు అర్థం కావటం లేదు. బహుశా ప్రేమ లోపమేమో.

**సూచన:** ప్రకృతికిమించి ఉన్న ఆనందంలో వత్తిడి ఉండదు. అందుచేత మనస్సు దాని అనుభూతిలో ఉంటూ ఉండి కూడా దాని పరిధి దాటియే ఉంటుంది. దశలో ఉండి కూడా దానిని అతిక్రమించి ఉన్నట్లుగానే అనిపిస్తుంది. ఎప్పుడైతే మనం ప్రకృతిని అధిగమించి ముందుకుపోతామో అప్పుడు ఆనందం యొక్క స్వరూపం

మారిపోతుంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 668

షాజహాన్‌పూర్,
12.03.1958

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఆధ్యాత్మిక స్థితి అయితే బాగానే ఉంది. దిగులంతా నీ ఆరోగ్యం గురించియే. నీవు మిషన్‌కొరకు పని చేయగలగడానికి దైవం నీకు ఆరోగ్యాన్ని అనుగ్రహించాలి. ఏ స్థానం నుంచి నయితే (Super Mind) ఈశ్వరీయ మనస్సు యొక్క ప్రభావం పడుతూ  ఉంటుందో, అట్టి స్థానానికి అభ్యాసి చేరుకున్నపుడు అతనికి శూన్యత అనుభవమవుతుంది. దానిలో కలిసి మమేకమైపోయినప్పుడు, దాని నుండి అతనికి (Subtle condition) సూక్ష్మగతి యొక్క సమాచారం అందుతుంది. ఆ విధంగా కలిగే సూక్ష్మస్థితి ఎటువంటిది అంటే, దానిని మాటల్లో చెప్పాల్సివస్తే, అక్కడ ఎప్పుడో ఒక దీపం వెలిగించబడి దాని కాంతి అంతటా వ్యాపించి ఉన్నదని అనిపించేట్లుగా ఉంటుంది. ఆ స్థితిని దేనితో పోల్చవచ్చును అంటే, ఒక కాంతి యొక్క ప్రభావం, తర్వాత అది దాని ప్రభావం చూపకుండా పోయినపుడు ఎటువంటి సన్నివేశం ఏర్పడుతుందో అప్పుడు దానితో పోల్చవచ్చు. అటువంటి అనుభూతి అతనికి కలుగుతుంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, మిణుకు మిణుకుమంటూ వెలుగునిస్తూన్న ప్రాతఃకాల దీపం ఆరిపోబోతున్నపుడు ఎలాంటి దృశ్యం ఆవిష్కరించబడుతుందో, అదేరకంగా ఉంటుంది. అనగా మనిషి మనస్సులో సందేహం కలిగినపుడు ఎటువంటి పరిణామం కలుగుతుందో, అది కూడా అలాగే ఉంటుంది. తమ మహిమను చూపిన తర్వాత చక్రాలు తమ పని ముగించి ఉన్నతిని కల్పిస్తాయి. దీని తర్వాత (సెంటర్లు) కేంద్రాలు మాత్రమే ఉంటాయి. అవి ప్రకృతి రహస్యాలను బహిర్గతం చేస్తాయి.

సహస్రదళ కమలం (శిరస్సు) మీద చేతి ఐదు వ్రేళ్ళు ఉంచినప్పటికీ స్పర్శ తెలియటం లేదు అంటే, నా సహాయం స్వల్పంగా మాత్రమే అవసరమవుతుందని అర్థం. నా పనిని ఎక్కువగా ప్రకృతియే చేస్తోంది. అభ్యాసీలో లయ–అవస్థ సూక్ష్మస్థితిలో జరిగినపుడు అతని లోపల, బయట నిశ్శబ్దం వంటిది వ్యాపించి ఉంటుంది.

ఎప్పుడైతే ప్రతిదాని యొక్క అనుభూతి జరిగిపోతోందో లేదా ముగిసిపోతోందో, అప్పుడు అభ్యాసి యాత్ర వాస్తవికతలో (రియాలిటీలో) ప్రారంభమైనట్లు గ్రహించాలి. ఆ తర్వాత ఇంకా ఏదో ఉన్నది. ఆ ఉన్నది ఏమిటంటే, అక్కడ ఉన్న అణువులన్నీ కరిగిపోయి, వాటి వాస్తవిక అస్థిత్వాన్ని (Real Identity) కోల్పోవాలి. **నీవు కూర్చుని ఉన్నా, లేదా పండుకుని ఉన్నా సరే, నీ ఇచ్ఛాశక్తిని ప్రయోగించి నీ వ్యాధులన్నీ తొలగిపోతున్నట్లుగాను, నీవు ఆరోగ్యవంతంగా అవుతున్నట్లుగాను నీ దృష్టి నిలపాలి. ఇప్పటివరకు నీవు ఎప్పుడూ నీ ఆధ్యాత్మిక శక్తి ఎటువంటిదో ప్రయోగించి ఉండలేదు. ఒక రాతిమీద నీ ఇచ్ఛాశక్తిని కేంద్రీకరించినట్లయితే అది ముక్కలు ముక్కలైపోయేటంత శక్తి నీలో ఉంది. పర్వతాలు, పృధ్వి ఊగిసలాడిపోగా లేనిది, నీ జబ్బు ఒక లెఖ్ఖా!** అమ్మగార్కి ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 669

లఖీంపుర్,
14.03.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి తమరు వ్రాసిన ఉత్తరం చేరింది. తమ సమాచారం తెలిసింది. నా ఆరోగ్యం బాగానే ఉంటోంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆధ్యాత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, నా లోపల, బయట కణకణం అన్నింటిలోని దివ్యత్వాన్ని లేదా అలౌకికత్వాన్ని ఎవ్వరో పూర్తిగా పీల్చివేసి పూర్తిగా ఎండిపోయినదానిలాగా వదిలివేసినట్లు అనిపిస్తోంది. భోజనంలో ఉప్పులేనటువంటి దశ ఇది. ఒకసారి తమరు నాకు దివ్య జ్ఞానం (Divine Wisdom) గురించి, అది నాలో ఉన్నట్లుగా వ్రాశారు. కాని ఇప్పుడు దశ ఎలా ఉందంటే, నా లోన, బయట, కణకణం నుంచి దివ్యత్వాన్ని ఎవ్వరో పిండేసినట్లు అనిపిస్తోంది. నేను ఇప్పుడు పూర్తిగా ఒక సాధారణ వ్యక్తిలాగానే ఉన్నాను. ఈ దివ్యహారం ఎప్పుడు తెగిపోయి అంతమైపోయిందో తెలియదు. నేను ఇప్పుడు ఏమీ తెలుసుకోలేకపోతున్నాను. ఇంతకుపూర్వం నేను ఏదైతే సాధారణ మాటా-మంతీ రోజంతా మాట్లాడుతూ ఉండేదానినో, ఏదైతే వ్రాస్తూ ఉండేదాననో అవి నాకు దివ్యత్వానికి లేదా అలౌకికత్వానికి చెందినవిగా అనిపించేవి, కాని ఇప్పుడు ఏమైందో ఏమో కాని 6 లక్షల ఇల్లు బూడిదైపోయింది. (దీనిని షడ్గుణాలుగా చెప్పవచ్చునేమో!)

అంతేగాకుండా, ఇప్పుడు ఏమైందో ఏమోగాని స్వయంగా లోపల, బయట ఆ ఎడారి కూడా లేదు. కాని నేను ఎక్కడికి వెళ్ళితే అక్కడ ఆ ఎడారితనం లేదా నిర్జనత్వం వెల్లివిరుస్తూ ఉంటుంది. అలాకాకపోతే, మృత్యువు వంటి నిశ్శబ్దం వ్యాపిస్తుంది నేను ఎక్కడికి వెళ్ళితే అక్కడ. ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నేను స్వయంగా ఈ విషాద వాతావరణం నుంచి కూడా దాటిపోయాను. ఎందుకంటే, అది నన్ను తాకలేదు కూడా. నా దశ ఇటువంటిదే:

**"ప్రాప్తలేయి జొ నామ్ హమారా। తాహి న తేహి దిన్‌మిలె అహారా॥"**

అనగా ఎవ్వరైతే ఉదయం నా పేరు తలుస్తారో, వారికి ఆ రోజంతా ఆహారం దక్కదు, అని భావం. అనగా ఇది అపవిత్రతకు ఒక సంకేతం వంటిది.

ఈ దశలో ఇంకా ఎలా ఉందంటే, తమ ఉత్తరం చదివినంతసేపూ, నేను ఇది చేయగలను, అది చేయగలను అనుకుంటూ అన్నీ చేయగలుగుతాను కాని, ఆ తర్వాత మళ్ళీ మామూలే. ఎందుకంటే, వాస్తవమైన విషయం ఏమిటంటే, నేను ఒక ప్రాపంచిక సాధారణ జీవిని మాత్రమే కనుక. ఇటువంటి ఆధ్యాత్మిక నిగూఢ విషయాలు (Complicated subject) నేను అర్థం చేసుకోలేను. ఒకప్పుడు ఎలా ఉండేదంటే, నా ప్రేమ అను పగ్గాన్ని (త్రాడును) తీసుకుని 'మాలిక్'ను బంధించటానికి వెళ్ళేదానిని. కాని ఇప్పుడు ఆ పగ్గం / త్రాడు ఏమైపోయిందో ఏమో. నేను కూడా త్రాడు తీసుకుని వెళ్ళలేక ఎక్కడ ఉన్నదానిని అక్కడే, ఎలా ఉన్న దానిని అలానే నిల్చుండిపోయాను. అలా బంధించాలను సంకల్పం ఎవరిదో కూడా మర్చిపోయాను. ఈ ఆట చెదరిపోయింది. ఇంక ఇంటి పనులు యధావిధిగా నిర్వహించబడుతున్నాయి. ఇప్పుడు ఆ విధంగా బంధించాలను ఆలోచనా రావటం లేదు. అందుకు తగిన తపన నన్ను చైతన్యపరచలేకపోతున్నది. నేను తరచుగా ఇప్పుడు నాకు ఎందుకు ఇలా అయిపోయింది అని వ్యధ చెందుతున్నాను. బహుశా ఇందుకేనేమో, 'అతని' గురించిన ఆలోచనతోపాటుగానే ఆ (Divine Wave) దివ్యహారం, దివ్యతరంగం, (Divine Light) అలౌకికత్వపు లేదా దివ్యత్వపు జ్యోతి కూడా కనుమరుగైపోయాయి. ఇప్పుడైతే ఒక ఆరిపోయిన దీపం మాత్రమే ఉంది. దానికి ఇంటిలో కాంతిని ప్రసరింపజేయగల శక్తి కూడా లేకపోయింది. ఇప్పుడు ఇల్లు కూడా ఒక సత్రం వంటిదే, ఎందుకంటే, అక్కడ ఎప్పుడూ దీపం వెలిగించబడి ఉండదు. ఆ చీకటిలోనే ఎవ్వరైనా

కావాలంటే వస్తూ  ఉంటారు, వెళ్ళిపోతూ ఉంటారు, ఏమీ తెలియదు.

"సత్యత్వం (రియాలిటి) ప్రారంభమైందని, నీవు దానిలో ఇప్పుడు ముందుకు ఈదుతూ పోతున్నావు" అని తమరు వ్రాశారు. కాని నేను ఒక సాధారణ బాలికను, నాకేమీ అర్థం కాదు. నాలో దీపం వెలిగించే శక్తి లేదు. అందువలన సత్యత్వం (రియాలిటీ) యొక్క ముఖ్య సారాంశాన్ని (Main essence of Reality) అర్థం చేసుకోలేను. కాని ఏది ఏమైనా, నాకు ఏదైనా కనిపించినా, కనిపించకపోయినాగాని, నా చేతులైతే ముందుకే చాపాల్సి ఉంది. దాని అన్వేషణలో నేను చేతులు ముందుకుచాపే ఉంచుతాను. ఇదంతా ఏమిటో ఏమో, అంతా తమకే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 670

లఖీంపుర్,

15.03.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి సంతోషించాను. నేను నా ఆరోగ్యం మీద బాగా శ్రద్ధ నిలిపి ఉంచుతున్నాను. విచారించాల్సిన పనిలేదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

చాలా రోజుల నుంచి మెడకు పైభాగాన, శిరస్సుకు పూర్తిగా వెనుక దిగువ శిరస్సులో ఒకచోట బాధ ఏర్పడి ఉంటోంది. అది కొద్దిగా పెరుగుతూ ఉంది. శిరస్సులో పాపిడిని సూటిగా దాని వెనుక శిరస్సువరకు పొడిగించుకుంటూ పోయినట్లయితే దాని కుడివైపున ఉన్న పాయింట్ మీద అనగా ఇదివరకు ఎక్కడైతే తరచుగా ఫట్ ఫట్ మని అనుభవమవుతూ ఉండేదో అక్కడ ఇప్పుడు కూడా అది అనుభవమవుతోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 671

షాజహాన్‌పూర్,

17.03.1958

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరాలన్నీ అందాయి. నీవు నీ ఆరోగ్యం బాగుపడిందని వ్రాశావు. ఆ ఆనందంలో నిన్ను '$P_1$' స్థానం మీదకు రాత్రి చేర్చాను. ఇప్పుడు ఇక్కడ నీ యొక్క ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభమవుతుంది. బ్రహ్మవిద్య దశను అశుభమైనదిగా చెప్పినట్లయితే, బ్రతికి ఉన్న వానిని చనిపోయినవానిగా చెప్పటం వంటిదిగా వివరించడమవుతుంది. ఇంకా ముందుకు వెళ్ళాక ఈ దశయే కొంత కాలం నిలిచి ఉండి తర్వాత శెలవు తీసుకుంటుంది. కణకణమూ పిండేసినట్లుగా ఉంది అని నీవు వ్రాసినది సరైనదే. ప్రాపంచికపు తడి (ఆకర్షణ) వదలి నిన్ను పొడిగా ఉంచుతున్నట్లు దాని అర్థం. నీవు, దీపం ఆరిపోయినట్లుగా ఉంది అని ఉదాహరణ చెప్పావు. కాని అది దీపం ఆరిపోవటం కాదు, దానిలో సత్వత్వం యొక్క వెలుగు లేదా దివ్య ప్రకాశం ఉత్పన్నమైంది. అంటే ఆ దీపం లేదా శక్తితో అన్నీ దీపాలను వెలిగించవచ్చు. ఇంకొక విషయం ఏమిటంటే, నీ ద్వారా మీ ఇంటిలో వెలుగు వ్యాపించింది.

నీ సోదర సోదరీలకు ఆశీస్సులు. చౌబేజీకి ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

### ఉత్తరం సంఖ్య - 672

లఖీంపుర్,
19.03.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. సమాచారం తెలిసింది. నా ఆరోగ్యం ఇప్పుడు పూర్తిగా బాగుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, నేను నా 'మాలిక్'ను ప్రార్థించినట్లయితే అది ఈ విధంగా మాత్రమే:

**"బినా భక్తి తారొ, తబ్ తారిబొ తిహారొ హై"**

అనగా భక్తి లేకుండానే నాకు ముక్తి నిచ్చినట్లయితే అప్పుడు నీవు ప్రశంసాపాత్రుడవుతావు. తమరు ఇప్పుడు ముక్తి గావించినా, లేకపోయినా నాకు పెద్ద విషయం కానట్లుగా ఉంది. ఎందుకంటే, ముక్తి అనేది ఏమిటో నాకు అర్థం కావటం లేదు. ఇప్పుడు 'మాలిక్'ను ప్రార్థించటం కూడా జరుగుతోంది. కాని అందులో పసలేదు. అది కేవలం విన్నపంగానే ఉంది. ఈ విన్నపంలో కూడా విన్నపంగా గాని, ప్రార్థనగా గాని లేకుండా ఉంటోంది. ఇది ఒక స్వాభావిక లేక సహజ దశగా అయిపోయింది, లేదంటే ఇది నా (Nature) స్వభావంగా అయిపోయింది. ఇప్పుడు ఒక వింతైన విషయం ఏమి చూస్తున్నానంటే, దశను నేను అనుభూతి చెందుతున్నపుడు, ఆ ఆనందం ఎంతైనా, ఎటువంటిదైనా కానివ్వండి, అనుభవమవుతూనే ఉంది. కాని ఎందుకోమరి (Senses) జ్ఞానేంద్రియాలు ఉన్నవి ఉన్నట్లుగానే ఉంటున్నాయి. హృదయం, మనస్సు కూడా అలాగే ఉంటున్నాయి. ఇదంతా ఏమిటో అర్థం కావటం లేదు. అన్నీ కూడా లోపల-బయట, ఉన్నవి ఉన్నట్లుగా బాగానే ఉంటున్నాయి. వాటిని ఎవ్వరూ చేతితో స్పృశించటం జరగనట్లుగానే ఉంది. నూతనత్వంగాని, అద్భుతంగాని ఏమీలేవు. కళ్ళు తెరచిచూస్తే ప్రపంచమంతా ఎప్పటిలాగానే మార్పు లేకుండా ఉంది.

ఇప్పుడు ఈ దశలో, ఒక సంపూర్ణ వలయంలో నేను స్వయంగా ఇమిడి ఉన్నట్లుగాను లేదా అన్నీ నా గుప్పిట్లోనే కుంచించుకుపోయి ఉన్నట్లుగాను ఉంది. నేను ఈ వలయం లేదా పాయింట్‌ను దాటలేకపోయినా గాని ఏమిపట్టనట్లుగా అక్కడే ఉండి విశ్రాంతి తీసుకుంటున్నట్లు ఉంది. 'మాలిక్' ఏమి చేస్తున్నారో, అది 'అతని'కే తెలుసు. ఆ వలయం అంతటా చుట్టి వచ్చాను. దాని అణువణువు తేలికగా అయిపోయి నా లోపల వ్యాపించి పోయాయి, కాని నాకు మాత్రం స్వయంగా నా ఉనికి ఎక్కడో తెలియకుండా పోయింది. 'మాలిక్'యే ఎక్కడైనా దానిని మాయం చేశారో లేక స్వయంగా తాను కూడా నన్ను తీసుకుని ఎక్కడైనా మాయమైపోయారో తెలియటం లేదు. నేను ఖాళీ చేతుల్తో ఉన్న దానిని ఉన్నట్లుగా నిలబడి ఉండి, ఎప్పుడైనా 'అతడు' జ్ఞాపకం వచ్చినపుడు 'అతని' కోసం ఎదురుచూస్తూ ఉంటున్నాను. నిజం చెప్పాలంటే, 'అతడు' ఎప్పుడు జ్ఞాపకమే రావటం లేదు. ఇప్పుడు 'మాలిక్'కు సేవ కూడా ఏమీ జరగటం లేదు. ఏమి సేవ చేయాలో, ఎలా చేయాలో అర్థం కావటంలేదు.

ఇప్పుడు షుమారు 15,20 రోజుల నుండి ఎటువంటి దశ ఉన్నదంటే, రాత్రిపూట అకస్మాత్తుగా అరుస్తున్నాను. అది నిద్రలోనే కాకుండా పగలు మేల్కొని ఉన్నపుడు కూడా ఆగి ఆగి అరుస్తూ ఉంటున్నాను. అయితే 'మాలిక్' దయవలన నా అరుపును ఇప్పటివరకు ఇంటిలోని వారెవ్వరు కూడా వినలేదు. లేకపోతే నాలో ఎటువంటి బాధ, నొప్పి లేకుండానే నా అరుపుకు కారణం ఏమిటో వారికి ఎలా చెప్పాలి. జ్ఞానేంద్రియాలు (Senses) ఉన్నవి ఉన్నట్లుగా శాంతంగా ఉన్నాయి. హృదయం, మనస్సు కూడా పూర్తిగా సామ్యావస్థ రూపాన్ని దాల్చి ఉన్నాయి. ఇదేమిటో నాకు

అర్థం కావటం లేదు.

నిన్న అకస్మాత్తుగా ఎడమకాలి బొటనవ్రేలు చివర ఎంత ఎక్కువగా విలవిలలాడిపోయిందంటే, కాలు మొత్తం నరాలు లబోదిబోమని అంటున్నాయేమో అని అనిపించింది. ఇంతలో కొంచెం చల్లని వాయువు వంటిది దానిలో మునిగి వస్తున్నట్లుగా అయి, ఆ అసౌకర్యం శాంతించింది. ఇప్పటికీ బొటనవ్రేలు లోపల ఏదో తెరుచుకున్నట్లుగా అనిపిస్తోంది. కాని, అదేమిటో తెలియదు.

ఇప్పుడు నాలో ఇటువంటి చైతన్యం లేదా క్రియాతత్వం ఎందుకు ఉంటున్నదో నాకు తెలియటం లేదు. అది నా స్వాధీనంలో కూడా ఉండటం లేదు. అయితే ఆ చైతన్యంతో లేదా ఉద్వేగంతో నాకు ఎంత మాత్రం సంబంధం లేదు.

ఇంకొక విషయం ఏమిటంటే, నేను ఏదైనా తినాలనుకున్నపుడు, స్వయంగా నేను తినకుండా ఇతరులకు తినిపిస్తూ ఉంటే అదే నాకు తృప్తిగా అనగా నేను స్వయంగా తిన్నదాని కంటె ఎక్కువ సంతృప్తి కలుగుతోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 673

లఖీంపూర్,

03.04.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు పూజ్య మాస్టర్ సాహెబ్‌కు వ్రాసిన పోస్టుకార్డ్ ద్వారా విషయాలు తెలిసి సంతోషమైంది. తమరు నన్ను '$P_1$' పాయింట్ మీదకు చేర్చారు. అందుకు చాలా ధన్యవాదాలు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఈ దశ ఏమిటోగాని, ప్రతి మనిషి యొక్క మనస్సు–మానసం మీద నాకు అధికారం ఉన్నట్లుగా అనిపిస్తోంది. మిషన్ కోసమని కాశీ గడప గడపకు జోలిపట్టుకుని తిరుగుతున్నట్లయితే, కస్తూరీ జోలి పట్టుకుని ప్రతి మనిషీ దానిని నింపమని బలవంతం చేస్తుంది. జన్మలకు జన్మలుగా మిషన్ ప్రచారం కోసమని నేను ఆ పనిని స్వీకరించాల్సివచ్చినా నేను అందుకు బాధపడను. ఎందుకంటే, మిషన్ పని మరియు దాని ప్రచారం నాకు జన్మసిద్ధమైన హక్కుగా భావిస్తాను. నేను దానిని పూర్తి చేయాల్సి ఉంది. నా బాబూజీ, సమర్థగురు శ్రీ లాలాజీతో ఇంటింటికీ మిషన్ కొరకు ప్రచారం చేస్తానని తమరు ప్రతిజ్ఞ చేసి ఉన్నారు. ఇప్పుడు అది నా స్వంత ప్రతిజ్ఞగా నా ఎదుట నిలిచి విజృంభిస్తోంది. నాకు అది చేయాల్సి ఉంది. ప్రతి మానవ మనస్సును మిషన్‌వైపు మరల్చాల్సి ఉంది. ప్రపంచం యొక్క సమస్త తనువులు, మనస్సులు మరియు సమస్త ధనం మిషన్‌కు చెందినదే. దాని కోసమే రెండు చేతుల్తో (అనగా దోసిళ్ళతో) తోడి పోయబడుతుంది. అనగా అందుకొరకే వాటన్నిటినీ సంతరించటం జరుగుతుంది. నేనే కనుక ఉద్యోగంలో ఉండి ఉంటే, ఏదైనా ఎండిన రొట్టెను ఒక్కపూట మాత్రమే సేవించి, ఒక్క గంట మాత్రమే సేదతీరి నేను నా మిషన్‌ను ఒంటరిగానే రూపాయలతో నింపి ఉండే దానను. నేను కేవలం 'మాలిక్' సేవలోనే ఉన్నాను కనుక, ఇది కూడా నెరవేరుతుందని అనుకుంటాను. 'మాలిక్' గనుక నా పోషణ బాధ్యత వహించి ఉంటే, నేను కూడా మిషన్ యొక్క పోషణ మరియు 'వారి' ఆరోగ్య విషయం పట్టించుకుని ఉండేదానను. ఇది ఇంతకుముందు నుంచే ఉన్నాగాని ఇప్పుడు పూర్తిస్థాయిలో నా బాధ్యతగా స్వీకరించాను. ఇంక ఇప్పుడది తమ కృపతోనే సాధ్యమవుతుంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 674

షాజహాన్‌పూర్,
07.04.1958

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం ఒకటి 1958 మార్చి 31వ తేదీది, మరొకటి ఏప్రియల్ 3వ తేదీతో ఉన్న పోస్టుకార్డు అందాయి. నీ పోస్టుకార్డు అందిన వెంటనే నేను నీకు సిట్టింగ్ ఇచ్చాను. అది నీకు బాగుందని అనిపించవచ్చు. ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, జనం దైవాన్ని ప్రేమించరు. ఒకవేళ ప్రేమించాలి అని అనుకున్నప్పటికీ అది కూడా చేయలేకపోతారు. నీవు దానికి కారణం ఆలోచించావా? నేనైతే ఆలోచించలేదు కాని, ఇప్పుడు వచ్చిన ఆలోచనను వ్రాస్తున్నాను. ప్రాపంచిక విషయాలవైపుగా ఉన్న వారి దృఢమైన సంబంధం దైవంవైపు మరలించే ప్రయత్నంలో బలపర్చలేకపోతోంది. తరచుగా నాకు ఈ సంబంధాన్ని జోడించవలసి వస్తుంది. అందుకు ప్రయత్నించాను కూడ. అయితే ఇప్పుడు నా పరిస్థితి ఎలా ఉందంటే, అటువైపు (దైవం) నా దృష్టిని కేంద్రీకరించలేక పోతున్నాను. ఎందుకంటే, నేను ఆ విధంగా సంబంధం కల్పించాలని చేసిన దాని ప్రభావం, ఒక త్రాగుబోతుకు మద్యం త్రాగించినంతసేపు మత్తు ఉండి, మద్యం నిలిపివేయగానే ఆ మత్తు దిగిపోయినట్లుగా ఉంది. అటువంటి మత్తును చూసి తమలో ఆధ్యాత్మిక మత్తుస్థితిని కల్పించుకోలేకపోతున్నారు.

భగవంతుని కృపతో నీవు భావించినట్లుగానే దక్షిణ భారతదేశంలో మిషన్ గాలి సోకటం ఆరంభమైంది. డాక్టర్ కె.సి. వరదాచారిగారి దగ్గరకు చాలామంది మంచి వ్యక్తులు రావటం ప్రారంభమైంది. ఆశ్రమంలో భవన నిర్మాణం గురించి ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది. దానికొరకు చాలామంది ప్రయత్నిస్తున్నారు. అందుకు 'మాలిక్' మాత్రమే దిక్కు. ఒక వ్యక్తి, తనకు (China clay) చైనా మట్టికి చెందిన రిజిస్ట్రేషన్ అయినట్లయితే తన స్వంత ఆదాయంతో ఆశ్రమం నిర్మించి ఇవ్వడానికి వాగ్దానం చేశాడు. ఒక పదవీ విరమణ చేసిన డిప్యూటీ కలక్టర్ సహాయంతో అతని పని పూర్తయ్యింది. 'హిందు' పత్రిక అసిస్టెంట్ ఎడిటర్ (సహాయ సంపాదకుడు) సత్సంగ్‌లో చేరాడు. 3,4 సిట్టింగులు తీసుకున్న తర్వాత అతడు అమెరికా వెళ్ళవలసి వచ్చింది. అతడు ఇంకను కొద్ది రోజులు తర్వాత వెళ్ళే అవకాశం కలిగి ఉంటే, అతడు మన మిషన్ ప్రచారానికి అక్కడ ఉపయోగపడి ఉండేవాడు. అయినప్పటికీ నేను అతనికి "Reality at Dawn" (సత్యోదయం) పుస్తకం 6 ప్రతులు పంపించాను.

ఇప్పుడు నేను నీ స్థితిని గురించిన సందర్భానికి వస్తున్నాను. ఇప్పుడు నీ యాత్రా స్థానం '$P_1$' అయి ఉండగా, యాత్ర ఇంకను ప్రారంభం కాలేదు. నీ ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని నెమ్మదిగా, సహజరీతిలో నేను పని చేస్తున్నాను. నీ ఆరోగ్యం బాగుపడుతున్నట్లుగా నీవు కూడా నీ ఇచ్ఛాశక్తిని ఉపయోగించు. మార్చి 31వ తేదీ ఉత్తరంలో వ్రాసిన దానిలో, నీవు ఏదైనా పదార్థం తినాలి అనుకున్నప్పుడు, దానిని ఇతరులకు తినిపించినట్లయితే, నీవు స్వయంగా తిన్నప్పుడు కలుగు తృప్తి కంటే, అలా చేయటం వలన కలిగే తృప్తి ఎక్కువగా ఉంటున్నట్లుగా తెలియజేశావు. నా పరిస్థితి కూడా కొన్ని సంవత్సరాలుగా అలాగే ఉంటోంది. నీవు వ్రాసినది చదివాక ఆ విషయం జ్ఞాపకానికి వచ్చింది. దీని వలన నీలో ఏకత్వ భావన (Oneness) కలిగిందని, కోరికలు అంటూ ఏమీ లేకుండా పోయాయి అని అర్థమౌతుంది. మిషన్‌ను విస్తరింపజేయాలను నీ ప్రగాఢ వాంఛకు కారణం సర్వసాధారణమైనదే. ఎందుకంటే, నీవు నాలో మంచి లయ-అవస్థను పెంపొందించుకున్నావు కనుక నా ఈ కోరికే నీలో ఉత్పన్నమవుతున్నది.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 675

లఖీంపుర్,

10.04.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. తమ ఆరోగ్యం బాగుందని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఈరోజు నేను అకస్మాత్తుగా, వాతావరణంలో ఏదైనా స్థితిని కల్పించటానికి నాకు 'మాలిక్' శక్తి ఇచ్చినట్లుగా అనుభవమైంది. ఇటువంటి అనుభవం ఇప్పటివరకు ఎన్నడూ కలగలేదు. దానిపైన ఎప్పుడూ నా దృష్టి కూడా పడలేదు. అది ఏమిటో తెలియదుగాని, నా శరీరంలోని కణకణం నుంచి సమస్త ప్రపంచం పిండివేసినట్లుగాను, ఇదే కాకుండా నా 'మాలిక్'ను కూడా ఎవరో పిండివేసి నా హృదయాన్ని, నా కణకణాన్ని లోపల, బయట అన్నింటినీ ఎవరో కొల్లగొట్టి ఖాళీగా ఉంచినట్లుగాను అనుభవమైంది. 'మాలిక్' ఇలా ఎందుకు చేశారో తెలియదు. అన్నీ కణాలనుంచి ఎవ్వరో ఉప్పును (దివ్యత్వం యొక్క ఆనందాన్ని) పిండేశారా అన్నట్లుగా ఉంది. మొత్తంలో ఎండుదనం ఏర్పడిందని అనిపిస్తోంది. ఇంకా తెలియనిది ఏమిటంటే, కణకణం అని నేనయితే వ్రాశాను, కాని నాకయితే కేవలం కొన్ని శబ్దాలు మాత్రమే వ్యాపించి ఉంటున్నాయి. ఇంక ఎటువంటి అనుభవంగాని, అనుభూతిగాని లేవు. ఇంకా ఏమిటంటే, ఆ మొత్తం (Whole) గురించిన అనుభవం కూడా ఏమీలేదు, ఉందనిపించటం లేదు. నా నోటి నుంచి కేవలం 'మొత్తం' అను శబ్దమే వెలువడుతోంది. అందుకని దానినే వ్రాస్తున్నాను. ఇంకా ఏమైనా ఉందో లేదో కాని, నా లోపల, బయట అన్నీ కలిసి మొత్తంగా అయిపోయాయి. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఈ మొత్తాన్ని పిండివేసినా లేదా తీసివేసినాగాని కేవలం మొత్తం మాత్రమే మిగిలి ఉంది. అది కూడా 'మాలిక్' భావనలోకిగాని, నా భావనలోకిగాని రావటం లేదు. అటుచేసి, ఇటుచేసి చివరకు ఆ మొత్తం మాత్రమే ఉంది, ఇంకొక ఉద్దేశ్యమే లేదు.

ఇప్పుడు ఎటువంటి దశ ఉందంటే, దానిని స్వచ్ఛం అని చెప్పగలను. వీపంతా ఎంత మెత్తగా అయిపోయింది అంటే, దానిలో ఎముకలు ఏమీలేనట్లుగా అనిపిస్తోంది. బరువు అనదగిన వస్తువు ఏదీ తాకటం లేదు. ఒక నిర్మలమైన విశాల మైదానంలో నేను స్వచ్ఛంగా నిలబడి ఉండి ఒక నూతన (Circle) వలయంలో ఉన్నట్లు ఉంది. అయినా కాని 'మాలిక్' దయతో ఆ వలయం మొత్తం నా దృష్టిలో ఉంది. ఇప్పుడు లయ-అవస్థకు చెందిన ఈ నూతన మరియు అద్భుత దశలోపల నిలిచి ఉన్నాను. అక్కడ భక్తి, విశ్రాంతి, ప్రేమ, లయ వంటివి మరియు జ్ఞానం ఏదీ అంటనట్లుగా ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 676

షాజహాన్‌పూర్,

16.04.1958

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరాలు, పోస్టు ద్వారా రెండు, వ్యక్తి ద్వారా ఒకటి అందాయి. నీ ఆరోగ్యం బాగుంటుందని నీవు వ్రాసినది చూసి నాకు చాలా ఆనందం కలిగింది.

నీవు, వాతావరణంలో ఏదైనా స్థితిని కల్పించగల శక్తిని కలిగి ఉన్నావని అభిప్రాయపడుతున్నట్లుగా వ్రాసింది సరైనదే. ఎందుకంటే, బ్రహ్మాండ మండలం యొక్క ఆధిపత్యం నీకు ఇవ్వబడింది. నీవు పవిత్రమైన స్థితిని కలిగి

ఉన్నప్పటికీ, ఇంకను నీవు పవిత్రత మరియు అపవిత్రతల యొక్క ధ్యాస కలిగి ఉన్నావు. నిజానికి, అక్కడ పవిత్రతగాని, అపవిత్రతగాని లేవు. నీవు లయ-అవస్థ యొక్క నూతన దశలో నిలిచి ఉన్నట్లుగా కలిగిన భావం సరైనదే. నీవు ఆత్మ చైతన్యంలో లయమయ్యావనే విషయం త్వరలోనే నీకు అనుభవపూర్వకంగా తెలుస్తుంది. ఇప్పుడు నీవు దాని (ఆత్మ చైతన్యం) ద్వారంవద్దనే వేచి ఉన్నావు. అది ఇంకా ప్రారంభం కాలేదు కాని లయ-అవస్థ పరిధిలో ఉన్న దశ నీలో ఉత్పన్నమయ్యింది. ఇది నీ పోస్టుకార్డు ఏప్రియల్ 10వ తేదీ దానికి జవాబు.

అమ్మకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 677

లఖీంపుర్,
16.04.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడందరూ కుశలమే. అక్కడ కూడా అందరూ కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో నాకు ఏమీ తెలియటం లేదన్నట్లుగా ఉంది. **కస్తూరీ యొక్క (Form) రూపం కేవలం నామ మాత్రంగానే ఉంది. ఎందుకంటే ఈ రూపంతో నేను ఏమీ వినటం లేదు, అర్థం చేసుకోవటం లేదు, మాట్లాడటం లేదు, చూడటం లేదు మరియు అనుభవం పొందటం లేదు. కస్తూరీ రూపం (శరీరం) ఇప్పుడు కేవలం ఆమె పరదా మాత్రమే. ఎందుకంటే, విన్న అన్ని మాటలు నాకు తెలియకుండా లోపల ఎక్కడికో వెళ్ళిపోతున్నాయి. ఏదైనా తెలుసుకున్నా, తెలుసుకోకపోయినా, విన్నా, వినకపోయినాగాని ఎక్కడికో వెళ్ళిపోతోంది. అందువలన గ్రహించటం, గ్రహించలేకపోవటం వంటివి ఏవీ స్పర్శించటం లేదు. శ్వాస కూడా లోపల లోపలే జరుగుతోంది కాని దాని అనుభూతి నాకు కలగటం లేదు. ఇప్పుడు నేను లోపల లేదా బయట అని చెప్పాలనుకున్నాగాని నాకు అవి రెండూ సమానంగానే అనిపిస్తున్నాయి.**

కొన్ని సంవత్సరాలకు పూర్వం నేను ఉదాసీనదశ అని వ్రాసినటువంటిది, అనిపించినటువంటిది అప్పుడు ఒక పరదా రూపంలో ఉంది, కాని ఇప్పుడయితే ప్రతిదశ ఒకే ఒక్క మొత్తం శబ్దంలో వ్యాపించిపోయినట్లుగాను, అంతమైపోయినట్లుగాను ఉంది. ఇప్పుడు నా వద్ద ఏమీలేదు. ఖర్చుపెట్టటానికి ధనమూ లేదు, తీసుకోవటానికి హరినామం (భగవన్నామం) లేదు. దశ ఇప్పుడు దాని 'అసలు'లో కలిసిపోయింది, నన్ను ఒంటరిగా వదిలిపోయింది.

ఒక వింతయైన విషయం జరిగింది, అది ఏమిటంటే, జీవితం తన 'అసలు' (రియాలిటీ)లో కలిసిపోయింది. మృత్యువు తనలో ఇమిడిపోయింది. గుణాలు కూడా తమ **అసలు (రియాలిటీ)**లో అంతర్లీనమైపోయాయి. ఇంకా ఎంతగానంటే, 'మాలిక్' కూడా స్వయంగా తనలో తానే లీనమైపోయాడు. నేనయితే ఒక యంత్రంలాగా అటూ ఇటూ తిరుగుతూ ఉన్నాను. అది ఏ వేషంలోనో, ఏ ఆలోచన ద్వారానో, అన్ని పనులు నాకు తెలియకుండానే చేస్తున్నాను. ఆధ్యాత్మికత కూడా స్వయంగా తనలో కలిసిపోయింది. నన్ను ఎవరు అడుగుతారు! అయినా కాని ప్రతిస్థితిలోను నాకు నా 'మాలిక్' ఉన్నారు, 'అతని'కి కావల్సినట్లు నన్ను ఉంచుతారు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 678

లఖీంపుర్,

21.04.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. సమాచారం తెలుసుకున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పటివరకు ఆంతరికమైన లీలలు చూస్తూ వచ్చాను, కాని ఇప్పుడు అన్ని లీలలు, అన్ని ఆటలు మరియు వింతలు సమాప్తమైపోయాయి. ఇప్పుడు ఉన్నవేవో ఉన్నాయో లేదో మరి. ఏవైతే ఉన్నాయో, ఇప్పుడు అవి లేవు. ఇప్పుడైతే ఆటలు, వింతలు మరియు ఉరుకులు, పరుగుల మైదానం వెళ్ళిపోతోంది. నేను ఇదివరలో వ్రాస్తూ ఉండిన శూన్య సమాధి దశ కూడా తనలో విలీనమైపోయింది. నేను మొత్తం లేదా విరాట్ రూపంలో ఇమిడి ఉండి, దానితో కూడా సంబంధం త్రెంచుకని ఒక ఒంటరి స్థానంలో నిలబడిపోయాను అని అనిపిస్తోంది. ఇప్పుడు ఆత్మ కరగటం కూడా ఆరంభమైపోయినట్లు అనిపిస్తోంది.

"జో పహి రావె, సోయీ పహిరూం" లేదా "జహాఁ బైఠారె, తిత్ హీ బైఠూ" అనగా "దేనిని ధరింపజేస్తే దానిని ధరిస్తాను" లేదా "ఎక్కడ కూర్చుండబెట్టితే అక్కడ కూర్చుంటాను" అని వ్రాసినటువంటి దశ తాలూకు మాటలన్నీ సమాప్తమైపోయాయి. ఆ ప్రేమమయ దశ కూడా కరిగిపోయి, సమానంగా అయిపోయింది. దశ మొత్తం నాలోనే లయమైపోయింది. అయితే ఇప్పుడు ఉన్న దానిలో ఎందుకు పరవశించిపోతున్నానో తెలియటం లేదు. ఎప్పుడైనాగాని లోపలినుంచి స్వయంగానే ఒక అవధూతగతి వంటి దశ ఉప్పొంగి పైకి వస్తూ పోతూ ఉంటుంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 679

షాజహాన్‌పూర్,

27.04.1958

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీవు క్షేమంగా ఢిల్లీ చేరి ఉంటావు. వెంటనే హాస్పిటల్ వార్డులో ప్రవేశం పొంది ఉంటావని అనుకుంటున్నాను. నేను ఒక విధంగా నిన్ను వనవాసానికి పంపించాను. దానితో నీలో మిగిలి ఉన్న వ్యాధినంతటినీఅక్కడ సంహరించివేయగలవు. నీవు ధైర్యంగా ఉండాలి. అంతేకాదు, **ఎవ్వరైనాసరే, ఏ సమయంలోనైనా ఆనందంగా ఉండాలి.**

నీ ఆధ్యాత్మిక స్థితులు, దైవేచ్ఛ ఉంటే యధావిధిగానే కొనసాగుతూ ఉంటాయి. **హృదయంలో నీకు శాంతి, సంతృప్తి ఉంటాయి. ఒకవేళ ఏదైనా కష్టమనిపిస్తే, ప్రార్థన అను సాధనం నీవద్ద ఉండనే ఉంది. దానితో పరిస్థితులన్నీ చక్కబడతాయి.**

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 680

లఖీంపుర్,

04.05.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి ఆనందించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురంచి వ్రాస్తున్నాను.

నేను వ్యతిరేకించగలను (హాస్పటల్‌లో ఉండటానికి), కాని నా లోపల 'తమ' ఇచ్చను గ్రహించాక మరియు తమరు కొంత విడమర్చి చెప్పిన తర్వాత అటువంటి వ్యతిరేక భావాలే కలగటం లేదు. ఇది ఇప్పుడు తెలియక పోయినప్పటికీ నాకు ఎల్లప్పుడూ 'మాలిక్' యొక్క అభీష్టంలో నేను సంతోషంగా ఉన్నాను అను భావనయే ఉంటోంది. ఇప్పుడింక వ్యతిరేక భావాలు లేవు, నేను కోరుకుంటున్న భావాలూ లేవు. ఇంతకూ యదార్థం ఏమిటంటే, మంచివి, చెడ్డవి అను భావాలు ఏమీ కూడా నాలో ఉదయించటం లేదు. నేను అందుకని నా దశను స్వయంగానే అర్థం చేసుకోవటంలో అసమర్థురాలుగా ఉంటున్నాను. ఎందుకంటే, విలపించినా, గానం చేసినాగాని అన్ని విషయాలు ఆంతరిక భావాలు కలగకుండానే నాలో ఉత్పన్నం అవుతున్నాయి. నేను కేవలం 'మాలిక్'కు మాత్రమే కాకుండా, ప్రతి మానవ మాత్రునికి కూడా ఒక చైతన్యంలేని కొయ్యబొమ్మలాగానే ఉన్నాను. నేను కొయ్యబొమ్మలాగా ఉండటం వలన నాకు జ్ఞానంగాని, సంతోషంగాని ఉండటం లేదు.

నా అంతర్గత దర్వాజా విరిగిపోవటం వలన హృదయం విస్తరించి, అంతా ఏకధాటిగా అయిపోయినట్లుగా అనిపిస్తోంది. దాని వలన నాలో ప్రేరణ మరియు స్ఫూర్తిని కలిగించే నా ఆంతరిక శక్తి నశించిపోయింది. అలాకాదు గాని, ఒకే రకమైన దశయే వ్యాపించి ఉన్నందున, నేను పూర్తిగా ఖాళీగా అనగా ఏమీ పట్టనట్లుగా మౌనంగా పచార్లు చేస్తున్నాను. నాలో ఇప్పుడు ఏకధాటిగా ఆలోచనలు కలగటం లేదు. అంతేగాకుండా శిరస్సు యొక్క మధ్యభాగం, ఏదైతే దైవశక్తితో సంబంధం కలిగి ఉంటుందో, దానిపై నుంచి కొన్ని స్పందనలు వస్తూ ఉంటాయి, కాని రాత్రిపూట నిద్రలో పూర్తిగా మహాశూన్యంలోనే వ్యాప్తమైపోతాయి. నేనయితే ఇక్కడ ఉంటున్నాను కాని నా నివాసం అయితే (Real home) అసలు ఇంటిలోనే చోటుచేసుకుంది. అయితే ఈ అనుభవం నిద్రలో మాత్రమే కలుగుతుంది. అదేమిటోగాని మహాకాశాన్ని అన్నింటి కంటె శూన్యంగా (Absolutely Blank) చెప్పబడింది, కాని నా దశలోనయితే అది కూడా సరితూగటం లేదు. అది భారీగానే ఉంటోంది. నా స్థితి అయితే ఖాళీ లేదా శూన్యమను శబ్దం యొక్క గాఢరూపంగానే అయిపోయింది. ఇది ఖాళీ లేక శూన్యమని చెప్పవచ్చునుగాని, అది సహేతుకంగా అనిపించటం లేదు. ఎందుకంటే, ఇది నా దశ యొక్క అనుభవమా లేక కేవలం నా స్వరూపమేనా, ఏదో నిర్ణయించుకోలేక పోతున్నాను. ఇప్పుడు అనుభవం మరియు దశ కూడా ఒకటిగా అయిపోయాయి. ఇప్పుడు ఏ కారణంగా ఆత్మిక దశల అనుభూతి కలుగుతూ ఉండేదో ఇప్పుడు కారణమే అంతరించిపోయింది కనుక ఆ ఆకర్షణ కూడా సమాప్తమైపోయింది. ఆ ఆకర్షణయే నన్ను సదా పైకి మరియు ఆంతరికంలోకి గుంజుతూ ఉండేది. ఇప్పుడింక పైన-క్రింద, లోన-బయట, అన్నీ కూడా సమాప్తమైపోయియి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 681

లఖీంపుర్,

29.05.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఎలా ఉన్నదంటే, రాత్రిపూట నిద్రించినా కూడా మెదడుకు విశ్రాంతి అనిపించటం లేదు. అంతేగాకుండా, అలసటయే అనుభవ మవుతోంది. మెదడులోని నరాలు శ్రమపడుతున్నాయేమో నాకు తెలియదు. కాని పగలు ఎప్పుడైనా నిద్రించినట్లయితే, అప్పుడు ఎందుకోగాని మెదడుకు తప్పకుండా విశ్రాంతి కలుగుతోంది. 'మాలిక్'ను చేరుకోవటానికిగాని లేదా లయ-అవస్థ కొరకుగాని ఒక నూతన మైదానంలో ఈత ప్రారంభమై పోయింది. చాలా కోమలమైన దశ నా స్వరూపంగా అయిపోయింది. లోన-బయట అంతా కోమలంగానే అయిపోయింది. దానిని నేను ప్రవాహం అనిగాని, సరళం అనిగాని చెప్పినట్లయితే, ఆ శబ్దాలు భారమే అనిపిస్తున్నాయి, దశ కంటె కూడ. 'శబ్దాల' యొక్క అర్థం యొక్క భారం లేదా దశ యొక్క అంచనా కూడా దశ కంటె భారంగా అనిపిస్తున్నది. ఇప్పుడు దశను ఎలా వ్యక్తం చేయాలి!

ఉన్నదేదో ఉంది అనేది కూడా స్థితికి చెందినంతవరకు మూర్ఖత్వం అనిపిస్తోంది. నమ్రత (Humble) అని చెబుతామనుకుంటే, అది కూడా దశకు తగ్గట్లుగా లేదు. అది, పంచతత్వాలు మరియు త్రిగుణాలకు అతీతంగా ఉన్నపుడు దానిని దశగా ఎలా చెప్పాలి? కృత్రిమం లేదా కల్పితం అనుదానికి దానిలో ఎంతమాత్రం అవకాశం లేదు. ఇది చాలా నాజూకైన దశ. ఈ స్థితిలో శరీరం కూడా ఇప్పుడు శరీరంగా కాకుండా ఈశ్వరాలయం లేదా భగవంతుని నివాసంగా ఉంది. ఏమైందో ఏమోకాని, అంగాంగాలు, నరనరాలు మరియు కణకణాలు లోన-బయట ఈశ్వరీయ శక్తితో మరియు ప్రకాశంతో పరిపూర్ణంగా ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇటువంటి అర్థంకాని దశ ఏదైనా నాతో ఉన్నప్పుడు, దానితో శక్తి మరియు ప్రకాశం, అవి ఏమిటో, ఎలా ఉంటాయో అర్థం చేసుకోలేకపోతున్నాను. అన్నీ కూడా హద్దు లేకుండాపోయాయి. ఆ అపరిమితమైన దానిలోనే నేను కూడా లయమైపోయాను. ఇప్పుడు దశను గురించి వ్రాస్తున్నాను, కాని నా మనస్సు ఏకాగ్రత చెందిన కారణంగా భయకంపితమవుతోంది. ఏకాగ్రత అనేది ఇప్పుడు నాకు సహింపరానిదిగా ఉంది. మనస్సులో స్వయంగా ఎప్పుడైనా, ఏదైనా వస్తూ పోతున్నాగాని, నాకు మాత్రం సహింపరానివిగానే ఉంటున్నాయి. అంతా అపరిమితం అయిపోయింది. నేను కూడా ఎక్కడ విలీనమైపోయానో తెలియదు. శరీరం, మనస్సు మరియు ప్రాణం యొక్క కణకణం చెల్లాచెదురైపోయి అకస్మాత్తుగానే ఆ అపరిమితంలోనే లయమైపోయాయి. ఈ విధంగా చెప్పటంలో నాకు ఆనందంగాని, అర్థంకాని అనిపించటం లేదు.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 682

లఖీంపుర్,

07.06.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను దద్దా ద్వారా పంపిన నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ క్షేమమే. తమరు కూడా క్షేమమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి

వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో '$P_1$' పాయింట్ యాత్ర పూర్తయ్యిన తర్వాత, ఒక నిలకడ (Stoppage) అనగా కాళ్ళు చేతులు పనిచేయకుండా ఉన్నట్లుగాను, మరోవైపు ఒక నూతన దశలో ఈత కూడా ప్రారంభమైనట్లుగాను ఉంది.

ఇదివరకు నేను, ఒక రకమైన వెచ్చదనంతో సర్వదా సంబంధం కలిగి ఉంటున్నాను అని వ్రాస్తూ ఉండేదానను, కాని ఇప్పుడు ఈ దశలో ఆ వెచ్చదనమే నా స్వంత స్వరూపంగా అయిపోయింది. ఇప్పుడు ఏమయ్యిందంటే, లోన-బయట, కణకణం మొత్తంలో, కొంచెం తక్కువది, మృదువైనది అయిన ఆ వేడియే వ్యాపించి ఉంది. ఈ రోజు అకస్మాత్తుగా నుదిటి మీద చివరన పాపిటివరకు అంతటా ఒక్కసారిగా లోపల ఆ పాయింట్ పూర్తిగా విస్తరించిపోయి నరాలన్నీ పైకి పీక్కునిపోయి పైనున్న దశతో సంబంధం కల్పించుకున్నట్లుగా ఉంది.

ఇప్పుడు దశ, (Softness) మృదుత్వం యొక్క చిట్టచివరి దశగా ఉంది. లోన, బయట, కణకణమూ అంతమైపోయి అంతటా మృదుత్వం (Softness) ఒక్కసారిగా వ్యాపించిపోయింది. ఇంతకుపూర్వం నాది పిచ్చివంటి దశగా ఉండేది. ఇప్పుడైతే శరీరం యొక్క కణకణం ఆ పిచ్చిదనం యొక్క స్వరూపంగా అయిపోయాయి. అందుచేత పిచ్చి అని చెప్పటం కూడా వ్యర్థమేనని అనిపిస్తోంది. పిచ్చివాడు, పిచ్చివాడిని ఏమంటాడు, ఎలా గుర్తిస్తాడు. ప్రతి దానిని చివరి దశ అని చెప్పవచ్చు లేదా సమాప్తి దశ అని చెప్పవచ్చు. 'మాలిక్' ఆత్మలో నా ఈత ప్రారంభమైనట్లుగా అనిపిస్తోంది. ఒకే ఒక ఆత్మలో లయవంటి దశ యొక్క ఈత ప్రారంభమైపోయింది. ఈ దశలో క్షోభ ఎన్నడూ ఉత్పన్నమై ఉండలేదు అన్నట్లు అనిపిస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 683

లఖీంపుర్,
15.06.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. ఇక్కడ అందరూ బాగానే ఉన్నారు. తమరు కూడా బాగున్నారనే అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఏమనిపిస్తున్నదంటే, చైతన్యమంతా సమాప్తమైపోయి, శరీరం యొక్క అణువణువూ ఒక్కసారిగా శాంతం మరియు మౌనం దాల్చాయా అన్నట్లుగా ఉంది. శరీరం యొక్క కణకణంలోను, లోన, బయట అంతటా ఒక మసకదనం వంటిది వ్యాపించింది. 'మాలిక్'తో సంబంధమే లేకపోయాక ఇంక ఏమి వ్రాయగలను! 'మాలిక్'కు ఈ జీవితం అర్పితమైపోయిందని మాత్రం చెప్పగలను. 'అతని'కి ఇష్టమైన రీతిలోనే ఉండటానికి ప్రయత్నిస్తున్నాను. ఏ దశ అయితే ఆధ్యాత్మికతకు కారణమైందో అది, కరిగిపోయి సమాప్తమైపోయింది. ఇప్పుడు మూలంగాని, కారణంగాని లేనందున దశ నాది అని, అనిపించటం లేదు. ఇంతేకాదు, కాని ఏ కారణంతోనైతే లయ-అవస్థ కలుగుతూ ఉండేదో అదే కారణం కూడా కరిగి కరిగి నీరుగారిపోయి అంతరించిపోతూ ఉంది.

ఇప్పుడు ఏమైనా శాంతిగాని, ఆనందంగాని దక్కాయి అని చెబుదామంటే, నా ఈ దశలో, శరీరంలో శాంతి-అశాంతిగాని, ఆనందం-నిరానందంగాని ఉన్నట్లు తెలియటం లేదు. శాంతి-అశాంతి, ఆనందం-నిరానందం, వేటినైనా సమకూర్చుకోవటానికి మనస్సులోగాని, ఆలోచనలోగాని అంత శక్తియే లేకపోయింది. (Naturality) సహజత్వం

లేదా (Simplicity) సరళత్వం కూడా నా ఆలోచనలకు చిక్కటం లేదు. అవి చాలా దూరంగా ఉండిపోయి నాకు చెందినవి కాకుండా ఉన్నప్పుడు ఇంక నాకు వాటితో పని ఏమి ఉంటుంది.

ఇప్పుడు ఏమైంది అంటే, ఏ వస్తువు (శక్తి) అయితే నాకు నా స్థితిని తెలియపరుస్తూ ఉండేదో అది ఎప్పుడు అంతమైపోయిందో తెలియదు. నా హృదయం ఎంత చిన్నదిగా అయిపోయింది అంటే, ఇటువంటి విషయాలకుగాని లేదా ఆధ్యాత్మికతకుగాని స్థానం కల్పించటానికి దానిలో చోటులేకుండాపోయింది. అందుచేత అన్నీ (స్థితులన్నీ) విడిచిపెట్టిపోయాయి. ఇప్పుడు మైదానంకాని మైదానం నా ఎదుట ఉంది. దానిలో నేను గమనం లేకుండా లేదా నడక లేకుండా నడుస్తూ పోతున్నాను.

ఇప్పుడు అదేమిటోగాని, పూజచేసేవారైనా, చేయనివారైనా అనగా అభ్యాసి అయినా, కాకపోయినా ప్రతిమనిషితో పోలిస్తే నా స్థితి చాలా అల్పమైనదిగా అనిపిస్తోంది. ఏమీ ప్రత్యేకత కనిపించటం లేదు. ఇంకా ఏమిటంటే, నేను నా దశను అంటిపెట్టుకుని ఉండలేకపోతున్నాను. ప్రయత్నం చేయడం కూడా వృధా అనిపిస్తోంది. ఎవ్వరైనాగాని నా స్థితి యొక్క అనుభూతి బలవంతంగానైనా మరపింప చేయటానికి చూసినట్లయితే, అప్పుడు నేను నా (Will) ఇచ్ఛతో నా ఆలోచనలను అక్కడే విడిచిపెట్టున్నాను. దాని మూలంగా నా స్థితి పూర్తిగా నా స్వంతమవుతూనే ఉంటుంది. 'మాలిక్' దయతో నన్ను ఏ విధంగానైనా వెంట తీసుకొనే వెళ్తున్నారు. నేను 'వారి'ని అంటిపెట్టుకునే ఉంటాను. చేతులు, కాళ్ళు ఆడకపోతే మాత్రం నడవలేను. ఇప్పుడైతే చేతులు, కాళ్ళు ఉన్నాయిగాని లేకపోతే నడవటం ఎలా? ఇప్పుడు చెప్పటానికి, వినటానికి లేదా వ్రాయటానికి నావద్ద మాటలుగాని, అనుభూతిగాని లేవు. శక్తి కూడా లేదు. అయితే ఆలోచనలను వ్రాసేటపుడు స్వయంగా 'మాలిక్' నుంచి శక్తిని గుంజుకొని శబ్దాల రూపంలో ఏవో వెలువరిస్తూ ఉంటాను. అలాకాకపోతే నా శరీరంలో లేదా జ్ఞానంలో లేదా మనస్సులో చైతన్యం అనేది ఎక్కడ ఉంది. అవసరమైనపుడు ఆలోచనలే 'మాలిక్' నుంచి శక్తిని పొంది పని జరుపుతూ ఉంటాయి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 684

లఖీంపూర్,
29.06.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తావూజీ ద్వారా పంపిన ఉత్తరం తమరు స్వీకరించి ఉంటారని అనుకుంటున్నాను. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఎలా ఉందంటే, నా హృదయమే అంతటా వ్యాపించి ఉన్నట్లుగాను, ప్రతి ఒక్కరి సుఖదుఃఖాలు, మంచిచెడుల స్పందనలన్నీ నా హృదయాన్ని తాకుతున్నట్లుగాను ఉంది. స్థితిలో లోన, బయట స్వచ్ఛతగాని, చీకటిగాని లేకుండా ఒక రకమైన మసకయే వ్యాపించి పోయింది. ఇంకొక రకంగా చెప్పాలంటే, నా దృష్టి అంతటిలోను ఆ మసకయే తిష్టవేసింది. నేను కేవలం 'వారి' సేవకురాలిని మాత్రమే లేదా నా జీవనం 'వారి' యొక్క జీవనమే.

ఇప్పుడు ఒక రకమైన సామ్యదశయే లోన, బయట అంతటా వ్యాపించి ఉంది. ఒకసారి నేను వ్రాసి ఉన్నాను, ఏమని అంటే, నేను 'మాలిక్' యొక్క దృష్టిలో ఉన్నపుడు, 'అతని' గొప్పదనం స్వయంగా నాలో వ్యక్తమవుతోంది అని. అయితే అదంతా నాకు మాటమాత్రంగానే. గొప్పదనం పేరుతో ఉన్నది అంతా వ్యర్థం, దానికి అర్థం లేదనిపిస్తుంది.

శిరస్సుకు ఎడమభాగంలో, ఎక్కడైతే పాపిడి అంతమవుతుందో, అక్కడ నుండి చెవివరకు, మరియు శిరస్సు యొక్క సగభాగంలో నుంచి వెనుక మెడవరకు షుమారు 15 నిమిషాలపాటు ఎంతో తీవ్రంగాను, స్పందన మరియు గిలిగింత వంటి అవస్థ ఉంటూ ఉండేది, అది చెప్పనలవికానంతగా ఉండేది. ఎవరో నన్ను ఆ గతస్థితి నుంచి నా మనస్సును విముఖంగా చేస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఇప్పటివరకు అవధూతగతి మాటిమాటికీ కలుగుతూ ఉంటుంది. అయితే ఎవరో నన్ను బలవంతంగా దానికి పెడముఖం చేస్తున్నారు. స్థితి గడచిపోయిన దానితోనైనా లేదా ఉన్నదానితోనైనా నన్ను అప్రియంగా ఉంచుతున్నారు. ఇలా ఎందుకో నాకు తెలియదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 685

లఖీంపుర్,

12.08.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం, తావూజీ ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా బాగానే ఉన్నారని ఆశిస్తున్నాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఎలా ఉందంటే, 'మాలిక్' నాకు ఏదైతే ఇచ్చారో అది 'అతని'కే తెలుసు. అంతకుమించి నావద్ద ఇంకేమీ లేదు. హృదయం ఆధ్యాత్మికతను కూడా మర్చిపోయినంతగా అయిపోయింది. ప్రేమను పొందాలను కోరిక ఇప్పటికీ ఉంది. ఎందుకంటే, స్వయంగా 'హాయ్' అంటూనే నిట్టూర్పు కూడా వస్తుంది. 'మాలిక్'ను హృదయ పూర్వకంగా ప్రేమించలేక పోతున్నాను.

చాలా రోజుల నుంచి హృదయంలోను మరియు వీపులోను సూదులు గ్రుచ్చుకున్నట్లుగా ఉంటోంది. నా ఈ దశలో, సంపూర్ణ సామ్యావస్థ లేదా సంపూర్ణ స్థిరత్వం నాలో నెలకొనకుండా ఏదోశక్తి అడ్డుపడుతోంది. ఎప్పుడూ నాకు, స్పందనలకు మధ్య ఒక బంధనం ఏర్పడి ఉంది. అన్నీ నన్ను విడిచి వెళ్ళిపోయాయి. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటోగాని నేను సదా నా 'మాలిక్'తోనే సంబంధం లేనట్లుగా ఉంటున్నాను. ప్రతి మానవుని స్థితి, నా స్థితి కంటె ఉన్నతంగా ఉందని నేను ఇదివరకు వ్రాశాను. అయితే ఇప్పుడు నా దృష్టి మరియు హృదయం అందరి చరణాలవైపు మొగ్గి ఉంటోంది. స్థితిని గురించి ఏమి చెప్పలేకుండా ఉన్నాను ఎందుకంటే, ఇప్పుడు ఏ దశను గుర్తించలేకపోతున్నాను. అది ఎంతగానంటే, ఒక పారిశుధ్య కార్మికుడి కాళ్ళు పట్టుకున్నా, కుక్క కాళ్ళు పట్టుకున్నా ఏమీ అనిపించటం లేదు. ఇంతకుముందైతే, ఒక రకమైన పారవశ్యం ఉండేది దాని కారణంగా అలా చేయగల్గిన ప్రవృత్తి ఉండేది, కాని ఇప్పుడు ఆంతరికంలో ఒక సామ్యావస్థ నెలకొని ఉంటోంది. ఈ రెండింటికీ మధ్య ఉన్న భేదం ఇదే.

ఇప్పుడు ఈ దశలో నా మనస్సుకు ఉల్లాసంగాని, అద్భుతాలుగాని నచ్చటం లేదు. అలాగే ఊసర క్షేత్రం గురించిన మాటలుగాని, ఎడారి గురించిన మాటలుగాని నచ్చటం లేదు. వాస్తవం ఏమిటంటే, ఈ విషయాలు ఏవీ నన్ను ప్రభావితం చేయటం లేదు, కాని ఎవ్వరికోసమైతే తపన లోపల ఉంటున్నదో అది జలగలాగ శాంతిని కలగనివ్వటం లేదు. నిజం చెప్పాలంటే, శాంతి కూడా నాకు నచ్చటం లేదు. స్థితి, ప్రకృతిని అనుసరించి ఉంది.

ఈ దశలో, ఆత్మిక దశలను లోపల, బయట చూస్తూ కూడా దశను చూడనట్లుగానే ఉంటున్నది. బాబూజీ, నేను నా 'మాలిక్'ను పొందగలనంటారా? 'అతడు' నన్ను కలుస్తాడో, లేదో నాకు తెలియదు. ఎందుకోగాని, ఇప్పుడు నేను నడుస్తున్న మైదానం గురించిన అనుభూతి కూడా నాకు కలగటం లేదు. అప్పుడప్పుడు నా పురోగమనం

ఆగిపోయిందేమోనన్న భయం కూడా నాకు కలుగుతోంది. అది అసంభవమే, ఎందుకంటే, నా 'మాలిక్' నావారు, 'అతడే' నాకు ఊతం, భరోసా కల్పిస్తాడుగాని నాకయితే బలం ఏమీ లేదు. అప్పుడప్పుడు ఈ గమనంలో అలసట అయితే వస్తుంది కాని, అది ప్రార్థన ద్వారాగాని, తమకు జాబు వ్రాయటం ద్వారాగాని తొలగిపోతుంది.

నేను ఒక సాధారణ కుటుంబ బాలికలాగా ఉన్నాను. ఆధ్యాత్మిక విషయాలు లేక ఈశ్వరీయ విషయాలు గురించిన ఎరుక లేదు. అన్నీ మరచి ఉండి కూడా ఒక స్పృహలేని స్పృహ వంటిది నన్ను వెన్నంటి ఉంటున్నట్లుగా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు, కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 686

లఖీంపుర్,

27.08.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం పూజ్య మాస్టర్ సాహెబ్‌గారు నిన్న సాయంత్రం చదివి వినిపించారు. విన్న తర్వాత చాలా సంతోషమైంది. వాస్తవానికి తమ ఉత్తరంలోని ప్రతి పంక్తీ నేర్చుకోదగినదిగానే ఉంటుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, నేను నా దశను అంటిపెట్టుకుని ఉండలేకపోతున్నాను, ఎందుకు? ఇప్పుడు నా లోపల బైఠాయించి ఉండే శక్తి కూడా నాలో లేదు. ఇప్పుడు ఏ పని కూడా నా అలవాటుగా లేదన్నట్లుగా చూస్తున్నాను. ఆఖరికి పూజ లేదా ధ్యానం విషయంలో కూడా, వాటిని కూడా సమయానికి, సందర్భానికి తగ్గట్లుగా చేస్తున్నాను. ఫలానా పని చేశాను అనిగాని, చేస్తూ ఉండే దానిని అనిగాని, ఏదీ చేయలేదను ఆలోచనగాని రావటం లేదు. ప్రాపంచిక కార్యాల్లోను లేదా ఆధ్యాత్మిక కార్యాల్లోను నాకు ఎటువంటి బంధనమూ లేకుండా పోయింది. తప్పొప్పుల గురించిన జ్ఞానం కూడా ఇప్పుడు నాలో లేకుండా ఉంది. నాలో సోమరితనం బాగా అలముకొంది. ఈ దశ ఏమిటో నాకు అర్థం కావటం లేదు.

ఎప్పుడైనా నాకు ఏ స్థానంలోనైనా వేచి ఉండాలి అని నా మనస్సుకు తోచినట్లయితే, అప్పుడు ఏదో ఒక తెలియనిది నన్ను ఆ విధంగా నిలవనివ్వటం లేదని అనిపిస్తోంది. నాకు ఇప్పుడు జ్ఞాపకం వస్తున్నదేమంటే, నేను '$B_1$' మీద ఉన్నప్పుడు, తమరు "నేను ఒక స్పందన (Vibration) కల్పించాను. దానితో అది నిన్ను అక్కడ నిలవనివ్వదు" అని వ్రాశారు. అటువంటి ప్రభావమే ఇక్కడ కూడా కల్పించబడిందా ఏమిటి? శరీరంలో అలసట కలుగుతోంది. అయినా కూడా శరీరం లోపల ఏదో తెలియనిది, ఆ అలుపును నిలువనీయటం లేదు. అయితే స్థితిలో కూడా వేగం ఏమి కనిపించటం లేదు. ఉపరితలం నుంచి ఎప్పుడూ అల ఉప్పొంగటం లేదు. నేను ఏ పని చేయకుండా ఖాళీగా కూర్చున్నట్లయితే, అప్పుడప్పుడు నాకు చిరాకు లేదా విసుగుదల కలుగుతోంది.

తమ యొక్క మార్పు గురించిన పనిలో, కణకణం ఆధ్యాత్మిక శక్తితో పూరించే పని దాదాపు పూర్తయ్యింది అని అనిపిస్తోంది. వినాశకర లక్షణాలు (Symptoms of Destruction) కూడా పూర్తిగా నశించిపోయాయి. అయితే ఇంకను ఉన్న ఒక విషయం ఏమిటంటే, పనిమీద ఒక పొగమంచు వంటిది ఆవరించి ఉంది. దాని వలన 'తమరు' ఈ ప్రపంచంలో చిరకాలం జీవించి ఉంటారు అని మాకు సందేశం ఇస్తున్నట్లుగా ఉంది. ఇది నా విశ్వాసం. ఇది

'తమ' యొక్క అభ్యాసీ సోదర సోదరీలందరకూ శుభవార్తగా భావిస్తున్నాను.

నాకు ఇప్పుడు గాఢనిద్ర చాలా తక్కువగా వస్తోందని గ్రహిస్తున్నాను. గాఢనిద్రలో మునిగిపోయినపుడు, తర్వాత లేచినపుడు, నేను నా నుంచి బయటకు వచ్చినట్లుగా అనిపిస్తోంది. ఆ తర్వాత మగతగాని, బద్ధకంగాని ఏమి ఉండటం లేదు. అనగా నాకు కళ్ళు మూసినా, తెరచినా ఒక్కటిగానే ఉంటే ఎలా ఉంటుందో అలా అని అర్థం చేసుకోవచ్చు. కళ్ళుమూస్తే చీకటిగాని, కళ్ళు తెరిస్తే వెలుతురుగాని లేనట్లుగా ఉంది. ఆలోచనల గొలుసు (Chain of thoughts) విషయంలో కూడా ఒక రకమైన లెక్కలేని (Carefree) స్థితిగా ఉంది, చెప్పాలనుకుంటే, ఇలా కూడా చెప్పవచ్చు: నిద్రిస్తున్న మనిషిని దోమలు కుట్టినట్లయితే అతడు గోక్కుంటూనే ఉంటాడు, కాని నిద్రకు మాత్రం భంగం కలుగదు. నాలో స్పృహలేనితనంలో కూడా ఒక స్పృహ (Consciousness in unconscious) లేదా స్పృహలో స్పృహలేనితనం (Unconsciousness in conscious) ఉంటున్నాయి. ఇకపోతే నా శేషజీవితంలో నేనొక సాధారణమైన చిన్న బాలికలాగా ఉంటున్నాను.

మొన్న కూర్చుని ఉండగా అకాస్మాత్తుగా మెదడుకు చెందిన ఏదో ఒక పొర వంటిది లాగి వేసినట్లుగా అనిపించింది. అప్పటినుంచి తలనొప్పిగా ఉంటోంది, కాని అది చాలా నిదానించింది. ఇంతకుపూర్వం నేను, హృదయంలోను మరియు వీపులోను సూదులు వంటివి గ్రుచ్చుకుంటూ ఉన్నట్లుగా ఉంది అని వ్రాశాను కదా, ఇప్పుడు కూడా అవి బాగా అనుభవమవుతున్నాయి. ఇంతకుక్రితం తీవ్రంగా ఉండేది, అయితే ఇప్పుడు శరీరమంతటా, హృదయంలోను మరియు వీపులోను కొంచెం పిప్పరమింట్ అంటినట్లుగా అనిపిస్తోంది. ఇటువంటిదే ప్రతికణం నుంచి వెలువడుతూ ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇంకో విధంగా చెప్పాలంటే, కణకణం నుండి ఏ ప్రకాశమైతే వడియకట్టబడిందో (పిండబడిందో) దాని స్థానంలో ఇప్పుడు ఈ 'వస్తువు' చోటుచేసుకుంది. ఇప్పుడు కుడిచేతి బొటనవ్రేలు చివర ఒక రకమైన స్పందన వంటిది కలుగుతోంది. చిటిక వేస్తే అది కొంచెం బాగున్నట్లనిపిస్తోంది.

అమ్మ తమకు శుభాశీస్సులు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 687

లఖీంపుర్,

3.09.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. తమ ఆరోగ్యం బాగుందని భావిస్తున్నాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఎటువంటిది అంటే, ఎవ్వరైనా నా మనస్సుకు తోచినట్లుగా గాని, మూర్ఖపు పట్టుదలతో వ్యవహరిస్తున్నానని గాని చెప్పినట్లయితే అసలు నేను ఆ విధంగా వ్యవహరిస్తున్నానో లేదో తెలియటం లేదు. ఇప్పుడు సర్వదా ఒక తెలిసీ తెలియని స్థితిలో ఉంటున్నాను. ఇప్పుడు పూజలో ఏదైనా బాగుందని అనిపించినా కూడా అది ఎవరికి అనిపిస్తోందో తెలియటం లేదు.

నా దశ ఎలా ఉందంటే, తెలిసో తెలియకనో, స్పృహ ఉండియో లేక లేకుండానో ఏదైనా ఆలోచన కలిగినప్పుడు, "బైఠె సూతె పడె ఉఠాన్, కహైం కబీర్ హమ్ వహీ ఠికాన్" అనగా నేను కూర్చున్నా, నిద్రిస్తున్నా లేక మేల్కొని ఉన్నా, నేను నా 'మాలిక్' వద్దనే ఉంటున్నాను, అని కబీరు చెప్పిన విధంగా ఉంది. అయితే నా పగ్గాలు మాత్రం ఎవరిచేతుల్లోనో

లాగి ఉంచబడుతున్నట్లుగాను, నన్ను తన అదుపులో ఉంచుకుంటున్నట్లుగాను ఉంది. కాని ఆలోచన మాత్రం ఎక్కడ ఉంటున్నదో తెలియటం లేదు. దాని జాడ కూడా ఎప్పుడు తెలుస్తుంది అంటే, అకస్మాత్తుగా ఎవ్వరినైనా ఢీ కొట్టినప్పుడుగాని, ఉన్నట్లుండి ఎప్పుడైనా కాలు లేదా ఎక్కడైనా దెబ్బ తగిలినప్పుడుగాని అనుభవానికి వస్తుంది. మెదడు మీద లేక శరీరంలోను క్రమ్మియున్న అస్పృహ లేదా అచైతన్యం అకస్మాత్తుగా తొలగిపోయినట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు నాకు ఏమైందో ఏమోగాని, నా అస్థిత్వం కూడా నాకు తెలియకుండా ఉంది. ఇంకా చూస్తూ ఉంటే, ఎప్పుడైనా ఆలోచన యొక్క ఆలోచన వచ్చినా కూడా అది మోసపూరితంగా ఉన్నట్లు తోస్తోంది.

ఒక్కటి రెండు రోజుల నుండి, ఎడమబొటనవ్రేలి ప్రక్కన ఉన్న వ్రేలు లోపల ఏదో తెరచుకున్నట్లుగాను లేదా శుభ్రపడినట్లుగాను ఉంది. అప్పటినుంచి ఏదో ప్రాకటం వంటిది కూడా అనుభవం కలగటం లేదు. నాలో ప్రాణాహుతిని నిలుపుకునే శక్తి కూడా సమాప్తమై పోయింది. ఎవరిచేతనైనా పూజ చేయిస్తున్నా కూడా ప్రాణాహుతి నాలో లేని కారణంగా ఏమి జరుగుతున్నదో నాకు తెలియటం లేదు. పూజలో ఎవరికి బాగుందనిపిస్తోందో కూడా తెలియటం లేదు. అంతేకాదు అసలు బాగున్నట్లుగా అనిపిస్తోందో లేదో కూడా తెలియదు. నాకు ఇప్పుడు లోపలి స్థితి ఎలా ఉందో తెలియటం లేదు, కాని బయటి స్థితి మాత్రం పూర్తిగా సాదాగా ఉంటోంది. ఇప్పుడు మనస్సులో కట్టుబాటు అనేది లేకుండా పోయింది, కాని అన్నీ కూడా సాధారణంగా అయిపోయాయి.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 688

లఖీంపుర్,
22.09.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు క్షేమంగా చేరి ఉంటారని అనుకుంటున్నాను. పూజ్య దద్దా ద్వారా తమ సమాచారం తెలిసి చాలా సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు చాలా రోజుల నుండి నుదుటి పైభాగాన, ఎక్కడ నుండి అయితే పాపిడి ప్రారంభమవుతుందో అక్కడి నుండి మూడు వేళ్ళు ఎడంగా, సరిగ్గా పాపిటికి ఎడమవైపున ఉన్న ఎముకలో అంతటా ఏదో గడ్డ చితకటానికి సిద్ధంగా ఉన్నట్లు అనిపిస్తోంది. అది అలాగే కొనసాగుతూ ఉంది. తేలికపాటిది, మధురమైనట్టిదిగా అనిపిస్తున్న బాధ కూడా ఉంటోంది. కాని నిన్నటి నుంచి అక్కడ రంధ్రమే కాకుండా ఎముక కూడా పూర్తిగా చిట్లిపోయి వ్యాపించిపోయినట్లు అనిపించింది. నిన్నటి నుండి దశ పూర్తిగా తెరచుకున్నట్లుగా ఉంది. నేను అక్కడ ఉన్నప్పుడు తమతో '$Q_1$'లో యాత్ర జరుగుతున్నట్లుగా చెప్పినది సమాప్తమైపోయింది. అప్పటి నుంచి లోపల ఏదో ఉంటూనే ఉంది. దాని వలన గమనం పూర్తిగా ఆగిపోయింది అనేది కూడా తెలియకపోగా, కాళ్ళు చేతులు చాపుకోవటానికి కూడా స్థలం లేకపోయిన కారణంగా ఊపిరిసలపలేదు. కాని నిన్నటి నుంచి 'మాలిక్' కృపతో అంతా సర్దుకుంది, స్థితి తెరుచుకుంది. చేతులు, కాళ్ళు వాటి స్థానంలో చాపుకున్నాయి. విశ్రాంతిగా ఊపిరి పీల్చుకున్నట్లు ఉంది, కాని అది సంతోషానికి సంబంధించినది కాదు. ఇప్పుడు అదేమిటోగాని, ఎందుకో లోపల ఆత్మ వరకు ఏదో ప్రాకుతున్నటు వంటి అనుభవం కలుగుతోంది.

ఇప్పుడు స్థితి కూడా స్థితిలేనిదానిగా అయిపోయింది. నడక కూడా నడవనట్లుగా ఉంది. లోన, బయట అన్నీ జ్ఞానేంద్రియాలు (Senses) మరియు శరీరం యొక్క కణకణమూ ఒక నిశ్శబ్ద మహా ప్రళయరూపం దాల్చాయి. నా హృదయంలో ఒక రకమైన స్పందన నాకు ఎరుక ఉన్నా లేకపోయినాగాని కలుగుతూనే ఉంది. ఈ నిశ్శబ్ద

మహాప్రళయంలో అప్పుడప్పుడు అకస్మాత్తుగా, ఎడమకాలి బొటనవ్రేలు నుంచి శిరస్సు మధ్య పాపిటి వరకు ఒక రకమైన, తీగమీటిన కంపనం వంటి ప్రవాహం ఒక్క సెకనుపాటు అనుభవమై తొలగిపోతోంది. వీని ప్రభావం మరెక్కడా ఉండటం లేదు, కాని వీపు మొత్తం వెన్నెముకలోను, మరియు దాని ఎడమవైపున వీపు మొత్తంలో కొంత ప్రభావం ఉంటోంది.

ఇప్పుడు ఈ స్థితిని అవ్యక్తస్థితి అని కూడా చెప్పినట్లయితే దాని అసలీయత్ అనగా అసలుతత్వం (రియాలిటి) పోతూ ఉంటుంది. అందుచేత మౌనంగా కూర్చుని, దాని పూర్తి సౌందర్యాన్ని చూస్తూ ఉన్నాను. దానిలో అప్పుడు 'ఉన్నది' అని చెప్పటానికిగాని, 'లేదు' అని చెప్పటానికిగాని అవకాశమే లేదు. ఉన్నదేదో ఉంది, అది 'మాలిక్'దే. ఎందుకంటే, నేను ఇప్పుడు దానిని అంటిపెట్టుకుని ఉండలేకపోతున్నాను. నేను కేవలం ప్రేక్షకురాలిని మాత్రమే. అలాకాదు, ప్రేక్షకురాలనే కాకుండా ఆ దశకు సాక్షీభూతంగా ఉన్నాను. ఈ దశ ఎటువంటిది అంటే, ఇప్పుడు ఈ స్థితి అయితే నాది కాదు కాని స్థానం లేదా మైదానం నాదిగానే ఉండి వ్యాపించి ఉంది. నా పూర్తి శరీరం మాత్రమే కాకుండా, కణకణం వరకు ఒక నిశ్శబ్ద ఏకాంత మైదానంగా అయిపోయింది. దానిలో 'మాలిక్' యొక్క దివ్యవిభూతి విస్తరించి ఉంది. అయితే నా దశ ఏమిటంటే, నేనయితే స్పృహలేని దానిగానే ఉన్నాను. ఇప్పుడు నాది అంటూ ఏ దశగాని, మైదానంగాని లేదు. ఇంకో విధంగా చెప్పాలంటే, నేను ఎవ్వరికీ చెందినదానను కాదు.

ఇప్పుడు ఏమైందో ఏమోగాని, నా కణకణమూ విరాట్ రూపంగా అయిపోయాయి, కాని అది నా ఊహకు అందటం లేదు. కాని నా జాడ అయితే సదా నావద్దనే ఉంటోంది. ఎందుకంటే, నేను ఎవ్వరికీ చెంది ఉండలేదు మరియు స్వయంగా నేను నాకు కూడా చెందనట్లుగానే ఉన్నాను. నా దశ ఏమిటో నాకు తెలియదు. అది 'మాలిక్'కే తెలియాలి. ఇప్పుడు దశ ఏదో రకంగా ఉంది, అనగా 'మాలిక్' నాకు తన రహస్యం ఏదో వెల్లడించినట్లుగాను, దానిని విడమర్చి చెప్పటానికి నేను అసమర్థురాలిని అన్నట్లుగాను ఉంది. 'మాలిక్' తన రహస్యాన్ని బహిర్గతం చేయటమే కాకుండా, ఆ రహస్యాన్ని నా కణకణంలో వ్యాపింపజేశారు. ఆ విధంగా చేసి కూడా బహుశా నన్ను తమ దానిగా చేసుకోవటం కోసం నన్ను తమవద్దనే ఉంచుకున్నారు. ఇప్పుడు సర్వత్రా, కణకణంలోను 'వారి' రహస్యమే బహిర్గతమై వ్యాపించి పోయి, స్వరూపంగా అయిపోయింది. అయితే నేను ఇప్పుడు అంటిపెట్టుకుని ఉండటానికి నాలో శక్తియే లేకున్నది. నేను వాని రహస్యానికి సాక్షిగా మాత్రమే ఉన్నాను గాని నాదంటూ ఏమీలేదు.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

**ఉత్తరం సంఖ్య – 689**

లఖీంపుర్,
4.10.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఈశ్వర కృపతో ఇప్పుడు తమ శ్వాస సంబంధమైన ఇబ్బంది తగ్గిపోతుందని భావిస్తున్నాను. తమరు సదా ఆరోగ్యంగా ఉండాలని ఈశ్వరుని ప్రార్థిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని వ్రాస్తున్నాను.

బాబూజీ, ఈ దశలో నా ప్రతికణం యొక్క రోమరోమానికి చెందిన సంబంధం నా నుంచి తెగిపోయి అసలు భాండాగారంగా అయిపోయిందేమో అని అనిపిస్తోంది. ఇప్పుడు లోన, బయట, కణకణంలో, నా రోమరోమం నుంచి ఈశ్వరీయ ప్రకాశం వెలువడుతున్నట్లుగా ఉంది.

ఇప్పటివరకు స్వయంగా నా చేతులు ఎత్తబడి ఉన్నట్లుగా నా స్థితి ఉండేది, కాని అది ఎవ్వరి హస్తం ఎత్తబడిందో, ఎవ్వరు ఎత్తి ఉంచారో తెలియటం లేదు, అనుభూతికి రావటం లేదు. ఎవ్వరైనా పిలుస్తూ ఉంటే,

వింటున్నాను కాని ఎవరు మాట్లాడుతున్నారో తెలియదు. ఇంకొక విచిత్రమైన దశ ఏమిటంటే, 'మాలిక్' ఎదుట కూర్చుని ఉన్నాను, వారిని స్పర్శిస్తూనే ఉన్నాను, అయినా కాని 'మాలిక్' యొక్క పాదాల అనుభూతి కూడా కలగటం లేదు. 'తమ'తో మాట్లాడుతున్నాను, ప్రశ్నలకు జవాబు చెప్తున్నాను, కాని ధ్వని మాత్రం నా చెవులకుగాని, తమ చెవులకుగాని సోకటం లేదు. ఇప్పుడు ధ్వనియే కాకుండా, నా ఎదుట 'తమరు' కూర్చుండి ఉన్నా కూడా నాకు కనిపించటం లేదు. ఇది 'మాలిక్' యొక్క రహస్యమో లేక నా దశయో తెలియటం లేదు. నాకు ఇదంతా తెలియదు, తమకే తెలిసి ఉండాలి!

ఇప్పటివరకు 'మాలిక్' నావారు అన్నట్లుగా ఉంది. వారు లేకుండా జీవించలేనని అనిపించింది. కాని ఇప్పుడు అకస్మాత్తుగా నన్ను వీడి 'అతడు' ఎక్కడికి, ఎందుకు వెళ్ళిపోయాడో తెలియటం లేదు. ఎక్కడైతే లోన, బయట సర్వత్రా 'అతని' నుండియే ప్రకాశం వెలువడుతూ ఉండేదో, దానిలోనే నేను అంటూ ఉండేదానను. కాని అది ఇప్పుడు అంతా 'అతని' మాయగా ఉంది. 'అతడు' ఆ మాయను ఇప్పుడు ఒక్కసారిగా ఉపసంహరించుకున్నారు. ఇప్పుడు నేను ఎక్కడ ఉన్నానో, ఏమి చేస్తున్నానో, ఏమి చేయాలో  తెలియటం లేదు. అయితే 'అతడు' నాకు ఒక చేతికర్రలాగా ఊతం ఇస్తున్నాడన్న విశ్వాసం నాకు ఉంది. ఎందుకంటే, నా గురించిన సమాచారం 'అతని'కి తెలుసు. 'అతడు' మాయావి (మాయగాడు). 'అతడు' తన మాయను తనలో ఇముడ్చుకుంటే ఏమయ్యింది! లోన, బయట అంతటాను, శరీరం యొక్క రోమరోమం అన్నింటి నుండి ఎవరో తన మాయాజాలాన్ని లయం చేసుకున్నట్లుగా ఉంది. ఇది ఏమిటోగాని, యావత్తు శరీరంపైన ఆవరించి ఉన్న పరదా మొత్తాన్నే ఎవరో తొలగించి వేసినట్లుగా అనిపిస్తోంది.

'మాలిక్' నా సాంగత్యంలో ఎన్ని ఆటలు ఆడారో తెలియదు. ఒకప్పుడు తన అలౌకిక దివ్యత్వాన్ని సమకూర్చి నన్ను మోహపెట్టారు. మరొకప్పుడు తమ విరాట్ స్వరూపంతోపాటు నాకు చెందిన అణువు అణువును విరాట్‌గా మార్చారు. ఇప్పుడైతే ఇదంతా కేవలం ఒక మాయాజాలంలాగ 'వారు' తమలో లయం చేసుకున్నట్లుగా నాకు అనిపిస్తోంది. శరీరం లోపల ఆవహించి ఉన్న పరదాను మొత్తం తొలగించి వేశారు. ఈ విధంగా చేసింది నా శరీరానికే కాదు, సమస్త ప్రకృతికి చెందిన పరదాను తొలగించగా అది స్వచ్ఛంగా అయ్యింది. ఇప్పుడింక ప్రకృతి లేదు, పరమాత్మ లేదు. ఇదంతా ఒక భ్రమ వంటిదని 'మాలిక్' దర్శింపజేసి తన మాయను లయం చేసుకున్నారని అనిపించింది.

నేను ఇప్పుడు పూర్తిగా అజ్ఞాని, అమాయక బాలికలాగ ఒంటరిగా, మౌనంగా ఒక సమతల మైదానం మధ్య నిలబడి ఉన్నాను. నాకు తోడు ఎవ్వరూ లేరు. 'అతని'కి నా జాడ తెలుసునని మాత్రం నా హృదయంలో ఏకోశానో దృఢవిశ్వాసం ఉంది. ఈ విశ్వాసమనేది నా చేతుల్లో లేనప్పటికీ, 'మాలిక్' తన ప్రకాశం కల్పించునటువంటి ఒక సాధనాన్ని నాలో ఎక్కడో వదిలిపెట్టినదానితో నేను దారిలోనే ఉంటున్నాను, లేకపోతే నేను పూర్తిగా ఒక అజ్ఞాన బాలికనై ఎక్కడో తిరుగుతూ ఉండేదాన్ని. 'అతడు' మొదట నాలో తన రహస్యాలను బయటపెట్టి మళ్ళీ అన్నింటినీ లయం చేసుకున్నారు, ఎందుకో తెలియదు. తమ దివ్యత్వాన్ని, గొప్పదనాన్ని మరియు విలక్షణత్వాన్ని, మాయాజాలాన్నంతటినీ నా దృష్టినుంచి కూడతీసుకుని నన్ను ఒక ఏకాంత చదువైన అంతంలేని మైదానంలో విడిచిపెట్టారు. నాకు మాత్రం ముందుకు నడవాల్సియే ఉంది. అది ఎక్కడికో, ఎందుకో తెలియదు. అయితే నాకు తెలిసిందల్లా, మైదానంలో నిలబెట్టారు కనుక నేను దాటాల్సియే ఉంది, అని.

ఇప్పుడు దీని నంతటినీ ఒక దశానుభవంగా వ్రాస్తున్నానో లేక కథను వివరిస్తూ వెళ్ళుతున్నానో తెలియటం లేదు. నా 'మాలిక్'! తమరు స్వయంగా తమర్ని నా హృదయం నుంచి తొలగించారు. మనస్సు నుంచి ఉపసంహరించుకున్నారు. తమరు నా ఆలోచనల నుంచి కూడా తమర్ని తొలగించివేశారు. అలాగే కానివ్వండి. అయినాగాని నేను తమకు కృతజ్ఞతలనే తెలుపుతున్నాను. ఎందుకంటే, 'తమరు' నా నుండి తమర్ని

ఉపసంహరించుకున్నాగాని నన్ను 'తమ' నుంచి (అనగా తమ హృదయం నుంచి) తొలగించలేకపోయారని, ఆ విధంగా చేయలేరని నా ప్రగాఢ విశ్వాసం. ఈ విశ్వాసం ఇప్పుడు నాలో లేకపోయినాగాని 'తమ'వైపు నుంచి వెలుగు రూపంలో నాకు మార్గం కనిపిస్తోంది. నా స్థితి, రెండు మూడు నెలల శిశువులాగా ఉంది. ఎలా అంటే, ఆ స్థితిని తల్లి కూడా గుర్తించలేనటువంటిదిగా ఉంటుంది. నా కళ్ళెదుట నుంచి, సమస్త ప్రకృతి యొక్క మాయాజాలన్నే ఎవ్వరో ఒక్కపెట్టున ఉపసంహరించుకున్నట్లుగా ఉంది. అయినా నేను దానిని లక్ష్యపెట్టను. ఎందుకంటే, పైకెక్కి అయినా పరమాత్మను పొందుతాను. నేను నా ప్రియతముడైన 'మాలిక్'ను చేరాల్సి ఉంది. 'అతడు' తన ఆటను (మాయను) ఉపసంహరించుకుంటే నేనేం చేయాల్సి ఉంటుంది. ఇదంతా ఏమిటా అని నేను ఆశ్చర్యపోతున్నాను.

చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 690

లఖీంపుర్,
13.10.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఎటువంటిది అంటే, అన్ని రంగులు కలిపి రంగరించి నట్లయితే ఏదో ఒక రంగు కాకుండా రంగులేనిదిగా ఎలా అయిపోతుందో, అదే విధంగా దశలన్నీ కలిసి దశలేని దశగా అయిపోతుంది. ఆ తర్వాత ఏ స్థానం లేక మైదానాన్ని దాటవలసి ఉంటుందో ఆ మైదానమే నా ఎదుట ఉంది. దానిలో కూడా ఈత / యాత్ర ప్రారంభమైపోయింది. అలాకాదుగాని, దానిలో చాలా దూరం వెళ్ళాను. ఇప్పుడు ఆ దశయే నడుస్తోంది. మైదానం యొక్క తీరం చేరుకోవటానికి ఎంత సమయం కావాలో అంత సమయం తీసుకుంటాను. కాని దానిలోకి గంతువేయగానే కాళ్ళు చేతులు ఎంత గొప్పగా అయిపోతాయి అంటే, వాటి వేగం స్వయంగా నాకు కూడా ఊహించనంతగా ఉంటుంది. ఈ మైదానాన్ని నేను ఈదుకుంటూ దాటి పోయానా లేక అదే స్వయంగా దాటిపోయిందా అనేది కూడా తెలియటం లేదు. దీనిలో సరైనది నేను అనుకుంటున్నది ఏమిటంటే, ఏ రూపంలో, ఏ వేగంతో హనుమంతుడు సముద్రాన్ని దాటాడో, లంకను దహనం చేశాడో, అటువంటి దశయే మనిషికి కూడా కలుగుతుంది. కాని మాయ యొక్క శక్తి ఇంతటితో సమాప్తమైపోతుంది. దానితోపాటుగానే తనలో ఇచ్ఛాశక్తి కూడా పూర్తిగా ఉండకుండా పోతుంది. అప్పుడింక లోపల శక్తిగాని, సాహసంగాని ఉండవు. ఇంకా ఏమిటంటే, 'అతడి'వైపు నుంచి ఏ శక్తులైతే సమకూరతాయో, ఆ సమయం తీరాక (అనగా సందర్భం ముగిశాక) 'అతని' (దైవం) వద్దకే తిరిగిపోతాయి అని మనకు తెలిసిన విషయమే. శక్తి అను దానికి అస్థిత్వంగాని, స్థితిగాని లేవు అనిపిస్తోంది. అందుచేత దానిలో నిలకడ లేదు. ఇది శక్తి విషయంలోనే కాదు, ప్రేమ, భక్తి, దీక్ష, విశ్వాసం, నేను, నీవు అనేవి వేటికీ స్వంత అస్థిత్వమంటూ లేదు. కనుక నిలకడ లేదు. అన్నీ కూడా ఒక మాయ, భ్రమ లేదా స్వప్నంలాగా వస్తూ పోతూ ఉంటాయి. సాధారణంగా మాయ కూడా జరుగుతూ, పోతూ ఉంటుంది అని చెప్తుతూ ఉంటారు. ఇదే నా దశగా అయిపోయింది.

ఇప్పుడు ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నా చేతిని శిరస్సు క్రింద మోపి ఉంచుతాను. ఇది తెలిసి ఉండి కూడా, నేను ఒక్క క్షణమైనా నా చేతిని తలక్రిందమోపి ఉంచాను అనిగాని, లేదు అనిగాని తెలియనట్లు ఉంటుంది. వాస్తవంగా ఏమిటంటే, నా ఈ దశలో, నా శరీరం నన్ను తాకటం లేదన్నట్లుగా ఉంటుంది. ఇలా

శరీరమేకాదు, మనస్సు, బుద్ధి, ఆలోచన మరియు ఆత్మ కూడా నాలో లేకపోయాక ఇంక స్పర్శమాటే ఏముంటుంది. హృదయం మీద ధ్యానం చేయాలి అని అందరికీ చెబుతూ ఉంటాను, కాని నాకు హృదయమే లేదు, కనుక నేను ధ్యానం ఎలా చేయాలి, ఎందుకు చేయాలి అనేది తెలియకుండా ఉంది. అందరితోనూ అన్నీ చేయాలని చెబుతూ ఉంటాను, అయితే స్వయంగా నాకు ఏమి చేయాలో తెలియకుండా ఉంది. ఈ దశ ఏమిటోగాని, నిలబడి ఉంటున్నా- కూర్చుంటున్నా, నిద్రిస్తూ-మేల్కొని ఉంటూ ఉన్నా, ఎప్పుడూ ఎటువంటి ఆలోచనలు రావటం లేదు. లోన-బయట, ఎక్కడైనా గాని, ఎప్పుడైనాగాని ఆలోచనలు అనేవి తట్టటం లేదు లేదా తలెత్తటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 691

లఖీంపుర్,
23.10.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ నుంచి ఉత్తరం రాలేదు. కారణం ఏమిటి? దయచేసి తమ ఆరోగ్య పరిస్థితిని వెంటనే తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఈ దశ ఎలా ఉందంటే, నా హృదయం కేవలం బ్రహ్మవిద్య యొక్క (Screen Plate) స్క్రీన్ ప్లేట్‌లాగా ఉంది. దాని మీద 'మాలిక్', ఆత్మిక దశల చిత్రాలను రూపొందిస్తూ ఉంటారు. వాటిని చూపించి మళ్ళీ తనలో ఇముడ్చుకున్నారు. అప్పుడు హృదయం మళ్ళీ ఖాళీ మైదానం యొక్క మైదానంలాగా ఉండిపోయింది (అనగా పలకమీద వ్రాసినది తుడిచి వేసినట్లుగా). ఇప్పుడు ఎటువంటి దశలాగా ఉందంటే, నేనొక పిరికిపందగా అయిపోయాను లేదా నిద్రిస్తూ, మేల్కొంటూ, నిలబడి ఉంటూ, కూర్చుంటూ ఇంకా ఎలా ఉన్నా కూడా ఎటువంటి ఆలోచనలు ఎప్పుడూ కలగటం లేదు అని చెప్పవచ్చు. నా లోన, బయట, నరనరాల్లోను, కణకణాల్లోనూ ఒక శూన్యస్థితి వంటిది ఏర్పడి ఉంది. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఈ దశ మీద నేనొక దిండు వేసుకుని ప్రశాంతంగా కూర్చున్నట్లుగా ఉంది. ఇప్పుడు ఒక విచిత్రమైన దశ ఏమిటంటే, నేను శాంతంగాను లేను, అశాంతంగా లేకుండాను ఉంటున్నాను. ఎటువంటి కష్టం లేదు, అలాగని సుఖంగా ఉన్నానని చెప్పటానికి వీల్లేదు. నాకు ఇప్పుడు ఒక తిన్నె (దిబ్బ)గాని, ఒక నివాసంగాని లేవు. నాకు చిరునామా ఉండటంగాని, లేకపోవటంగాని లేదు. నాకు ఇప్పుడు ప్రేమ, భక్తి, దీక్ష, విశ్వాసం మరియు నేను, నీవు అనే వాటికి అస్థిత్వమే లేనట్లుగా అనిపిస్తోంది. వీటన్నింటినీ వింటూ ఉంటే నాకు స్వప్న సదృశంగా అనిపిస్తున్నాయి. అనగా అన్నీ మాయ లేదా భ్రమ లేదా స్వప్నంలాగ వచ్చి పోతున్నాయి. ఎందుకోగాని నాకు ఎవరి మాటలు వింటున్నా కూడా ఇదే విధంగా అనిపిస్తోంది. ఒక తపన ఉండి అది నన్నొక క్షణమైనా విశ్రాంతిగా ఉండనివ్వటం లేదు. ఇప్పుడు ఏదైనా దశ వచ్చినా, నేను దానిని అంటిపెట్టుకుని ఉండకుండా, వేరే ఎవ్వరిదో స్థితిని చూస్తున్నట్లుగా చూస్తూ ఉండిపోతున్నాను. నా దశ ఇప్పుడు సాధువులు, సన్యాసుల దశలాగా అయిపోయింది. అలా అనటానికి వీల్లేదు. ఎందుకంటే, వారిలో విద్యుత్తు అయితే ఉంటుంది, నావద్ద నయితే అది కూడా లేదు. ఈ దశలో ఎప్పుడూ ఎటువంటి ఆధ్యాత్మిక కోరిక కూడా ఉదయించలేదు. ఇది పూర్తిగా ఒక సత్యదశగా ఉంది. ఆత్మిక అను శబ్దం నేను దశకు ఉపయోగిస్తున్నది కేవలం వ్రాయటానికి మాత్రమే. ఇప్పుడు దశకు ఆత్మతో ఎటువంటి సంబంధమూ లేకుండానే ఉంది. ఇదే ప్రకారంగా నేను ఇతరులకు ఆంతరిక దృష్టి లేదా అంతర్‌దృష్టి

గురించి చెబుతాను కాని నా స్థితి మాత్రం స్థితి లేనిదిగానే ఉంది. నేను ఎవ్వరికీ ఏమీ చెప్పటానికి యోగ్యురాలను కాదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 692

లఖీంపుర్,
17.11.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. నా జబ్బు మూలంగానే ఈశ్వరుడు నా ఆంతరికాన్ని నిర్మలీకరించాడని భావిస్తున్నాను. అలా ఎందుకంటే, నా హృదయాన్ని తనవైపు ఆకర్షించు కోవటానికి 'మాలిక్'కు సహాయకారిగా ఉంటుంది అని కావచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇదేమి దశయో కాని, నేను మిషన్ యొక్క సభ్యురాలను అను విషయం కూడా ఎప్పుడూ అనుభవానికి రావటం లేదు. నేను అందరితో తమ గురించి చెబుతున్నాగాని, నాకు తమతో సంబంధం ఏమీ లేనట్లుగానే అనిపిస్తోంది. నేను ఆర్యసమాజానికి చెందినదానిగా అయిపోయానా ఏమిటి? ఎందుకంటే, భగవానుడు, ఈశ్వరుడు అంటూ ఎవ్వరూ లేరు. నాకు ఎప్పుడూ ఒక్క క్షణమైనా తమ యొక్క అనుభూతి అనేది కలగటం లేదు. ఇప్పుడు నా స్థితి ఎటువంటిది అంటే, నేను కూర్చుని ఉన్న కొమ్మనే నరుక్కున్నట్లుగా ఉంది. భజనలు (కీర్తనలు) పాడుతున్నాను. పూజ చేస్తున్నాను, చేయిస్తున్నాను, కాని నామీద వాటి ప్రభావం ఉండటం లేదు. నేను తపనతో విలవిల్లాడినప్పుడు తమరుచేసిన వైద్యమే నాకు బాగుండేది. ఇప్పుడు ఏ ఔషధమూ పని చేయటం లేదు. అదేమిటో 'మాలిక్'కే తెలియాలి.

ఇప్పుడు లోన, బయట, నలుపు–తెలుపుకానిది, భారం–తేలిక కానట్టిది అయిన పొగ వంటిది వ్యాపించి ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు శరీరం అంతటా ఒక ఉదాసీనత యొక్క స్వరూపంగానే అయిపోయింది. శరీరం యొక్క కణాలన్నింటిలోను ఒకే స్థాయిలో ఉదాసీనత దశ వ్యాపించి ఉండి కదలని–మెదలని, చలనం–చలనరహితం, స్థిరత్వం–అస్థిరత్వం వంటిదిగా ఉంటోంది. యావత్తు శరీరం, కణకణమూ పారదర్శకంగా (Transparent) అయిపోయినట్లుగా ఉంది. అదేమిటో తెలియదు, దానిలో స్థూలత్వం లేదు, సూక్ష్మత్వమూ లేదు. దశకు ఇప్పుడు సూక్ష్మత్వం అని ప్రయోగించటం సరికాదని అనిపిస్తోంది. ఇప్పుడు దశయే లేదు, కాని నా ప్రతికణం ఎలా ఉందో అలాగే ఉంది. కస్తూరి కూడా ఎవ్వరో వారే. ఇంతకుమించి అర్థం చేసుకోవటానికి ఏ మనస్సూ లేదు. అర్థం చేసుకోలేకపోవటమే కొంత ప్రయోజనకరం అనుకుంటాను. ఎందుకంటే, అర్థం చేసుకుని మాత్రం చేసేది ఏముంటుంది. అదేదో 'మాలిక్'కే తెలుసు. ఇప్పుడు నా సంబంధం విచ్చినమైపోయింది. ఏ విధంగానంటే, దీనులతోగాని, దైవంతోగాని, ప్రపంచంతోగాని, మానవునితోగాని సంబంధం లేకుండా పోయింది. అదేమిటో తెలియటం లేదు. ఏమంటే, ప్రతి ఒక్కరితోను నా సంబంధం అలాగే అనగా స్వంత సంబంధీకులుతోలాగా ఉండిపోయింది. కాని పూజలో పురోగతి చెందుతున్నవారితోనయితే ప్రాణం కంటె కూడా మిన్నగా సంబంధం ఉంటుంది. అంతేగాని ఇంకెవ్వరితోనూ సంబంధం ఉండదు. అలాకాదు కాని, నా దశ ఎటువంటిది అంటే, ఎవ్వరితోనూ ఎప్పుడూ నాకు సంబంధం ఉండదు, వ్యతిరేకతా (విరుద్ధం) ఉండదు. కాని సంబంధం యొక్క సంబంధమే నాతో తెగిపోయినట్లుగాను లేదా అసలు ఎన్నడూ లేనట్లుగాను చెప్పవచ్చు. 'మాలిక్' కావచ్చు, మరెవ్వరైనా కావచ్చు, అందరిపట్ల ఈ విషయంలో నేను నిస్సహాయురాలిని.

ఇప్పుడు నా లోపల ఏదీ లేకపోయాక, నేను ఏదైనా ఎక్కడ నుంచి తీసుకురావాలి. అదేకాదు, నాకు అందరికీ ఇదే దశగా ఉందనిపిస్తోంది. బాబూజీ, సంబంధం అనేది ఎప్పుడూ కలిగి ఉండనపుడు అది ఉండటం, తెగిపోవటం

ఎలా ఉంటాయి. ఇప్పుడు ఒకటి ఏమిటంటే, అదేమిటో దశను గురించి వ్రాస్తున్నప్పుడుగాని లేదా దానితో (దశతో) కొంత స్పర్శ కలిగినప్పుడుగాని శ్వాస భారమైపోతుంది. అలా వ్రాయకుండా నిలపటానికి మనస్సు కకావికలమవుతుంది, ఊపిరాడకుండా చేస్తుంది. మౌనంగా కూర్చోవటానికి మనస్సుకు తప్పనిసరి అవుతుంది. ఈ కారణంగానే 'మాలిక్' కల్పించే దశను డైరీలోగాని, ఉత్తరంలోగాని వ్రాయటానికి తటపటాయిస్తూ ఉంటాను. దీనివలన ఉత్తరం వ్రాయటానికి ఆలస్యమవుతూ ఉండటమేగాక ఒకటి రెండు మాటలు మర్చిపోతాను కూడా. శరీరం యొక్క కణకణానికి చెందిన ఆవరణలు కూడా తొలగిపోయాయి. స్థూలత్వం, సూక్ష్మత్వం వంటి దశ కూడా ఇప్పుడింక లేదు. ఇదంతా ఏమిటో తమరే స్వయంగా చూడండి. నేనయితే నా గ్రహింపుకు వచ్చిన దానిని, కలిగిన దానిని వ్రాసేసాను. ఇంకా ఏదైనా మిగిలి ఉంటే అది తమకు తెలుసు లేదా తమ ప్రయోగానికి తెలుసు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. కేసర్ కూడా తమకు ఉత్తరం వ్రాసింది. దానిని కూడా పరిశీలించండి. చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 693

లఖీంపుర్,
26.11.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉండవచ్చు. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారు కూడా అక్కడికి చేరుకొని ఉంటారని అనుకుంటున్నాను. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, నా దశ ఎలా ఉంది అంటే, నేను ఈశ్వరుని నుంచి తీసుకోవాల్సిందిగాని, ఇవ్వవలసిందిగాని ఏమీలేనట్లుగా ఉంది. అందుచేత పూజ, నియమ నిష్ఠల గురించి ఎటువంటి విభేదంగాని, తిరుగుబాటుగాని లేవు. ఇప్పుడు ఈ సంగతి ఏమిటోగాని, ఇంతకుముందు నాకు జరగబోయే ఘటనలు తెలుస్తూ ఉండేవి. వాటిని చెబుతూ ఉండేదానను. వాటిలో అధికంగా జరుగుతూ ఉండేవి. అయితే ఇప్పుడు నా మాటల్లో విశేషం ఏమి లేకుండా పోయింది. అందుకు ఉదాహరణగా, దినేష్ తమ ఇంటిలో పడిపోవటంగాని, తావూజీకి ఆ రోజున జరిగిన ప్రమాదం గురించి కేసర్‌కు తెలిసింది గాని, నేనయితే ఒక మూఢురాలులాగా, ఏమీ తెలియని దానిలాగా అన్ని పనులూ చేస్తూ ఉండిపోయానుగాని నాకేమీ తెలియలేదు. నిజం చెప్పాలంటే, పూర్తిగా నేనొక సాధారణ మనిషిలాగా ఉండి, అంతకంటె కూడా తక్కువ గ్రహింపు కలిగి ఉన్నాను.

ఇప్పుడు నా దశలో నాకు శాంతిగాని, అశాంతిగాని లేవు. ప్రపంచం శాంతి కోసం తపిస్తూ ఉంటుంది, కాని నాకు శాంతి ఉన్నదో లేదో తెలియటం లేదు. దాని గురించిన కోరిక కూడా నాకు లేకుండా పోయింది. ఇప్పుడు భక్తి పాటలు పాడిన స్వరం కూడా నా ఆంతరికంలోకి చేరటం లేదు. అలాగే పూజ చేస్తున్నదిగాని, చేయిస్తున్నదిగాని నా ఆంతరికంవరకు చేరటం లేదు. నేను స్వయంగానే నాకు భిన్నంగా ఉన్నాను. శరీరంలో ఇప్పుడు మరొక కస్తూరీ పని చేస్తున్నట్లుగాను, ఆ విషయం నాకు తెలియనట్లుగాను, ఆ కస్తూరీతో నాకు పరిచయం లేనట్లుగాను అనిపిస్తోంది. 'తమ'పట్ల కూడా నా దశ అలాగే ఉంది. ఎలా అంటే, తమ పేరు స్మరిస్తూ కూడా తమతో సంబంధం లేనట్లుగా ఉంది. నాకు ఇప్పుడు నివాసస్థానం కూడా లేకుండా పోయింది. అలాగే నాకు స్థిరత్వం కూడా లేదు. నేను 'తమరి'లోనే ఉండి, 'తమ'రినే స్మరిస్తూ ఉండి కూడా నాకు తమతో సంబంధంలేనట్లుగా ఉంది. నేను ఇప్పుడు ఒక సాధారణ గృహస్థ బాలికలాగా ఉన్నాను. ఇప్పుడు సంస్కారాలు మంచివిగాని, చెడ్డవిగాని లేవు. నా స్వంత వస్తువు అంటూగాని,

పరాయివి అంటూగాని ఏమీలేవు. ఇప్పుడు ఎవరూ నాకు చెందినవారు కారు, అలాగే నేను ఎవరికి చెందినదానను కాను.

చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

**ఉత్తరం సంఖ్య - 694**

లఖీంపుర్,
29.11.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. తామందరూ కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో నాకు కలతగాని, కలత లేకుండాగాని, అన్వేషణగాని, సమాచారంగాని లేవు. అలాగే శాంతి, అశాంతి కూడా లేవు. స్థిరత్వం, అస్థిరత్వమూ అనుభూతికి రావటం లేదు. ఇంక లోపల ఒక విధమైన విసుగుదల ఉండటంతో అశాంతినిగాని, శాంతినిగాని అనుభవం కానివ్వడం లేదు. లోపల ఒక వింత దశ ఉంది. (Silence) నిశ్శబ్దంగాని, (Wave of activity) చైతన్యం యొక్క అలలుగాని లేవు. (Balance) సమత్వంగాని, (Instability) అస్థిరత్వంగాని లేవు. నాకు అన్ని శబ్దాలు నిరర్థకంగానే ఉన్నాయి. ఇంక నేను ఏమిటి అంటే, వాస్తవంగా నా స్థితి అంటూ ఏమీలేదు. అంతా ఒక క్రమంగా ఉన్నది ఉన్నట్లుగా జరిగిపోతోంది. దానిలో నియమ నిబంధనలుగాని, కట్టుబాటుగాని ఏమీలేవు. మూడు, నాలుగు రోజుల నుండి శిరస్సు మధ్యలో పాపిటికి సమానంగా కుడివైపున షుమారు మూడు వేళ్ళ ఎడంగా ఉన్న స్థానంలో ఏదో జంతువు ప్రాకుతున్నట్లుగా ఉంది. తరచుగా ఆ కదలిక ఎంత తీవ్రంగా అనిపిస్తున్నదంటే, బలవంతంగా నా చేయి శిరస్సుమీద నొక్కాలనిపిస్తుంది. అయితే అప్పుడప్పుడు ఎటువంటి దశ ఉంటుంది అంటే, ఆ ప్రాకటం నిద్రలో ఉంటున్నదా, మేల్కొని ఉండగా ఉంటున్నదా, అది శరీరంలో ఉంటున్నదా లేక గోడలో ఉంటున్నదా అనేది తెలియకుండా ఉంది.

శరీరం లోపల, బయట, అణువణువు, కణకణం అన్నీ కూడా వాస్తవంగా (Inanimate) జడత్వం వహించినట్లుగా అనిపిస్తోంది. అయినా కాని జీవనంలోని పనులన్నీ ఎలా జరిగిపోతున్నాయో తెలియటం లేదు. అయితే ఆ పనులన్నీ చేయటానికి అవుసరమైన చైతన్యం ఎక్కడ నుంచి వస్తున్నదో కూడా తెలియటం లేదు.

చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

**ఉత్తరం సంఖ్య - 695**

లఖీంపుర్,
04.12.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఈ రోజు పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తమ ఆరోగ్యం గురించి తెలిసి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా దశలో ఈ విధంగా అనిపిస్తోంది: **ఏ స్థానంలో నయితే జన్మజన్మాంతర సంస్కారాలు మరియు రోజువారీ సంస్కారాలు ఒక్కచోట కూడియుంటాయో, ఆ స్థానం ఇప్పుడు నాలో లేనేలేదని అనిపిస్తోంది. లోన, బయట, శరీరం, ఆపాదమస్తకం పారదర్శకంగా (Transparent) అయిపోయింది.** సామ్యావస్థ (Modera-

tion) దశ ఇప్పుడు నా కార్యకలాపాలు అన్నింటినీ తన స్వాధీనంలో ఉంచుకొంటున్నట్లుగా గమనిస్తున్నాను. ఆత్మిక దశలో అది నన్ను అనుసరించి ఉన్నప్పటికీ, బాహ్య విషయాలలోగాని, పనుల్లోగాని అది తన అధికారం చెలాయిస్తున్నట్లుగా అనిపిస్తోంది. నా భక్తి మరియు విశ్వాసాల పగ్గం లేక జ్యోతి ఎక్కడ విలీనమైపోయాయో తెలియటం లేదు. ఇప్పుడైతే పూర్తిగా ఖాళీ కస్తూరీయే తిరుగాడుతూ ఉంది. అందుచేత ఇదివరకు అవుసరమైన దానికంటె ఎక్కువగా ఉన్న దృఢత్వం నాలో ఉన్నటువంటిది, ఇప్పుడు ఎక్కడ విలీనమైపోయిందో తెలియటం లేదు. అయితే బలహీనత లేదు. నేను మరణించి కూడా జీవించి ఉన్నాను అని నేను వ్రాసి ఉన్నటువంటి ఆ జీవనం ఎక్కడ విలీనమైపోయిందో తెలియదు. ఇప్పుడు జీవితం అనే మాటయే నాకు వ్యర్థంగా తోస్తున్నది. అది ఏమైపోయిందో కూడా తెలియదు. మృత్యువు కూడా ఎక్కడైనా ఉందో లేదో నాకు తెలియదు. అది కూడా నాకు వ్యర్థమే.

ఇప్పుడు నా దశ ఎటువంటిది అంటే, ఎటువంటి సంబంధం లేకుండానే అన్ని సంబంధాల యొక్క మాయ వ్యాపించి ఉంది. నేను మౌనంగా, ఒంటరిగా ఎక్కడికి నడిచి వెళ్తున్నానో తెలియటం లేదు. దారి చూపించి, ఆ మార్గంలో తీసుకుని వెళ్ళే మార్గదర్శకుడు ఇప్పుడు మౌనంగా ఎందుకు ఉన్నాడో తెలియటం లేదు. నా లోపల, బయట ద్వారాలన్నీ తెరువబడి ఉన్నాయి. నేనయితే దారిని చూస్తూ ఇప్పుడు కూడా ఆశ్చర్యంతో నడుస్తూ పోతున్నాను. ఎక్కడైనా 'అతని' ఉనికి దొరికి తీరుతుంది. 'అతడు' మాట్లాడకపోతే మాట్లాడకపోవచ్చు. 'అతడు' నా చేయిపట్టుకోకపోతే పట్టుకోకపోనీ. అది 'అతని' అభీష్టం, కాని నేను 'అతడు' లేకుండా ఎలా ఉండగలను? నా కళ్ళు 'అతడి' దివ్యకాంతిని పీల్చుకున్నాయి. అది నన్ను ఏకాంత ప్రదేశంలో, ఎడారి దేశంలో గ్రుడ్డిగా ఉంటూ ఉన్నా కూడా నన్ను 'అతడి' దగ్గరకు చేరుస్తుంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 696

లఖీంపుర్,
9.12.1958

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. మాస్టర్ సాహెబ్‌గార్ని ఉద్దేశించి తమరు వ్రాసిన ఉత్తరం చేరింది. వారి ద్వారా తమ ఆరోగ్య స్థితిని తెలుసుకుని సంతోషమైంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా లోన, బయట ఒక (Balanced state) సామ్యావస్థయో కాదో గాని, (Blank or empty) శూన్యం లేదా ఖాళీ అవస్థలో పడి ఉంటోంది లేదా ఇది 'అతని' స్వరూపంగానే అయిపోయింది అని చెప్పవచ్చు. అయినాగాని నాలో ఏదో ఉండి నన్ను ప్రశాంతంగా ఉండనివ్వకుండా లోపల తపన కలిగిస్తోంది. అప్పుడప్పుడు మనస్సు ఎంతగా విసుగు చెందుతుంది అంటే, అప్పుడుగనుక తమ కృపతో మనస్సు తనంతట తాను లోపలి అవస్థలో లయం కాకపోయినట్లయితే, అప్పుడింక నేను జీవించటమే దుర్లభమైపోవచ్చు. అయితే 'మాలిక్' దాని నంతటినీ తనంతట తానే సరిచేస్తూ ఉంటారు. ఇప్పుడు గమనం (నడక) ఆగి ఉన్నదా లేక సాగుతోందా కూడా నాకు తెలియటం లేదు. వాస్తవంగా చెప్పాలంటే, నా గతి అఖండం (ఆగనిది, ఎడతెగనిది), అరూపం మరియు నిర్వికల్పంగా ఖచ్చితంగా ఉంటోంది. నిన్న రాత్రి షుమారు తొమ్మిదిన్నర లేక పదిన్నర గంటల సమయంలో మంచం మీద పడుకొని ఉండగా, ఒక్కసారిగా నుదుటిలో ఎడమవైపున మరియు కనుబొమ్మ పైనుండి ఒక తేలికపాటి వెచ్చదనం వంటిది ఏర్పడి, తర్వాత అది వృద్ధి చెందుతూ నుదుటి మొత్తంలో వ్యాపించిపోయింది. ఇంతలోనే శిరస్సుకు పూర్తిగా వెనుక, ఎక్కడి

నుండి అయితే వెన్నెముక ప్రారంభమవుతుందో దానికి నాలుగు వ్రేళ్ళంతగా పైన చాలా తీవ్రమైన స్పందన లేదా అదరటం మొదలైంది. దానిని నేను వివరించలేను. ఈ విధంగా 12-15 నిమిషాలపాటు ఉండి తర్వాత మాయమైపోయింది.

ఈ దశలో అదేమిటోగాని, తరుచుగా ఏదో సందేశం దానంతట అదే నా లోనికి వస్తూ ఉంటుంది, ఏదో పోతూ ఉంటుంది, కాని నాకు ఏమీ తెలియటం లేదు.

అమ్మ తమకు ఆశీస్సులు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 697

లఖీంపుర్,

13.01.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. అమ్మ ఆరోగ్యం ఇప్పుడు బాగానే ఉంది. నా ఆరోగ్యం కూడా బాగవుతోంది. తమరు బాధపడవద్దు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా దశలో, వీపు అంతటి నుంచీ మరియు శిరస్సుకు చుట్టూరా ఒక పల్చని నిర్మల ప్రకాశం బయటకు వెలువడుతున్నట్లుగా అనిపిస్తోంది. లోపల అయితే ఎంత మధనం (చిలకటం) జరిగిందంటే, ప్రారంభం నుంచి చివరదాక కూడా ఎక్కడా ఎటువంటి శబ్దమూ లేదు, అరుపులు వంటివీ లేదు. దీనిని ఋజువుపర్చుకునే వస్తువు కూడా ఏదీ లేకపోయింది. శూన్యతను కల్పించే వస్తువు ఏదీ కూడా లేదు. ఇంకను ఇదేమిటోగాని, నా ఆంతరికంగాను, బాహ్యంగాను ఉన్న తెర (దుప్పటి) మీద ఏదైనా వచ్చిపోయినాగాని, దానిమీద ఎప్పుడూ ఎటువంటి మరక పడటం లేదు. అంతేకాదు, అలాంటి మరక ఎప్పుడూ పడలేదు, పడటం లేదు, పడబోదు కూడా. అలా ఎటువంటి మరక పడకపోయినాగాని ఆ తెర (దుప్పటి) తెల్లగా లేదు. దీనిని ఈ విధంగా చెప్పవచ్చు. ఏ విధంగానైతే రంగు, నిర్మలత్వం మరియు పవిత్రత లేకుండా, సరళత్వం మరియు నమ్రతల యొక్క రంగు ఎలా ఉంటుందో, అటువంటి రంగు ఇప్పుడు నా హృదయ రూపమైన లేదా నా ఆంతరిక రూపమైన ఆ తెరదిగా అయిపోయింది. ఇప్పుడు నాకు ఆంతరికం, బాహ్యం రెండు కూడా సమాన శబ్దాలుగానే అయిపోయాయి.

ఇప్పుడు 'మాలిక్' ఈ దీనురాలైన కుమార్తె యొక్క (తెర) ముసుగును ఉన్నది ఉన్నట్లుగా తీసివేసి ప్రక్కనబెట్టారు. ఇటువంటిదే నా దశగా ఉంది. ఇప్పుడు నేను అంతా పరిశీలించి ఓటమి పొందాను. తమకు కానుకగా ఇవ్వటానికి నావద్ద ఎక్కడా ఏ వస్తువు కూడా లేదు. ఇప్పుడు నా విన్నపం ఏమిటంటే, తమ కుమార్తె వద్ద ఏదైనా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే, అది తమకే కానుకగా అవుతుంది.

ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, నేను ఏదైనా ఇవ్వవలసి ఉందనిగాని, ఇవ్వాలనిగాని మరచిపోయాను. నేను 'తమరి'ని జ్ఞాపకం ఉంచుకుంటూ ఉండటం కూడా మరచిపోయాను. అలాంటప్పుడు ఏమి ఇవ్వాలి. నా హృదయమైతే సరళత్వం మరియు నమ్రతల స్వరూపంగా అయిపోయింది. ఇంకా అదేమిటోగాని, నేను అందరికీ ఋణగ్రస్తురాలనై ఉన్నట్లుగా అందరి ముందు ఒదిగి ఉంటున్నాను.

తమరు నా మీద దయతో పాయింట్ '$S_1$' మీదకు చేర్చారు. అందుకుగాను ధన్యవాదాలు ఎంతగా, ఎలా అర్పించాల్సి ఉంటుంది! చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 698

లఖీంపుర్,

25.01.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. మాస్టర్ సాహెబ్‌గార్కి తమరు వ్రాసిన ఉత్తరం వచ్చింది, విషయం విన్నాక కొంత విచారం కలిగింది. తమకు శీఘ్రంగా స్వస్థత చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. 'అతడు' మా ప్రార్థన తప్పకుండా ఆలకిస్తాడు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా దశ చాలా బాగా నడుస్తోంది. **నేను దానిని అంటిపెట్టుకుని ఉన్నా లేకపోయినాగాని నాకు దాని వెచ్చదనం నిరంతరాయంగా లభిస్తూనే ఉంది.** అది నా స్వరూపంగానే అయిపోతూ నడుస్తోంది. నన్ను ఏదో ఒక సముద్రంలో విసిరివేయటానికి ప్రణాళిక రూపొందించబడుతున్నట్లు అనిపిస్తోంది. దానిని గురించి నేను ఏమీ చెప్పలేకపోతున్నాను. అయితే దాని అనుభూతి యొక్క వెచ్చదనం నా వెంట తప్పనిసరిగా ఉంది. 'స్థితి' లోపలికి దూసుకుపోవాలను తపన మాత్రం ఉంటోంది. ఆ తపన నన్ను ఒక్క క్షణమైనా విశ్రాంతి తీసుకోనివ్వటం లేదు. ఇదంతా ఏమిటో తమరే గమనించగలరు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. కేసర్ తనపట్ల కూడా దృష్టి నిలపమని తమరిని కోరుతోంది. చిన్నారులకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 699

లఖీంపుర్,

03.02.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, నేను స్వయంగా ఒక విస్మృతురాలుగాను అనగా మరచిపోబడినదానిలాగాను, గుర్తింపులేని పక్షానికి చెందినట్లుగాను ఉన్నాను. నాలో ఇప్పుడు ఎటువంటి తపన లేదు, ఎటువంటి భక్తీ లేదు. లయ-అవస్థ కూడా నా ఆలోచనల నుంచి తప్పిపోయింది. కనుక దానిలో లయమయ్యే ప్రశ్న ఎక్కడ ఉంటుంది! జ్యోతిగాని, దీపంగాని లేవు. లోన, బయట అన్నీ గోప్యంగా ఉండిపోయాయి అన్నట్లు ఉంది. ఈ దశ ఏమిటోగాని, నేను ఎవరిదో వివాహ కార్యం జరిపిస్తూ ఉన్నప్పుడు అది నా స్వంత ఉత్సవంలాగా కన్నులకు కట్టినట్లుగా ఉంటోంది. అదే ప్రోత్సాహం, ఉత్సాహం, ఈశ్వరీయ ధార (ప్రాణాహుతి) అన్నిచోట్ల పొందుతున్నాను. దాస్యభావం అనగా పూర్తిగా దీనత్వం వంటిది నా స్థితిగా ఉంటోంది. అదేమిటో తెలియదు. ఇప్పుడు నేను ఎప్పటివరకునయితే 'అతని' మహనీయతను గురించిన స్మరణ మనస్సులో నిలుపుకుని ఉంటానో, అప్పుడు అటువంటి స్థితినే నాదిగా పొందుతున్నాను. కాని ఎప్పుడైతే మామూలు మరియు సహజమైన స్థితిలోకి వస్తానో అప్పుడు ఏమైపోతుందో తెలియదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 700

లఖీంపుర్,
03.03.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న తావూజీ మరియు మాస్టర్ సాహెబ్‌గారు క్షేమంగా ఇక్కడకు చేరారు. వాళ్ళ ద్వారా తమ సమాచారం తెలిసి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా దశ ఎలా ఉందంటే, ఈశ్వరుని మనస్సు అంతా నాలో లయమైపోయినట్లు ఉంది. నా దృష్టి ఇప్పుడు దానిని కూడా అధిగమించి ఎక్కడో, ఏమి వెదుకుతూ ఉందో నాకు తెలియటం లేదు. నా అడుగు ఎంతగా ముందుకుపడుతూ ఉంటే నేను అంతగా 'అతడి'ని సమీపిస్తున్నట్లుగా నేను బాగా గమనిస్తూ వస్తున్నాను. అన్వేషణ మరియు (దాహం) తపన కోణంలో సంతోషం గురించి పట్టించుకోకుండానే ముందుకు సాగిపోతున్నాను. ఈ బకా యొక్క అనుభవంతో నా లోపల నేనేమి చేయాలి అను తపన యొక్క తీవ్రత ఉంటుంది. ఏ విధంగానైనా సరే, నా ప్రియతముడ్ని పొంది 'అతని' చరణాలను పట్టుకుంటాను. నా స్థితిలో బకా అనేది నా జీవనంలో చోటుచేసుకుంది. ఇంక ఇప్పుడు ఉన్నది బకా అంటే బకానే, మిగిలినది అంతా సమాప్తమైపోయింది. ఇప్పుడు ఈ దశ ఇలా ఉంది: "రహె న కాహూ కామ్ కె। మై భరోసె అపనె రామ్‌కె॥" అనగా నేను ఎందుకూ పనికిరాను, నేను నా రాముని మీదే ఆధారపడి ఉన్నాను, అని. నేను నా 'మాలిక్' మీదనే ఆధారపడి ఉన్నాను. ఇప్పుడు అది ఏమిటోగాని, నేను నవ్వలేకపోతున్నాను, విలపించలేకపోతున్నాను మరియు ఏమీ చెప్పలేకపోతున్నాను, అలాగే ఏదీ వినలేకపోతున్నాను. ఇంతేకాదు, ఇప్పుడు నేను ఏదీ ఊహించలేకపోతున్నాను. లోపల కొంత తపన ఉంది, కాని అది ఎందుకో తెలియదు. ఇప్పుడు లోన, బయట, శాంతి, అశాంతి అన్నీ ఒకే రకంగా అయిపోయాయి. ఇప్పుడింకా ఏమైపోయిందో ఏమోకాని ఏకత్వం అనేది నా వద్దకు రావటం లేదు, ద్వైతమూ నన్ను స్పృశించటం లేదు. నేను దేనితోను ఏకం కాలేకపోతున్నాను. అంతేకాదు, దశలో కూడా ఏకం కాలేకపోతున్నాను. ఏ వ్యక్తియైన నిద్రలో మాట్లాడుతూ ఉంటాడు, కాని ఆ విషయం అతనికి తెలియదు. అదే దశ నా దశగా ఉంది. నేను దశను తమకు వ్రాస్తున్నాను. ఏదో ఆనందం కూడా నా లోపల ఉంటోంది, కాని నేను దేనితోను ఉండలేకపోతున్నాను. నాకు 'అతడి'ని పొందాలను తీవ్రమైన కోరిక ఉంది, ముందడుగు వేస్తూ సాగిపోవాలి. ఇది మాత్రమే అనగా "నేను 'అతడ్ని' పొందాలి" అనే ప్రవచనం మాత్రమే నాకు జ్ఞాపకం ఉంది. దీనికిమించి మరేదీ నేర్చుకోలేదు, చదువనూ లేదు. బ్రహ్మాండాలకు బ్రహ్మాండాలే నాలో లయమైపోయినట్లుగా అనిపిస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీ లందరకూ ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ